

# దీప నిర్వాణ గంధం...

**An anthology about Death**



## డాక్టర్ లంకా శివరామప్రసాద్



# దీప నిర్వాణగంధం...

## (An anthology about Death)



*ఆసీదభ్యధికా చాస్యశ్రీః శ్రియం ప్రముముక్షతః*
*నిర్వాణకాలే దీపస్య వర్తీ మివ దిధక్షతః*

విరాట–భారతం–వ్యాసుడు

*దీప నిర్వాణగంధం చ సుహృద్ వాక్య మరుంధతిం*
*న జిఘ్రంతి, న ష్రిన్వంతి, న పశ్యంతి గతాయుషః*

1–77–హితోపదేశం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# Deepa Nirvanagandham

(An anthology about Death)

by

**Dr. Lanka Siva Rama Prasad**

✧✧✧———————————————✧✧✧

July 2013

All rights reserved

Copyright @ 2013

by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar (Dist.) A.P.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL
Andhra Pradesh - 506 002, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Copies available at :

**All the branches of Vishalandhra**

Price : ₹ **250 $ 5**

Cover Design & Post Script
**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***





# ప్రస్తావన

సరిగ్గా ముప్ఫై ఏళ్ల క్రితం 1983లో మా ప్రొఫెసర్ గారి తల్లికి బ్రెయిన్ హెమరేజ్ వల్ల పక్షవాతం వచ్చింది. నేనూ, ఆయనా వంతులవారిగా ఆమె పక్కనే కూర్చుని ఆమె ఆరోగ్య పరిస్థితిని గమనించేవాళ్లం. ఆరోజు ఉదయం ఎనిమిదిన్నర దాటింది. ప్రొఫెసర్ గారు వచ్చే టైమ్. ఠంచనుగా తొమ్మిదింటికి ఆయన వచ్చేస్తారు. నాకెందుకో ఆమె పరిస్థితి బాగున్నట్లు అనిపించలేదు. దాదాపు పదిహేను రోజులుగా 'సెమికోమా'లో ఉన్న ఆమె కాస్త ఇరిటబుల్‌గా ఉన్నట్లు నాకనిపించింది. బి.పి., పల్సులో కొంత తేడా?

సెల్‌ఫోన్లు లేని కాలమది. మామూలు ఫోన్ చేద్దామనుకున్నా ఆయన దారిలో ఉంటారు కాబట్టి ఉపయోగం లేదు. అటుయిటూ కదుల్తున్న ఆమెను సముదాయిస్తూ ఆమె తలను నిమురుతూ ప్రొఫెసర్ గారి రాక కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఆమె నాకేదో చెప్పాలని ప్రయత్నిస్తున్నదని నాకర్థం అయ్యింది. ప్రొఫెసర్ గారింటికి ఫోన్ చేయమని సిస్టర్‌కు చెప్పాను. సార్ బయల్దేరకపోతే వెంటనే బయల్దేరి రమ్మని.

ఆమె కదలికలు ఎక్కువయ్యాయి. ఏదో అస్పష్ట సంభాషణ. వంకరపోయిన మూతి నుంచి చొంగ కార్తున్నా ఏవో పదాలు రావడానికి ప్రయత్నిస్తున్నది. నాకు అర్థమవుతున్నది. 'కృష్ణా' అని అంటున్నదా అని నేనర్థం చేసుకుని మా ప్రొఫెసర్ గారిపేరు కృష్ణారావు ఆయన రాకకోసం నేను మరింత ఉద్వేగంగా ఎదురుచూడసాగాను. ఇంతలో ఆమె చూపులు నన్ను దాటి నా వెనుక వేపు ఉన్న కారిడార్ వేపు ప్రసరిస్తున్నట్లు నాకనిపించింది. ప్రొఫెసర్ గారు వచ్చేదారి అదే. ఆయన అడుగుల చప్పుడు నేనూ గుర్తుపట్టాను.

ఎందుకో తెలియదు కాని– 'సర్! వెంటనే ఇటురండి' అన్నాను దాదాపు అరుస్తున్నట్లు. ఆయన వచ్చీరాగానే ఆమెను నా చేతుల్లోంచి చాచివున్న ఆయన చేతుల్లోకి మార్చి నేను పక్కకు తొలిగాను. ఆయనను గుర్తుపట్టినట్లు ఆమె ముఖంలో లీలగా చిరునవ్వు. పెదాలు 'కృష్ణా' అన్నట్లు కదలిక. కళ్లల్లో ప్రకాశ వంతమైన వెలుగు. కొద్దిక్షణాలు మాత్రమే. నేను చూసాను– ఆ వెలుగు క్రమేపీ తగ్గి ఆరిపోవడం. ఆ వెలుగును ఎవరో తీసుకునిపోతున్నట్లు. ఆమె జీవనాడుల్ని, ప్రక్రియల్ని ఎవరో 'స్విచాఫ్' చేసినట్లు. అప్పటి వరకు అక్కడే మమ్మల్ని గమనిస్తున్న

వ్యక్తెవరో అక్కడి నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమించినట్లు నాకనిపించింది. అంతకు ముందు అనేక మరణాలను చూసినా మృత్యువును అంత దగ్గరగా చూడడం అదే మొదటిసారి.

అప్పటివరకు మృత్యువు, మరణం, చావు ఇటువంటి మాటల్ని వినడం ఇష్టం లేని నాకు మృత్యువంటే భయం పోయింది. అన్వేషణ ప్రారంభమయ్యింది. నేను రచించిన చాలా పుస్తకాలలో అంతర్లీనంగా ఉండే వస్తువు మృత్యువు. సత్యాన్వేషణలో, జీనోమ్, Shades, Twilight Zone, Bhagavatam, సంఖ్యాశాస్త్రం, స్వప్నశాస్త్రం ఇవన్నీ ఆ అన్వేషణలో జనించిన గ్రంథాలే. ఈ 'దీపనిర్వాణగంధం' ఆ అన్వేషణలోని చరమాంకాన్ని తెలుపుతుంది.

'Men fear Death because they refuse to understand it' అంటాడు సైరస్ యల్. సల్జ్‌బర్గర్ తన My Brother Death అనే గ్రంథంలో.

'The fear of Death is worse than death' అనేది రాబర్ట్ బర్టన్ అభిప్రాయం.

మా నాన్నగారికి రెండోసారి Stroke వచ్చింది. నా పర్యవేక్షణలోనే వైద్యం సాగుతున్నది. ఆయనను ICU లో ఉంచలేదెందుకంటే ఈనాటి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు గమనించాక అవి నాకొక్కొక్కసారి Intensive Scare unitsలా అనిపిస్తాయి. సెలెక్టెడ్ కేసుల్ని అక్కడ ఉంచితే తప్పులేదేమో కాని విచక్షణా రహితంగా అందర్నీ ఆ Closed environment లోకి నెట్టడం సరైనది కాదని నా అభిప్రాయం. నవరంధ్రాల్లో ఏవో ట్యూబులు, రకరకాల తీగెలు, రంగురంగుల మానిటర్లు, ధ్వనులు, అలారంలు ఇవేకాక ఆఖరు క్షణాలను తమ వాళ్లతో గడపనీకుండా, ఆఖరు ఓదార్పును, కన్నీటి చుక్కల్ని పంచుకోనీకుండా తమవాళ్ల స్పర్శను, ధైర్యాన్ని దూరం చేస్తున్న ICCU లంటే నాకు ఒక్కోసారి భయం, ఏవగింపు కలుగుతుంది.

మా నాన్నగారికి సిగరెట్లంటే మహా యిష్టం. సెమికోమాలో ఉండి కూడా మా తమ్ముడు 'నాన్నగారూ సిగరెట్ తాగుతారా!' అంటే కళ్లు తెరచే ప్రయత్నం కన్నా ముందే ఆయన పెదాలపై చిరునవ్వు వెలిసేది.

వెలిగించిన సిగరెట్ ఆయన పెదాల దగ్గర ఉంచగానే ఆయన దమ్ము పీల్చే ప్రయత్నం చేసేవారు. ఒక్కోసారి కళ్లవెంబడి కన్నీటి చుక్క రాలేది. మంచి

ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్న ఆయన ఈ సిగరెట్ అలవాటు ఎందుకు మానుకోలేదో నాకు తెలియదు కాని, నేను రెండుమూడు సార్లు మందలించినా ఆయన నాకున్న ఒకే ఒక బలహీనత ఇదేరా! అనేవాడు. పన్నెండురోజులు అలా 'కోమా'లో గడిపి ఆయన ప్రశాంతంగా దూరతీరాలకు తరలిపోయాడు.

సర్జన్‌గా, కార్డియోథొరాసిక్ సర్జన్‌గా నేనెన్నెన్నో మరణాల్ని చూసాను. సైన్సు పరంగా వాటికి మేం ఇచ్చే విశ్లేషణలూ, కారణాలూ ఎందుకో ఒక్కోసారి అసంతృప్తిగా అనిపించేవి. ఆపరేషన్ చేసేప్పుడు హృదయస్పందనను ఆపి, ఆపరేషన్ తరువాత మరల హృదయాన్ని యధాస్థితిలోకి తీసుకురావడం, ఒక్కోసారి గుండెకు షాక్ లివ్వడం ద్వారా, పేస్ మేకర్ల ద్వారా దానిని మామూలుగా పనిచేసేట్లు చేయడం అలవాటైపోయింది. అయినా ఇంకా ఏదో వెలితి?

గుండె మార్పిడి, అవయవాల మార్పిడి, రక్తదానం వీటన్నిటిలో ఒకరి అవయవాల్ని, కణాల్ని ఇంకొకరి శరీరంలోకి ప్రవేశబెట్టినాక ఏం జరుగుతుంది. అనే ప్రశ్నకు సైన్సు ఇచ్చే సమాధానాలు, రియాక్షన్లను అధిగమించే మందులూ ఇవన్నీ తెలిసినాక అసలు ఆత్మ అనేది ఉన్నదా అనే జిజ్ఞాస మరింత ఎక్కువైంది.

'అధాతో బ్రహ్మ జిజ్ఞాసా' అనేది ప్రసిద్ధ వాక్యం కదా!

ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించే క్రమంలో మృత్యువు గురించిన ఈ గ్రంథం చదువరులలో ఆసక్తిని, ఆలోచనను కలిగిస్తుందని సృజనలోకం భావిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**



# *Appointment in Samarra*

He saw the Death in the market place. And his surprise turned to terror when Death raised his eyes and fixed them penetratingly on him. The servant was convinced that Death had come for him, he ran as fast as he could to the house and requested his master to give him the fastest horse in the stable. Upon enquiry he told his version and galloped to Samarra.

The master went to the market place and found the Death still there, boldly approached him and put his question. Death looked puzzled and said- "I was surprised to see him here in Baghdad. Actually, I have an appointment with him tomorrow in Samarra. Excuse Me"-

బాగ్దాద్ నగరంలో వస్తువులు కొనుక్కొద్దామని ‘సంత’కు వెళ్లిన సేవకుడికి అల్లంత దూరాన మృత్యువు తన వేపే తీక్షణంగా చూస్తున్నట్లు కనిపించింది. భయంతో అతగాడు ఇంటికి పరిగెత్తి యజమానికి ఉన్న అతివేగవంతమైన గుర్రానెక్కి తాను వెళ్లిపోతున్నట్లు యజమానికి చెప్పి ఆఘమేఘాల్లో వేగంగా సమర్రాకు పారిపోయాడు.

ధైర్యస్థుడైన యజమాని సంతకు వెళ్లి మృత్యువును గమనించి ఏమిటీ విషయం అని ఆరాదీసాడు. మృత్యువు అన్నాడు– “నేనూ ఆశ్చర్యపోయాను అతగాడిని ఇక్కడ చూసి. నిజానికి అతనితో నాకు రేపు సమర్రాలో అపాయింట్‌మెంట్ ఉంది. Excuse me!"

# విషయసూచిక

## -: మరణం - నిర్వచనం :-


1. మరణం - నిర్వచనం ........ 1
2. జాతస్య హి మరణం ధ్రువం... ........ 11
3. ఆయుష్షు నూరేళ్లేనా? ........ 13
4. సజీవ సమాధి ........ 16
5. మాంటెజుమా శాపం........ 22
6. దింపుడు కల్లాలు ........ 28
7. మామూలు కత్తి నుంచి 'సర్జన్స్ నైఫ్' వరకూ ........ 31
8. మరణానంతర అవమానాలు - అభిమానాలు ........ 39
9. మమ్మీలూ - గుండెలూ ........ 45
10. రాబోయే కాలంలో సైన్సు మృతసంజీవనిని కనుక్కుంటే... ........ 51
11. నన్ను మరచి పోవద్దు! ........ 54
12. నీవు లేవు కాని నీ మాట వుంది!........ 60
13. అంతిమ సంస్కారం ........ 63
14. దహనం........ 66
15. నిశ్శబ్ద గోపురాలు........ 71


## -: ఆత్మహత్యలు :-


1. ఆత్మహత్య మహాపాపం! ........ 75
2. ఆత్మహత్య........ 82
3. రకరకాల ఆత్మహత్యలు! ........ 88
4. ఆత్మహత్యలు........ 94


## -: కవిత్వం :-


1 సమవర్తి........ 113

2. మృత్యువుతో భేటీ........ 114
3. ఆకస్మిక మృత్యువు........ 115
4. మృత్యు నృత్యం ........ 118
5. గర్వాంధుల మదమణిచే మృత్యువు ........ 121

6. నన్ను యువకుడిగా చావనివ్వండి ................................ 122
7. మరణించిన వారికి మరింత దగ్గర... ............................ 124
8. కవి మరణం ........................................................ 125
9. మరణం ............................................................ 127
10. మృత్యు సౌందర్యం ................................................ 128
11. మృత్యు దేవతా! ఆమెనిక్కడకు తీసుకునిరా! ...................... 132
12. శాశ్వత దెయ్యం ................................................... 135
13. జీవపు గొలుసు .................................................... 136
14. వడిలిపోయిన కాలపు శాఖ ......................................... 138
15. మిత్రుడైన మృత్యువు .............................................. 140
16. కాసేపు ఆగుము, మృత్యుదేవతా! .................................. 142
17. వైద్యుడూ - మృత్యువూ .......................................... 143
18. సంభాషణ ......................................................... 145
19. మారనిది ......................................................... 145
20. ఫ్రెడ్‌మార్స్‌డెన్ విషాదాంతం ..................................... 146
21. మార్గరిటె - షులామితె .......................................... 148
22. మృత్యువు గురించి భయపడకు! ..................................... 150
23. అప్పగింతలు ..................................................... 150
24. సంతాపం ......................................................... 151
25. మృత్యువు కొరకు ................................................. 152
26. మృత్యు దోపిడి .................................................. 153
27. బాధ ............................................................. 154
28. మృత్యు రహస్యం .................................................. 155
29. తగలబడిన నగరం ................................................. 156
30. ప్రతిపత్తి ........................................................ 157
31. నేను విలపించను! ................................................ 158
32. మరణాలు - ప్రవేశాలు ............................................ 159
33. మృత్యువుతో గొడవ .............................................. 161
34. రాబర్ట్ బ్రౌనింగ్ మరణించినప్పుడు- .............................. 162
35. ఒక మరణం - ఒక జననం ........................................ 163
36. ఒక జననం - ఒక మరణం ........................................ 164

37. మృత్యువంటే అది ........................................ 165
38. మృత్యువు గురించి ........................................ 166
39. చస్తే మంచిది ........................................ 167
40. అంతా మృత్యువే ........................................ 168
41. మృత్యుశయ్య ........................................ 170
42. కవలల్లో ఒకరి మరణం ........................................ 172
43. మృత్యు వనం ........................................ 173
44. అయిదవ ఇంద్రియశక్తి లోపం ........................................ 175
45. మృత్యు విజయం ........................................ 177
46. ఒజిమాండియస్ ........................................ 178
47. దీపాలు ఆరిపోయాయి ........................................ 179
48. నివాళి ........................................ 181
49. మృత్యుభయం ........................................ 183
50. మృత్యువు ........................................ 184
51. తాతయ్య ........................................ 185
52. పూలను కోసిన మృత్యువు ........................................ 186

## - వేదాంతం -

1. ఆనాటి వాళ్లేమనుకునేవారు? ........................................ 189
2. అనాది విశ్వాసం - పరలోక యాత్ర ........................................ 192
3. సత్యాన్వేషణ ........................................ 195
4. మృత్యోర్మా అమృతం... ........................................ 199
5. మృత్యుంజయ మంత్రం ........................................ 203
6. మృత్యుముఖం నుంచి రక్షణా గీతం ........................................ 204
7. మృత్యువు - Quotations ........................................ 205



# మరణం - నిర్వచనం



# 1. మరణం - నిర్వచనం

"నేను అనేక వార్డులలో పనిచేసాను. కాన్పులగది, కాన్సరువార్డు, బర్న్ వార్డు, అవయవ మార్పిడి వార్డు, ఐసిసియూ ఇంకా ఎన్నెన్నో. ఎన్నో సార్లు మరణావస్థలో ఉన్నవారిని, మరణాలను చూసాను. గుండె ఆగిపోయినప్పుడు మందులు, షాక్‌లు ఇవ్వడం ద్వారా కొంతమంది బతకడం కళ్లారా చూసాను. చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా, అప్పుడే పుట్టిన పసిపాపలు కన్నుమూయడం ప్రతిరోజూ గమనిస్తున్నా ప్రతి మరణం నన్ను కలచివేస్తూనే ఉంటుంది. ప్రతి సందర్భం కొత్తగానే ఉంటుంది. మృత్యువు ఎన్ని రూపాల్లో వస్తుందో తలచుకుంటే ఆశ్చర్యం, భయం కలుగుతాయి" – అంటుంది జేమ్స్ టిబురాన్ అనే నర్సు.

ఓ డాక్టరుగా నా ముప్పై ఏళ్ల అనుభవంలో నేనూ అనేక సార్లు రోగిని రక్షించే క్రమంలో మృత్యువుతో ముఖాముఖీ తలపడ్డాను. అనేకసార్లు ఓడిపోయినా కొన్నిసార్లు గెలిచాను కూడా! గుండె ఆపరేషన్లు చేసేప్పుడు ఒక్కోసారి చావుకు బ్రతుకుకు మధ్య ఉండే సన్నటితెరను నేను స్పృశిస్తున్నానేమో అన్న భావన కలుగుతూ ఉంటుంది. మందులతో హృదయస్పందనను ఆపి, ఆపరేషను పూర్తయ్యాక మరల గుండెను కొట్టుకునేట్లు చేసే క్రమంలో ఒక్కోసారి మాకు ప్రతిక్షణం ఒక యుగంగా అనిపించిన సందర్భాలు కోకొల్లలు.

మృత్యువు గురించి నవీన శాస్త్రమేమంటుంది? మృత్యుశాస్త్రమేమన్నా ఉన్నదా? మృత్యు నిర్వచనం, మృత్యు దర్శనం ఇటువంటి విషయాలను పరిశీలిద్దాం.

Thanatology–థనటాలజీ – అనేది మరణాన్ని గురించి విశదపరిచే మృత్యుశాస్త్రం. మరణం రెండురకాలు: 1) దైహిక మరణం (Somatic, Systemic, Clinical); 2) కణ మరణం (Cellular or Molecular).

దైహిక మరణం, శారీరక మరణం లేదా Somatic death - దీనిలో రక్తప్రసరణం (Circulation), ఊపిరి తీసుకోవడం (Respiration), మెదడు నరాలు (Brain and Nerves) శాశ్వతంగా పనిచేయడం మానివేస్తాయి (Irreversible). అయితే ఇప్పటికీ మరణానికి ఖచ్చితమైన నిర్వచనం లభించలేదు. అవయవ మార్పిడి సమయాల్లో మెదడు, నాడీమండలం వ్యవస్థ శాశ్వతంగా దెబ్బతిన్నప్పటికీ, హృదయస్పందన, ఊపిరినీ కృత్రిమంగా కల్పించి అవయవాల్ని బదిలీ చేయవచ్చు. ఈ అవయవాలు వేరే వ్యక్తి శరీరంలో బతుకుతాయి.

తలకు తీవ్రమైన దెబ్బతగిలి మెదడు నుజ్జునుజ్జు అయినా Brain stem మెదడు క్రింది భాగానికి రక్తప్రసరణ మంచిగా ఉన్నట్లయితే గుండె కొట్టుకోవడం, ఊపిరి తీసుకోవడంలో పెద్ద మార్పులుండవు. మూత్రపిండాలు (Kidneys), హృదయం (Heart); ఊపిరితిత్తులు (Lungs); కాలేయం (Liver) ఇవన్నీ రక్తప్రసరణం సరిగా ఉన్నపుడే వెంటనే తీసి అవయవ మార్పిడి చేయాలి. కార్నియా (నేత్రదానం) వ్యక్తి చనిపోయిన ఆరుగంటల్లో, చర్మం 24 గంటల్లో; ఎముక 48 గంటలలోపు; రక్తనాళాలు 72 గంటలలోపు అవయవ మార్పిడికి పనికివస్తాయి.

అందుకని ఇప్పుడు Brainstem death అనే పదాన్ని మరణానికి నిర్వచనంగా వాడుతున్నారు. అనేక దేశాలు ఈ పద్ధతిని న్యాయసమ్మతం చేసి అవయవ మార్పిడికి (Organ Transplantation) మార్గాన్ని సుగమం చేస్తున్నాయి. ఈ Irreversible Structural Brain damageలో వ్యక్తి పూర్తిగా అచేతనుడై Irreversible Coma లో ఉంటాడు.

**1)** **Deep unconsciousness** (సంపూర్ణ అచేతనత్వం)

**2)** **No Movements, No spontaneous breathing** - కదలికలు లేకపోవడం, ఊపిరి ఆగిపోవడం.

**3)** **Cessation of Heart beat -** గుండె ఆగిపోవడం.

4) No Reflexes – ప్రతిస్పందనా రాహిత్యం

**5)** **Bilateral dilatation and fixation of pupils -** కనుపాపలు వెడల్పు కావడం.

**6)** **Flat isoelectric EEG -** మెదడు తరంగాలు ఆగిపోవడం.

(1) 24 గంటల వ్యవధి, (2) శరీర ఉష్ణోగ్రత $32^0$ సెంటిగ్రేడులకు పైన ఉండాలి. (3) కోమాను కలిగించే ఏ ఇతర రుగ్మతలూ కారణమై ఉండరాదు.

ఇద్దరు డాక్టర్లు సర్టిఫై చేయాలి. అవసరమైతే పరీక్షలు మరలా చేయాలి. డాక్టర్లిద్దరూ ఒకే టీమ్‌కు సంబంధించిన వాళ్లై ఉండకూడదు.

కణజాలాన్ని, అవయవాల్ని ఇతరులకు ఇచ్చే విధానాలు 1) Autologous- స్వశరీరం (చర్మాన్ని ఒకచోట తీసి మరొక చోట అతికించడం), 2) Monologous - మూత్రపిండం, కాలేయంలో కొంతభాగం, రక్తం, ఇతరులకు దానమివ్వడం,

3) Cadaveric (మరణానంతరం)– కార్నియా, మరియు ఇతర శరీర భాగాలు మరణానంతర అవయవ మార్పిడి.

వీటిల్లో అవకతవకలు, మోసాలు జరగకుండా ఉండటానికి ప్రతి దేశంలోనూ కొత్తకొత్త చట్టాలను ప్రవేశబెడ్తున్నారు.

**మృత్యువులాంటిది–**

**Stupor (స్టుపర్)–** వ్యక్తి అచేతంగాఉన్నా, గట్టిగా గిల్లినా, బాధ కలిగించినా కదిలి మరలా వెంటనే కోమాలోకి వెళ్లిపోతాడు.

**Vegetative State-** వ్యక్తి ఊపిరి తీసుకుంటూ ఉంటాడు, రక్త ప్రసరణం, హృదయ స్పందన సంతృప్తికరంగా ఉంటాయి. అప్పుడప్పుడూ కళ్లు తెరుస్తూ ఉంటాడు. నిద్ర, మెలకువ ఉంటాయి కాని తనెవరో, పరిసరాలేవిటో అవగాహన ఉండదు. మెదడు రెండు భాగాలు దెబ్బతిన్నా, బ్రెయిన్‌స్టెమ్ మామూలుగా ఉండడం వలన ఈ స్థితి ఏర్పడుతుంది.

**కణ మరణం (Cellular or Molecular death) -** జీవ వ్యాపారాలు (Vital functions) అన్నీ ఆగిపోయిన ఒకటిరెండు గంటల్లోపల కణ మరణం సంభవిస్తుంది. నాడీ కణజాలం వెంటనే మరణించగా, కండరాలు ఒకటి, రెండు గంటలపాటు జీవించి ఉంటాయి.

తీవ్రమైన ప్రమాదానికి, మృత్యువుకు మధ్య వ్యక్తి అనుభవించే నరకయాతనా సమయాన్ని Agonal Period అంటారు.

**మృత్యువు సంభవించే విధాలు (Modes of Death) :**

1) **Coma - అచేతన స్థితి** – బ్రెయిన్ స్టెమ్‌లోని కేంద్రభాగం దెబ్బతినడం వల్ల వ్యక్తి అచేతనుడవుతాడు. మెదడుకు గాయాలు, ఓపియం, కొకైన్ లాంటి మందులు, చక్కెరవ్యాధి, మూత్రపిండాల వ్యాధులు, విషజ్వరాలు, మూర్ఛరోగాలు ఈ స్థితికి కారణాలుగా చెప్పుకొనవచ్చును.

2) **Syncope -** గుండె అకస్మాత్తుగా ఆగిపోవడంతో మెదడుకు రక్తసరఫరా కాక ఒక్కోసారి మృత్యువు సంభవిస్తుంది. కాళ్లు చేతులు చల్లబడడం, ఫెయింట్ అవడం –ఇలాంటి లక్షణాలు రక్తస్రావం వల్ల, రక్తహీనత వలన, కలగవచ్చు.

3) **Asphyxia -** ఊపిరి ఆగిపోవడం. మెదడుకు ఆక్సిజన్ అందకపోతే 3–7 నిముషాల్లో నాడీవ్యవస్థ, కణజాలం దెబ్బతింటుంది. గుండె ఆగిన ఇరవై సెకండ్లలో ఊపిరి ఆగుతుంది. ఊపిరి ఆగిన ఇరవై నిముషాల్లో గుండె

ఆగిపోతుందని ఓ అంచనా! గొంతుకు, శ్వాసకోశ నాళాలకు అడ్డం పడడం వల్ల, ఒత్తుకుపోవడం వల్ల, కొన్ని రకాల వ్యాధుల, మందుల వలన, దెబ్బల వలన, మత్తుమందు వలన ఊపిరి ఆగిపోవచ్చు.

అకస్మాత్తుగా చనిపోవడానికి (Sudden Death) ముఖ్యకారణం Heart Attack –గుండెపోటు. హృదయ సంబంధ వ్యాధులు దాదాపు 50 శాతం; శ్వాసకోశ వ్యాధులు 20 శాతం; నాడీమండల రుగ్మతలు 15 శాతం; జీర్ణకోశ వ్యవస్థ 8 శాతం; మిగతావి 7 శాతం అకస్మాత్తు మరణాలకు కారణాలుగా చెప్పబడుతున్నవి.

## మరణానంతర మార్పులు (Post Mortem Changes) :

**1)** **తక్షణ మార్పులు – Immediate - Somatic death -** దైహిక మరణం స్పర్శ, ఇంద్రియానుభూతి కోల్పోవడం, ఊపిరి, గుండె ఆగిపోతాయి.

**2)** **నెమ్మదిగా సంభవించేవి– Cellular death -** పాలిపోవడం, శరీరంపైని మృదుత్వం తగ్గడం, కళ్లల్లో మార్పులు; కండరాలు వదులవడం (Primary Flaccidity); ఒళ్లు చల్లబడడం, నీలిరంగులోకి మారడం, రిగార్ మార్టిస్– శరీరం గట్టిపడడం.

**3) ఆలస్యంగా వచ్చే మార్పులు (Decomposition and Decay)**

**a)** **Putrefaction** (కుళ్లిపోవడం) – కణజాలపు రంగు మారి, విష వాయువులు దుర్వాసన ప్రారంభమై, కణజాలం కరిగిపోవడం మొదలై పాంచభౌతిక దేహం పంచభూతాల్లో కలిసే ప్రక్రియ సాగుతుంది.

**b)** **Adipocere (Saponification)** – కొవ్వు కణజాలం సబ్బుగా రూపాంతరం చెందడాన్ని Adipocere అంటారు. ఇది దాదాపు మూడు వారాలు పడ్తుంది. శరీరం నుంచి ఓ రకమైన తియ్యని వాసన వస్తుంది.

**c)** **Mummification -** కణజాలం ఎండిపోయి వ్యక్తి సహజరూపం కనిపిస్తూనే ఉంటుంది. ఎడారుల్లోని శవాలు, తక్కువ లోతు గోతుల్లో పాతిపెట్ట బడిన శవాలు ఈ స్థితికి చేరుకుంటాయి.

## భౌతిక కాయాన్ని నిలువ ఉంచే పద్ధతులు :

1) **Embalming - ఎంబాల్మింగ్ :** జీర్ణకోశ వ్యవస్థలోని పదార్థాల్ని, రక్తనాళాల్లోని రక్తాన్ని, మూత్రాశయంలోని మూత్రాన్ని తీసివేసి వాటిల్లోకి ఎంబాల్మింగ్

ద్రవాన్ని ఎక్కిస్తారు. ఎంబాల్మింగ్ ద్రవంలో లీటరున్నర ఫార్మాల్డిహైడ్, సోడియం బోరేట్ 600 గ్రాములు; సోడియం సిట్రేట్ 900 గ్రాములు; గ్లిజరిన్ 600 మిల్లీలీటర్లు; సోడియం క్లోరైడ్ 800 గ్రాములు; ఇవొసిన్ 1% - 30 మిల్లీలీటర్లు; నీరు పదిలీటర్లు ఉంటాయి.

2) **Mummification -** ఈజిప్టు ప్రజలు, 'ఇంకా' జాతిప్రజలు తమతమ పూర్వీకులను ఇలానే భద్రపరిచారు.

3) **Adipocere -** సున్నపు గనుల్లో పడిన వ్యక్తుల శవాలు, ఒక్కోసారి ఇలా రూపొందుతాయి.

4) **Freezing -** అంటార్కిటికా, ఆర్కిటిక్ ప్రాంతాల్లో ఎప్పుడో మరణించినవారి శవాలు ఇప్పటికీ చెడిపోకుండా లభ్యమవుతున్నాయి.

5) కొన్ని చిత్తడినేలల్లోని రసాయనాల వల్ల శవాలు నీళ్లలో ఉన్నా కుళ్లిపోకుండా చాలాకాలం పాటు ఉంటాయి.

## Death across the Life Span :

**1) మృత్యువు దృష్టిలో చిన్నపిల్లలు :** వృద్ధాప్యంలో మరణం సంభవిస్తే అది అంతగా బాధించకపోవచ్చు. కాని పసిపిల్లలను, యుక్తవయస్సులో ఉన్నవాళ్లను మృత్యువు కబళిస్తే కలిగే దుఃఖం వర్ణనాతీతం.

మనదేశంలో చిన్నపిల్లల మరణాలు ఎక్కువే. గర్భస్రావాలూ, బరువు తక్కువగా జన్మించే పిల్లలు, తల్లి బలహీనంగా ఉండడం వల్ల, దారిద్ర్యం వలన ఇతర కారణాల వలన సరైన పోషణ లేక మృత్యువాత పడుతున్న చిన్నారులెందరో ఉన్నారు. వీటిలో ఒకటి Sudden infant death syndrome (SIDS) అనేది. 2-4 నెలల వయసున్న పసిపిల్లలు నిద్రలోనే ప్రాణం విడుస్తారు. తమ తప్పు వలన, నిర్లక్ష్యం వలన పసిపాప మరణించిందని తల్లిదండ్రులు తమని తాము నిందించుకుంటారు. అపరాధ భావన వాళ్లను క్రుంగదీస్తుంది.

చిన్నపిల్లల్లో చాలామంది హత్యలకు గురికాబడడం మనందరకు కలవరం కలిగించే విషయం. ఆర్థిక లావాదేవీలు, శత్రుత్వాలూ, పెద్దవాళ్ల పగలు పిల్లవాళ్ల అపహరణలకు హత్యలకు దారితీస్తాయి. లైంగిక హింసలు, ప్రమాదాలు చిన్నపిల్లల్లో మరణాలకు ముఖ్య కారణాలుగా చెప్పవచ్చును.

**చిన్నపిల్లల దృష్టిలో మృత్యువు :** అయిదు సంవత్సరాల వయసు వచ్చేవరకు చిన్నపిల్లలకు మృత్యువుపై అవగాహన ఉండదు. చనిపోయిన వ్యక్తి

నిద్రపోతున్నాడనుకుంటారు. భయం ఉండదు. అందరూ ఏడుస్తుంటే వింతగా చూస్తారు. తల్లి హత్యకు గురైనప్పుడు పక్కనే ఉన్న పసిబాలుడు– అమ్మా! లే! పాలివ్వు... అన్నంపెట్టు... అని అడగడం మనలో చాలామందిమి చూసే ఉంటాము. ఒక్కోసారి పిల్లలు తాము అల్లరి చేయడం వలన తమవాళ్లు దూరం వెళ్లిపోయారనుకుని మానసికంగా కృంగిపోతారు.

అయిదేళ్ల ప్రాయం దాటిన పిల్లలకు మృత్యువు గురించి కొంత అర్ధమవుతుంది. మృత్యువును ఒక దయ్యంగా ఊహించుకుంటారు. తొమ్మిదేళ్ల వయసు కల్లా మృత్యువు యొక్క శాశ్వతత్వం, కర్మకాండల వ్యవహారం అవగత మవుతుంది.

**2) టీనేజ్ పిల్లలు :** వీళ్లు మృత్యువును గురించి అర్థం చేసుకుంటారు గాని, అది తమకు సంభవించవచ్చునన్న విషయాన్ని నమ్మరు. వాళ్లకు వాళ్లు ప్రత్యేకం – Unique and Special అనుకుని ఒక్కోసారి చిక్కుల్లో పడతారు. మోటార్‌సైకిళ్లపై వేగంగా పోవడం, సాహసాలు చేయడం ఇటువంటి Risky behaviour తో ఈ వయసు పిల్లలు మృత్యువుకు దగ్గరౌతారు. ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, కాన్సర్, ఎయిడ్స్, మృత్యు కారణాలు.

వీళ్లకు ఏదైనా ప్రాంణాతకపు వ్యాధిగాని, ప్రమాదం గాని సంభవించిందా అది దారుణమైన మానసిక సంఘర్షణకు గురిచేస్తుంది. జీవితం వాళ్లను మోస పుచ్చిందని భావించి నిరాశకు, ఆగ్రహానికి గురై ఒక్కోసారి వైద్య సహాయాన్ని నిరాకరిస్తారు. కొందరు తమకు ప్రమాదమున్న విషయాన్ని కూడా నమ్మరు.

**3) యవ్వనపు తొలిదశలో మరణం :** ప్రేమ వీళ్లను ముందుకు నడిపిస్తుంది. కాని ప్రాణాంతకపు వ్యాధుల్లో ఉన్నవాళ్లు తమను తమతోటి వాళ్లతో పోల్చుకుని, ఏం చెయ్యాలో తెలీని సందిగ్ధస్థితిలో ఉంటారు. వివాహం చేసుకోవాలా వద్దా? ఇతర బంధాలను ఉంచుకోవాలా, తెంచుకోవాలా? ఉద్యోగాలు చెయ్యాలా వద్దా – ఇవన్నీ సమస్యలౌతాయి.

**4) మధ్యవయసు :** జీవన్మరణాలను గురించి తెలిసిన వయస్సు కనుక ప్రాణాంతకపు వ్యాధి ఉన్నదని తెలిసినా 'షాక్'కు గురికారు. ఈ వయస్సులో గుండెజబ్బులు, పక్షవాతం ప్రధాన మృత్యుదూతలు. ఎక్కువమంది కాన్సర్ లాంటి మెల్లగా చంపే రోగం వస్తే బాగుండేది అని మనసులో అనుకుని, బయటకు మాత్రం అనాయస మరణం కావాలని అందరికీ చెప్పుకుంటారు.

**5) వృద్ధాప్యం :** అప్పటికే కుటుంబంలో చిన్నాపెద్దలు మృత్యుబారిన పడడం చూసిన వయసు. కొంత ఆశ, కొంత నిర్లిప్తత. కాన్సర్, గుండెనెప్పి, పక్షవాతం మృత్యు కారణాలు. వీటిని వైద్యశాస్త్రం అదుపులో ఉంచితే ఆయుర్దాయం డెబ్భైకిపైన మరో ఏడేళ్లు పెరగవచ్చని శాస్త్రజ్ఞుల అంచనా!

వయసు పెరిగినకొద్దీ మతిమరపు పెరుగుతుంది. Terminal decline. చదవడం, వ్రాయడం తగ్గుతాయి. కొందరిలో మృత్యువాంఛ పెరిగి ఆత్మహత్యలకు పాల్పడతారు. కుటుంబానికి, సమాజానికి తాము భారంగా మారుతున్నామేమో అన్న భావన వాళ్లను అంతిమ నిర్ణయానికి పురికొల్పుతుంది.

చిన్నపిల్లలు అడిగినట్టే వృద్ధులూ తమకు మృత్యువు వస్తుందా, వస్తే ఏ రూపంలో వస్తుంది? ఇంకా ఎన్నాళ్లు రూకలు మిగిలున్నాయి? ఇటువంటి ప్రశ్నలు అడుగుతారు.

కొన్ని తెగల్లో జీవితం ఇకచాలు, ఈ రోగంతో, వృద్ధాప్యంతో ఈ మరణశయ్యపై నేనుండలేను అనుకున్న వ్యక్తి తన పెద్దకొడుకును పిలిచి మెడచుట్టూ తాడు చుట్టమంటాడు. అందరికి వీడ్కోలు చెప్పి కుమారుడిని తాడు లాగమంటాడు. ముడి గట్టిపడ్తుంది. అతడికి ఈ లోకానికి బంధం తెగిపోతుంది.

హిందువులకు స్వర్గం, ఈజిప్షియన్లకు యారోరీడ్ పొలాలు, గ్రీకులకు ఎలిషియన్ పొలాలు, వైకింగులకు వాలాహల్లా మరణానంతరం ఆత్మలు ఆనందంగా సంచరించే ప్రదేశాలు. లకోటా తెగకు చెందిన అమెరికన్ ఇండియన్లకు వానాగి మకొసి (Wanagi Makoez) అనే ఆత్మలలోకం అలాంటిదే. హిందువులకు మృత్యువు అంతిమం కాదు మరో జన్మకు ప్రారంభం మాత్రమే!

భారతంలో ధర్మరాజును కొంగరూపంలోని యక్షుడు – అన్నిటికన్నా ఆశ్చర్యం కలిగించేదేమిటని అడుగుతాడు. అప్పుడు ధర్మరాజు–'తన ఎదుట ఎందరో చనిపోతున్నా తానుమాత్రం మరణించడని మానవుడనుకుంటాడు' అని సమాధాన మిస్తాడు. దీనినే పోతన – భాగవతంలో

**'మచ్చిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము దేహి పుట్టుచున్**
**జచ్చుచునుండ చూచెదరు చావక మానెడు వారి భంగి నీ**
**చచ్చిన వారి కేడ్చెదరు చావుకు నొల్లక డాగవచ్చునే**
**యెచ్చట బుట్టె నచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్'** – అని వివరిస్తాడు.

**మృత్యువుతో ముఖాముఖీ :**

ఎలిజబెత్ కుబ్లర్ రాస్ (Elisabeth Kubler Ross) అనే మానసిక శాస్త్రవేత్త అనేకమంది మృత్యుముఖంలో ఉన్నవారిని పరిశీలించి, ఇంటర్వ్యూ చేసి సారాంశాన్ని ఇలా తెలియజెప్పింది. మృత్యువుకు చేరువైన వ్యక్తులు అయిదు దశల్లో మృత్యుసన్నిధిని చేరుకుంటారు. (Kubler Ross - 1975)

1) **తిరస్కారం (Denial)** – నేనేమిటి? చచ్చిపోవడమేమిటి? అసంభవం! ఎక్కడో ఏదో తప్పు జరిగింది. నాకా జబ్బు వచ్చి ఉండదు. ఆ డాక్టరుకేం తెలీదు. అది బహుశా Wrong diagnosis.

2) **కోపం (Anger) -** తిరస్కారం తరువాత ఆగ్రహం. ఎవర్ని చూసినా కోపమే! పలకరిస్తే చాలు కస్సుమంటారు. నేనెందుకు చచ్చిపోవాలి. ఈ భూప్రపంచంలో ఇంతమంది దుర్మార్గులున్నారే? వాళ్లకేమో చావురాదా? నాకెందుకొస్తుంది – ఇలా మొండిగా వాదిస్తుంటారు. ఈ దశలో కొందరు చేయకూడని పనులు, ఊహించలేని కార్యాలు చేసే అవకాశం ఉంది.

3) **బేరసారాలు (Bargaining) -** ఇక నుంచి చెడుపనులు చేయను. బుద్ధిగా ఉంటాను. అట్లాగయినా దేవుడు నన్ను కనికరించి నాకు ఆయుర్దాయ మిస్తాడేమో! నా కూతురి పెళ్లయ్యాక హాయిగా కన్నుమూస్తానమ్మా! డాక్టరుగారూ! ఏదో ఒక మందిచ్చి అంతదాకా నన్ను బతికేట్టు చేయండి! పంతులు గారూ! మృత్యుంజయ యాగం నిర్వహించండి!

   ఒకసారి కాలవ్యవధి నిర్ణయించుకున్నాక భీష్ముడు ఉత్తరాయణ కాలం కొరకు ఎదురుచూచినట్లు, యూదులు Passover పండుగ తర్వాత, చైనీయులు ముఖ్య పండుగల తరువాత మరణించేందుకు ఇష్టపడతారు.

4) **మానసికంగా కృంగిపోవడం (Depression)** – జరిగేది జరగక తప్పదనుకున్నవాళ్లు ఇక నిరాశతో కృంగిపోతారు. తమవాళ్లను తమకిష్టమైన వాళ్లను విడిచివెళ్లేప్పటి బాధ వీళ్లలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ నిరాశ – తన ఉద్యోగం, పరువు, ప్రతిష్ఠ, స్థానం కోల్పోవడం వలన కలిగే reactive depression కావచ్చు లేదా తను మరణించడం వల్ల కుటుంబానికి భవిష్యత్తులో జరిగే ఆర్థిక, ఇతర నష్టాల అంచనా వలన కలిగే Preparatory depression కావచ్చును. ఈ నిరాశ వాళ్లకు అంతులేని విచారాన్ని కలిగిస్తుంది.

5) **అంగీకారం (Acceptance) :** చేసేదేమీ లేదని తేలినాక మిగిలింది సమాధానపడటమే కదా! నిర్లిప్తత ఆవరించాక ఒంటరితనాన్ని కోరుకుంటారు. ఇక, మృత్యువు కొండె వారినేమీ బాధించదు.

కొందరిలో ఈ దశలు ముందుకూ వెనకకూ వస్తుంటాయి. ఈ దశల మధ్య వ్యవధి ఉండవచ్చు, ఉండకపోవచ్చు కూడా! అదే విధంగా వ్యక్తుల మనస్తత్వాలు, వయస్సు, జ్ఞానం, చదువు, పెంపకం, మతం, ఆలోచనలు ఇవన్నీ వారి ప్రవర్తనలో మార్పులను తెస్తాయి. కుబ్లర్ రాస్ పరిశోధనలు మృత్యుముఖంలో ఉన్నవారిని అర్థం చేసుకోడానికి, సాయం చేసుకోడానికిప్రణాళిక రూపొందించు కోడానికి సాయపడ్తున్నాయి.

ఎడ్విన్ ష్నీడ్‌మాన్ అనే మరో మానసిక శాస్త్రవేత్త (1999) మృత్యు ముఖంలో ఉన్నవాళ్లలో కొందరిలో అపనమ్మకం, అవిశ్వాసం, నెప్పివలన కలిగే భయం, వింత వింత ఆలోచనలు, తమనెవరో రక్షిస్తున్న, రక్షించబోతున్న భ్రాంతులు ఇవన్నీ లేక వీటిలో కొన్ని అలలు అలలుగా వారిని కమ్ముకుంటా యంటాడు.

**నన్ను రక్షించవద్దు (Do Not Resuscitate - DNR) :**

అనేకమంది వ్యక్తులు కోమాలోకి పోయి రోజులు, నెలలు, సంవత్సరాలు మరణశయ్యపై యంత్రాల సాయంతో జీవించగా వాళ్లలో కొద్దిమంది బతుకుతున్నారు కాబట్టి ఆ ఆశతోనే ఈ రకపు వైద్యం ICCU లలో ప్రధాన విధానంగా మారింది. అయితే కొందరు తమను అలా బతికించవద్దని ముందే ఖరాఖండీగా చెప్పేవాళ్లున్నారు. వైద్యులు కూడా రోగి వయస్సును, వ్యాధిని బట్టి ఒక్కోసారి DNR పద్ధతిని బంధువులకు 'సజెస్ట్' చేస్తారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్ణయాలు తీసుకోడానికి ఉపయోగపడే వాటిల్లో – Living Will - (Living will is a legal document that designates the medical treatments a person does or does not want if the person cannot express his or her wishes.) రోగికి సంబంధించిన వ్యక్తి కాని Health Care - Proxy కాని వ్రాసియిచ్చే పత్రం.

**నాకు సహాయం చేయండి (Euthanasia or Assisted Suicide) :**

1990లో డాక్టర్ జాక్ కెవొర్కియాన్ – ఆత్మహత్య యంత్రం (Suicide Machine) ను కనిపెట్టాడు. ఎవరైతే ప్రాణాంతకపు వ్యాధి చివరి దశలో ఉండి చనిపోదలుచుకున్నారో ఆ వ్యక్తి ఆ యంత్రంలోని ఒక బటన్ నొక్కితే దాంట్లోంచి

మత్తుమందు ఎక్కువ మోతాదులో వచ్చి అది హృదయస్పందనను ఆపేస్తుంది. అతడు ఆ విధానాన్ని 60 Minutes (అరవై నిముషాలు) అనే 'టివిషో'లో చూపించినందుకు– Assisted Suicide నేరం క్రింద ఎనిమిది సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించవలసి వచ్చింది.

అమెరికాలో ఇది సంచలనం కలిగించగా– ఒరెగాన్ రాష్ట్రం 1998లో 'A Right to die law' ను ప్రవేశపెట్టింది. ఒక్క దశాబ్దకాలంలో ఆ చట్టాన్ని వినియోగించుకుని మరణించినవాళ్లు మూడువందల లోపే కాగా ఈ విషయం ఎందరినో ఆశ్చర్యపరచింది. నెదర్లాండ్‌లో Assisted Suicide చట్టబద్ధమే! ఇద్దరు వైద్యులు ఆ వ్యక్తి యొక్క ప్రాణాంతక వ్యాధిని నిర్ధారణ చేయాలి. రోగి స్వయంగా అంగీకార పత్రంపై సంతకం చేయాలి. బంధుమిత్రులకు సమాచారం అంది ఉండాలి. అప్పుడే అది చెల్లుబాటు అవుతుంది.

**దయా మరణం (Mercy Killing or Euthanasia) :**

Passive Euthanasia లో రోగికి కృత్రిమ శ్వాసనిచ్చే యంత్రాలను, ప్రాణాన్ని నిలిపి ఉంచుతున్న మందులను ఆపివేస్తారు. DNR ఆర్డర్ అమలులో ఉంటుంది.

Voluntary Active Euthanasia లో నెప్పి తగ్గే మందు కాని మత్తుమందు కాని ఎక్కువ మోతాదులో ఇస్తారు.

అనేక ICCUలలో ఈ విధానం అమలులో ఉందని సర్వేలు తెలుపుతున్నాయి. ఇవి రోగి, రోగి బంధువులు, డాక్టర్లు కలిసి తీసుకునే నిర్ణయమే.

ఒకరి జీవితాలను అంతం చేసే అధికారం ఇంకొకరికి లేదు కదా! నిష్ణాతులైన వైద్యుల అభిప్రాయాలూ ఒక్కోసారి లెక్కతప్పి ఆర్నెల్లు బతుకుతావన్న వాడు ఆరేళ్లు బతకవచ్చు. బాధలో, నిరాశలో ఈ బతుకు చాలు నన్ను చంపేయ్ అన్నవాడే ఆశ మొలకెత్తితే మరల బతకాలనుకోవచ్చు. అందుచేత ఈ స్వచ్ఛంద మరణాలూ (Euthanasia), సహకార మరణాలూ (Assisted Suicide) లు తగవని కొందరు అభిప్రాయపడ్తున్నారు.

✧✧✧✧✧

# 2. జాతస్య హి ధ్రువో మృత్యుః

పుట్టినవాడు గిట్టక తప్పదా? మృత్యువును తప్పించుకునే వీలు లేదా? సంజీవని లత, అమృతం, యవ్వన జలధార మనకు దొరకవా? శాస్త్రజ్ఞానం ఇంత అభివృద్ధి చెందింది కదా, మృత్యువును ఆపే లేదా వయస్సును పెంచే విధానాలేవీ కనుగొనబడలేదా? ఆధునిక శాస్త్రమేమంటుంది మృత్యువు గురించి?

వృద్ధాప్యం సమీపించాక క్రమేపీ శరీరం వడలి, పూవులా ఎప్పుడు రాలిపోతుందో? దీనిని వివరించే రెండు సిద్ధాంతాలున్నాయి.

**1) Genetic Programming theories of aging -** మన శరీరంలోని కణాల్లో ఉండే DNA లో నిక్షిప్తం చేయబడిన కాలపరిమితి వరకు మాత్రమే ఒక్కో కణం రెండుగా విడి ద్విగుళం, బహుళం కావడం సంభవిస్తుంది. ఆ తరువాత కణ విభజన ఆగిపోవడంతో వ్యక్తి కృశించడం మొదలువుతుంది.

కణంలోని న్యూకియస్‌లో ఉన్న కోమోజోముల చివరి భాగంలో టెలొమియర్ అనబడే తోక ఉంటుంది. కణం విభజన చెందిన కొద్దీ ఆ టెలొమియర్ పొడవు తగ్గి, టెలొమియర్ అదృశ్యం కాగానే కణవిభజన ఆగిపోతుంది. ఒక్కో కణం ఎన్నిసార్లు విభజన చెందాలనే సమాచారం కణంలోనే నిక్షిప్తమై ఉంటుంది.

**2) Wear and tear theory of aging -** కణ విభజన జరిగేప్పుడు విడుదలయ్యే పదార్థాలు, శరీరంలో తయారయ్యే విషపదార్థాలు, Free radicals, toxins ఎక్కువ కావడంతో అవి కణ విభజనను ఆపుదల చేయడమే కాక, వృద్ధాప్యంలో వచ్చే కాన్సర్, గుండెజబ్బు, డయాబెటిస్ లాంటి వ్యాధులకు కారణమై మృత్యువును ఆహ్వానిస్తాయి.

## వృద్ధాప్యాన్ని వాయిదా వేయగలమా ?

శాస్త్రజ్ఞులు ఆ దిశగా ముందంజ వేస్తున్నారు. తొమ్మిది రోజులు మాత్రమే బతికే నులిపురుగుల ఆయుర్దాయాన్ని 50 రోజులకు పెంచగలిగారు. అది దాదాపు 420 సంవత్సరాల మానవ ఆయుర్దాయానికి సమానం. అలాగే పళ్లమీద మూగే ఈగల (Fruit flies) ఆయుర్దాయాన్ని పెంచగలిగారు. టెలొమియరేజ్ ఎంజైమ్‌ను నియంత్రించడం, Sirtuins అనే జీన్స్‌ను, ఫ్రీ రాడికల్స్‌ను, కాలరీస్‌ను తగ్గించడం ద్వారా; అవయవ మార్పిడి ద్వారా వృద్ధాప్యానికి విరుగుడు కనుక్కునే దశలో ముందడుగు వేస్తున్నారు.

తండ్రి యయాతికి పూరుడు తన యవ్వనాన్నిచ్చినట్లు బహుశా యవ్వన మార్పిడి ప్రక్రియ ప్రస్తుత అవయవ మార్పిడిలా ఉండిందేమో?

## మనిషీ నీ వయసెంత ?

రాబోయే బయొనిక్ కాలంలో (Bionic Age) గుండె, కాలేయం, మూత్రపిండాలు తదితర అవయవాల మార్పిడి ఎముకల కీళ్ల మార్పిడితో ఎవర్నైనా నీ వయసెంత అని అడిగితే– నా గుండె వయసు నాలుగేళ్లు, కాలేయం వయసు మూడేళ్లు, కిడ్నీ వయసు ఏడేళ్లు, కీళ్ల వయసు పదేళ్లు, నా అసలు వయసు డెబ్భై ఏళ్లు, మనసు మాత్రం ఇరవై ఏళ్లు అంటారేమో. గర్భకోశం, అండాలు, వృషణాల మార్పిడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నది.

గౌతముడి శాపంతో పోగొట్టుకున్న వృషణాలకు బదులు ఇంద్రుడికి మేక వృషణాల మార్పిడి జరిగిన కథ మనకు తెలుసు. తల మార్పిడి–దక్షుడికి, వినాయకుడికి జరిగి వాళ్లు జగాన్నేలడం అందరికీ విదితమే. మన ఆధునిక శాస్త్రమంతవరకూ ఇంకా రాలేదు.

ఆత్మహత్యకు కారణాలేమని సైన్సు చెబుతోంది?

ప్రతి కణంలోనూ లైసోజోమ్ లనే ఖాళీ ప్రదేశాలుంటాయి విశ్వంలో ఉన్న కృష్ణబిలాల్లా (Black Holes). క్రోమోజోంలోని టెలిమియర్ కృశించిన కొద్దీ కణవిభజన పునరావృత సంఖ్య తగ్గుతుంది. కణం యొక్క జీవితకాలం పూర్తి కాగానే Programmed System అదేశాలతో విడుదలయిన Caspases అనే ఎంజైములు కణంలోని ఖాళీ ప్రదేశాలైన Vacuoles నుంచి వెలువడి, కణాన్ని నశింపజేస్తాయి. దీనినే 'Programmed Suicide' అంటారు.

కొన్ని రకాల పక్షులు, జలచరాలు, మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతాయంటారు. ఎఫిడ్స్ అనే చీమలు పెంచుకునే చిన్న జీవులలో కొన్ని ఎఫిడ్లు శత్రువు తమని భక్షించటానికి వస్తుందని తెలియగానే అవే విస్ఫోటనం చెంది ఆ విషంతో శత్రువును గాయపరచడమో, చంపడమో చేస్తాయి. ఇదే వ్యవహారం ఈనాటి Suicide Bombers లో, కమికజె – మిత్రసైన్యాన్ని చీకాకు పెట్టిన జపనీస్ పైలట్లలో, జోహార్ చేసుకున్న చితోర్ రాణివాసపు స్త్రీలలో, బాలిదేశపు రాజవంశీకులలో గమనించవచ్చును.

ప్రసార మాధ్యమాల (మీడియా) ప్రచారంతో కూడ కొందరి మనసులు ప్రభావితం చెందగా వ్యక్తులు ఆత్మహత్యను సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నామనుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడతారు. కొందరు నిరాశతో, కొందరు ఉద్వేగంతో– రైతుల ఆత్మహత్యలు, విద్యార్థుల ఆత్మహత్యలు, సైనికుల ఆత్మహత్యలు ఈ కోవకు చెందినవి. సమాజం తమను ఆర్థికంగా, మానసికంగా ఆదుకోగలదన్న విశ్వాసం కలిగిననాడు ఎవ్వరూ ఆత్మహత్యకు పాల్పడరు.

✧✧✧✧✧

# 3. ఆయుష్షు నూరేళ్లేనా?

**ఆయువు నూరు వత్సరములందు సగంబు నశించె నిద్రచే**
**నా యరలో సగంబు గతమయ్యెను బాల్య జరా ప్రసక్తి చే**
**బాయక తక్కినట్టి సగబాలు గతించు బ్రయాస వృత్తిచే**
**నాయువు చంచలంబగుడు బ్రాణుల కెట్లు సుఖంబు చేకూరున్**

నూరేళ్ల జీవితంలో సగం నిద్రకే సరిపోతుంది. మిగిలిన భాగంలో సగం బాల్య, యవ్వన చాపల్యాలకు సరిపోతుంది. మిగిలిన భాగం వృత్తికి సరిపోతుందంటూ భర్తృహరి జీవిత సత్యాన్ని ఎంత చక్కగా చెప్పారు! జీవితం నీటి బుడగని, ఆయువు అల్పమని, ధన సంపదలు చంచలమని తెలిసి కూడా మానవుడు అహంకార పూరితుడై అందరినీ అణగదొక్కాలని చూడడం చిత్రం

**'జాతస్య హిధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ**
**తస్మాత్ పరిహార్యే ర్థే న త్వం శోచితు మర్హసి'**

పుట్టినవాడు గిట్టక తప్పదు. మృతినొందిన వారికి కర్మానుసారం పునర్జన్మమూ నిశ్చితమే! ఎలాగైనా తప్పని ఈ విషయం గురించి చింతించడం ఎందుకు? అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుని అనునయిస్తాడు. జనన మరణాల మధ్య ఉండే కాస్త సమయాన్ని ఆయుర్దాయమని గ్రహించి, నిలబెట్టుకోడానికి మనిషి ఎంత తాపత్రయ పడుతున్నాడు?

## ఏ యుగంలో ఎంత ఆయుష్షు?

'ఆయుర్వర్ష శతం నృణాం పరిమితం' నరులకు నూరేళ్ల ఆయుష్షని చెప్పినా, పూర్వ గ్రంథాల్లో యుగాలను బట్టి ఆయుర్దాయం మారుతుందని చెప్పారు. కృత, త్రేతాయుగాల్లో 4000 ఏళ్లు, ద్వాపరలో 400, కలియుగంలో నూరు ఏళ్లుగా పేర్కొన్న 'చరకసంహిత' ధర్మదేవత పాదాలు తగ్గినకొద్దీ ఆయుఃప్రమాణం క్షీణిస్తుందని చెబుతున్నది.

**'యుగే యుగే ధర్మ పాదః క్రమేణాన హీయతే**
**గుణ పాదశ్చ భూతానాం ఏవం లోకః ప్రలీయతే**
**సంవత్సర శతే పూర్ణేయాతి సంవత్సరః క్షయమ్**
**దేహినామాయుషః కావే యత్ర యన్మాన మిష్యతే'**

కృతయుగ ప్రారంభంలో దేవతలతో సమానమైన వయస్సు ఉన్న మానవులు కృతయుగం మొదలయ్యాక నాలుగు వందల సంవత్సరాలకు (పురుషాస్సర్వ సిద్ధాశ్చ

చతుర్వర్ష శతాయుః కృతి-వ్యాస మహర్షి), కృతయుగాంతానికి 300, త్రేతాయుగాన 300-200, ద్వాపరాన 200-100, కలియుగంలో 100 సంవత్సరాలు... ఈ రకంగా ధర్మం నశించినకొద్దీ ఆయువు క్షీణిస్తుందని ఓ భావన.

## పూర్ణాయుర్దాయం ఎంత?

దేవతలకు ఒక దేవ సంవత్సరం 360 మానవ సంత్సరాలకు సమానం. నూరు దేవ సంవత్సరాలకు (36,000 ఏళ్లకు) దేవతల అధిపతి ఇంద్రుడు కూడా పదవీ విరమణ చేస్తే కొత్త ఇంద్రుడి పరిపాలన మొదలవుతుంది. త్రేతాయుగం కడపట సీతా సాధ్వి నిష్క్రమణానంతరం శ్రీరామచంద్రుడు బ్రహ్మచర్యం పాటించి, 11 వేల ఏళ్లు ఎడతెగకుండా అగ్ని హోత్రంబులు చెల్లించి తాను ఎక్కడి నుంచి అయితే వచ్చాడో అక్కడికి వెళ్లాడని భాగవతం చెబుతున్నది. త్రేతాయుగపు రాజుల ఆయుర్దాయం వేలల్లోనే ఉన్నదని దీన్నిబట్టి మనకు అర్థమవుతున్నది. క్రీస్తుపూర్వం 1880 నాటి ఓ శిలాఫలకంపై సుమేరియన్ రాజుల వయస్సు 10,800 సంవత్సరాల నుంచి 72,000 ఏళ్ల వరకు జీవించినట్లు రాసి ఉన్నది. పాత నిబంధనలో (ఓల్డ్ టెస్టామెంట్) పాత బైబిల్ కథలలో వేలాది ఏళ్లు బతికిన వీరుల ప్రస్తావన ఉన్నది. మానవుని పూర్ణాయుర్దాయం వేయి సంవత్సరాలుగా యూదులు భావించేవారు. ఎందుకంటే అది దివ్య దినానికి, 'పవిత్రమైన రోజుకు' చిహ్నం. మానవులు వృద్ధిచెందడంతో వారి కుమార్తెలను దేవుని కుమారులు వివాహం చేసుకొన్నారు. దాంతో మానవులలో గర్వం పెరగడాన్ని గమనించిన దేవుడువారి వయస్సును 120 ఏళ్లుగా నిర్ణయించినారని జెనెసిస్ - ఆది కాండంలో చెప్పారు.

ఆదిమానవుడు ఆదాం 930, సెత్ - 912, వినాష్ - 905, కానన్ 910, మహాలారెల్ 892, జారెడ్ 962, ఈనాక్ 365 (దేవునితో నడిచెను) అందరికంటె ఎక్కువ మెథుసెలాహ్ 969 సంవత్సరాలు జీవించారు.

## దేవదారు ముందు మనమెంత?

వివిధ జంతువుల ఆయుర్దాయాలు. తాబేలు-152, సొరచేప-90, ఏనుగు-70, సింహం-20, రాణిచీమ-18, ఎలుక-6, సీతాకోకచిలుక-1, మానవుడు 120 సంవత్సరాలుగా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. 5 వేల సంవత్సరాల వయస్సు ఉన్న దేవదారు వృక్షంతో పోల్చిచూసినప్పుడు మన ఆయుర్దాయం అతి తక్కువగా కనిపిస్తుంది కదా! మన జ్యోతిష శాస్త్రాలు చెప్పే గ్రహ ప్రభావం 120 ఏళ్లుండడం గమనార్హం.

గ్రీకు, రోమన్ ఐతిహ్యాలలో 'పార్సే లేదా మొయిరాయి' లేదా త్రీ ఫేట్స్ ముగ్గురు ఆయుఃలక్ష్ములుగా ప్రసిద్ధికెక్కారు. క్లోతో, లాఖెసెస్, ఎట్రోపాస్. వీళ్లు జీవదారం

వడికే చరఖా దగ్గర కూర్చోని ఒకామె, నూలు వడుకుతూ జీవదారాన్ని సాగదీస్తుంటే, మరొకామె కండెకు చుడుతూ, మూడో ఆమె దారాన్ని కత్తిరిస్తూ ఉంటుంది. ఆమె ఎప్పుడు, ఎక్కడ కత్తిరిస్తే అక్కడి వరకే ఆయుర్దాయమన్నమాట. క్లోతో పుట్టుకకు, లాఖెసెస్–పెరుగుదలకు, ఎట్రోపాస్–మరణానికి అధిదేవతలు.

## దిన దిన గండం

ఎక్కడ చూసినా ఉత్పాతాలే! దుర్నిమిత్తాలే! ధర్మరాజు మనసు మనసులో లేదు. ద్వారక వెళ్లిన అర్జునుడు దూరం నుంచే విషణ్ణవదనంతో వస్తున్నాడు. గుండెలు బిగబట్టి ధర్మజుడు తమ్ముడిని కారణమడగ్గా ఉబికి వస్తున్న కన్నీటిని చేతితో తుడిచికొనుచు

**'మన సారధి మన సచివుడు**
**మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్**
**మన విభుడు గురుడు దేవర**
**మనలను విడనాడి చనియె మనుజాధీశా'**

అని గద్గద స్వరంతో అర్జునుడు చెప్పాడు. జ్యోతిషశాస్త్రం ప్రకారం క్రీస్తుపూర్వం 3228లో జన్మించిన శ్రీకృష్ణుడు 3102లో నిర్యాణం చెందగా ఆరోజే కలియుగం ప్రారంభమైనది. శ్రీకృష్ణ పరమాత్మ 125 సంవత్సరాల 7 నెలలు జీవించారని పండితుల అభిప్రాయం. కలియుగంలో ఆయుష్షు దిన దిన గండం నూరేళ్ళాయుష్షులాగా వర్థిల్లుచున్నది. భయం నీడలో జీవనం కదా!

✧✧✧✧✧

# 4. సజీవ సమాధి

భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాపథంలో 'సజీవసమాధి' గురించి అందరికీ తెలిసిన విషయమే. యోగులు, మునులు, దైవస్వరూపులుగా కొనియాడ బడినవారు తాము నిర్ణయించుకున్న రోజున గుహలోనో, బిలంలోనో ప్రవేశించి ద్వారాన్ని బండరాళ్లతో మూయించుకుని భగవదైక్యం చెందేవారు. అదో పెద్ద పండగలా ఆరోజు, ఆ తర్వాత ప్రతి సంవత్సరమూ ప్రజలు ఆ మహనీయుణ్ణి దేవుని అవతారంగా స్మరిస్తూ ఉత్సవం చేసుకునేవారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి లాంటి సిద్ధయోగులు అలానే శాశ్వత కీర్తి పొందినారు.

ఒక్కోసారి కొన్ని నేరాలకు శిక్షగా 'సజీవసమాధి'ని రాజులు విధించేవారు. సలీంను ప్రేమించిన అనార్కలికి అక్బర్ ఈ శిక్షను అమలుపరచి నాడని అనేకమంది విశ్వాసం. ప్రమాదాలలో ముఖ్యంగా గనులు, భవంతులు కూలినప్పుడు, భూకంపాలు వచ్చినప్పుడు దురదృష్టవంతులు సజీవసమాధి కావడం మనకు తెలుసును.

ఒక్కోసారి వైద్యులు చనిపోయాడని నిర్ధారించిన వ్యక్తులు కూడ పునరుజ్జీవులు కావడం, చితిమంటల వేడికి, మానవ స్పర్శకు, నెప్పికి నిద్ర నుంచి లేచినట్లు మరణించినవారు సజీవులుగా ప్రత్యక్షమైనప్పుడు ప్రత్యక్ష సాక్షులు పడే భయసందోహాలు కథలు కథలుగా చెప్పబడినాయి. అటువంటి విషయాన్నే 'ఎడ్గార్ అలన్‌పో' (Edger Allan Poe) ఒక కథగా మలిచినాడు.

–క్రీస్తుశకం 1810లో భాగ్యవంతుల కుటుంబానికి చెందిన ఓ అందమైన పదహారేళ్ల బాలిక విక్టరైన్ లాఫర్‌కెడ్ (Victorine Lafodercade)ను జర్నలిస్టు మరీ అంత ధనవంతుడు కాని జూలియన్ బొస్యుట్ (Julian Bossuet) ప్రేమించినాడు. ఆమెను పెళ్లాడడానికి ముందుకు వచ్చినవారిలో అతడు కూడా ఒకడు. అయితే ఆమె వివాహం మరో పేరున్న ధనవంతుడు, బ్యాంకర్ రెనెల్లె (Renelle) తో జరిగింది. అతగాడు ఆమెను నిర్లక్ష్యం చేయడమే కాక తరచూ అనుమానాలు, అవమానాలకు గురిచేస్తుండడంతో కొన్నేళ్లపాటు దుర్భర జీవితాన్ని గడిపిన ఆమె మానసికంగా క్రుంగి వైద్యుల పర్యవేక్షణలో ఉండగానే మరణించింది. ఆమె మరణాన్ని ధృవీకరించినాక బంధుమిత్రుల సమక్షంలో ఆమె దేహాన్ని శవపేటికలో ఉంచి ఖననం గావించారు.

అర్ధరాత్రి ఆమెకు మెలకువ వచ్చింది. ఏదో చప్పుడు! తాను ఏదో పెట్టెలో పెట్టబడి ఉన్నట్లుగా అర్థం కాగానే ఒక్కక్షణం భయం ఆమె శరీరాన్ని మొత్తం వణికించింది. స్వతహాగా ధైర్యస్తురాలు కావడంతో కాస్త నెమ్మదిపడి కొద్దికొద్దిగా గాలిపీలుస్తూ శవపేటిక కప్పువేపు చూస్తున్నది. గుండెలపై, ఊపిరి తిత్తులపై ఎవరో కూర్చున్నట్లు ఊపిరాడక ఆయాసం రాసాగింది. పైనుంచి ఏదో చప్పుడు, మరింత దగ్గరగా; కొత్తమట్టి వాసన, తనపై కప్పబడిన కొత్త వస్త్రం, పూలు, అత్తరుల వాసన కలిపి వింత పరిమళం. కటిక చీకటి. క్షణక్షణానికి ఎక్కువవుతున్న శబ్దం - దానితోపాటు మరల భయం ఆమెను కమ్ముకు రాసాగింది. శబ్దానికి నిశ్శబ్దానికి మధ్య ప్రతిక్షణం యుగంలా అనిపించడంతో ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. క్రమేపీ ఆమె స్పృహ కోల్పోసాగింది.

అతడు శరవేగంతో సమాధి గోతిని తవ్వసాగాడు. ఆమెపై అతనికున్న అంతులేని ప్రేమ అతడిని ఈ పనికి పురికొల్పింది. త్వరగా తవ్వాలి! ఎవరన్నా చూస్తే? దారుణమైన నేరం, ఘోరమైన శిక్ష! అతని చేతులు చకచకా కదుల్తున్నాయి. మట్టిని ఎత్తి పైకి పోస్తున్నాడు. తవ్వుతున్నాడు. మనసులో రకరకాల ఆలోచనలు. ఆమె తనతో జీవించడానికి నిరాకరించింది. అయినా ఆమెను తాను ప్రేమిస్తూనే ఉన్నాడు. ఆమె గుర్తుగా, ఎంతో అందమైన ఆమె బంగరు శిరోజాలు, వాటినైనా తనతో జీవించినంత కాలం భద్రపరచుకోవాలి. ‘ఠంగ్’మని శబ్దం! శవపేటిక మూత చప్పుడు వినపడగానే అటూ యిటూ చూసాడు. చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. ఊపిరి బిగబట్టి నెమ్మదిగా మూత తెరిచాడు. గట్టుమీద ఉన్న లాంతరుతో శవపేటికలోకి తొంగి చూసాడు.

ఎంత ప్రశాంతంగా, నిద్రపోతున్నట్లున్న ఆమె వదనం. అతనిలో ప్రేమ పొంగుకు రాసాగింది. ఇంత చిన్న వయసులో ఈమెకు రావాల్సిన స్థితి కాదు. కళ్లలో నీరు పొంగుకు రాగా అతడు ఆమె వదనాన్ని ముద్దాడినాడు. ఆ కన్నీటి చుక్కల, ఆ ప్రేమ నిండిన ముద్దుల వేడికి ఆమె నెమ్మదిగాకనులు తెరచింది. మరల భయంతో స్పృహ కోల్పోయింది. అతడు అది గమనించలేదు. ఆమె శిరోజాలు మాత్రమే తీసుకు వెళ్లాలనుకున్న అతడు ఎందుకో మనసు మార్చుకున్నాడు. ఆమెను లేవనెత్తి, తన భుజాన వేసుకుని పక్కనే చెట్టుకింద ఉంచినాడు. వెనక్కి వచ్చి శవపేటిక మూత మూసి, మరల మట్టిని చదునుచేసి పారా, తట్టా దూరంగా పారవేసి, ఆమె ఉన్నచోటికి వచ్చి, ఆమెను మరల తన భుజంపై వేసుకుని ఆ చీకటి నిశ్శబ్దంలో పోతుండగా అతనికి ఆమె కదిలినట్లని పించింది.

ఏదో అనుమానం వచ్చినా అతడు పెద్దగా పట్టించుకోకుండా ఆమెను అక్కడే దగ్గరలో ఆపిన తన గుర్రపు బగ్గీలో ఉంచి ఆమెపై వెచ్చగా దుప్పట్లు కప్పి తన ఇంటికి తీసుకువెళ్లి మంచంపై పడుకోబెట్టి మంచం కోడుపై తలవాల్చి ఆమెను ముద్దాడుతూ దుఃఖించసాగినాడు. ఆమె నెమ్మదిగా కదిలింది. ఆశ్చర్య భయసంభ్రమాలతో ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. వాస్తవ పరిస్థితి అర్థమైంది. అతనిలో అనిర్వచనీయమైన ఆనందం. ఆమెలో అంతులేని కృతజ్ఞతా భావం. ఆమెకు తెలుసు అతనికి తనపై ఎంత ప్రేమ ఉన్నదో. కాని సమస్య ఇప్పుడు తాను తనని నిర్లక్ష్యం చేసి మరణించేట్లు చేసిన భర్త వద్దకు వెళ్లాలా! లేక తనను బతికించిన ప్రేమికునితో ఉండాలా అన్నది. పరిష్కారానికి ఒక్క నిముషం కూడా పట్టలేదామెకు. తన కొత్త జీవితం ఇతనితోనే. కాని, సమాజం ఒప్పుకోదు. ఆమె తన నిర్ణయాన్ని తెలిపింది.

ఇద్దరూ అమెరికాకి పారిపోయారు. ఇరవై ఏళ్ల తర్వాత మరల ఫ్రాన్స్‌కు వచ్చారు. తమల్నెవరూ గుర్తించలేనంత మారిపోయామని వాళ్లనుకున్నారు. కాని, అనుకోకుండా ఓ రోజున తారసపడిన ఆమె పూర్వ భర్త ఆమెను గుర్తుపట్టి న్యాయస్థానానికి ఫిర్యాదు చేసాడు. న్యాయాధిపతుల నిర్ణయం వారికే అనుకూలంగా రావడంతో కథ సుఖాంతమైంది. –

బ్రతికి ఉండగానే సమాధి చేయబడడం అనే భయం మానవుడికి ప్రాచీన కాలం నుండి ఉన్నదంటాడు ఎడ్గార్ అలెన్ పో. జీవితపు వెలుగు నుంచి మృత్యు నిశీధిలోకి పోవడమే భయంకరమైన ఊహ అయినప్పుడు, బతికి ఉన్నపుడే పాతిపెట్టబడి, అది తెలుసుకున్న వ్యక్తికి ఆ కాసేపూ నరకయాతనే కదా అంటాడతడు.

మనదేశంలోనూ శవాన్ని స్మశానం వద్దకు తీసుకువెళ్లేప్పుడు మధ్యలో నేలపైన దించి, ఆత్మీయులు ఆ వ్యక్తిని పేరుతో పిలుస్తారు. ఈ దింపుడు కళ్లాల పద్ధతి ఈ భయం లేదా ఆశ నుంచి పుట్టుకు వచ్చిందే!

చితిమంటల వేడికి మేలుకున్నా బయటకు రాలేక మంటలలో మరణించిన 'ఎసిలియస్' అనే దురదృష్టవంతుడి కథను ప్లిని (Pliny the Elder) (క్రీస్తుశకం 23–79) వర్ణించాడు. 1308లో మరణించిన జొహన్నెస్ డన్స్ స్కొటస్ అనే వేదాంతిని శవపేటికలో ఉంచి ఖననం చేసారు. ఆ తరువాత కొన్నాళ్లకు సమాధిని తవ్వి చూసినపుడు శవపేటిక మూతను విరగగొట్టి ఆతడు

బయటకు రావడానికి చేసిన ప్రయత్నం కనిపించి అందరూ ఆశ్చర్యపోయారు. మైకా హిబుల్ (Micah Hibble) అనే వ్యక్తి మూడుసార్లు అంత్యక్రియలకు సిద్ధం చేసినా చివరిక్షణంలో లేచి కూర్చున్నాడట మూడుసార్లూ. నాల్గోసారి లేచినప్పుడు 'నరకాన్ని, స్వర్గాన్ని చూసాను కాని వివరించడం నావల్ల కాదు' అన్నాడు. 1742లో విన్స్లో (Winslow) అనే ఫ్రెంచి వైద్యుడు మృత్యు లక్షణాలు - The uncertainity of the signs of death - అనే గ్రంథాన్ని వ్రాసినవాడు రెండుసార్లు శవపేటికలో పెట్టబడి బతికి వచ్చినవాడిగా చెప్పబడినాడు. అతని సిద్ధాంతమేమిటంటే దేహం దుర్వాసన రాగానే శవము అవుతుంది. అందుచేత కుళ్లిపోయిన లక్షణాలు వచ్చేంత వరకు ఖననం, దహనం చేయవద్దన్నాడు. కాని శవాన్నింట్లో పెట్టుకునేవాళ్లు ఆనాడూ, ఈనాడూ లేరు కదా!

చనిపోకముందే పాతిపెట్టబడి, మరల జీవించిన ఇంకో యువతి కథ ఇది. గాబ్రియేలె అనే పద్దెనిమిదేళ్ల యువతిని మారిస్ (Maurice) అనే సైనిక కెప్టెన్ వివాహం చేసుకున్నాడు. పెళ్లైన కొద్దినాళ్లకే అతడు విదేశం పోవాల్సి వచ్చింది. భార్యను అత్తవారింట్లో ఉంచి మామగారి అనుమతితో అతడు విదేశానికి వెళ్లాడు. వెంటనే రావాల్సిన వాడు రెండేళ్లైనా రాలేదు యుద్ధాల వల్ల. కడపటి వార్తల ప్రకారం అతడు యుద్ధరంగంలో మరణించాడు. గాబ్రియెలె 'డుబోర్గ్' అనే అతడిని పునర్వివాహం చేసుకున్నది.

అయిదేళ్ల తరువాత సొంత ఊరికి వచ్చిన మారిస్‌కు దారిలో ఎదురైన అంతిమయాత్ర 'గాబ్రియెలె డుబోర్గ్' అని తెలియగానే పూర్వాపరాలు విచారించి శోకంతో కుమిలిన మారిస్, ఆ అర్ధరాత్రి స్మశానానికి వెళ్లి సమాధుల వాల్ట్‌లో శవపేటిక మూత తీసి చూడగా ఆమెలో జీవలక్షణాలను చూసి ఆశ్చర్యపోయాడు. ఇద్దరూ కలిసి 'మారిస్' ఇంటికి వెళ్లిపోయారు. గమనించిన వాళ్లెవరో 'డుబోర్గ్'కు తెలియజేయడంతో అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సాక్షిగా తమ కుమార్తెను ప్రవేశపెట్టాడు 'డుబోర్గ్'. తల్లిని గుర్తుపట్టిన కుమార్తె మాటలతో న్యాయాధిపతి తీర్పును 'డుబోర్గ్'కు అనుకూలంగా ఇచ్చాడు. సంతోషపడ్తున్న 'డుబోర్గ్'ను 'నీవు కోల్పోయింది నీకిచ్చేస్తున్నాను' అంటూ గాబ్రియెలె 'డుబోర్గ్' కాళ్ల దగ్గరపడి చనిపోతుంది. ఆమె మరణాన్ని చూడగానే మారిస్ ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇటువంటి కథలు, నిజ వృత్తాంతాలు కోకొల్లలు. కలరా, ప్లేగు లాంటి ఎపిడమిక్‌లు వచ్చినప్పుడు భయంతో వణికిపోయే ప్రజలు మరణించిన వారితో

పాటు మరణిస్తున్నవారిని మృతులుగా భావించి సామూహిక ఖననం గావించేప్పుడు అనేక పొరపాట్లు దొర్లడం సహజమే. అలాగే ఉరిదీయబడినాక కూడా బ్రతికినవాళ్లు (1650లో ఏన్ గ్రీన్) కూడా చరిత్ర పుటల్లో ఎక్కినారు. క్జైనాన్ అనే చక్రవర్తిని తాగిన మైకంలో ఉండగా సజీవంగా పాతిపెట్టగా రెండురోజుల పాటు అరణ్యరోదన చేస్తూ అతడు మరణించాడనేది ఓ కథనం.

ప్రముఖ ఎనాటమిస్టు ఏండ్రియస్ వెసాలియస్ (Andreas Vesalius) చనిపోయాడని భావించిన ఓ బిషప్ (Bishop) రొమ్ము కోసినపుడు బిషప్ గుండె కొట్టుకుంటూనే ఉన్నదని అతని ప్రత్యర్థులనేవారట. రొవెన్ (Rouen)లోని ఒక పెద్దమనిషి తన భార్య చనిపోయిందని వైద్యులు ధృవీకరించినా నమ్మక ఆస్థాన వైద్యుడిని ఆమె శరీరంపై ఇరవై అయిదు గాట్లు పెట్టమన్నాడని, ఇరవై ఆరో గాటు పెడ్తుండగా ఆమె కదిలి– 'ఏంటా పిచ్చిపని?' – అని అరుస్తూ స్పృహలోకి వచ్చిందట. ఆ తరువాత ఆమె 'గాటుకో బిడ్డ' అన్నట్లు ఇరవై ఆరు మందికి జన్మనిచ్చిందట. అదేవిధంగా ఓ మతాధికారి చనిపోయాడని భావించి, ఆతని మిత్రులు, మతాధికారికి ఇష్టమైన పెంపుడు పిల్లిని సజీవంగా శవపేటికలో ఉంచారట. అంత్యక్రియలకై ఊరేగింపు ప్రారంభమయ్యింది. లోపల మతాధికారి స్పృహలోకి వచ్చి తన మొహం మీద 'ఇంకుబస్' దయ్యంలా కూర్చుని ఉన్న పిల్లిని అదిలించగా, దాని అరుపులు విని శవపేటిక తెరవగానే ఇటు పిల్లి, అటు మతాధికారి శవపేటికలోంచి లేచి ఒక్కటే పరుగు. భయపడ్డ జనం సంగతి సరేసరి.

హార్ట్‌మాన్ (Hartmann) అనే ఆతడు ఇటువంటివి ఏడు వందల సంఘటనల వివరాలను సేకరించినా వైద్యులు నమ్మక అతడిని అపకీర్తిపాలు చేయడంలో కృతకృత్యులైనారు. ఇంకో ఉదంతంలో బాబిన్ అనే ఆవిడ ఎల్లో ఫీవర్‌తో చనిపోయిందని నిర్ధారించారు. అప్పటికే ఆమె పూర్ణగర్భిణి. సమాధి చేసిన కొద్దిరోజుల తర్వాత అనుమానంతో శవపేటిక మూత తెరవగా లోపల ఆమె శిశువును ప్రసవించి ఉండడం, తల్లీ బిడ్డా మరణించి ఉండడం గమనించారట.

నిజానికి వదనంలో వచ్చే మార్పులు, నోటినుంచి వచ్చే ధ్వనులు ఇవన్నీ మృతవాయువులు బయటకు పోయేప్పుడు చేసే శబ్దాలు. బిడ్డను ప్రసవించడం కూడా ఆ కోవకు చెందిందే. ఒక్కోసారి ఆ వాయువుల తీవ్రతకు పలచగా ఉన్న

శవపేటికల మూతలు పగిలిపోవచ్చును. ముఖ్యంగా నీళ్లలో నాని ఉబ్బిన శవాల నుంచి వెలువడే వాయువుల తీవ్రతకు అవి పరీక్ష బల్లల మీద నుంచి నేలపైకి దబుక్కున విసిరినట్లు పడతాయి.

ఇవికాక కేటలెప్సీ (Catalepsy) అనే వ్యాధిలో కండరాలు గట్టిపడి దాదాపు 'రిగార్ మోర్టిస్'ను తలపిస్తాయి. కాళ్లూ చేతులూ రకరకాల భంగిమలలోకి మారతాయి. హిస్టీరియా (Hysteria), హిప్నొటిజమ్, ఉన్మాద స్థితుల్లో ఇది సాధారణంగా కనిపించే లక్షణం.

మృత్యువులా కనిపించే మరో పరిస్థితి, చనిపోయినట్లు ఎదుటివారిని నమ్మించడాన్ని డైడెల్ఫిస్ వర్జినియానా (Didelphis Virginiana) అంటారు. అపోజమ్ (Opposum) అనే జంతువుపై దాడి జరిగినప్పుడు అది నేలపై పడి లుంగజుట్టుకుని బంతిలా మారి, నాలుక బయటకు పెట్టి, కళ్లు తేలవేస్తుంది. అపాయం దాటిందని తెలవగానే స్వరూపంలోకి వచ్చి పరుగులు పెడ్తుంది. ఈ విద్యనే సైనికులు శత్రువులు పైచేయి సాధించినపుడు తమను చంపకుండా శవాల పక్కన శవాల్లా పడుకుని ప్రాణాలు కాపాడుకోవడాన్ని 'Playing Possum' అంటారు.

ధానటొమైసిస్ (Thanato - Death; mimesis-Mimicry) మృత్యువును అనుకరించడం. (Imitating death). Sham Death or playing possumలో మోసం చేయడం ఉన్నది. ధానటోమైసిస్ అనేది నిజంగా మృత్యువు సోకినట్లే ఉంటుంది.

స్పృహ కోల్పోవడం, మూర్ఛ (Fainting, Syncope) దాదాపు మృత్యువు లానే ఉంటాయి. సాధారణంగా రోగి వాటి నుంచి తేరుకుని స్వస్థ పడతాడు. ధ్యానస్థితి ఒక్కోసారి మృత్యువును తలపిస్తుంది.

హిందూ దేశంలోని యోగులు అనేకమంది తమ యోగశక్తితో జీవ లక్షణాలను నియంత్రిస్తారు. ఊపిరిని ఆపడం, నాడిని మందగింపజేయడం, గాలిలో తేలడం, నీటిపై నడవడం లాంటి పనులే కాక సమాధిలోకి పోవడం, పరకాయ ప్రవేశం చేయడం లాంటి విద్యలను ప్రదర్శించేవారని పూర్వకాలంలో చెప్పుకునేవారు.

✧✧✧✧✧

# 5. మాంటెజుమా శాపం

అనగనగా ఒక రాజు. అతడి పేరు మాంటెజుమా. అజ్టెక్ ప్రజలకు అతడు చెప్పిందే వేదం. శిలాశాసనం. అతడి పరిపాలనా కాలంలో ఇరవై వేల మందికి పైగా బతికున్నవాళ్ల గుండెల్ని బయటకు లాగి సూర్యదేవుడికి అర్పించాడు. 'అపోకలిప్టో' (Apocalypto-2006) అనే సినిమాలో ఈ వృత్తాంతం చూడవచ్చు. తమని సర్వనాశనం చేయడమే కాకుండా తమ సమాధుల్ని తవ్వి బంగారం, మణులతో పాటు మమ్మీలను, శవాల ఎముకలను తస్కరిస్తున్న యూరోపియన్లపై పగబట్టి వాళ్లను అంతుపట్టని వ్యాధుల్తో, విరేచనాలతో చావాలని శపించాడట మాంటెజుమా మహరాజు.

1967లో క్రిస్టియన్ బెర్నార్డ్ మొదటి గుండెమార్పిడి (Heart Transplant) ఆపరేషను చేయగానే చాలామందికి ఈ 'మాంటెజుమా శాపం' గుర్తుకు వచ్చింది. మూత్రపిండాలు, ఇతర అవయవాల్ని అమ్ముకుంటున్నట్లు జనాలు గుండెల్ని అమ్ముకుంటారేమో, బ్రోకర్లు–మధ్యవర్తులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో (ICCU)కి జొరబడి ఇంకా బతికున్నవాళ్ల అవయవాల కోసం చేయకూడని పనుల్ని చేస్తారేమోనని అనుమానాల్ని వ్యక్తం చేసారు – మీడియా, ప్రసార మాధ్యమాలలో విమర్శకులు, నిపుణులు. అయినా ఇదేమీ కొత్త కాదుకదా!

అయితే మనిషి ఖచ్చితంగా చనిపోయాడని ఎలా చెప్పడం? అందుకే 'బ్రెయిన్ డెత్' Brain Death అనే పదం వ్యాప్తిలోకి వచ్చింది. బ్రెయిన్ EEG (Electro Encephalogram)లో ఫ్లాట్ వేవ్ (లైను) వస్తే, ఇంకా గుండె కొట్టుకుంటూనే ఉన్నదనుకోండి అతడి అవయవ భాగాలు అవయవ మార్పిడికి (Transplantation)కు పనికివస్తాయి. అందుకనే శస్త్ర చికిత్సానిపుణుడు ఈ స్వర్ణసూత్రం (Golden rule) ను పాటిస్తాడు. 'సందేహముందా, చేయకు– If in doubt, don't'

చనిపోయాడని ఎలా ఖచ్చితంగా చెప్పడం?

మనం ఒక్కసారే అంతా చచ్చిపోతామా? లేక ముక్కలు ముక్కలుగా చచ్చిపోతామా? గుండె ఆగిపోయినాక కూడా గోళ్లు పెరుగుతాయా? మనిషి లేదా జంతువు ఇన్నేళ్లు బతుకుతుందని చెప్పవచ్చు శాస్త్రవిజ్ఞాన సహాయంతో.

కాని 'చనిపోతున్న కార్యక్రమం' (Process of dying) మొదలయ్యే క్షణం ఎలా చెప్పగలం?

'....నాడి దొరకదు,
గుండెచప్పుడు వినబడదు,
వేడిమి, ఊపిరి కనబడదు,
బుగ్గల, పెదాల గులాబిరంగు అదృశ్యమై
తెల్లని బూడిద వర్ణం అలుముకుంటుంది.
కనుల కిటికీలు మూతబడ్డాయి.
మృత్యువు జీవన దినాన్ని మూసివేస్తాడు.
శరీరభాగాలు నియంత్రణ లేక గట్టిపడగా
శీతలం కమ్ముకుంటుంది – మృత్యు గాఢ పరిష్వంగంలా'

విలియం షేక్స్పియర్ – రోమియో–జూలియట్‌లో (Romeo and Juliet - Act IV, Scene I)లో మృత్యు లక్షణాల్ని ఇలా అద్భుతంగా వర్ణించాడు. శాస్త్రజ్ఞులు, వైద్యులు మరణ సమయ నిర్ణయంలో సరైన విధానం కోసం తర్జన భర్జనలు పడుతూనే ఉన్నారు.

## 1. చచ్చినవాడికి స్పర్శ ఉండదు.

చనిపోయాడా లేదా నిర్ధారించేందుకు పూర్వకాలంలో సూదులతో చేవుల్ని చేతివేళ్ల గోళ్ల కింద గుచ్చి పరీక్షించేవారు. కొన్నిచోట్ల ఆడా మగా గుంపుగా చేరి ఏడ్చి, మొత్తుకుని, పళ్లు కొరుకుతూ శబ్దాలు చేస్తూ చెవులు పగిలేట్లుగా నానా గొడవ చేసేవారు. ముక్కు దగ్గర కర్పూరం వెలిగించేవారు. నోట్లో ఆమ్లాన్ని, నిమ్మరసాన్ని, మిరియాల కషాయాన్ని (మూత్రాన్ని కూడా) పోసేవారు. ఈ చిట్కాలకు కొందరు సగం చచ్చినవాళ్లు బతికి బట్టకట్టారని ప్రతీతి.

## 2. చచ్చినవాడి శరీరం చల్లగా ఉంటుంది.

మరణానంతరం శరీర ఉష్ణోగ్రతను కొలిచే థర్మామీటర్లను నెక్రొమీటర్ (Necrometer) లేదా థనటోమీటర్ (Thanatometer) అని పిలుస్తారు. ఇంట్లో దుప్పట్ల మధ్య ఉంచిన శవం వేడిగాను, హాస్పిటల్ మార్చురీలో ఉంచినది చల్లగాను ఉండడం అందరికి తెలిసిందే. కలరా లాంటి ఇన్‌ఫెక్షన్ సోకి

మరణించిన వారి శవాలు వెచ్చగానే ఉంటాయి. 'లుయిజి విట్టొరి' అనే అతగాడు దాదాపు చచ్చిపోయాడని భావించి ముక్కు దగ్గర కర్పూరం వెలిగిస్తే కాసేపటికి లేచి కూర్చున్నాడు కాని, కాలిన ముక్కు జీవితాంతం ఓ బండగుర్తుగా మిగిలిపోయింది.

డాక్టర్ 'మార్టెనొ' అనే వైద్యుడు మరణించిన వారి చేతివేళ్లకు ఒక సెంటీమీటరు దూరంలో వెలిగించిన కొవ్వొత్తి ఉంచేవాడు. ఆ వేడికి బొబ్బ ఏర్పడి, పగిలి కొవ్వొత్తిని ఆరిపేస్తే వ్యక్తి మరణించినట్లు నిర్ధారించేవాడట. అయితే బతికున్నవాళ్లలోనూ ఇలా అవుతుంది మరి.

బ్రౌరార్డెల్ అనే అతడు సలసలా కాగుతున్న నీళ్లలో ఇనుప సుత్తిని ముంచి కడుపు మీద ఉంచేవాడు. స్పృహ తప్పినవాళ్లు ఆ వేడికి ఎగిరి నుంచునేవాళ్లట. శవాలు నిలబడవు గదా! ఆ సుత్తిని మేయర్ సుత్తి (Mayor's hammer) అనేవారు.

### 3. చచ్చినవాడు ఊపిరి తీయడు.

కింగ్ లియర్ (King Lear) తన కుమార్తె చనిపోయిందా లేదా అని నిర్ధారించేందుకు ఆమె ముక్కు దగ్గర అద్దం (Looking glass) ఉంచమని ఆజ్ఞాపించాడు. తడిమంచు మసకగా ఏర్పడినా, అద్దం తడిసినా ఊపిరాడుతున్నట్లే కదా! దీన్నే చికాగో హంతకులు తాము చంపినవాడు చచ్చాడా, లేదా తెలుసుకోడానికి వాడేవారు. అందుకే ఈ పద్ధతిని 'మాఫియా మిర్రర్ టెస్ట్' అంటారు (Mafia Mirror Test).

ముక్కు దగ్గర పక్షి ఈక పెట్టి గమనించడం, నిండా నీళ్లున్న గ్లాసును ముందుపెట్టి నీళ్లు కదిలి పడ్తున్నాయా అని చూడడం ఇవన్నీ చేసేవాళ్లు కాని, శవం కడుపులో తయారైన విషగాడ్పులు శబ్దం చేసుకుంటూ బయటకు వచ్చేప్పుడు ఈక కదుల్తుంది, నీళ్లూ చిందుతాయి.

### 4. చచ్చినవాడి గుండె కొట్టుకోదు.

అలా అనడానికి వీల్లేదు. ఎందుకంటే ఫ్రెంచి విప్లవ కాలం నాటి రోజుల్లో 'గిలెటిన్'తోనో, కత్తితోనో తల నరికి వేరుచేసినాక, మొండెంలో ఇంకా గుండె కొట్టుకోవడం వైద్యులు గమనించారు. అంటే మొండెం బతికే ఉందన్నమాట కదా! గుండె ఆపరేషన్లలో గుండెను ఆపి శస్త్రచికిత్స చేస్తారు.

అయితే మిడిల్ డార్ఫ్ అనే అతడు నాలుగు అంగుళాల సూదికి పైన ఓ జెండా ఉంచి దానిని చనిపోయాడనుకున్న వాడి గుండెలో గుచ్చి చూడమన్నాడు. గుండె కొట్టుకొంటుంటే జెండా ఎగుర్తుంది కదా అనేది అతగాడి ప్రతిపాదన. రక్తనాళాలు కోసి రక్త ప్రవాహాన్ని గమనించడం, వేలికి గట్టి దారాన్ని గట్టిగా లాగి కట్టగా , వేలు నీలంగా మారి ఉబ్బిందా, వ్యక్తి బతికే ఉన్నట్లు భావించాలి (డాక్టర్ మాగ్నస్–1872) – ఎందుకంటే చచ్చిన వాడి వేలు తెల్లగా పాలిపోయి ఉంటుంది కదా!

## 5. చచ్చినవాడు గట్టిగా బిర్రబిగుసుకుపోతాడు.

మనిషి చచ్చిపోయిన వెంటనే ముందుగా శరీర భాగాలన్నీ మెత్తగా, వదులుగా మారిపోతాయి. కాళ్లూ చేతులూ ఎటుపడేస్తే అటు పడతాయి. కింది దవడ వదులుగా ఉండి నోరు తెరుచుకుంటుంది. మొహంలోని కండరాలు వదులై వదనం ప్రశాంతంగా కనిపిస్తుంది.

ఆ తరువాత కొద్దిసేపటికి కండరాలు గట్టిపడి మొహం తీక్షణంగా, కనుబొమలు కుంచించుకుని, నోరు బిగబట్టి, ఎంతో బాధపడిన తీరు కనిపిస్తుంది. కాళ్లూ చేతులూ గట్టిపడతాయి. దీనినే రిగార్ మార్టిస్ (Rigor Mortis) అంటారు. శరీరమంతా ఒక చెక్కలా మార్తుంది. పిడికిళ్లు బిగబట్టబడి, రోమాలు నిక్కబొడుస్తాయి.

రిగార్ మార్టిస్ మెడలో మొదలై దవడకు, ఆ తరువాత శరీర భాగాలకు మొహానికి, చేతులు, రొమ్ము, కడుపు, కాళ్ల వేపు పాకుతుంది. రిగార్ మార్టిస్ నిష్క్రమించగానే శరీరం రెండోసారి వదులుగా మెత్తగా మారుతుంది. దవడ నుంచి మొదలైన వదులు తనం ఆఖరుసారిగా శరీరమంతా వ్యాపిస్తుంది.

రిగార్ మార్టిస్ వ్యక్తి చనిపోయిన 1–6 గంటలలో మొదలై 4–10 గంటలలో శరీరమంతా గట్టిపడుతుంది. వేడి ప్రదేశాలలో త్వరగా, చల్లటి ప్రదేశాలలో నెమ్మదిగా ఈ శరీర స్థితి కన్పడుతుంది. కండరాలు మొదట వదులుగా – తర్వాత గట్టిగా – మరల వదులుగా (Flaccidity - Rigor Mortis - Secondary Flaccidity) ఉండడాన్ని క్రైమ్ నవలల రచయితలు తమ రచనలలో కథామలుపులకు వాడుకున్నారు.

ఆఖరి క్షణాలలో పిడికిలి గట్టిగా పట్టి ఉంచితే రిగార్ మార్టిస్ వెంటనే ఏర్పడి పిడికిలి అలా గట్టిగానే ఉంటుంది. బిగబట్టిన కండరాలు అదే స్థితిలో ఉండిపోతాయి. రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయిన వ్యక్తి చేతిలో రివాల్వర్ అలాగే గట్టిగా పట్టుకుని ఉండి కనిపిస్తుంది. అలాగే నదిలో మునిగి చనిపోయిన వాళ్ల చేతులు రెల్లుగడ్డిని, మొక్కల్ని గట్టిగా పట్టుకుని ఉండడం, హత్య చేయబడినవాళ్ల చేతిలో హంతకుడి వెంట్రుకలో, దుస్తులో ఉండడం అందరికీ తెలిసినదే. అకస్మాత్తుగా చంపబడిన సైనికులు చేతుల్లోని తుపాకులతో గురిచూస్తున్నట్లుండడం, అశ్వికుడి తల ఖండించబడగా చేతిలో కత్తిని పైకెత్తి ఉన్న మొండెం, గుర్రంపై అలాగే స్వారీ చేయడం కథలుగా మిగిలిపోయాయి. నా చిన్నప్పుడు మా ఊళ్లో మోటార్‌సైకిల్‌పై వస్తున్న వ్యక్తిపై, ముందు వెళ్తున్న లారీలోని ఇనుపరేకు జారిపడి తల తెగిపోగా, మొండెం అలానే మోటార్‌సైకిల్‌ను నడుపుతూ రావడం చూసి చాలామంది భయపడ్డారని చెప్పుకునేవారు.

జర్మనీలో ఒకావిడ నిలబడే చనిపోగా ఆమె శవం కూడా వెంటనే రిగార్ మార్టిస్‌లోకి వెళ్లగా ఆమె నిలబడే బిగుసుకుపోయిన విషయం పుస్తకాలలో రికార్డు చేయబడింది. రిగార్ మార్టిస్‌ను ఋజువు చేయడానికి డాక్టర్ కొల్లాంగుస్ ఒక చిట్కా చెప్పాడు. బతికున్నవాళ్ల వేలు మన చెవిలో పెడితే రెండురకాల ధ్వనులు వస్తాయని, చచ్చినవాడి వేలు చెవిలో పెట్టుకుంటే నిశ్శబ్దం తాండవిస్తుందని ఆతడి సూచన. టర్కిష్ వైద్యులు చనిపోయినవాడి నోట్లో నీటి తిత్తి గొట్టం ఉంచి నీరు వేగంగా పోయేలా ఒత్తిడి చేసేవారు. ఆ వేగానికి పేగులు కదిలి చనిపోయిన వ్యక్తి ముడ్డి కండరాలు వదులై అపానవాయువు వెలువడేది. వ్యక్తి బతికుంటే అలా జరగదని వారి నమ్మకం. స్నార్ట్ అనే అతడు ఈ పరీక్ష విధిగా చేయాలని చెప్పేవాడు. ఎలక్ట్రిక్ షాక్ వలన కండరాలు కదలడం, ఇంద్రియ స్ఖలనం ఇవన్నీ రిగార్ మార్టిస్ ఉన్నా సంభవించే విషయాలే.

## 6. చచ్చినవాడు ఖచ్చితంగా కుళ్లిపోతాడు.

జీవి మరణించాక సూక్ష్మజీవులు తమవంతు పని కానిస్తాయి. శరీరాన్ని ద్రవంగా, వాయువులుగా మార్చి పంచభూతాల్లో లీనం చేస్తాయి. దీనిని Putrefaction 'ప్యూట్రిఫాక్షన్' అంటారు. మొదట ఇది కడుపు భాగంలో కిందివేపు కుడిపక్క (ఎపెండిక్సు ఉండే చోటు) ఆకుపచ్చ రంగులో కనిపిస్తుంది.

శవంలోపల తయారయ్యే వాయువులు బయటకు వెలువడే వేగానికి పొట్టలోని పదార్థాలు బయటకు రావచ్చును. స్త్రీ గర్భంలోని పిండం బయట పడవచ్చు. ఒక్కోసారి శవపేటిక పగిలిపోవచ్చు. గర్భసంచి, పేగులు జారడం (Prolapse) ఈజిప్షియన్ మమ్మీలలో గమనించారు. మమ్మీల దగ్గర మంటలు - will-o-the wisp - ఆ వాయువుల ప్రభావమే.

చివరగా శరీర అవయవాలు ద్రవస్థితిలోకి మారతాయి. ముందు కళ్లు, తరువాత వరసగా మెదడు, పొట్ట, కాలేయం– గర్భసంచి చివర్లో కరిగిపోతుంది. అందుకే మరణించిన వ్యక్తి స్త్రీ అని నిర్ధారించడానికి ఇది ఉపయోగపడ్తుంది. శరీరం కుళ్లిపోవడం రకరకాల పరిస్థితుల్ని బట్టి– వాతావరణంలోని వేడిమి, నేల స్వభావం – మారుతుంది.

"గాలిలో ఒకవారం, నీటిలో రెండువారాలు, నేలలో పాతితే ఎనిమిది వారాలు" – అనేది సాధారణ సూత్రం. ఈ వ్యవధిలో సూక్ష్మజీవులు, మాగట్ క్రిములు, ఈగలు, పురుగులు తమ పని తాము కావిస్తాయి.

శరీరం కుళ్లిపోయిందని నిర్ధారించడానికి కొందరు ఫ్లోర్‌సిన్ ఇంజెక్షన్ చర్మం క్రింద ఇస్తారు. చనిపోయినవారిలో ఏ మార్పూ ఉండదు. బతికున్న వారిలో చర్మం పసుపుగా, కళ్లు ఆకుపచ్చ రంగులోకి మారతాయి.

✧✧✧✧✧



# 6. దింపుడు కళ్లాలు

చచ్చినవాడు బతుకుతాడేమోనని బతికున్నవాళ్లకు ఆశ. బతికుండగానే పాతిపెడ్తారేమోనని చావు బతుకుల మధ్య ఉన్నవాళ్లకు చచ్చేంత భయం. మూర్ఛ రోగులూ, శోషవచ్చి పడిపోయినవాళ్లూ, కలరా, ప్లేగు లాంటి రోగాలు వచ్చినపుడు సామూహిక ఖననాలు జరిగినప్పుడూ, యుద్ధాల్లోనూ ఒక్కోసారి బతికున్న వాళ్లు పాతిపెట్టబడడం, మార్చురీ రూంలో శవస్థితి నుంచి లేచి నడిచినవాళ్లు, చితిమంటల వేడికి లేచి పరుగెత్తినవాళ్ల కథలను విన్నవాళ్లు, చూసినవాళ్లు తమకు అటువంటి పరిస్థితులు రాకూడదని నానా దేవుళ్లకూ మొక్కుకోవడమే కాక, తమని కాపాడుకోడానికి అనేక రకాల పద్ధతుల్ని అవలింభించేవాళ్లు.

వైద్యులు కూడా తామిచ్చే ధృవపత్రాలలో– ఫలానా సుబ్బారావు చనిపోయాడని అందరూ భావించడం వలన అతడు మరణించాడని ధృవపరచడమైనది – అనే అర్థం వచ్చేలా 'గోడమీద పిల్లి' సర్టిఫికెట్లు ఇచ్చేవారు.

'ఫ్రాన్సిస్ డౌస్' అనే అతడికి తనని బతికుండగానే పాతిపెడ్తారేమోనన్న అనుమానం పెరిగి పెరిగి వటవృక్షం కాగా వీలునామాలో ఇలా రాసాడు– 'నేను ఆంథోనీ కార్లైల్‌కు రెండువందల పౌండ్లు ఇస్తున్నాను. ఎందుకంటే నేను మరణించాక అతడు నా తలను శరీరం నుంచి వేరైనా చెయ్యాలి లేదా నా గుండెను బయటకు తీయాలి. తద్వారా నేను సజీవ సమాధి చేయబడకుండా ఉంటాను– ఇది నేను సరైన మానసిక స్థితిలో ఉండి వ్రాస్తున్న వీలునామా'–

హారియట్ అనే ఆమె తన కపాలాన్ని, మెదడును జార్జి ఎట్కిన్‌సన్ అనే పరిశోధకుడికి శాస్త్ర పరిశోధనల నిమిత్తం ఇవ్వాలని వీలునామాలో వ్రాసింది. ఎందుకంటే తల నరికినాక మరల బతికే అవకాశం లేదుకదా! ఫ్రాన్సెస్ కొబె అనే మహిళ కూడా దాదాపు అలానే అభ్యర్థించింది. దీనిని బట్టి ఆరోజుల్లో (క్రీ.శ. 1800–1890) పాతిపెట్టినాక తిరిగి బతికితే పడే దుర్భర యాతన గురించి దారుణమైన, భయంకరమైన ఊహలుండేవని అర్ధమవుతోంది.

కొన్నిచోట్ల గుండెలో దబ్బనాన్ని గుచ్చి వ్యక్తి బతికున్నాడా లేదా నిర్ధారించేవారట. వర్జినియాలో 1850 ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన చదువుతుంటేనే మన వళ్లు గగుర్పొడుస్తుంది. అక్కడ నివసిస్తుండే ఓ మర్యాదస్థుల కుటుంబంలో ఎవరు చనిపోయినా, ఆ కుటుంబ పెద్ద, చనిపోయిన వాడి గుండెల్లో కత్తితో

పొడిచి నిర్ధారించినాకే మృతదేహాన్ని ఖననం చేసేవారట. ఆ దురదృష్టపు రోజున ఆ కుటుంబంలోని అందాల బాలిక మరణించిందని భావించి, శోకతప్త హృదయంతో, వలవలా ఏడుస్తూనే ఆమె తండ్రి ఆమె గుండెలో కత్తి దింపగానే ఆమె పెద్దకేకతో మేల్కొని బాధతో విలవిలలాడుతూ మరణించిందట. నిర్విణ్ణుడైన ఆ తండ్రి తానుకూడ కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, అప్పటి నుంచి ఆ ఆచారానికి స్వస్తి చెప్పారని ఓ 'జర్నల్' పత్రికలో గ్రంథస్థం చేయబడివుంది.

మిసెస్ బర్టన్ అనే ఉన్నత కుటుంబ స్త్రీ అభిప్రాయం ప్రకారం బతికున్నపుడే సమాధి కావించబడడం కన్నా ఎంబాల్మింగ్ (శవం చెడిపోకుండా మందులను నరాలలోకి ఇంజక్ట్ చేయడం)లోనో, ఎనాటమి డిసెక్షన్ హాల్‌లో కత్తితో కోయబడడం మెరుగు, ఉచితమైన పని. అందరికీ తెలిసిన ఓ వృత్తాంతం ఇది– 'రాఛెల్' అనే ప్రముఖ నటి 1858లో పారిస్‌లో మరణించినప్పుడు ఆమెకు ఎంబాల్మింగ్ (Embalming) ఇంజక్షన్లు ఇస్తున్నపుడు ఆమె స్పృహలోకి వచ్చి లేచి కూర్చున్నది కాని ఆ ఇంజక్షన్ల విష ప్రభావంతో పదిగంటల తర్వాత మరణించింది. 'హన్నా' అనే మహిళ డాక్టర్ ఛార్లెస్ వైట్ అనే అతడికి ఇరవై అయిదు వేల పౌండ్లు ముట్టజెప్పింది. చనిపోయాక తన శరీరాన్ని ఎంబాల్మింగ్ చేసే నిమిత్తం.

ఉత్తర ఇటలీలో మరణానికి ఖననానికి మధ్య కాలం 48 గంటలుగా, దక్షిణ ఇటలీలో 24 గంటలుగా శాసనముండేది. వేడి ప్రాంతాలలో శవం తొందరగా కుళ్లి దుర్వాసన వస్తుంది కనుక అంత్యక్రియలవీ త్వరగా కానిచ్చేవారు.

ఈ గొడవలన్నీ పడలేక– ఫ్రాన్సులో వచ్చిన ఆలోచన జర్మనీలో కార్యరూపం దాల్చింది– కొన్ని చోట్ల మరణానంతర 'వెయిటింగ్ హాల్స్' – వేచియుండే గదులు ఖననానికై– ఏర్పాటు చేయబడినాయి. వీటిని 'Waiting Mortuaries' అనేవారు. మృతదేహాన్ని అర్ధగంటలో వైద్యుడి పర్యవేక్షణలో ఈ గదుల్లోకి చేర్చేవారు.

శవాన్ని స్నానం చేయించి, ఏంటిసెప్టిక్‌లతో తుడిచిన మంచంపై పడుకోబెట్టి చుట్టూరా పూలతో అలంకరించి, బంధుమిత్రులు ఆఖరి ఫోటోలవీ తీసుకున్నాక, శవం చేతివేళ్లకు, కాలివేళ్లకు సన్నటి దారాలు కట్టి, ఒకవేళ అవి కదిల్తే గణగణమని గంటలు మోగేలా ఏర్పాట్లు చేసేవారు. అలా 72 గంటలు

ఆ 'వెయిటింగ్ రూం'లలో జాగరణ చేసిన శవాలను దుర్వాసన రావడం మొదలు కాగానే ఖననం చేసేవారు. అయితే చనిపోయాక కండరాలు గట్టిపడడం, వాయువులు వెలువడినప్పుడు గంటలు మోగి పరిశీలకుల్ని కంగారు పెట్టేవికూడా! వంద సంవత్సరాల చరిత్రలో ఒకే ఒక్కసారి ఒక అయిదేళ్ల పసివాడు ఈ 'వెయిటింగ్ రూం'లో బతికి తన తల్లి వద్దకు రావడం, ఆ ఆనందంతో ఆ తల్లి గుండె ఆగి మరణించడం జీవన మరణాలలోని అనిశ్చితిని, వింత పోకడల్ని తెలియజేస్తాయి.

1896లో కార్నైస్-కార్నికి అనే రష్యాలో ఉన్నతోద్యోగి ఓ కొత్తరకం శవపేటిక కనిపెట్టాడు. శవపేటిక నుంచి ఒక గొట్టం గాలి పీల్చుకునేందుకు, లోపల వ్యక్తి కదిలితే గంట గణగణమోగి స్మశాన సంరక్షకుల్ని హెచ్చరించేందుకు పనికొచ్చే విధంగా తయారుచేశాడు. వీటితోనూ ఒక్కోసారి ఇబ్బందులు, తప్పుడు సంకేతాలు (False alarms) వచ్చేవి. అయితే ఈ రకపు శవపేటికల్లో బతికి బట్టకట్టినవాళ్ల దాఖలాలేమీ లేవు.

✧✧✧✧✧



# 7. మామూలు కత్తి నుంచి 'సర్జన్స్ నైఫ్' (Surgeon's Knife) వరకూ

ఒకటా రెంటా మునిగితే కాని వైద్యుడు కాడు అనేది నానుడి. క్లినిక్ ముందు ఎండిపోయిన పూలమొక్కలున్న డాక్టరు దగ్గరకు వెళ్లడానికి పేషంట్లు భయపడతారు కదా! 'నా చేతి మాత్ర వైకుంఠయాత్ర' అనేది ఓ వైద్యశిరోమణికి ఆయన పేషంట్లిచ్చిన బిరుదు. శస్త్రచికిత్సకుడికి 'దుష్టాంగంబు ఖండించి శిష్టాంగంబునకు రక్షసేయు విధము'– తెలిసి ఉండాలి. దానికి బోల్డెంత నేర్పూ, అనుభవం ఉండాలి. వెనకటి రోజుల్లో అనేక నాగరిక సమాజాల్లో శవాన్ని కోసి చూడమనేది పెద్ద అపరాధం. తప్పు. అంచేత మానవ శరీరంలోని అవయవాల సంఖ్య, నిర్మాణం అంతా జంతువుల శరీర అవయువాలను చూసి ఊహించుకున్నదే. రెండవ శతాబ్దపు వాడైన గ్రీకు వైద్యుడు గాలెన్ (Galen) కుక్కలు, కోతులు, పందులు, ఎద్దుల్ని కోసి – శరీర నిర్మాణశాస్త్రం (Anatomy) వ్రాయగా అదే మరో పదమూడు వందల సంవత్సరాలపాటు ప్రామాణిక గ్రంథంగా మారింది. పందికి కాలేయంలో అనేక దొప్పలు; కోతి రొమ్ము ఎముకలో విడిభాగాలు, కుక్క గర్భాశయంలో రెండు సంచులు, ఎద్దు తుంటి ఎముకల్లా ఇలా, మానవుడి శరీరావయవాలున్నాయని విశ్వసించేవారు. పదహారవ శతాబ్దంలో శరీర నిర్మాణ శాస్త్రవేత్త 'వెసాలియస్' (Vesalius) ఎనాటమి డిసెక్షన్‌తో అది కాదని నిరూపించే వరకూ ఈ నమ్మకాలు అలాగే కొనసాగినాయి.

బైబిల్‌లో 'He that touchth the dead-body of any man shall be unclean seven days - (Numbers XIX, II) అన్న వాక్యాన్ని ప్రామాణికంగా చేసుకుని ఎవరూ శవాల్ని ముట్టుకునేవారు కాదు. వైద్యులయితే శస్త్రచికిత్సకుల్ని చిన్నచూపు చూసేవారు. అందుచేత చిన్నచిన్న ఆపరేషన్లను మంగలివారు, తలారులు, పందుల్ని మేపేవారు, జులాయిలు చేసి తృణమో, పణమో సంపాదించుకునేవారు.

క్రీస్తుశకం 1300 ప్రాంతంలో పోప్ బొనిఫేస్–VIII ఒక ఫర్మానా జారీ చేసాడు. 'ఎవరైనా సరే మానవ దేహాన్ని కోసినా, ఉడికించినా వారు మత ద్రోహులుగా పరిగణించబడ్తారు' అని ఎందుకంటే ఆరోజులో జరిగిన పవిత్ర యుద్ధాల్లో (Crusades) మరణించినవారి దేహాలను పంపడం కన్నా ఎముకలు

పంపడం తేలిక, ఆరోగ్యకరంగా ఉండడంతో మృతదేహాల్ని కోసి, ఉడికించి వాసన లేని ఎముకల్ని స్వస్థలాలకు గౌరవమైన ఖననం నిమిత్తం పంపేవారుట. ఆ ఫర్మానాతో శరీర నిర్మాణశాస్త్ర పురోగతి మూడువందల సంవత్సరాల పాటు ఎక్కడున్నది అక్కడే ఆగిపోయింది.

ఆ చీకటి కాలం గడచి పునరుజ్జీవన కాలం (Renaissance) వచ్చాక మతాధికారుల, ప్రజల దృక్పథంలో కొంత మార్పు వచ్చింది.

క్రీ.శ. 1687లో లూయిస్–XIV ప్రభువు భగంధరం (Anal fistula)తో బాధపడ్తున్నపుడు ఒక వైద్యుడు, పశువులకు శస్త్రచికిత్స చేసిన అనుభవంతో రాజుగారికీ విజయవంతంగా చేసి రాచమన్నన పొందినాడట.

క్రీ.శ. 1540లో హెన్రీ–VIII ఆమోదంతో The United Company of Barbers and Surgeons ఏర్పాటయ్యింది. ఈ సంస్థకు మాత్రమే మరణశిక్ష అమలుపరచిన అనంతరం నేరస్థుల దేహాలను డిసెక్షన్ చేసే అర్హత, అవకాశం ఇచ్చినారు. అయతే సంవత్సరానికి నాలుగు దేహాలే ఇలా ఇచ్చేవారు. అవేమూలలకు సరిపోతాయి? ఛార్లెస్–II కాలంలో ఆ కోటాను 'ఆరు'కు పెంచినా డిమాండ్ పెరగడంతో 1752లో నేరస్థుల దేహాలనన్నిటినీ ఎనాటమీ హాల్‌లోకి పంపించాలని ఆజ్ఞ జారీచేసారు.

మానవ శరీర నిర్మాణంపై కుతూహలం ఎంత పెరిగిందంటే అవకాశం దొరికితే చాలు వైద్యులు, శాస్త్రజ్ఞులు ఎంతకైనా తెగించి మృతదేహాల్ని సంపాదించు కునేవారు. ఆ విధంగా సమాధులు, గోరీల్నుంచి అప్పుడే పాతిపెట్టిన శవాల్ని దొంగిలించడం, వాటిని అవసరమున్న డాక్టర్లకు, మెడికల్ స్టూడెంట్లకు అమ్మడం, శవాల మాఫియా ఇవన్నీ చకచకా సమాజంలోకి విచ్చేసాయి. వీటి నీలినీడలు మనం ఇప్పటికీ ప్రముఖ వైద్యకళాశాలల వద్ద, మార్చురీల వద్ద చూడవచ్చును.

ఆనాటి వైద్యుల పట్టుదల, జిజ్ఞాస ఏ రీతిలో ఉండేయంటే– రొండెలెర్ (Rondeler) అనే మెడికల్ కాలేజి ప్రొఫెసర్ తన స్వంత బిడ్డ శరీరాన్ని డిసెక్ట్ చేసి శరీరభాగాల్ని విద్యార్థులకి చూపించాడు. రక్త ప్రసరణాన్ని కనుక్కున్న 'హార్వే' తన స్వంత తండ్రిని, సోదరిని మరణానంతరం 'డిసెక్ట్' చేసి ఆ విషయాలను తన గ్రంథంలో పొందుపరచాడు. 'రొండెలెర్' పనిచేసిన మాంట్ పెలియర్ మెడికల్ కాలేజికి ఫ్రెంచి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక నేరస్తుడి దేహాన్ని ఇచ్చేదట.

బ్రిటన్ ప్రధానమంత్రి 'స్పెన్సర్ పెర్సివాల్'ను మే 1812లో జాన్ బెల్లింగ్‌హామ్ అనేవాడు కాల్చిచంపగా అతడికి ఉరిశిక్ష అమలు జరిపి అతడి దేహాన్ని సెయింట్ బార్థొలోమ్యూ హాస్పిటల్‌కు అప్పగించినారు.

అయితే ఖననానికి బదులు దేహం ఎనాటమీ హాల్‌లో డిసెక్షనుకు పంపబడుతుందేమోనన్న భయం ప్రతి నేరస్థుడికీ ఉండేదట. అయినా, ఎనాటమిస్టులు నేరస్థుల దేహాల్ని డిసెక్ట్ చేసి ఎముకల్ని వేరుచేసి అస్థిపంజరంగా చేసి, వాళ్ళ చర్మంతో చేసిన కవరులో ఉన్న కాగితాలలో అతగాడి జీవిత, మరణానంతర వివరాలను భద్రపరచేవారు.

క్రీ.శ. 1775లో విలియం హంటర్ అనే ఎనాటమిస్టు ఓ క్రిమినల్ దేహాన్ని రిగార్ మార్టిస్ రాకముందే చర్మాన్ని ఒలిచి కండరాలన్నీ కనబడేలా చేసి (శరీరపు మోడల్ (కాస్ట్)) దానికి 'Smugglerius' అని పేరు పెట్టాడు. అదింకా రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో ఉన్నది. 1780–1830 మధ్యకాలంలో ఈ శవాల డిమాండ్ పెరిగి సప్లై తగ్గిపోవడంతో సమాధుల్ని తవ్వి శవాల్ని దొంగిలించడమనే (Grave robbery) కొత్త వ్యాపారం మొదలయ్యింది. ఈజిప్ట్ పిరమిడ్లు, 'ఇంకా' సమాధుల్నుంచి ధనం, రత్నాలకోసం జరిగే వాటికి, శవాల కోసం జరిగే ఈ నేరాలకు తేడా ఉన్నది కదా! ఇది కేవలం 'బ్రిటిష్‌వాళ్ల విద్య'గా ఆరోజుల్లో చెప్పుకునేవారు. ఈ అక్రమ వ్యాపారం చేసేవాళ్లని 'Resurrectionists' గా 'Sack-them-up' 'శవాల మూటగాళ్లు'గా పిలిచేవాళ్లు. వీళ్ల పనల్లా సమాధులు తవ్వి తాజా శవాల్ని ఎనాటమీ హాల్‌లో అమ్మడమే.

పద్దెనిమిదవ శతాబ్దం చివరికి వచ్చేసరికి కాస్త విద్యావంతులు, మేధావులు, సజ్జనులు– సర్జన్లుగా, శస్త్ర చికిత్సకులుగా రావడంతో సర్జన్లకు గౌరవం పెరిగింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలు పెరిగాయి. ఎనాటమీ డిసెక్షన్ సౌకర్యం ఉన్నవాటికి స్టూడెంట్స్ డిమాండ్ ఉండేది. దాంతో శవాల అవసరం పెరిగింది. 1760–1830 – జార్జి–III, జార్జి–IV కాలంలో శవాల దొంగలు (Resurrectionists) అర్ధరాత్రి సమాధి గోతులు తవ్వి శవాల్ని మూటకట్టే కార్యక్రమాలతో శాశ్వత దుష్కీర్తి తెచ్చుకున్నారు.

సర్ ఆస్ట్లే కూపర్ (Sir Astley Cooper) జార్జి–IV నెత్తిపై సెబేసియస్ సిస్ట్ తీసి 'సర్' బిరుదు పొందినాడు. అయినా మెడికల్ స్కూలు నడపాలంటే శవాలు కావాలి. అందుకని అతడికీ బరో (Burough gang) ముఠా నాయకుడైన

బెన్ క్రౌచ్ (Ben Crouch)కు మిత్రుత్వం ఏర్పడింది. ఈ గాంగ్ వ్యాపారం అక్టోబర్ 1826లో బట్టబయలయినా శవాలు ప్రాపర్టీ – ఆస్థి కిందకు రావు గనక, శవాల దొంగలు ఆస్థికి చెందిన శవపేటికను, వస్త్రాన్ని (Shroud) ముట్టుకునే వారు కాదు గనుక శిక్ష అతి మామూలుగానే విధించబడేది.

ఈ శవాల స్మగ్లర్లు స్మశానాల కావలివాళ్లకు, కాటికాపర్లకు లంచాలిచ్చి మంచి చేసుకుని, గోరీలు కట్టేవాళ్లుగా, సమాధి గోతులు తవ్వేవాళ్లుగా అవతారాలు మార్చి ఖనన సమయంలోనే శవాన్ని శవపేటిక నుంచి బయటకు తీసి గోనె సంచిలో ఉంచి పైన పోసిన మట్టికి కాస్త దిగువగా ఈ గోనె సంచిని ఉంచి, అర్ధరాత్రి వచ్చి అతిసులభంగా, అసలు గోతికి కాస్త దూరం నుంచి సొరంగం తవ్వి శవాన్ని లాక్కుపోయేవాళ్లు. తెల్లవారే సమాధి మామూలుగానే ఉంటుంది. గోరీ గోరీలానే ఉంటుంది. లోపల శవపేటిక, ముసుగూ మాత్రమే ఉంటాయి. పెద్దవాళ్ల శవాలకు నాలుగు బంగారు నాణాలు (Guineas), చిన్నపిల్లల శవాలు మొదటి అడుగుకు ఆరు షిల్లింగులు, తరువాత అంగుళానికి తొమ్మిది పెన్నీలు రేటున గిట్టుబాటు చేసుకునేవారు. లంచాలకు, తాగుడికి పోగా వారానికి పది పౌండ్లు మిగిలేదట. అంటే మామూలు పనివాడికి వచ్చే వేతనానికి ఇరవైరెట్లు.

అయితే 'డిమాండ్‌కు తగ్గ సప్లై' కోసం ఎనాటమిస్టులు – ఈ శవాల గ్యాంగుతో చాలామంచిగా ఉండేవారు. ఎప్పుడన్నా జైల్లో పడితే వీళ్ల కుటుంబాల సంరక్షణా బాధ్యత ఎనాటమిస్టులపై ఉండేది. అట్లా చేయనివాళ్లపై శవాల గ్యాంగు తీసుకునే ప్రతీకారం భయపెట్టేదిగా ఉండేది. దుర్వాసన కొడ్తున్న శవాల్ని రాత్రికి రాత్రి ఎనాటమీ హాల్లో ఉంచి పరారయ్యేవాళ్లు. చుట్టుపక్కల జనం ఆ వాసన భరించలేక ఎనాటమిస్టుపై 'దొమ్మీ'కి దిగితే పోలీసుల రక్షణ కోరాల్సివచ్చి చావుతప్పి కన్ను లొట్టపడినంత పనయ్యేది!

సిన్ సిన్నాటి – ఓహియో మెడికల్ కాలేజి విద్యార్థులు తనతో సరిగా వ్యవహరించలేదని భావించిన శవాల దొంగ (ఓల్డ్ కన్నీ Old Cunny) స్మాల్‌పాక్స్‌తో మరణించిన వాడి శవాన్ని ఆ కాలేజీకి పంపి అనేకమంది వైద్య వద్యార్థులు మశూచికం బారిన పడేట్లు చేసాడట.

శవాల దొంగల మధ్య కూడా పోటీ తీవ్రంగా ఉండేది. ఒక గ్యాంగు సప్లై చేసిన శవాల్ని మరో గ్యాంగు వచ్చి అర్ధరాత్రి ఎనాటమీ హాల్లో సర్వనాశనం చేసి పోయేవి. ఇదికాక హాస్పిటల్ బెడ్‌లో నిన్నటిదాకా ఉన్న పేషంటు మరణించాక

అదే హాస్పిటల్ ఎనాటమీ హాల్లో శవమై డిసెక్షన్‌కు రావడం ఈ దొంగల మాయాజాలం వల్ల సంభవించేది. 1812 లో 'గై' హాస్పిటల్‌లో (Guy's Hospital) మరణించిన రోగులు పాతిపెట్టబడినాక ఈ సమాధి దొంగల పాలనబడి అదే హాస్పిటల్‌కు శవాలుగా అమ్మబడినారు. అంతేకాక ఈ దొంగల భార్యలు, చుట్టాలు, శవం తాలూకు బంధువుల్లా వచ్చి హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో తగాదా పడి శవాన్ని తీసుకుపోయి మరో హాస్పిటల్‌కు అమ్మేవారుట. ఇలా ఒకే శవాన్ని రెండుమూడు చోట్ల అమ్మి డబ్బు గడించిన ఉదంతాలెన్నెన్నో.

పూర్తి శవాలు దొరక్కపోయినా దిగులేం లేదు. దంతవైద్యులకు దంతాలను, విద్యార్థులకు ఎముకలను, కపాలాలను అమ్మి ఈ సమాధి దొంగలు పైకం గడించేవారు. యుద్ధ సమయంలో మరణించిన, చావుబతుకులలో ఉన్న సైనికుల దంతాల్ని పీకి దంతవైద్యులకమ్మిన ముఠాల్లో 'బెన్‌క్రౌచ్' ముఠా పేరు గాంచింది. హ్యూబర్ట్ కొలి (Hubert Cole) - Things for the Surgeonలో ఇలా వ్రాసాడు– "యుద్ధరంగం – నిశ్శబ్దంగా ఉంది. రక్తం మందుగుండు కలిసిన కొత్తరకం వాసన. మనుషుల గుర్రాల శవాలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. గుంటనక్కలా ఒకడు ఒక శవం దగ్గర నుంచి మరొక శవం దగ్గరకు పోతున్నవాడు – వాడి చేతిలో దంతాలు పీకేందుకు కావాల్సిన పనిముట్లు. భుజంపై ఓ తోలుసంచి. నెప్పితో మరణించిన శవాల ముఖాలు వాడు వెళ్లాక నెత్తురోడ్తూ, పళ్లుపీకిన చోట రక్తపు గుంటలుగా మరింత వికృతంగా కనిపిస్తున్నాయి". కొన్ని శవాల నుంచి సేకరించిన కొవ్వుతో కొవ్వొత్తులు కూడా తయారుచేసేవారుట.

ఉత్తర ఏథెన్స్‌గా పేరుపొందిన ఎడింబరో (Edinburgh)కు మరో చెడ్డపేరు– Resurrectionist Capital of the world. లండన్, డబ్లిన్ నగరాలకు శవాలు పెద్దఎత్తున, అధిక ధరలతో సరఫరా అయ్యేవి. క్రీ.శ. 1820 ప్రాంతంలో విలియం బర్క్, విలియం హేర్‌లు కొత్తరకం బర్కింగ్ (Burking) అనే పద్ధతికి ఆద్యులయ్యారు. వీళ్లు సమాధుల్లో శవాలను ముట్టుకునేవారు కాదు. అనాథలను, అనామకుల్ని, వేశ్యల్ని ఆకర్షించి తమ గదికి తీసుకువెళ్లి మంచం మీద పడుకోబెట్టి దిండుతో ముఖాన్ని అదిమి చంపేసేవాళ్లు. హేర్‌కు ఈ అయిడియా ఎలా వచ్చిందంటే 1824లొ ఇతడి ఇంటిలో అద్దెకున్నవాడొకడు అతనికివ్వాల్సిన నాలుగు పౌండ్లు ఇవ్వకుండానే కన్నుమూసాడు. ఆ శవాన్ని డాక్టర్ రాబర్ట్ నాక్స్ (Knox) ఏడు పౌండ్లిచ్చి కొన్నాడు. అది ఒకనెల జీతంతో సమానం. దానితో హేర్, బర్క్‌తో కలిసి బర్కింగ్ అనే పద్ధతితో బతికున్నవాళ్లని శవాలుగా

మార్చి డాక్టర్ నాక్స్‌కు అమ్మడం మొదలెట్టారు. ఓ పదిహేను మంది వేశ్యలిలా ఎనాటమీ హాల్‌లో డిసెక్షనుకు రావడంతో వాళ్ల కస్టమర్లలో ఉన్న కొందరు మెడికల్ స్టూడెంట్లు వాళ్లని గుర్తుపట్టారు. ఈ శవాల్లో మేరీ పాటర్సన్ అనే వేశ్య శవం ఎంత అందంగా ఉన్నదంటే డాక్టర్ నాక్స్ ఆమె శవాన్ని మూడు నెలలపాటు విస్కీ పీపాలో ఉంచి ఆనక డిసెక్షన్‌కు అనుమతినిచ్చాడట. ఈ బర్క్, హేర్‌ల చేతిలో పడి అనాయాస మరణం పొందిన వాళ్లలో జేమ్స్‌విల్సన్ అనే కురూపి ఉన్నాడు. మాడగి డొఛెర్తి అనే మహిళను చంపి, డాక్టర్ నాక్స్ స్కూలుకు తరలించిన క్రమంలో ఈ కిరాతకులు పోలీసులకు చిక్కారు. 'హేర్' అప్రూవర్‌గా మారడంతో క్షమాభిక్ష లభించింది. 28 జనవరి 1829 నాడు దాదాపు పాతిక వేలమంది ప్రజల సమక్షంలో విలియం బర్క్‌ను ఉరితీసినారు. అతని చర్మపు ముక్కలను జనాలు కొనుకున్నారు. ఛార్లెస్ డికెన్స్ ఒక ముక్కను కొనుక్కొని పుస్తకాలలో Book Mark గా వాడేవాడట. బర్క్ అస్థిపంజరం ఇప్పటికీ ఎడింబరో యూనివర్సిటీ ఎనాటమీ మ్యూజియంలో ఉన్నది.

ఎడింబరో నుంచి లండన్‌కు సీను మారింది. బర్క్ ఉరిదీయబడినా శవాల దొంగల వ్యాపారం సాగుతూనే ఉన్నది. థామస్ విలియమ్స్, జాన్ బిషప్ అనే బావాబామ్మరుదులు- కార్లొఫెర్రారి అనే పధ్నాలుగేళ్ల అనాధ పిల్లవాడికి రమ్ము, ఓపియం కలిపి తాగించి, చావుదెబ్బకొట్టి, ఇంకా నమ్మకం కుదరక తలకిందులుగా బావిలోకి దింపి చనిపోయాడని నిర్ధారించుకున్నాక రెండుమూడు చోట్ల శవబేరం కుదరక చివరకు కింగ్స్ కాలేజి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ సిబ్బంది అనుమానంతో పోలీసులకు ఉప్పందిస్తే, పోలీసులు వీళ్లని అరెస్టుచేసి ఉరితీసారు. ఆ సంఘటనకు ప్రజల ప్రతిస్పందన, ఒత్తిడి తీవ్రమై - వార్‌బర్టన్ ఎనాటమి ఏక్ట్-1832 రావడానికి మార్గం సుగమమైంది.

మత్తుమందు విభాగం- ఎనస్థిషియా ఇంకా లేని రోజుల్లో సర్జన్- శస్త్రచికిత్సకుడికి పేరు తెచ్చేవి- అతడికున్న వేగం, అవయవ నిర్మాణ జ్ఞానమూ- ఎడింబరో సర్జన్ రాబర్ట్ లిస్టన్ (Robert Liston 1794-1847) 33 సెకండ్లలో ఏంపుటేషన్ (Amputation); చేసేవాడట. ఓసారి అలా కాలు నరుకుతున్నపుడు అతడి అసిస్టెంటు చేతివేళ్లు మూడు పోయాయట. మరోటి అప్పట్లో మూత్రాశయంలో రాళ్లు (Bladder stones) చాలామందికి ఉండేవి. విలియం ఛెసెల్‌డన్ అనే సర్జన్ యాభైనాలుగు సెకండ్లలో ఆపరేషన్ చేసేవాడట. బ్రాన్స్‌బై కూపర్ అనే అతడు గంటసేపు చేసేవాడు కాని ఇంకో ఇరవైతొమ్మిది గంటలు

రోగి నానా అవస్థలూ పడి చివరకు మరణించేవాడట. డాక్టరుగారు మాత్రం– Oh dear! Oh dear! అని బాధపడుతూ ఉండేవాడని ఆరోజుల్లో కథలుగా చెప్పుకునేవారు.

రాబర్ట్ లిస్టన్ అనే వైద్యుడు, శవాల రాజు (Corpse King)గా పేరుబడిన 'బెన్‌క్రౌచ్'తో కలిసి ఓ హైడ్రొకెఫాలస్ (Hydro Cephalus–తలలో నీరు) రోగి మరణించినాక కొన్ని వారాల తరువాత సమాధి నుంచి అతడి తలను కాపలావాళ్ల కళ్లుకప్పి ఎలా తస్కరించాడో ఆ ఉదంతాన్ని కథగా చెబుతారు.

సర్ ఆస్లే కూపర్ (Astley Coope) తాను తలుచుకుంటే ఎవరి శవాన్నైనా సరే ఎనాటమీ హాల్‌లోకి తెప్పించగలనని బీరాలు పలికేవాడట. బహుశా ఇతడి గురించేనేమో 'రాబర్ట్‌సౌతే' (Robert Southey) తన కవిత 'The Surgeon's Warning'లో ఇలా వ్రాసినాడు.

నేను మృతుడి కొవ్వుతో కొవ్వొత్తులు వెలిగించాను.
కాటికాపరులందరూ నా బానిసలే.
పుట్టని పిండాన్ని సీసాల్లో భద్రపరిచాను.
సమాధుల్నించి వెలికిదీసిన గుండెల్ని, కాలేయాన్ని ఎండబెట్టాను.
నాకు తెలుసు నా శిష్యులు పెద్దవాళ్లవుతారు.
నా ఎముకల్ని ఒకదానితో ఒకటి గుదిగుచ్చుతారు.
నేను ఎందరో మృతుల్ని సమాధుల్నించి తొలిగించాను.
కాని, నేనిప్పుడు నా సమాధిలో నిశ్చింతగా నిద్రపోలేను.

శవాల దొంగల్నుంచి సమాధుల్ని రక్షించుకోడానికి నిరంతరం పహారాతో బాటుగా, శవపేటికల చుట్టూరా– మార్ట్‌సేఫ్ (Mort-safe) అనబడే ఇనుపకంచె (Iron Grill)ను పాతి సిమెంటుతో పటిష్ఠం కావించడం, కంటికి కనబడని ట్రిప్‌వైర్స్‌ను సమాధిచుట్టూరా అమర్చడం, దుర్వాసన వచ్చేంతవరకు (Putrefaction) శవాల్ని రక్షిత గదుల్లో ఉంచడం లాంటి జాగ్రత్తలు తీసుకునేవారు. బ్రిడ్గ్‌మాన్ (Bridgman) అనే అతడు దుక్క ఇనుముతో చేసిన శవపేటిక ఎక్కువ ఖరీదు కావడంతో ప్రాచుర్యంలోకి రాలేదు. కొంతమంది శవపేటిక తెరిస్తే మందుగుండు (Gun Powder) మండేలా ఏర్పాట్లు చేసారు.

ఈజిప్షియన్లు సమాధులు తెరవకుండా నిరోధించే ప్రయత్నంలో శవపేటిక మూతలపై, సమాధి గోడలపై శాపాలు, మంత్రాలు లిఖించేవారు.

టుటన్ ఖామన్ (Tutan Khamun) సమాధి తెరవడానికి ధనసహాయం చేసిన లార్డ్ కార్నవాన్ శాపకారణంగా మరణించాడని కొందరు నమ్ముతారు. కాని సమాధి తవ్విన హొవార్డ్ కార్టర్ ఇంకో పదహారేళ్లు బతికి వృద్ధాప్యంలో చనిపోయాడు. 1912లో సముద్రంలో మునిగి 4190 మంది మరణానికి కారణమైన 'టైటానిక్'లో ఓ మమ్మీ తరలించబడడం వలన శాపానికి గురైందని కొందరు నమ్ముతారు.

ఛార్లెస్ ఓ బ్రైని, పాట్రిక్ కాటర్ అనే మహాకాయులు దాదాపు ఏడు అడుగుల ఎనిమిది అంగుళాలు – ఎనిమిది అడుగుల రెండు అంగుళాల ఎత్తు ఉండేవారట. కరొలిని క్రఛామి అనే సిసిలియన్ మరుగుజ్జు ఇరవై అంగుళాల ఎత్తు ఉండేది. వీళ్ల అస్థిపంజరాలు ఇప్పుడు ఎనాటమి హాల్స్‌లో వేలాడుతున్నాయి.

1787లో 'మెస్సెంజర్ మోన్‌సె' అనే వైద్యుడు తన శరీరాన్ని కోసేందుకు అనుమతినిచ్చాడు. ఆరోజుల్లో అది విడ్డూరమే! జెరెమె బెంథామ్ (Jeremy Bentham) యుటిలిటేరియన్ సిద్ధాంతాన్ని (Utiliterian Pinciple - The greatest good for the greatest number) ప్రవేశబెట్టినవాడు – మహాకాయుడు (giant). అతడు తన శరీరాన్ని 'డిసెక్ట్' చేసి మానవ శరీర నిర్మాణశాస్త్ర అభివృద్ధికి తోడ్పడేలా చేయమని వీలునామా వ్రాసినాడు. అంతేకాక తన అస్థిపంజరాన్ని గడ్డీగాదంతో కూర్చి దుస్తులు తొడిగి సజీవంగా ఉన్నట్లు ఉంచమని కోరినాడు. ఆ ఎప్ఫిగి (Effigy) ఇంకా యూనివర్సిటీ కాలేజి, లండన్‌లో భద్రపరచబడి ఉన్నది.

ఈ గండాలన్నీ గడిచి 1832లో హెన్రీ వార్‌బర్టన్ – The Anatomy Act of 1832 ఆమోదించబడింది. అనాథ శవాలు, హంతకుల శవాలు ఎనాటమీ హాల్‌లోకి రావడం న్యాయసమ్మతమైంది.

✧✧✧✧✧

# 8. మరణానంతర అవమానాలు - అభిమానాలు

ఒక్కోసారి బాగా బతికిన వాళ్లు సైతం చచ్చినాక శత్రువులపాలై అవమానాల పాలవుతారు. వాళ్ల సమాధులు తొలగించబడ్తాయి. వాళ్ల ఎముకలు విసిరేయబడి, శిలాఫలకాలు ఛిద్రంచేయబడతాయి. హెరాల్డ్ హేర్‌పుట్ రాజు (1035-1040) మరణించాక అతడి సవతి తమ్ముడు హార్థానట్ - రాజు శవాన్ని వెలికిదీయించి తలనరికి థేమ్స్ నదిలో పారవేయించాడట. ఆ తల జాలరి వలలో పడి దొరికితే లండన్‌లోని డేన్స్ స్మశానంలో ఖననం చేసారు. ఆరువందల సంవత్సరాల తరువాత అటువంటి పరిస్థితే - లార్డ్ ప్రొటెక్టర్ ఆఫ్ ఇంగ్లాండ్ 'ఆలివర్ క్రామ్‌వెల్' (Oliver Cromwell)కు ఎదురయ్యింది. మొదటి ఛార్లెస్ రాజును ఉరిదీసిన క్రామ్‌వెల్ జ్వరంతో 1658లో కన్నుమూసినాడు. రెండేళ్ల తరువాత మరల రాజరికం పునరుద్ధరణతో రెండవ ఛార్లెస్ ప్రభువైనాక అతని అనుచరులు వెస్ట్ మినిస్టర్ ఎబ్బెలోని క్రామ్‌వెల్ సమాధిని తవ్వి, కంకాళానికి ఉరివేసి, తలనరికి, శిరస్సు-కపాలాన్ని బల్లేనికి గుచ్చి వెస్ట్‌మినిస్టర్ హాల్‌పైన నిలబెట్టారు. పాతికేళ్లు అలా ఉన్న ఆ ఎండిన శిరస్సు గాలివానకు పడిపోయి ఓ కాపలాదారు కాళ్ల దగ్గర పడితే ఆతడు దానిని ఇంటికి పట్టుకుపోయాడు. ఆ తరువాత అది చేతులు మారగా విల్కిన్‌సన్ అనే అతడు 230 పౌండ్లకు కొనుక్కుని, విందు వినోదాలకు వెళ్లినప్పుడల్లా, బల్లెపు మొనకు గుచ్చుకుని ఉన్న శిరస్సును ప్రదర్శించేవాడు. ఆ తరువాత దానిని సిడ్నీ ససెక్స్‌లో పాతిపెట్టినారు.

చరిత్రలో జరిగే విచిత్రమైన మలుపుల్ని మనం ఊహించను కూడా ఊహించలేం. మొదటి ఛార్లెస్ తనను ఉరిదీయబోయేముందు తన పార్థివ దేహాన్ని 'వెస్ట్‌మినిస్టర్ ఎబ్బె'లో ఖననం చేయమని కోరితే క్రామ్‌వెల్ నిరాకరించినాడు. అయినా 1648లో ఉరిదీయబడ్డ ఛార్లెస్ రాజు శవపేటిక 1813లో విండ్సర్‌లో బయటపడి నిర్ధారణ చేయబడింది.

పాపం! క్రామ్‌వెల్ అవశేషాలు 'వెస్ట్‌మినిస్టర్ ఎబ్బె' నుంచి తొలగించబడినాయి. పదమూడేళ్లలో కాల పరిస్థితులు తారుమారయ్యాయి.

క్రామ్‌వెల్‌ను బలపరచినవాడు, పారడైజ్ లాస్ట్ రచయిత జాన్‌మిల్టన్ (1608-74) రెండవ ఛార్లెస్ కాలంలో ప్రశాంతంగా బతికినా, అతడు చనిపోయిన పంథొమ్మిదేళ్లకు హోల్స్ అనేవాడు సమాధి తెరచి దంతాలను,

పక్కటెముకను, శిరోజాలను పట్టుకుపోయాడట. ఆ సమాధి సంరక్షకురాలు ఎలిజబెత్ గ్రాంట్ సందర్శకులకు రెండు నుంచి ఆరు పెన్నీల రుసుము వసూలు చేసేది.

ఇంకొక కథ మరింత చిత్రమైనది. రొజెట్టి అనే అతడు కవి, ప్రేమికుడు. 1860లో ఎలిజబెత్‌ను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. రెండేళ్ల తరువాత క్షయరోగపు బాధలను తట్టుకోలేక ఎలిజబెత్ నల్లమందు అధిక మోతాదులో తీసుకుని మరణించింది. దుఃఖితుడైన 'రోజెట్టి' ఆమెపై తాను వ్రాసిన కవితల్ని, ఆమె బుగ్గలకు బంగరు రంగు శిరోజాలకు మధ్య ఉంచి, శవపేటికను 'హైగేట్ సిమెట్రి'లో భూస్థాపితం కావించాడు. ఏడేళ్లు గడిచాయి. కవికి భార్యపై ప్రేమ పలచబడి తన కవిత్వంపై ప్రేమ పెరిగింది. ఇక ఉండబట్టలేక 1869లో ప్రభుత్వ అనుమతితో సమాధిని తవ్వించి కవితల పుస్తకాన్ని తీసి 'పొయెమ్స్' (Poems) పేరుతో 1870లో అచ్చువేయించాడు.

ఈజిప్టు మహరాజుల సమాధులకే తప్పలేదు- పెద్దపెద్ద పిరమిడ్లలో, దారులన్నీ మూసివేసి దిగ్బంధనం గావించినా, మరణానంతర జీవనం కూడా మహారాజుగా గడపడానికి సమాధుల్లో ఉంచిన స్వర్ణం, విలువైన వస్తువుల కోసం దొంగలు అత్యంత సాహసికంగా పిరమిడ్లకు కన్నాలు వేసారు. అందుకే అనేక చోట్ల ఖాళీ శవపేటికలు దర్శనమిచ్చాయి- ఈకాలపు అన్వేషకులకు.

1875లో ఒక ఈజిప్షియన్ గొర్రెలకాపరి తన తప్పిపోయిన మేకను వెదకుతూ వెళ్లినపుడు అతడికి ప్రాచీనరాజుల సమాధి స్థలం కనిపించింది. ఆరేళ్లపాటు అబెద్-ఎల్-రసూల్ సోదరులు ఆ రహస్య స్థలంలోని విలువైన వస్తువుల్ని క్రమేపీ చేజిక్కించుకున్నారు.

ఆ కాలంలో యూరోపియన్లలో ఈజిప్టు మమ్మీలపై కప్పిఉంచిన వస్త్రాలలోని మందులు అన్ని రోగాలకు సంజీవనిగా పనిచేస్తాయని విశ్వాసం ప్రబలింది. శవాన్నే ఇన్నాళ్లు భద్రపరచిన మందు వస్త్రాలు బతికున్నవాళ్లకింకా బాగా ఉపయోగపడ్తాయని నమ్మి మమ్మీలను ఎంతైనా వెల యిచ్చి కొనేందుకు సిద్ధపడడంతో మమ్మీల దొంగ రవాణా వ్యాపారం పుంజుకున్నది. యధావిధిగా డిమాండ్ ఎక్కువ సప్లై తక్కువ కావడంతో మాఫియా గ్యాంగులు ఈజిప్టు స్మశానాల్లోని శవాల్ని దొంగిలించి, శరీరభాగాల్ని తొలిగించి, Asphaltum అనే తారుబంకను పూసి, ఎండబెట్టి యూరోపియన్ మార్కెట్లలో 'మమ్మీ'ల పేరున

అమ్మి డబ్బు చేసుకున్నారు. మమ్మీల 'పొడి' తయారుచేసే కర్మాగారాలు భారీగా రావడం, స్మశానాలు ఖాళీ అవుతుండడంతో ఈజిప్టు ప్రభుత్వం వాటిని నిషేధించవలసి వచ్చింది.

ఆధునిక కాలంలో ఓ దొంగనోట్ల ముఠా (1876) జైలులో వున్న తమ సహచరుడిని విడిపించుకోడానికి అబ్రహాంలింకన్ శవపేటికను దొంగిలించు కుపోతున్నపుడు ఆఖరిక్షణంలో పట్టుబడి గ్యాంగ్ మొత్తం జైలుపాలయ్యారు. మళ్లీ అటువంటి ప్రయత్నాలు జరగకుండా ఈసారి లింకన్ శవపేటిక చుట్టూ ఇనుము, కాంక్రీటు గోడలు కట్టి దుర్భేధ్యంగావించారు.

డిసెంబరు 1881లో ఎలుకలు పట్టేవాడొకడు అలెగ్జాండర్ లిండ్‌సే అనే రాజవంశీకుడి శవపేటికను దొంగిలించి ఆరువేల పౌండ్లు డిమాండు చేసినా కాలం కలిసిరాక కథ అడ్డం తిరిగి జైలుపాలయ్యాడు.

మార్చి 1978లో ఛార్లీచాప్లిన్ సమాధిని తవ్వి శవపేటికను తస్కరించి నాలుగు లక్షల పౌండ్లను డిమాండు చేసిన దొంగలు – ఛాప్లిన్ భార్య 'ఊనా'– 'నా భర్త నా హృదయంలో, మనస్సులో స్థిరంగా ఉన్నాడు. అతడి ఎముకల గురించి నాకు నిమిత్తం లేదు'– అని నిశ్చయంగా చెప్పడంతో దొంగలు విధిలేని పరిస్థితుల్లో సమాధికి పది కిలోమీటర్ల దూరంలో మొక్కజొన్న పొలంలో శవపేటికను పాతిపెట్టారు. స్విట్జర్‌లాండ్ పోలీసులు తమ విచారణలో ఇద్దరు దుండగుల్ని అరెస్టుచేసి, శవపేటికను స్వాధీనం చేసుకుని పాతసమాధి ఉన్నచోటనే ఈసారి కాంక్రీటుతో దుర్భేధ్యంగా మలిచి ఖననం చేసారు.

ఆగష్టు 1977లో ఎల్విస్ ప్రిస్లీ భౌతికకాయాన్ని దొంగిలించే ప్రయత్నం కూడా విఫలమయ్యింది.

ఇక సాధుసంతుల సంగతి చూద్దాం. జీవితకాలంలో ఎంతో నియమ నిష్ఠలతో గడిపిన సాధువులు, సంతుల శరీర భాగాల్ని తస్కరించి పూజా వస్తువులుగా దాచుకున్నవారెందరో! నిర్యాణం చెందిన సాధువుల దేహాలు, వాటి భాగాలూ పూజింపబడడం, వాటిపై గుళ్లూ, గోపురాలూ, ఆరామాలూ నిర్మించడం మనకు బౌద్ధకాలం నుంచీ తెలుసు.

కొంతమంది తెలివిగలవాళ్లు భక్తుల అవసరాలకనుగుణంగా ప్రముఖ వ్యక్తులు నడచిన దారుల్లో, జన్మస్థలాల్లో పూజామందిరాలు నిర్మించి భక్తులిచ్చిన కాన్కలతో తమ జీవితాల్ని హాయిగా గడిపే సంఘటనలు కోకొల్లలు. 'మాగి' (Magi) లేదా ముగ్గురు జ్ఞానుల దేవాలయం అటువంటిదే!

బాప్టిస్టు జాన్ ముఖం, భాగాలు అనేక ప్రదేశాల్లో ఆరాధ్య వస్తువులైనాయి. ప్రముఖ వ్యక్తుల భౌతికకాయాల్నుంచి ముక్కలు– కాళ్లు, చేతులు, వేళ్లు, దంతాలు, గోళ్లు – వేరుచేసి బంగారు వెండిపెట్టెలో పెట్టి ప్రదర్శించడం ఆరోజుల్లో ఫాషన్. ఒక్కోసారి రాజకీయ కారణాలు ఈ అవశేషాల మార్పిడికి, బహుమతులుగా ఇచ్చి ప్రతిఫలం పొందడానికి అవకాశం ఇచ్చేవి. ఛార్లెస్, ఫిలిప్స్, లూయిస్ రాజుల ఎముకలేకాక గెలిలియో లాంటి ఖగోళశాస్త్రజ్ఞుల అస్థికలు కూడా చౌర్యానికి గురై మార్కెట్లో లాభాలకు అమ్మబడుతూ ఉండేవి.

వీటిల్లో వింతైనది– నెపోలియన్ రహస్యాంగ దొంగతనం. పెరె విగ్నాలి అనే అతడు నెపోలియన్ శిశ్నాన్ని దొంగిలించి ఎండబెట్టేసరికి అదికాస్తా చిన్న ఎండుముక్కలా తయారై– 'Not tonight, Josephine' –అనే ప్రసిద్ధ వాక్యానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. లండన్‌లోని ‘క్రిస్టీ’ హాల్‌లో వేలానికి పెడితే అనుకున్న ధర పలకలేదట. బతికున్నపుడే దానికంత విలువలేదాయె మరి.

వెస్ట్‌మినిస్టర్ ఎబ్బె (West Minister Abbey) గొప్పతనం ఏమిటంటే– అది ఉన్న ఎకరం స్థలంలోనే ఇంగ్లండ్ రాజులకు పట్టాభిషేకం, ఖననం జరిగేవి. అంతేకాక వాళ్ల నివాసస్థలమూ అదే.

మరణానంతరం అవమానాల్లో అతి నీచమైనది అత్యంత హేయమైనది నెక్రొఫిలియా (Necrophilia) (శవసంభోగం). అమెజాన్ల రాణి పెంథెసిలియా మహావీరుడు ఎఖిల్లిస్ (Achilles)తో పోరాడి గాయాలతో మరణిస్తున్నపుడు ఆమె ముసుగు తొలిగించి చూస్తాడు. ఆమె అందానికి వివశుడైన ఎఖిల్లిస్ ఆమె చనిపోయిందన్న విషయాన్ని మరిచి శవసంభోగం చేస్తాడు (Graves-Penthesileia).

‘శాడిజమ్’కు మూలపురుషుడైన మార్క్విస్ డిశాడి (Marquis de Sade) రచనల్లో నెక్రొఫిలియా కూడా ప్రధానాంశమే. హెన్రీ బ్లాట్ అనే శవసంభోగి పట్టుబడినప్పుడు ఇలా అన్నాడట– ‘ఎవడి రుచి వాడిది. నాకు ఇది ఇష్టం’.

చరిత్రకారుడు హెరొడొటస్ (Herodotus)– ఈజిప్షియన్ల ఎంబాల్మింగ్ విధానాల గురించి వ్రాస్తూ అందమైన ఈజిప్షియన్ యువతులపై మరణానంతర అత్యాచారాలు జరగకుండా ఉండేందుకు శవాల్ని మూడు నాలుగు రోజుల తర్వాత (కుళ్లిపోయిందని నిర్ధారించినాకే) ఎంబాల్మింగ్ చేసేవాళ్లకిచ్చేవారని– వ్రాసినాడు. సమాధులు తవ్వేవాళ్లు; మార్చురీలో పనివాళ్లు, యుద్ధరంగంలో

సైనికులు లాంటివాళ్లు అవకాశం దొరికినప్పుడు ఈ హీనమైన కార్యానికి పాల్పడ్తారని ప్రజలు చెప్పుకునేవారు. రాబర్ట్ నాక్స్ అనే ఎనాటమిస్టు శవ సంభోగానికి పాల్పడపోయినా మేరీపాటర్సన్ శవపు అందానికి వశుడై మూడ్నెల్లపాటు ఆమె శవాన్ని ఆల్కహాల్‌లో ఉంచి ఆ తర్వాతనే డిసెక్ట్ చేసాడంటారు. మరణించిందనుకున్న యువతి శరీరాన్ని సంభోగించి ఓ సన్యాసి వెళ్లిపోయాక మేలుకున్న ఓ మహిళ తర్వాత ఓ పండంటి శిశువును కన్నదని ఓ కథ 1740 ప్రాంతంలో ప్రజలనోట నలుగుతూండేది.

బ్రామ్ స్టోకర్ (Bram Stoker)– డ్రాకులా, స్టిఫెన్‌కింగ్ (Stephen King) Salem's lot – లాంటి రచనల్లో వాంపైర్లు, దయ్యాలు మనుషుల్లానే ఉండి తమకు నచ్చినవాళ్ల రక్తాన్ని తాగి, శృంగారంలో పాల్గొని నిత్య యవ్వనాన్ని సంతరించుకుంటాయి. ఇటువంటి కథలు రుమేనియా, ఇంగ్లాండ్ లాంటి యురోపియన్ దేశాల్లో ప్రసిద్ధికెక్కాయి.

'ఫ్రిజ్ హార్మాన్' అనేవాడు 1925 ప్రాంతంలో ఇరవై నలుగురు యువకుల్ని చంపి వాళ్ల శవాలతో తన కోర్కె తీర్చుకుని పట్టుబడి ఉరితీయబడ్డాడు. అతడు 'హానోవర్ వాంపైర్'గా ప్రసిద్ధికెక్కినాడు. 1827లో కూడా పన్నెండేళ్ల అమ్మాయిని చంపి, ఆమె రక్తాన్ని తాగిన వాడి వృత్తాంతం ప్రజలు కథలుగా చెప్పుకునేవారు.

ఫలానావాడి దెయ్యం ఊళ్లో తిరుగుతోంది, నా పక్కన పడుకుంది, అని జనం భయపడ్తున్నపుడు ఆ వ్యక్తి సమాధిని తెరిచి శవం గుండెలోకి పదునైన చెక్కను గుచ్చి, ఒక్కోసారి తలను వేరుచేసి, మొత్తం శరీరాన్ని, తలను దహనం చేసి బూడిదను దూరంగా వెదజల్లేవారు. ఇలా సెర్బియాలో 1725– పీటర్ ప్లొగొజొవిట్జ్ అనే అతడు 'వాంపైర్'గా మారాడని అతడి సమాధిని తవ్విచూస్తే వెంట్రుకలు గోళ్లూ పెరిగి ఉండడం, కొత్త చర్మం వచ్చిన సూచన, పెదాల మూలల్లో రక్తం, శిశ్నం నిక్కపొడుచుకుని ఉండడం గమనించారు. కాని అవన్నీ మరణానంతరం శరీరంలో జరిగే పరిణామాలని నవీన శాస్త్రజ్ఞులు రూఢి చేసేంత వరకూ ప్రజలు తమ తమ నమ్మకాలతో వాటిని వింత సంఘటనలుగానే చెప్పుకునేవారు. భయపడేవారు.

మరణానంతరం అభిమానించబడిన వారు మరికొందరు. కొన్ని వృత్తాంతాలివి. 'అన్నామేరియా రెడి'గా ఇటలీలో జన్మించి సెయింట్ థెరిసా

మార్గరేట్ ఆఫ్ సేక్రెడ్ హార్ట్స్ (1747-1770)గా ప్రసిద్ధికెక్కిన ఆమె గాంగ్రిన్‌తో మరణించింది. పదిహేను రోజుల తర్వాత కూడ ఆమె శరీరం అలానే ఉండడం, మరింత సహజరూపును సంతరించుకున్నాక- ఆర్చిబిషప్, వైద్యుల సమక్షంలో ఆమెను ఖననం చేసారు. 1783, 1805లలో రెండుసార్లు బయటకు తీసినప్పుడు కూడా చెడిపోకుండా ఉన్న ఆమె దేహం ఇప్పుడు ఫ్లారెన్సులోని శాంతా థెరెసా ఆలయంలో భద్రపరచబడి ఉన్నది. 1934లో ఆమెకు దైవత్వం (Canonize) లభించింది.

గోవాలోని బెసిలికా ఆఫ్ బోమ్ జీసస్‌లో ఉన్న సెయింట్ ఫ్రాన్సిస్ గ్జేవియర్ (1506-1552) భౌతికకాయం గత 460 సంవత్సరాలుగా చూపరులను విస్మయపరుస్తూనే ఉన్నది. కొన్ని శరీరభాగాలు- కుడిచేయి, కాలివేలు, ఎడమచేయిలో కొంతభాగం ఇలా ప్రపంచంలో నలుమూలలా ఆరాధ్యనీయాలై భక్తులకు విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి.

ఇంకా అనేకచోట్ల లభ్యమైన చెడిపోని శవాలు శాస్త్రజ్ఞులలో ఆసక్తిని, ప్రజలలో దైవభక్తిని కలిగిస్తున్నాయి. పాలెర్మోలోని కపూచిన్ సన్యాసుల మఠంలో (Capuchin Monks) ఎనిమిదివేల శవాలు చిన్నాపెద్దా నిలబడి, కూర్చుని, ఇలా అనేక రకాల భంగిమలలో భద్రపరచబడి ఉండగా రోజాలియా లొంబార్డో అనే రెండేళ్ల పిల్లవాడి (డిసెంబర్ 1920) శరీరం చెక్కుచెదరకుండా పసిబాలుడు నిద్రిస్తూ సజీవంగా ఉన్నట్లే ఉండి చూపరులను ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది.

✧✧✧✧✧



# 9. మమ్మీలూ - గుండెలూ

శరీరం నుంచి బయటకు వెళ్లిన ఆత్మ, తన శరీరాన్ని గుర్తించాలంటే వెనుకటి రూపురేఖలు ఉండాలని ఈజిప్షియన్లు భావించేవారు. పరకాయ ప్రవేశ విద్యలో ఎవరైనా తన ఆత్మను వేరే శరీరంలో ప్రవేశపెట్టినట్లయితే ఈ పార్థివ దేహం ఉండకపోతే ఆత్మ ఆ శరీరంలోనే ఉండిపోతుంది. ఈ విషయం తెలిసిన మిత్రులు గాని శత్రువులు గాని అసలు శరీరాన్ని నాశనం చేసి ఆత్మను కొత్త దేహంలోనే నిర్బంధించే ప్రయత్నం చేసేవారు. శంకరాచార్యుల వారిపై కూడ ఇటువంటిది జరిగిందని కొందరి నమ్మకం.

క్రీస్తుపూర్వం 1500కు ముందు ఈజిప్టులో మమ్మిఫికేషన్ తొలిదశలో, 1500–1000 B.C.లో అభివృద్ధి చెందిన దశలో ఉండి, ఆ తరువాత పతనావస్థకు చేరుకున్నది. గ్రీకు చరిత్రకారుడు 'హెరొడొటస్' గ్రంథస్థం చేసిన విషయాలే మనకిప్పుడు ఆధారాలు. నేను 2004 ప్రాంతంలో ఈజిప్టు సందర్శించి నప్పుడు కైరోలో ఈజిప్టు మ్యూజియంలోని మమ్మీలను చూసి ఆనాటి ఈజిప్షియన్ల చాతుర్యానికి ఆశ్చర్యపడ్డాను. ఈజిప్షియన్ల దృష్టిలో మెదడుకన్నా హృదయానికి విలువ ఎక్కువ. మమ్మిఫికేషన్‌లో మొదటగా– ముక్కులోంచి ఓ కొంకిని దూర్చి మెదడును బయటకు గుంజేసి కపాలంలోకి కొన్ని మందుల్ని పోసేవారు. ఒక్కోసారి కళ్లుకూడా తీసేసేవారు. తరువాత శరీరంలోని ఇతర అవయవాల్ని తీసివేయడం. పరిస్‌ఖిస్టెస్ (Parischistes=Cutters) కడుపుకు ఎడమవేపు ఆరంగుళాల కోత కోసి – పేగులు, పొట్ట, కాలేయం, ప్లీహం తొలగించేవారు. మూత్రపిండాలు, మూత్రాశయం సాధారణంగా తీసేవారు కాదు.

కడుపులోంచి చేయిపోనిచ్చి డయాఫ్రమ్ (Diaphragm) గుండా రొమ్ములోని ఊపిరితిత్తుల్ని, అన్నవాహికను గొంతువరకు గుంజేసేవారు కాని హృదయాన్ని (గుండెను) అలాగే ఉంచేవారు. తర్వాత రొమ్మును, పొట్టభాగాన్ని కడిగి నీళ్లు, ఖర్జూర వృక్షాల నుంచి తయారుచేసిన సారాయితో నింపేవారు. శరీరం నుంచి తీసిన అవయవాల్ని రసాయనాలతో శుద్ధిచేసి గుడ్డలతో చుట్టి జాడీలలో భద్రపరిచేవారు. 'మమ్మీ'లాంటి సినిమాలలో ఈ విషయాన్ని చూడవచ్చు. ఈ సీసాలను లేదా జాడీలను శవంతోపాటు ఖననం చేసేవారు. స్త్రీల గర్భసంచుల్ని తీసి వాటినికూడా ప్రత్యేక జాడీలలో భద్రపరిచేవారు.

శవాలు తొందరగా గట్టిపడడానికి తక్కువ లోతున్న ఎడారి ఇసుక గోతుల్లోకాని, లేదా కైరో, అలెగ్జాండ్రియాల మధ్య లభ్యమయ్యే నేట్రాన్ (Natron)

అనబడే సోడియం కార్బనేట్, సోడియం బైకార్బనేట్ మిశ్రమంతో శవాల్ని నలభై రోజులబాటు ఆరబెట్టేవారు.

ఆ తరువాత ముక్కురంధ్రాల్లో చిక్కని రెసీన్ (Resin) పోసి, శరీర కుహరాల్లో లైఖెన్, రంపపు పొట్టు, రసాయనంలో ముంచిన గుడ్డపీలికలు, ఉల్లిపాయలు ఉంచేవారు. కళ్లకు బదులు రంగులు వేసిన ఉల్లిపాయల్ని కళ్లగుంతల్లో కళ్లలా కనపడేలా ఉంచేవారు.

గట్టిపడిన శరీరాన్ని సెడార్‌నూనె, టర్పెంటైన్, ఆవనూనె, గుగ్గిలం, గ్రీజు ఇతర ద్రవ్యాలతో పాలిష్‌చేసి, శరీరంలోని ఖాళీభాగాల్లో నూనెలు, రెసిన్లు నింపి మగవాళ్ల శవాలకు ఎర్రరంగు, మహిళల శవాలకు పసుపురంగు వేసేవారు.

చేతుల్ని ఎదుటి భుజాలను అంటుకునేలా గాని, పక్కనేగాని ఉంచి, గుడ్డలు చుట్టేందుకు సిద్ధం చేసేవారు.

Bandaging - గుడ్డలు చుట్టడం దాదాపు రెండు వారాల పని. లినెన్ గుడ్డను (నార చీరలు) రెసిన్‌లో ముంచి నెమ్మదిగా అంచెలంచెలుగా ఈ కార్యక్రమాన్ని పూర్తిగావించేవారు. మధ్యలో దూరి నివాసముందామనుకున్న ఎలుకలు తర్వాత మరో వరస నారచీరలు చుట్టబడగా లోనే ఉండిపోయి అస్థిపంజరాలుగా 3000 సంవత్సరాల తర్వాత నవీన శాస్త్రజ్ఞుల కంటబడ్డాయి. మమ్మీ మొహాన్ని రాజులు రాణులైతే బంగారు తొడుగుతో, పేదవాళ్లకు చెక్కముక్కలతో కప్పి ఖననానికి సిద్ధం చేసేవారు.

ఈ మమ్మిఫికేషన్ (Mummification) తతంగం ధనవంతులకు మాత్రమే లభ్యమయ్యేది. పేదవాళ్లు శాశ్వత జీవనం పొందదలచుకున్నట్లయితే వాళ్లకు చౌకబేరాలుండేవి. మలద్వారం (Anus) లోంచి దేవదారు నూనె (Cedar Oil) ఎక్కించి శరీరాన్ని నేట్రాన్ పొడిలో ఎండబెట్టేవారు. శరీర అవయవాలన్నీ మలద్వారం గుండా ద్రవరూపంలో పోయాక బ్యాండేజీలు చుట్టి ఖననం చేసేవారు. అతిపేదవాళ్లను వస్తి (Enema) ఆ తరువాత నేట్రాన్‌లో ఎండబెట్టి, ఆనక ఖననం చేసేవారు. దాదాపు యాభై కోట్లమంది ఈజిప్షియన్లు ఇలా ‘మమ్మీ’లుగా చేయబడ్డారని ఓ అంచనా!

మనుషుల్తోబాటు గిత్తలు, గొర్రెలు, పిల్లులు, కుక్కలు, కోతులు, మొసళ్ళ లాంటి జంతువుల్నీ మమ్మీలుగా చేసేవారు. 1859లో ఒక పిల్లుల స్మశానం నుంచి మూడులక్షల పిల్లుల మమ్మీలను ఎరువుగా వాడేందుకు ఓడలో బ్రిటన్ తరలించారట.

క్రీస్తుపూర్వం 1298 నుంచి 1135 వరకు అరవై అయిదేళ్ల పరిపాలించిన రామ్‌సెస్-II తన 96వ ఏట మరణించాడు. రెండు వందల మంది భార్యలు, తొంభై ఆరుగురు కొడుకులు, అరవైమంది కుమార్తెలున్న అతడి 'మమ్మీ' ఇవ్వాళ్టికీ కైరో మ్యూజియంలో రాజసం ఉట్టిపడుతూ కనిపిస్తుంది. 1520-84 B.C. మధ్య పాలించిన రాణి హట్‌చెప్‌సట్ (Hatchepsut) మగవాడిగా వస్త్రధారణ చేసుకుని, చిత్రాలలో, శిల్పాలలో గడ్డం ఉండేట్ల ఆజ్ఞాపించేది. వీళ్లిద్దరి మమ్మీలు ఆనాటి ఈజిప్షియన్ల మమ్మిఫికేషన్ లోని నాణ్యతకు ఉదాహరణలుగా నిలిచిపోయాయి. హొవార్డ్ కార్టర్ కనుక్కున్న టుటన్ ఖామన్ (Tutankhamun) సమాధి స్వర్ణాభరణాలతో, విగ్రహంతో ఉండి ప్రపంచాన్ని అబ్బురపరచింది.

ఇతర నాగరికతలలో కూడా 'మమ్మీ'ల సంస్కృతి ఉందనడానికి ఋజువులుగా పెరు, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా, ఇటలీలలో లభ్యమైన మమ్మీలు, శిథిలంకాని దేహాలు ఉదాహరణలు. ఈ మమ్మీలు కొన్ని సహజసిద్ధంగా తయారైనవి. కొన్ని కృత్రిమ రసాయన పద్ధతులలో మమ్మిఫికేషన్ (Mummification) చేయబడినవి.

క్రీస్తుపూర్వం 4000 నాటికే పెరూ (Peru)లో ఈ మమ్మీల సాంప్రదాయం ఉన్నది. మోకాళ్లూ మోచేతులూ వంచి రొమ్ముకానించి కూర్చున్న పద్ధతిలో 'మమ్మిఫికేషన్' కావించారు. మమ్మీలను చేసేప్పుడు పెరూ తెగల్లో మెదడును తీసివేయడం, కడుపులోని అవయవాల్ని తొలగించడం, మొహం మీద తొడుగుల్ని కప్పడం లాంటి పద్ధతులున్నాయి. పెరువియన్ మమ్మీలు 'ఫార్డో' (Fardo) అనే మూటలో కూర్చోబెట్టబడి ఉంటాయి. రాజుతోబాటు సేవకులు, రాణులు, మందీమార్బలం, ఆహారపదార్థాలు, సారాయి, దుస్తులూ అన్నీ సమాధిపాలయ్యేవి. ఇటువంటి కథల్ని సింద్‌బాద్ సాహసయాత్రల్లో, టిన్‌టిన్ కామిక్ స్టోరీల్లో మనం చదువుకుని ఉన్నాం.

ఆస్ట్రేలియా న్యూగినీల మధ్య ఉన్న టొర్రెస్ అగాథంలోని డారన్‌లే ద్వీపంలో సర్ విలియం మాక్‌లియే ఒక మమ్మీని కనుగొన్నాడు. ఇప్పుడది సిడ్నీ విశ్వవిద్యాలయంలో ఉన్నది. ఇక్కడి ఆదిమ ప్రజలు శవాల్ని మరణానంతరం జీవనం కొరకుకాక త్వరగా శిథిలం కావడం కొరకు మమ్మిఫికేషన్ చేస్తారని, అందుచేతనే ఈ ప్రాంతాలలో మమ్మీలు లభ్యం కావడం కష్టమని అంటారు. ఈ 'మాక్‌లియె' మమ్మీ ఓ నిచ్చెనకు వేలాడదీయబడి ఉన్నది. దేహమంతా ఎర్ర జేగురుమన్ను పూయబడి, కళ్లకు బదులు నల్లటి చుక్కలున్న తెల్లటి ఆల్చిప్పలు,

ముక్కు రంధ్రాల్లో ఎర్రటి పగడాలు పెట్టబడి ఉన్నాయి. మెదడు, కాలేయం, పేగులు తొలగించబడినాయి. శిశ్నం, వృషణాలు అలానే ఉంచబడినాయి. చేతి, కాలి గోళ్లు, అరికాళ్ల చేతుల చర్మం తీసి అప్పటి ఆచారాల ప్రకారం అతడి భార్యకు ఇచ్చి ఉంటారు. నెలలకొద్దీ ఎండబెట్టబడిన శరీరాన్ని, అతగాడి ఇంటిలో నిట్రాడికి కట్టి ఉంచుతారు. క్రమేపీ ఎముకలన్నీ రాలిపోగా కపాలం మిగుల్తుంది. దగ్గర బంధువు దానిని సారాయి తాగడానికి గిన్నెగా వాడతాడు.

అమెరికాలోని అరిజోనా, కొలరాడొ, మెక్సికోలో లభ్యమైన మమ్మీలు ఉన్నితో చుట్టబడి, గుహల్లో భద్రపరచబడినాయి. జపాన్‌లో దొరికిన బౌద్ధ భిక్షువుల మమ్మీలు మైత్రేయ బోధిసత్వుని రాకకై ఎదురుచూస్తున్నాయి. చైనాలో చాలా కొద్దిసంఖ్యలో 'మమ్మీ'లు లభ్యమైనాయి. చిత్తడి నేలల్లో లభ్యమైన మమ్మీలను Bog People అని పిలిచేవారు. డెన్మార్క్‌లో దొరికిన ప్రసిద్ధ మమ్మీలను టొల్లండ్ మాన్ (Tollund man), గ్రౌబలెమాన్ (Grauballe man) అని పిలుస్తారు.

ప్రాచీన బాబిలోన్ నగరంలో కూడా శవాల్ని మమ్మీలుగా భద్రపరిచేవారు. తేనెలో శవాల్ని ఉంచి చెడకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. అలెగ్జాండర్, ఛార్లెమాగ్నెల దేహాల్ని అలాగే భద్రపరిచారు.

హెన్రీ-I శవం చెడిపోయినా, ఎడ్వర్డ్-I దేహం కాథరిన్ (హెన్రీ-5 రాజు భార్య)ల శవాలు ఎంబాల్మింగ్ ద్వారా అనేక వందల సంవత్సరాలు భద్రపరచబడినాయి. ఊరగాయల రసాల్లో కూడా శవాల్ని భద్రపరచేవారు. నెల్సన్ ట్రఫాల్గర్ యుద్ధంలో మరణించాక, అతని దేహాన్ని బ్రాందీ పీపాలో ఉంచి బ్రిటన్‌కు పంపినారట.

హన్నా బెస్విక్ అనే మహిళ తన వైద్యుడు డాక్టర్ ఛార్లెస్ వైట్‌ను తన దేహాన్ని ఎంబాల్మ్ చేయమని వీలునామా వ్రాసింది. మార్టిన్‌వాన్ బుట్‌ఛెల్ అనే దంతవైద్యుడి భార్యను 'ఎంబాల్మింగ్' చేసే కార్యక్రమంలో ఆమె భర్తకూడా పాల్గొని ఆ పద్ధతిని 'డైరీ'లో వ్రాసినాడు. ఎంబాల్మింగ్ చేసినాక ఆ దేహాన్ని అద్దాల పెట్టెలో ఉంచితే అందరూ చూడడానికి ఎగబడినప్పుడు అతడు పత్రికాముఖంగా ఆంక్షలు విధించాల్సి వచ్చిందట.

జాన్‌షెల్డన్ అనే వైద్యుడు కూడా జాన్సన్ అనే మహిళ కోరినట్లు అందమైన దేహాన్ని ఎంబాల్మింగ్ చేసి తన ఇంటిలోని మ్యూజియంలో అట్టిపెట్టుకున్నాడు. అయినా కాలగతిలో ఈ 'మమ్మీలు' క్షీణించి వాటి సౌందర్యం శిథిలమై కాలగర్భాన కలిసిపోయాయి.

ప్రకృతి సహజంగా మమ్మీలుగా మారిన దేహాల్లో జిమ్మీగార్లిక్ (Jimmy Garlick)గా పిలువబడిన మమ్మీ 1839లో లండన్ నగరంలో సెయింట్ జేమ్స్ గార్లిక్ హైథెలో లభ్యమయ్యింది. కనీసం మూడు వందల సంవత్సరాలున్న ఆ మమ్మీని ఆ చర్చిలో ఉన్న అద్దాలపెట్టెలో చూడవచ్చును.

ఈజిప్షియన్లకు, పెరువియన్లకు, అజ్టెక్‌లకు ఇలా ప్రాచీన కాలపు నాగరికులకు శరీరంలోని అవయవాలన్నిటిలోనూ 'గుండె'కు ప్రాశస్త్యమెక్కువ. Heart is the seat of emotions - అనేది వారి భావన. అందుకని దానిని రొమ్ములోనే ఉంచి 'ఎంబాల్మ్' చేసేవారు. క్రిస్టియానిటి వచ్చినాక శరీరాన్ని యావత్తూ ఖననం చేయడం ఆచారమయ్యాక ఎంబాల్మింగ్ దాదాపు అంతరించింది.

అయితే పవిత్రయుద్ధాల (Crusades) కాలంలో ఇతర దేశాల్లో మరణించిన వీరుల అస్థికల్ని గాని, గుండెను గాని బ్రిటన్‌కు లేదా స్వదేశానికి పంపడం సులభంగా భావించి, మరణించిన వారి దేహాల్ని ఉడికించి ఎముకల్ని వేరు చేయడం, గుండెను తొలగించి పెట్టెలో పెట్టి ఖనన కార్యక్రమాలకు స్వదేశం పంపే విధానాలు ఎక్కువ కావడంతో ఉలిక్కిపడింది చర్చి;- పోప్ బోనిఫేస్-VIII 1299లో శరీరంలోని ఏ భాగాన్ని వేరుచేసినా, సంఘ బహిష్కరణ (Excommunication) శిక్షగా విధించబడుతుందని మత ఆజ్ఞను జారీచేసినాడు. అయినా ఆ పద్ధతి దిన దినాభివృద్ధి చెందింది. స్కాట్లాండ్ రాజు రాబర్ట్ ద బ్రూస్ 1329లో లెప్రసీతో చనిపోయినప్పుడు అతని ఆజ్ఞననుసరించి అతని హృదయాన్ని తీసి బంగారు పెట్టెలో ఉంచి జెరూసలెం తీసుకువెళ్లారని ఒక కథ. దాని సంరక్షకుడైన జేమ్స్ డగ్లస్ తనపై దాడికి దిగిన మూర్స్‌ను ప్రతిఘటిస్తూ, బ్రూస్ గుండెవున్న పెట్టెను విసిరి, గాయాలతో ఆ పెట్టెపైబడి మరణించగా ఆ పెట్టెను 'మెల్‌రోజ్'లో ఖననం చేసారని మరోగాథ.

ఫిలిప్ రాజు (1343); రిచర్డ్ ద లయన్ హార్ట్, ట్యూడర్ రాణులైన ఎలిజబెత్, మేరీల దేహాలొక్కచోట, హృదయాలు మరొక్కచోట ఖననం చేయబడినాయి. 1793లో జాన్‌హంటర్ తన గుండెను తీసి తన ప్రఖ్యాత మ్యూజియంలో భద్రపరచమని కోరినా అలా చేయబడలేదు. కాని జొహన్నెస్ వెప్ఫర్ (Johannes Wepfer) అనే ఎనాటమిస్టు మరణించినాక అతడి మిత్రులు అతడి శరీరాన్ని డిసెక్ట్ చేసి వివరాలు పొందుపరిచారు. తలకు వెళ్లే రక్తనాళాలకు, స్ట్రోక్‌కు సంబంధం ఉన్నదని కనుక్కున్న అతడి గుండెనుంచి వెళ్లే రక్తనాళాలు కూడా గట్టిపడి ఉండడం కొసమెరుపు. అతడి పరిశోధనలన్నీ ఉన్న ఆ పుస్తకం పేరు Memoria Wepferiana.

గుండెల్ని తీసిన మొనగాళ్లలానే, తలల్ని దాచిన తలారులూ ఉన్నారు. జియానె (Jeanne) అనే నవారె మహిళ తన భర్త గుండెను ఒక బంగారు పెట్టెలో పెట్టుకుని తను బతికున్నంతకాలం తన పక్కనే ఉంచుకునేదట. అలానే సర్ వాల్టర్‌రాలీ (Sir Water Raleigh) భార్య అతడు ఉరిదీయబడినాక అతడి తలను చేతిసంచిలో ఉంచుకుని ఎక్కడకు వెళ్లినా తనకూడా తీసుకువెళ్లేదట.

ఈ అలవాటు మనదేశంలో లేదేమోకాని దక్షిణ అమెరికాలో రెడ్ ఇండియన్లు తమ శత్రువుల్ని చంపి వాళ్ల తలల్ని చిన్నగా క్రికెట్ బంతులంత చేసి ఈటెలకు గుచ్చి ప్రదర్శించేవాళ్లు. ఎన్ని తలలుంటే అంత మొనగాడన్నమాట!

అయితే ఆ తలల్ని చిన్నగా చేయడం ఎలాగ? మెడ వెనక నిలువుగా కోసి తల ఎముకల్ని, పుర్రెను వేరుచేసి, తల మొహం చర్మాన్ని, వేడి ఇసుకతో, వేడి గుండ్రాళ్లతో క్రమేపీ గట్టిపరచి చిన్నగా చేస్తారు. పెదాల్ని, కనుబొమ్మల్ని దగ్గరకు కుట్టి దాదాపు రూపురేఖలు సహజంగా, మామూలుగా ఉండేట్లు చేస్తారుట. బాగా గట్టిపడ్డాక రంగులు వేసి, ఆభరణాలు తగిలించి, ఈటె కొసకు తగిలించి తమతో పాటు తీసుకువెళ్లేవారు.

యూరోపియన్ మ్యూజియంలు వీటికి ఎగబడడంతో 1800 ప్రాంతాలలో గిరాకి పెరిగి స్మశానాలు ఖాళీ అయి ఒక్కో తల 25 డాలర్లకు అమ్మబడిందని చరిత్రకారులు అంటున్నారు. యధావిధిగా మాఫియాలూ, గ్యాంగులూ వీటిలోనూ చొరబడ్డాయట.

✧✧✧✧✧



# 10. రాబోయే కాలంలో
# సైన్సు మృతసంజీవనిని కనుక్కుంటే...

ఎవ్వరూ మరణించకుండా అందరూ బతికివుంటే భూభారం ఎక్కువై సర్వనాశనం సంభవించదా! ద్రవ్యరాశి ఒక్కటే రూపాలు వేరైనా అనుకునేట్లయితే ఈ భూప్రపంచంలో కొన్నాళ్లకి మానవుడు తప్ప మరే జీవిని బతకనివ్వడా! అన్నిటినీ తినేస్తూ మానవుడే ఏకైక జీవిగా ఉన్నా ఉంటానికి చోటెక్కడ మిగుల్తుంది? ఇతర గ్రహాలకు తరలిపోయి అక్కడ బతకాల్సిందేనా? ఇలాంటివి సవాలక్ష సందేహాలు! మానవుడు మృత్యువును జయించే మందు కనుక్కుంటే! ఇప్పటికే వృద్ధాప్యానికి విరుగుడు కనుక్కుంటున్నారు. మానవుడి ఆయుర్దాయం 120 ఏళ్ల నుంచి 150 ఏళ్లకు పెంచేందుకు పరిశోధనలు ముందుకెళ్తున్నాయి.

భవిష్యత్ కాలంలో శాశ్వత జీవనం కోసం ఈజిప్షియన్లు తమవాళ్ల శవాలను మమ్మీలుగా భద్రపరచి ఆత్మ (Ka=కా) గుర్తుపట్టేట్లు రూపురేఖల్ని యధాతధంగా ఉంచే ప్రయత్నం చేసారు. అలా దాదాపు 500 మిలియన్లు (50 కోట్లు) ఈజిప్షియన్లు మమ్మీలుగా ఉన్నారని ఓ అంచనా!

అమెరికాలో నూతన ఎంబాల్మింగ్ ప్రక్రియ డాక్టర్ థామస్ హోల్మ్స్ (Doctor Thomas Holmes-1817-1900)ను ప్రెసిడెంట్ లింకన్‌– యూనియన్ సైనికుల శవాలను దక్షిణ యుద్ధరంగం నుంచి ఉత్తర దేశానికి తరలించేందుకు అనువుగా చేయమని కోరడంతో మొదలైంది. మొదట మెర్క్యురి బైక్లోరైడ్ ద్రావకాన్ని రక్తనాళాల్లో ఇంజక్ట్ చేసి ఎంబాల్మింగ్ చేసేవారు. మెర్క్యురితో దుష్ప్రభావాలు సంభవించి పనివాళ్లు రుగ్మతలకు లోనవడంతో మెర్క్యురి స్థానాన్ని ఆర్సెనిక్ ద్రావాలు ఆక్రమించుకున్నాయి. మెడికోలీగల్ వ్యవహారాల్లో ఆర్సెనిక్ విషం కూడా హత్యలకు, ఆత్మహత్యలకు ఉపయోగపడడంతో కొత్తచిక్కులు వచ్చాయి.

1893లో బ్లమ్ (Blum) అనే అతడు ఫార్మాల్డిహైడ్ (Formaldehyde) శరీర భాగాల్ని గట్టిపరుస్తుందని కనుకున్నాడు. (ఇప్పుడు కూడ శరీరభాగాల్ని పాథాలిజిస్టులు ఫార్మాల్డిహైడ్‌లో ఉంచి పల్చని ముక్కలు చేసి మైక్రోస్కోపులో పరీక్షిస్తారు) నవీన కాలంలో ఎంబాల్మింగ్ కోసం ఫార్మాల్డిహైడ్, బోరాక్స్, సాఫ్రనైన్, మిథైల్ రెడ్, ఇయొసిన్ ఎల్లో లాంటి ద్రావకాల మిశ్రమాన్ని

వాడుతున్నారు. ఈ ప్రక్రియలన్నీ శరీరాల్ని శాశ్వతంగా ఉంచడానికి నిర్దేశించినవి కావు. కేవలం ఓ వారం పదిరోజులు శరీరాన్ని చెడకుండా కాపాడుతాయి. కాని లెనిన్, ఇవాపెరాన్‌ల శరీరాలు ఎంబాల్మింగ్ చేసి చానాళ్లయినా ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

1954లో చిలీ దేశపు కొండగుహలో లభ్యమైన ఇంకా ప్రిన్స్ (The Inca Prince) పదేళ్ల పిల్లవాడు 14000 అడుగుల ఎత్తు కొండగుహలో చలికి గడ్డకట్టి మమ్మీగా లభ్యమయ్యాడు. బహుశా అతడు మరణించి అయిదు వందల సంవత్సరాలు దాటి వుండవచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా!

ఇప్పుడు కొత్తగా క్రయొనిక్స్– అత్యంత శీతల వాతావరణంలో శరీరాన్ని భద్రపరచడం. ఒకవేళ సైన్సు మరింత అభివృద్ధి చెంది చనిపోయిన వారిని బ్రతికించగలిగితే! అందుకోసమని కొందరు తమ దేహాల్ని మరణానంతరం అత్యంత శీతల ప్రదేశాల్లో – లిక్విడ్ నైట్రోజన్ (Liquid Nitrogen)తో చేయబడిన శవపేటికల్లో భద్రపరుచుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ తరహా విజ్ఞానాన్ని శాస్త్రజ్ఞులు ఖండిస్తున్నారు. 'వాళ్లు మాంసాన్ని నిలువ చేస్తున్నారు. బతికున్న కణాల్ని కాదు' అన్నాడు డాక్టర్ డేవిడ్ పెగ్.

మొట్టమొదటి క్రయోనిక్ సస్పెన్షన్ 1966లో ఒక మహిళకు చేసారు. తరువాత బంధువులు మనసు మార్చుకుని సాంప్రదాయ పద్ధతులతో ఖననం గావించారు. 1967లో జేమ్స్ బెడ్‌ఫోర్డ్ అనే మానసిక శాస్త్ర ఉపాధ్యాయుడు తన దేహాన్ని శీతల స్థితిలో ఉంచేందుకు రాబర్ట్ నెల్సన్ అనే టెలివిజన్ మెకానిక్, క్రయొనిక్ సొసైటి ఆఫ్ కాలిఫోర్నియాతో ఒప్పందం చేసుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందుల వల్ల రాబర్ట్ నెల్సన్ యొక్క ఇతర క్లయింట్ల శవాలు నిర్లక్ష్యపరచబడగా ఓ జర్నలిస్టు చొరవతో గుట్టు బయటపడి, నానా గొడవా జరిగి కోర్టు తొమ్మిది లక్షల డాలర్లను నెల్సన్ ఆ క్లయింట్ల బంధువులకు ఇచ్చేలా తీర్పుచెప్పింది. అయితే అంతకుముందే బెడ్‌ఫోర్డ్ దేహాన్ని వేరే క్రయోనిక్ సొసైటికి తరలించడం వల్ల అతడి దేహం ఇంకా శీతల స్థితిలోనే చెక్కుచెదరకుండా ఉండింది.

ఎవరైనా వ్యక్తి తన దేహాన్ని మరణానంతరం శీతల స్థితిలో ఉంచాలనుకుంటే న్యాయపరమైన, ఆర్థికపరమైన లావాదేవీలను పూర్తిచేసి Alcor Life

extension foundation లాంటి సంస్థలతో ఒప్పందం చేసుకోవాలి. వ్యక్తి మరణించాడని వైద్యులు ధృవీకరించాక ఆ కంపెనీవాళ్ల Emergency Response System అంబులెన్సు, మొబైల్ అడ్వాన్స్డ్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌ల ద్వారా వ్యక్తి దేహంలోని రక్తనాళాల్లోకి కణాల్ని సంరక్షించే ద్రవాల్ని, ఏంటికొయాగ్యులెంట్స్‌ను ఎక్కించి సంస్థ యొక్క ప్రత్యేక ప్రదేశాల్లో – $196^0$C వద్ద లిక్విడ్ నైట్రోజన్‌తో భద్రపరుస్తారు.

రాబర్ట్ ఎట్టింగర్ (Robert Ettinger) తన పుస్తకం The prospect of Immortality లోఈ Cryonic Preservation గురించి ప్రతిపాదించాడు. అతడు ఉదాహరణగా అనేకసార్లు చచ్చి బదికిన సోవియట్ ప్రొఫెసర్ (కారు ప్రమాదంలో అనేక గాయాలపాలైనాడు) గురించి వివరిస్తాడు.

మనుషులందరూ బదికితే మానవ సంబంధాల మాటేమిటి? వావి వరుసలేమౌతాయి. మృత్యువు ద్వారా మోక్షమనే మతభావనకు విరుద్ధం కాదా? ఇటువంటి సవాలక్ష సందేహాలున్నా సైన్సు అభివృద్ధి చెందుతూ అనేక సమాధానాలతో పాటు ప్రశ్నలనూ సంధిస్తూనే ఉన్నది.

✧✧✧✧✧



# 11. నన్ను మరచి పోవద్దు!

పదమూడెకరాల స్థలం, ఇరవై అయిదు లక్షల గ్రానైట్, శాండ్ స్టోన్ రాళ్లు, ఒక్కోటీ సుమారు 250 కిలోల బరువున్నవి, నాలుగు వందల అరవై అడుగుల ఎత్తు నిర్మాణం. ఈ బృహత్ శిలానిర్మాణం లోలోపల ఉన్నది ఓ చిన్నగది. దానిలో గ్రానైట్ తొట్టి– సార్కొఫేగస్. మహారాజు 'కెయాప్స్' (Cheaops) ఉండాల్సిన చోటు ఖాళీగా ఉన్నది. గీజా పిరమిడ్‌లో శాశ్వత జీవనాన్ని పొందు దామనుకున్న రాజు ఆశ నెరవేరకపోయినా ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటైన ఈజిప్టు గీజా పిరమిడ్ ద్వారా గత అయిదువేల ఏళ్లుగా 'కేయోప్స్' రాజును ప్రపంచం గుర్తు తెచ్చుకుంటూనే ఉన్నది.

చైనా రాజధానిని నాన్‌జింగ్ (Nanjing) నుంచి బీజింగ్ (Beijing)కు మార్చిన మూడవ మింగ్ చక్రవర్తి (1402–1424) యోంగ్లి (Yongle) సమాధి బీజింగ్‌కు 50 కిలోమీటర్ల దూరాన ఫెంగ్‌ష్యూ (చైనావాస్తు) ప్రకారం, చక్రవర్తి బతికి ఉన్నపుడే నిర్మాణం చేయబడింది. నూట ఇరవై చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో (ముప్పై ఎకరాలు) ఛాంగ్‌లింగ్‌లో ఉన్న యోంగ్లి సమాధిలో రాజు, రాణి శవాలు ఖననం చేయబడినాయి. పదముగ్గురు మింగ్ రాజుల సమాధులు ఆ ప్రదేశంలోనే ఉన్నాయి. ఆ సమాధుల్నిముద్దుకున్న తియాన్‌షు పర్వతం వద్ద డింగ్‌లింగ్ (Tomb of stability) సమాధి తవ్వకాలలో వాన్‌లి (Wanli) చక్రవర్తి, అతని రాణుల అస్థిపంజరాలు, పెద్దఎత్తున సిల్క్ వస్త్రాలు, పింగాణి, చెక్క వస్తువులు బయటపడినా, సాంస్కృతిక విప్లవకాలంలో రెడ్‌గార్డ్స్ చేతుల్లో అవన్నీ భస్మీపటలమైనాయి.

యోంగ్లి చక్రవర్తి అసలుపేరు ఝుడి (Zhu Di), అతని భార్యపేరు క్జు (Xu). అతడి సమాధి వద్ద మొదట కనిపించే పెద్ద భవనం దాదాపు అరఎకరం విస్తీర్ణంలో చలువరాయి, చందనపు చెక్కలతో నిర్మించబడింది. లోపల చక్రవర్తి రాగి (Copper) విగ్రహం గంభీరంగా కూర్చుని కనిపిస్తుంది. భవనం వెనకపక్క ఉన్న ఏడు మీటర్ల స్థలంలో రాజు రాణుల ఖననం చేయబడిన ప్రదేశాన్ని 'ట్రెజర్ సిటీ' అంటారు. బీజింగ్‌లో రాజప్రాసాదాల, మింగ్ సమాధుల నిర్మాతగా అతడు చరిత్రలో నిలిచిపోయాడు.

తన అందంతో ప్రెసిడెంట్ కెన్నెడీనే వశపరచుకున్న మార్లిన్‌మన్రో (1926–1962) సమాధి వద్దకు ఆమెతో 274 రోజులే కాపురం చేసిన ఆమె

మాజీ భర్త జోడి మాగ్గియో ఇరవై ఏళ్లపాటు వారానికి మూడుసార్లు ఎర్రగులాబీలు తెచ్చి అలంకరించేవాడట. అతడు మరల వివాహం చేసుకోలేదు. ఇప్పుడా సమాధి వున్న ప్రదేశం విలువ 4.6 మిలియన్ డాలర్లు.

పాప్ సంగీతపు రారాజు మైఖెల్ జాక్సన్ (1958–2009), విశ్వవిఖ్యాత రచయిత విలియం షేక్స్పియర్ (1564–1616), ఎల్విస్‌ప్రిస్లీ–రాక్ అండ్ రోల్ యువరాజు (1935–1977), జిమ్ మారిసన్ (రాక్‌సింగర్) (1943–1971); ప్రిన్సెస్ డయానా (1961–1997); ఫ్రాంక్ సినాట్రా గాయకుడు (1915–1998), రచయిత మార్క్‌ట్వైన్ (1835–1910), నటుడు బ్రూస్‌లి (1940–1973); రచయిత ఆస్కార్‌వైల్డ్ (1854–1900)ల సమాధులు ఈనాటికీ అభిమానులతో సందర్శింపబడి వారి కీర్తిని అజరామరం చేస్తున్నాయి.

లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ వద్ద ఉన్న The Collegiate Church of Saint Peter కు మరోపేరు వెస్ట్‌మినిస్టర్ ఎబ్బె (West Minister Abbey). ఈ చర్చిలోనే ఇంగ్లీషు రాజుల కిరీటధారణ, ఖననం లాంటి కార్యక్రమాలు చేస్తారు. అంతమంది రాజప్రముఖుల సమాధుల మధ్య ఊరూపేరు తెలియని సైనికుడి సమాధి ఉన్నది. నవంబరు 11, 1920 నాడు మొదటి ప్రపంచయుద్ధంలో మరణించిన ఓ అజ్ఞాత సైనికుడి శవాన్ని ఈ వెస్ట్‌మినిస్టర్ ఎబ్బెలో ఖననం గావించారు. అదేరోజున ఫ్రాన్సులో Arc de trimomphe లో అజ్ఞాత ఫ్రెంచి సైనికుడిని ఖననం చేసి గౌరవించారు.

ప్రపంచ ప్రఖ్యాత సమాధుల్లో ముఖ్యమైనవి– ఆగ్రాలోని తాజ్‌మహల్ (1632–1653); చైనాలోని టెర్రకొట్టా వీరులున్న క్విన్‌వంశపు చక్రవర్తి సమాధి (221–203 B.C.); ఉజ్బెకిస్తాన్‌లోని షా.ఇ. జిందా (The living king) కుసమ్ ఇబిన్ అబ్బాస్ సమాధి; అజర్‌బైజాన్‌లోని షిర్వన్‌షా మౌసోలియం; ఇరాక్–కర్బాలాలోని ఇమామ్ హుస్సేన్ ఇబిన్ ఆలి దర్గా, పాకిస్తాన్–లాహోర్‌లోని జహంగీర్ సమాధి; ఇటలీలోని హడ్రియన్ సమాధి; ఢిల్లీలోని హుమాయూన్ సమాధి; రష్యా–మాస్కోలోని లెనిన్ మౌసోలియం; ఇరాన్– పసర్‌గాడెలోని పర్షియన్ చక్రవర్తి సైరస్ సమాధి – ఇవన్నీ ఆయా వ్యక్తుల ప్రాభవాన్ని మనకు గుర్తుకు తెస్తాయి.

కొంతమంది సమాధుల్ని విచిత్ర ఆకారాలతో నిర్మించి తమను తదుపరి తరంవాళ్లు గుర్తుంచుకునేలా ప్రయాసపడ్డారు. కొందరు ప్రముఖ వ్యక్తుల, సాధు సంతుల దగ్గర్లో తమ సమాధులు ఉండేలా జాగ్రత్త పడతారు.

రోమన్ల కాలంలో నగరానికి దగ్గర్లో పెద్దగా ఉండేట్లు రహదారి పక్కన సమాధులు నిర్మించుకునేవారు. క్రిస్టియానిటీ అభివృద్ధి చెందాక చర్చిలో, చుట్టు పక్కలా ఖననం చేయబడడానికి క్రైస్తవులు మక్కువ చూపసాగినారు. సాధారణంగా ప్రముఖ మత ప్రవక్తలకు, మతాధిపతులకు ఇచ్చే అవకాశం తొలి క్రైస్తవ చక్రవర్తి- Constantine the great కి దక్కింది. క్రీస్తుశకం 274-337 కాలంలో జీవించిన కాన్స్టాంటైన్ చక్రవర్తి దేహాన్ని పవిత్ర అపొస్తలుల చర్చిలో ఖననం చేసారు. ఆ తరువాతనే చర్చి ఆవరణలో ఖననం చేయడమనేది గౌరవంగా గాక హక్కుగా రూపు సంతరించుకున్నది. దేవుడి మాన్యం (God's Acre)గా ఈ ప్రదేశాలను పిలిచేవారు.

క్రమేపీ డిమాండు పెరగడంతో మతాధికారులకు, చర్చికి విరాళాలు ఇచ్చినవారికి ప్రాధాన్యత పెరిగింది. చర్చిలో కూడ తూర్పువేపు, పూజాపీఠానికి ఎంత దగ్గర ఉంటే అంత డిమాండు. ఎందుకంటే అంతిమ తీర్పు దినం నాడు సూర్యుణ్ణి వెంటనే చూడవచ్చునని. అంతేకాక కాళ్లు తూర్పువేపు తల పడమట వేపు ఉంటే ఇంకా మంచిది. దక్షిణం వేపు కాస్త పలుకుబడి తక్కువ ఉన్నవాళ్లని, ఉత్తరం వేపు (సాతాను వాకిలి) మృతశిశువుల్ని, అక్రమ సంతానాన్ని, అపరిచితుల్ని ఖననం చేసేవారు. పవిత్ర చర్చి లోగిలిలో కూడా అనేక తేడాలు! ఆత్మహత్య చేసుకున్నవారిని చర్చి ఆవరణలో ఉత్తరభాగాన తల, కాళ్లు- దక్షిణాలకు ఉండేట్లు పాతిపెట్టేవారు. ఆత్మహత్య అంటే అంతలా జనం ఏవగించు కునేవారన్నమాట.

దేవుడి మాన్యంగా (God's Acre) గా పేరు తెచ్చుకున్న చర్చి ఆవరణలో ఖనన యోగ్యమైన స్థలం తగ్గిపోతున్నకొద్దీ కొత్తకొత్త ఉపాయాలు పుట్టుకొచ్చాయి. శవపేటికల్ని దగ్గర దగ్గర పేర్చడం; సమాధుల్లో ఉండే సమయాన్ని కుదించడం, ఇటువంటివి ఎక్కువయ్యేసరికి శాశ్వతంగా, ప్రశాంతంగా సమాధుల్లో నిద్రపోదా మనుకున్నవాళ్లకు ఆశాభంగాలెదురయ్యాయి.

ఇదిలా ఉంటే చర్చి స్మశానాల నుంచి వెలువడే దుర్వాసనతో చుట్టు పక్కల నివసించేవాళ్లు రోగపీడితులు కాసాగినారు. లండన్ క్లెమెంట్ వీధిలో నివసించే ప్రజలకు నాలుగువేపులా చర్చిలు, కబేళాలు ఉండడంతో వారి పరిస్థితి మరింత దయనీయం కాగా 'వాకర్' అనే అతడు తీవ్ర పోరాటాన్ని సాగించాడు.

పారిస్‌లో ఇటువంటి స్థితిని ఎదుర్కొనడానికి చర్చి ఆవరణలలో ఖననాల్ని నిషేధించారు. ఏప్రిల్ 7, 1786 నాడు దాదాపు ఆరు మిలియన్ల

ప్రజల అవశేషాల్ని పెద్ద ఊరేగింపుతో, ప్రార్థనల మధ్య సిమెట్రి ఆఫ్ ఇన్నొసెంట్సు నుంచి నగరం దక్షిణం వేపు వున్న గనుల సొరంగాల్లోకి మార్చారు. నగరానికి వెలుపల నాలుగు స్మశానాల్ని ఏర్పరచి ప్రజల్ని ఆకర్షించేందుకు అనేక ప్రయత్నాలు చేసి చివరకు సఫలీకృతులయ్యారు. చర్చి ఆవరణలో ప్రశాంత నిద్ర పోదామనుకునేవాళ్లకు ఆశాభంగమైనా, ఎక్కువకాలం అక్కడే ఉండేందుకు వీలు కుదరదని తెలిసాక, నష్టాలు అర్థమయ్యాక ప్రజలు వాళ్లంతట వాళ్లే శుభ్రమైన వాతావరణంలో ఉన్న కొత్త స్మశానవాటికల్లో ఖననం చేయబడడానికి అంగీకరించసాగినారు.

పారిస్ నుంచి నేర్చుకున్న పాఠాలను న్యూయార్క్ అమలు జరిపింది. క్రీస్తుశకం 1850 వరకు లండన్ వాతావరణం చర్చి ఆవరణలోని సమాధుల్నుంచి వచ్చే దుర్వాసనలతో కలుషితమై ఉండినది. పీల్చేగాలి, తాగే నీరు కలుషితం కావడంతో ప్రజలలో అలజడి మొదలైంది. రెవరెండ్ హారీజోన్స్ చర్చిలోని నీటి కుళాయికి 'Dead men's broth' అని పేరు పెట్టాడట. ఛార్లెస్ డికెన్స్ అనేవాడట– "ఆ పంపుతో నీళ్లు తోడకండి! క్రింద ఉన్న శవాలు గగ్గోలు పెడతాయి– మమ్మల్ని లాగొద్దు అని". అలా ప్రజలు గొడవ చేసేసరికి బ్రిటన్‌లోనూ కొత్త స్మశాన వాటికలు వెలిసాయి. చర్చి ఆవరణలో ఖననాలు నిషేధించబడ్డాయి. రోజరీ (1819), కెన్సాల్‌గ్రీన్ (1832), హైగేట్ (1839) స్మశాన వాటికలు, క్రమేపీ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 1854లో బ్రూక్‌వుడ్ సిమెట్రి వరకు వెళ్లే రైలు– వాటర్‌లూలో బయల్దేరి బ్రూక్‌వుడ్‌లో ఆగేది. దానిని నెక్రొపొలిస్ రైల్వే (Necropolis) అని పిలిచేవారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో లండన్ టెర్మినల్ ధ్వంసం అయ్యేంత వరకు ఈ రైలుబండి శవపేటికలను తక్కువ రుసుముతో బ్రూక్‌వుడ్ స్మశాన వాటికకు చేర్చేది.

పిరమిడ్లు, పగోడాలు, మౌసొలియంలు, గోరీలు, దర్గాలు, ఆలయాలు, ఆరామాలు ఇవన్నీ మహాపురుషుల జీవన విధానాన్ని అనుసరించడానికి వారిని గుర్తుంచుకోడానికి, వారి అడుగు జాడల్లో నడిస్తే సమాజం సన్మార్గంలో నడుస్తుందనే ఆశయంతో నిర్మించబడినవే. మామూలు వ్యక్తులు కూడ తమ వాళ్లను, తమను తరువాత తరంవాళ్లు మరచిపోకుండా రకరకాల సమాధుల్ని నిర్మించుకున్నారు.

పారిష్ చర్చిలలో 12వ శతాబ్దంలో శవాన్ని ఖననం చేసాక కేవలం 'ఒక నాపరాయి' లేదా చదరపు రాయిని పరిచి దానిపై వివరాలు చెక్కేవారు.

నాలుగు కాళ్లున్న రాతిబల్లలు, ఆ తరువాత మధ్యలో బోలుగా ఉండి అడుగులేని పెట్టెల్లా తొలచబడిన శిలామందసాలు సమాధులపై ఉంచబడినాయి. వీటిపై అయిదు పక్కలా రకరకాల వర్ణనలు, చిత్రాలు చెక్కడానికి వీలు చిక్కింది. సమాధుల వద్ద శిలువల్నుంచడం పంధొమ్మిదవ శతాబ్దం మధ్యలో మొదలయ్యింది.

ప్రాచీన కాలంలో సమాధులపై పెద్దపెద్ద బండరాళ్లను లేదా 'ఒబెలిస్క్'లనబడే రాతిస్తంభాలను, మామూలు శిలాఫలకాల్ని, చిన్నచిన్న పిరమిడ్లను ఉంచేవారు. క్రీ.శ. 1290లో ఎడ్వర్డ్ రాజు భార్య 'ఎలెనార్' చనిపోయినప్పుడు స్కాట్‌వీరులతో పోరాడుతున్న ఎడ్వర్డ్ యుద్ధాన్ని ఆపి వెనుకకు తిరిగి వస్తూ, ఆగిన ప్రతి మజిలీ వద్ద ఆమెకు ఓ స్మృతి చిహ్నాన్ని, పైన శిలువతో సహా నిర్మించాడు. వీటిని 'ఎలెనార్ శిలువలు' అంటారు.

ఫుల్లర్ అనే అతడు చర్చి నిర్మాణానికి సహాయం చేసి తను చనిపోయాక తన సమాధిపై పిరమిడ్ (25 అడుగులు) నిర్మించేందుకు అనుమతి పొందాడు. కట్టిన 24 ఏళ్ల తర్వాత 1834లో మరణించిన అతడి శవాన్ని అతడి కోరిక ప్రకారం ఆ సమాధిలోనే ఖననం చేసారు.

మక్కాలోకి మారువేషంలో వెళ్లిన తొలి శ్వేతజాతీయుడు, సాహసికుడు, క్రిమియన్ యుద్ధంలో టర్క్‌ల అశ్వికదళ నాయకుడు, నైలునది పుట్టుక కనుక్కోడానికి ప్రయత్నించినవాడు అయిన సర్ రిఛర్డ్ బర్టన్ –ఇతడు కామసూత్ర, The perfumed garden, అరేబియన్ నైట్స్‌ను అనువాదం చేసినవాడు. రిఛర్డ్ బర్టన్, ఇతడి భార్య ఇసోబెల్‌ల సమాధి పెద్ద 'Stone tent'లా ఉంటుంది. ఈ సమాధి లండన్‌లోని మార్ట్‌లేక్ వద్దనున్న సెయింట్ మేరీ మాగ్డలీన్ చర్చి ఆవరణలో ఉన్నది.

సర్ జాషువా డాన్వెర్స్ అనే అతడి సమాధి తలవేపు సగభాగం చర్చి ఆవరణలో, కాళ్లవేపు భాగం చర్చి బయట ఉండేట్లు సమాధిపై చర్చిగోడ ఉన్నది. ఎందుకంటే అతడు తనకిష్టమైన కుక్క శవాన్ని అతని కాళ్లవద్ద ఖననం చేసారు. చర్చి ఆవరణలో కుక్కలను ఖననం చేసే వీలులేదు కనుక.

బెన్‌జాన్సన్ అనే కవి (1572–1637) మొదటి ఛార్లెస్ రాజును తనను వెస్ట్‌మినిస్టర్ ఎబ్బెలో పద్దెనిమిది అంగుళాల స్థలంలో పాతిపెట్టమని కోరాడు. నిట్టనిలువుగా పాతిపెట్టబడిన కవి ఇతగాడొక్కడేనేమో!

మేజర్ లాబెల్లియరి అనే ఫ్రెంచి సైనికుడు; రిచర్డ్ హల్ అనే అశ్వికుడు తన గుర్రంతో సహా తలకిందులుగా పాతిపెట్టించుకున్నాడు. ఎందుకంటే అంతిమ తీర్పు రోజున ప్రపంచం తల్లకిందులయితే తాము సరిగా నేలపై ఉంటామనే విశ్వాసంతో.

విలియం ఎల్ట్రిన్ అనేవాడు తనని చర్చిగోడలో పాతిపెట్టించుకున్నాడు. అతగాడుతనను సైతాను విధేయుడిగా నమ్ముకుని మరణానంతరం సైతాను దళంలో చేరాలంటే చర్చిగోడలో ఉంటే సాధ్యపడుతుందని నమ్మాడు.

మరణించినవారిని మరచిపోకుండా నిర్మించిన మైనపు శిల్పాలు, శిలారూపాలు, లోహ విగ్రహాలు, దారుశిల్పాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవి, డెత్‌మాస్కులు (మృత్యు ముసుగులు) ఇవన్నీ 'నన్ను మరచిపోవద్దు సుమా!' అని వాళ్లంటున్నట్లు మనకు కనిపిస్తాయి.

✧✧✧✧✧



# 12. నీవు లేవు కాని నీ మాట వుంది!

మహావ్యక్తుల ఆఖరి మాటలకు ఓ పవిత్రత ఉంది. ఓ ప్రత్యేకత ఉంది. అయితే 'ఆయన ఆమాట అన్నాడు ఆఖరి క్షణాల్లో' అని ఆ వ్యక్తి చుట్టూ ఉన్నవాళ్లు చెప్పిన మాటలు ఒక్కోసారి మార్పుచేర్పులకు లోనవడం మనకు తెలిసిందే. ఆఖరి మాటలు కూడ చనిపోతున్న వ్యక్తికి పక్కనే ఉన్నవాళ్లతో ఉన్న సంబంధ బాంధవ్యాలను బట్టీ మారుతుంటాయి. మరణశయ్య పైనున్న వాళ్ల మాటల్లో నిరాడంబరత, దేశభక్తి, హాస్యం, ఆత్మవిమర్శ, ఒక్కోసారి గందరగోళం ధ్వనిస్తాయి.

గొప్పవాళ్ల ఆఖరి మాటల్లానే, ఆఖరి మాటల వల్ల గొప్పవాళ్లయిన వాళ్లూ ఉన్నారు. అయితే ఎప్పుడు చచ్చిపోతామనేది ఖచ్చితంగా తెలిసేది ఆత్మహత్య చేసుకోబోతున్న వాళ్లకూ, మరణదండన విధించబడిన వాళ్లకే కదా! ఎక్కువ మంది చనిపోయేప్పుడు మాటా పలుకూ లేకుండానో చిన్న శబ్దంతోనో, గురక చప్పుడుతోనో అస్తమిస్తారు. అయినా ఈనాటి ICCU లు వచ్చాక అన్ని రంధ్రాల్లోనూ ట్యూబులుండడంతో ఆఖరి మాటలు దాదాపు కరవైపోయాయి. ఊరుకాని ఊళ్లో మరణిస్తే, ఆఖరి మాటలు మాట్లాడినా అర్థం చేసుకునే వాళ్లుండొద్దూ! 1955లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అమెరికాలో మరణించినప్పుడు ఆయన చుట్టుపక్కల ఉన్నవాళ్లకు అతను జర్మనీభాషలో పలికిన ఆఖరి మాటలు అర్థం కాలేదు.

ఇరవై నాలుగేళ్ల వయసులోనే బ్రిటన్ ప్రధానమంత్రి అయిన విలియం పిట్ (1759-1806)- ఆఖరి క్షణాల్లో 'Oh my country! How I love my country!' అని అన్నాడని కొందరంటే, మరికొందరు అతడు- 'I think I could eat one of Bellamy's Veal pies' అన్నాడని చెబుతారు.

జార్జి చక్రవర్తి (1865-1936)- 'How is the empire?' అన్నాడని కొందరంటే- 'Bugger Bognor' అన్నాడని మరికొందరంటారు.

జీసస్ ఆఖరిమాటల గురించి కూడ భిన్నాభిప్రాయాలున్నాయి. సెయింట్ మార్క్ చెప్పినది- 'My God, My God, Why hast thou forsaken me' అన్నాడని; సెయింట్ ల్యూక్ చెప్పినది- 'Father, into thy hands I commend my spirit' అని; సెయింట్ జాన్ చెప్పినది- 'It is finished'.

ఎక్కువమంది ఆఖరిమాట- 'The end is nearer' చావు దగ్గర పడింది- అని. లార్డ్‌బైరన్ (1824)- Now I shall go to sleep; కారల్ వెబర్ (1824)-

Now let me sleep (నన్ను నిద్రపోనివ్వండి); విలియం హడ్సన్ (1922)– గుడ్‌బై Good Bye– లాంటివి.

ఆలివర్ గోల్డ్‌స్మిత్‌ను 'మనస్సు ప్రశాంతంగా ఉందా?' అని అడిగితే– 'లేదు' అని సమాధానమిచ్చాడట. హోప్‌కిన్స్ అనే రచయిత 'నాకు చాలా సంతోషంగా ఉంది. I am so happy అన్నాడు. విలియం హంటర్, నీరసంగా ఉన్నా– 'నాకు కలం పట్టుకునే శక్తి ఉంటే ఇప్పుడు చనిపోవడం అంటే ఎంత హాయిగా ఉంటుందో రాసేవాడిని– అన్నాడట. సోమర్‌సెట్ మామ్ 1965లో మరణించాడు. 'చచ్చిపోవడమంత బోరు జీవితంలో మరొహటి లేదు అంచేత అటువంటి పని పెట్టుకోకండి' అని సలహా ఇచ్చాడు. విట్టన్ స్ట్రాచే అనే అతడు 'ఇదా చావంటే! దీంట్లో ఏం థ్రిల్ లేదు' అనేసాడు.

కొంతమంది దేవుడి పేర్లు తలుస్తారు. క్రిస్టఫర్ కొలంబస్– In to thy hands, O Lord, I commit my spirit – 1506లో మరణించేప్పుడు అన్నాడంటారు. రోమన్ చక్రవర్తి వెస్టాసియన్ (AD 79) - Dear me, I must be turning to a God - అని కన్నుమూసాట్ట! దేవుడిని నమ్మిన జోసెఫ్ ఎడిసన్– ఎంత ప్రశాంతత క్రిస్టియన్‌కు చనిపోవడంలో– అంటే, హేతువాది వోల్టేర్– వెలుగుతున్న కొవ్వొత్తి వంకచూస్తూ 'The flames already!' అన్నాడట.

రాజులు, రాజకీయ నాయకులు, సైనికులు అంత్య ఘడియల్లో కూడా దేశభక్తిని ప్రవచిస్తారు. అయిదవ జార్జి ప్రభువు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రస్తావించగా, పిట్– ఇంగ్లాండ్ గురించి; పియర్రి లావెల్– ఫ్రాన్సు గురించి; నెపోలియన్–ఫ్రాన్సు, సైన్యం, జోసెఫిన్ గురించి, వాన్ రిబ్బెన్‌ట్రాస్– దేవుడు జర్మనీని రక్షించాలని కోరుతూ ఆఖరి శ్వాస తీసుకున్నారు.

హంసలా అద్భుతంగా నృత్యం చేసే అన్నా పావ్లొవా (1931) చనిపోయేప్పుడు 'నా కాస్ట్యూమ్ రడీ చేయండి' అన్నదట. స్టాన్ లారెల్ (లారెల్, హార్డీలలో ఒకతను) (1965) ఎలాఉంది? అని నర్సు అడిగితే– 'దీనికంటె స్కైయింగ్ బాగుంటుంది' అన్నాడు. మీకు స్కైయింగ్ వచ్చా? అని అడిగింది నర్సు. 'రాదు కానీ, ఈ అవస్థకంటే అదే మెరుగు' అన్నాట్ట ఆ హాస్యనటుడు.

W.C. ఫీల్డ్స్ అనే సిన్మానటుడు కూడా అంతే! 1946లో చనిపోయేప్పుడు 'దీనికంటే ఫిలడెల్ఫియా నయం' అన్నాడు. అతడికి ఫిలడెల్ఫియా అంటే అంత అయిష్టం. ఆస్కార్‌వైల్డ్ (1900)– 'ఈ Wallpaper అన్నా పోవాలి నేనన్నా పోవాలి' అంటే, థామస్ హుడ్ (1845) కాలికి పట్టీ వేస్తుంటే– 'ఆ పట్టీకి సరిపడా కండలేదు సుమా!' అన్నాడు.

జనరల్ సెడ్జ్‌విక్ అనే అమెరికన్ సివిల్ వార్ కమాండర్ (1864) పారాపెట్ మీంచి తొంగిచూస్తూ– 'వాళ్లు ఇంత దూరంలో ఏనుగును కూడా చంప....'' అంటుండగానే గుండు దెబ్బ తగిలి మరణించాడు.

మరణశిక్ష విధించబడిన వాడు ఉరికంబమెక్కబోతూ ఉరితాడు తగిలిస్తుంటే– 'Are you sure it is safe?' అన్నాట్ట విలియం పామర్. ఫైరింగ్ స్క్వాడ్ రెడీగా ఉంది నీ ఆఖరి కోరిక చెప్పుకో అంటే– Bullet proof vest ఇవ్వండి – అన్నాడు జేమ్స్ రోడ్జర్స్; ఛెరొకిబిల్‌ను ఏమైనా చెబుతావా అంటే– 'No. I came here to die, not to make speech' అన్నాడు.

ఆఖరిక్షణాల్లో పసిపాపల్లా ముద్దముద్దగా, ముద్దుముద్దుగా మాట్లాడ్తారు కొందరు. సర్ విలియం ఆస్లర్– Nighty - night a darling అన్నాడు. హోరేస్ విలియంను నీపేరేమిటి సర్! అని నర్సు అడిగితే హోరేస్ విలియమ్స్ అని పసిపాప గొంతుతో పలికాడట.

✧✧✧✧✧



# 13. అంతిమ సంస్కారం

జీవితపు వేరువేరు దశల్ని మరింత శోభాయమానంగా, సత్యమార్గంలో నడిపించి బాహ్యాంతర స్థితుల్ని ప్రక్షాళన చేసేవి సంస్కారాలు. వ్యక్తిత్వాన్ని అలంకరించేది సంస్కారమన్నాడు పాణిని. సంస్కారం వ్యక్తిని ఋషిగా మారుస్తుంది. హిందువుల జీవన విధానంలో పదహారు సంస్కారాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

వ్యాస స్మృతి ప్రకారం– ఈ పదహారు సంస్కారాలు ముఖ్యమైనవి.

1) గర్భాదానం – మంచి సంతానం కోసం
2) పుంసవనం – మూడు నెలల గర్భిణి క్షేమం కోసం
3) సీమంతం – కాన్పుకు ఒక నెల ముందు, లేక అయిదవ నెల తరువాత
4) జాతకర్మ – శిశువు జన్మించగానే
5) నామకర్మ – శిశువు జన్మించిన పదకొండు రోజుల తరువాత
6) నిష్క్రమణ – శిశువు జన్మించిన నాలుగు నెలలకు బయటకు తీసుకువెళ్లడం
7) అన్నప్రాశన – ఆరోనెలలో ఘనాహారాన్నివ్వడం
8) చూడాకర్మ – వెంట్రుకలు కత్తిరించడం
9) కర్ణవేధి – చెవులు కుట్టించుట
10) ఉపనయనం – జంధ్యం తొడగడం
11) వేదారంభం – చదువు ప్రారంభం
12) సమవర్తనం – వేదవిద్యాపూర్తి
13) వివాహం – గృహస్థాశ్రమ స్వీకారం
14) అవస్థ్యధనం – అగ్ని ప్రదక్షణం
15) త్రేతాగ్ని సంగ్రహం – గృహస్థ జీవితం
16) అంత్యేష్ఠి – అంతిమ సంస్కారం.

ప్రాచీన హిందువులు, జోరాస్ట్రియన్ మతావలంబకులు అగ్ని ఆరాధకులు. ఋగ్వేదం– 'అగ్నిమీళే పురోహితమ్' – అన్న శ్లోకంతో ప్రారంభ మవుతుంది. అగ్నిలో అనేక రకాలున్నవి. ముఖ్యమైవి–

1) గార్హపత్యాగ్ని – గృహాలలో ఉండేది – తండ్రి
2) ఆవహనీయాగ్ని – పూజలు, యజ్ఞాలలో వెలుగొందేది – గురువు

3) దక్షిణాగ్ని – సహజసిద్ధమైన అగ్ని – తల్లి

ఇవి త్రేతాగ్నులు. హిందూ మతస్థుల పూజా పునస్కారాలలో, సంస్కారాలలో అగ్నిదే పెద్దపీఠం. దేవతలకు మనుషులకు మధ్య హవ్యావాహనుడిగా అగ్ని ప్రసిద్ధికెక్కినాడు.

జీవితంలో అన్ని ఘట్టాలు గడిచాక అంతిమ ఘట్టం వస్తుంది. 'జాతస్యహి మరణం ధ్రువం' – పుట్టినవాడు గిట్టక తప్పదు కదా! వ్యక్తి మరణశయ్యపై ఉన్నపుడు అతనికి శాంతివాక్యాలు వినిపించడం, అతనిపై ఆధారపడినవాళ్లకు ఆసరాను ఇస్తే వ్యక్తి సంతృప్తిగా కన్నుమూస్తాడు.

**"రోదనాపేక్షయ కుర్యత్ సువ్యదస్థం మృతాత్మనః**
**సమాశ్రిత సమర్ధనం పుత్ర దీనాం సమాచరేతు**
**కళ్యాణమయ కర్మాభిః మృతాత్మనః సుశాంతయే**
**తచ్ఛేషోత్తర దాయిత్వం విదచ్ఛేద శుభేచ్ఛయా"**

మరణశయ్యపై నున్న వ్యక్తి దగ్గర్లో మహామృత్యుంజయ మంత్రాన్ని, గాయత్రీ మంత్రాన్ని జపించాలి. గీత, రామాయణాల్ని చదివి మనస్సును శాంతపరచాలి.

చనిపోయినాక దేహాన్ని నేలపై తల ఉత్తర దిక్కువేపు ఉండేట్లు పరుండ బెట్టాలి. కొన్నిచోట్ల ముఖాగ్నిని వెలిగిస్తారు. కొందరు కళ్లలో, ముక్కులో, నాసారంధ్రాలలో నేతిచుక్కలు పోస్తారు. ఈ చర్యలు ఒక్కోసారి కొన ఊపిరితో ఉన్నవారిని బతికిస్తాయని మన విశ్వాసం.

శవయాత్ర సాయంకాలానికల్లా ముగిస్తే మంచిది. కొత్తగా నరికిన వెదురు బొంగులతో 'పాడె'ని నిర్మించి, చెరువుకట్ట దగ్గరో, నదీ తీరానో చితిని ఏర్పరుస్తారు.

శవాన్ని స్నానం చేయించి, నూతన వస్త్రాలు అలంకరించి పాడెపై ఉంచి శవయాత్రను మంత్రోచ్చారణలతో సాగిస్తారు. దారిలో అయిదు లేదా ఏడుసార్లు భుజాలపై నుంచి పాడెను దించి నేలపై ఉంచి మృతుడ్ని పిలుస్తారు. వీటినే 'దింపుడు కల్లాలు' అంటారు. నాలుగు దిక్కులకు మంత్రోచితంగా నమస్కరించి, చితి ఉన్న దగ్గర 'ఓం' అక్షరానికి చుట్టూరా నాలుగు స్తంభాలను నాటుతారు. మధ్యలో చితి నేర్పరచి, స్తంభాలను కలిపేలా చిన్న కాలువలను తవ్వుతారు. నాలుగు దిగ్దేవతలను ప్రార్థిస్తారు.

చితిపై శవాన్నుంచి ఈ మంత్రం చదువుతారు.

**ఓం అగ్నయే నయసుఫథరాయె అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ యు యొధ్యస్మ అయ్యురనమయొ భూయిష్ఠం తె నమ ఉక్తి విదేహం**

శవంపై చందన కట్టెలను, ఇతర కట్టెలను ఉంచి, చితి శిరస్సువేపు పంచభూత సంస్కారాన్ని నిర్వహించి కాటికాపరి నుంచి క్రవ్యదయాగ్నిని తీసుకుని– 'ఓం క్రవ్యదయానమః' –అంటూ సాధారణంగా పెద్ద కుమారుడు అగ్నిని రగిలిస్తాడు. చితి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తాడు. అతని భుజంపై ఉన్న ఘటం (కుండ)లోని రంధ్రం నుంచి నీరు ధారగా పడుతూ ఉంటుంది.

శవదహనంలో ఆఖరి క్రియ 'కపాలక్రియ' – మస్తకచ్ఛేదనం. కపాలాన్ని పగలగొట్టి మరింత నేయి, తైలం పోసి అగ్నిని రగిలిస్తారు. **'అసౌ స్వర్గాయ లోకాయ స్వాహా జ్వలతు పావకే'** – అని మంత్రం పఠిస్తారు.

దహనానంతరం తెల్లవారుననే అస్థికలను బూడిదను ఏరి కలశంలో ఉంచి పవిత్ర దినం నాడు నదీ జలాల్లో కలుపుతారు

✧✧✧✧✧.



# 14. దహనం

క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాలనాటికే గ్రీసుదేశంలో మరణించిన వారి దేహాలను 'దహనం' చేసే ఆచారం ఉన్నట్లు తెలుస్తోంది. దూరదేశాల్లో మరణించిన గ్రీకు సైనికుల దేహాల్ని గ్రీసుదేశానికి తరలించడం కన్నా దహనం చేయడం ఉచితమని వాళ్లు భావించి ఉంటారు. అగ్ని దేహాలను శుద్ధిపరచి ఆత్మను విడుదల చేస్తుందనేది వారి నమ్మకం. చిన్న పిల్లలను, ఆత్మహత్య చేసుకున్న వాళ్లను ఖననం చేసేవారు.

చిన్న పిల్లలను పాతిపెట్టే ఆచారం హిందూ సాంప్రదాయంలోనూ ఉండడం విశేషం. శైవులు ఖననాన్ని, వైష్ణవులు దహనాన్ని అంత్యక్రియగా పాటిస్తారు. "శైవ వైష్ణవులకు భేదాలూ, గొడవలెందుకయ్యా! వైష్ణవుడు కాలి బూడిదవుతాడు. బూడిదను శైవులు భస్మధారణ చేస్తారు. శైవుడు ఖననం చేయబడి మట్టిలో కలుస్తాడు. వైష్ణవులు మట్టిని తిరుచూర్ణంగా శరీరంపై నామాలు పెట్టుకుంటారు. మరెందుకు కొట్లాడుకుంటారు? పరతత్త్వమెరగండి నాయనలారా!" అన్నాడు కవి.

పిడుగుపాటుతో మరణించిన వాళ్లను గ్రీకులు పాతిపెట్టేవారు. దేవుడు కాల్చినాక మరల దహనమెందుకు అనుకుని ఉండవచ్చు. వాళ్ల దేవుడు జ్యూస్ (Zeus) ఆయుధం పిడుగు. (ఇంద్రుడు తన వజ్రాయుధంతో పిడుగులు కురిపిస్తాడు.) రోమన్లలో డబ్బున్నవారు దహనక్రియలు కావిస్తారు. రోమన్ ప్రభువు నీరో తన భార్య పొప్పాయియా (Poppaea) రాణిని గర్భిణి అని కనికరం లేకుండా తన్నాడని, దానితో ఆమె మరణించగా ఆమెను దహనం చేయకుండా ఖననం చేసారని 'టాసిటస్' వ్రాసాడు. ఈ 'నీరో' చివరకు ఆత్మహత్య చేసుకుని కుక్కచావు చావడం మనకు తెలిసిందే! కొన్నిచోట్ల Os resectum - శరీరంలోని బొటనవేలుగాని అటువంటి చిన్న భాగాన్ని వేరుచేసి దాన్ని పాతిపెట్టి మిగతా దేహాన్ని దహనం చేసేవారు. దహనం చేయగా మిగిలిన బూడిదను, అస్థికలను పాత్రలలో, కలశాలలో భద్రపరచేవారు.

యూదులు మృతదేహాలను ఖననం చేసేవారు. నేరస్థులను మాత్రం దహనం చేసేవారు. పాత నిబంధన ప్రకారం– 'సాల్', అతడి కుమారుల దేహాలను ఫిలిస్తీనులు మరీ ముక్కలు చేయకుండా దహనం చేసి, అస్థికలను పాతిపెట్టారని

తెలుస్తోంది. ఇదొక్కటే పాత నిబంధనలో శవాల్ని దహనం చేసినట్లు కనిపించే ఘట్టం.

క్రిస్టియన్లు పునరుజ్జీవనాన్ని నమ్ముతారు గనుక వారి దృష్టిలో దహనం అనేది అనాగరిక చర్య. క్రైస్తవ మత వ్యతిరేకులను పనిగట్టుకు మరీ దహనం చేసేవారు. మత విరోధిగా ముద్రవేసి 'జాన్ వైక్లిఫ్' దేహాన్ని ఖననం చేసిన చానా సంవత్సరాల తరువాత వెలికిదీసి దహనం చేసి ఆ బూడిదను స్విఫ్ట్ నదిలో జల్లారు. ఛార్లమాగ్నె ప్రభువు (క్రీ.శ. 789)లో దహనక్రియకు శిక్ష–మరణంగా ఆజ్ఞ జారీచేయడంతో శవాలను దహనం చేయడమనేది యూరప్‌లో నిలిచిపోయింది. 1822లో ప్రఖ్యాత కవి పి.బి. షెల్లీ మెడిట్టేరియన్ సముద్రంలో మునిగిపోగా అతని శవం కుళ్లిపోయిన స్థితిలో తీరానికి కొట్టుకురాగా అప్పటి టుస్కన్ చట్టం ప్రకారం, కొంచెంసేపు ఇసుకలో పాతిపెట్టి తర్వాత దహనం చేసారు. ఈ సంఘటన ఒక వింత కథలా ఉంటుంది. ఎడ్వర్డ్ ట్రిలానీ తన– Recollections of the last days of Shelly and Byron లో ఇలా వివరించాడు–

"బంగారు రంగుతో తళతళలాడుతున్న ఇసుకపైకి షెల్లీ శవాన్ని లాగుతుంటే మాకు మేమే తోడేళ్ల గుంపులా, అడవి కుక్కల్లా ఉన్నామనుకున్నాము. ఆలోచనల్లోకి మళ్లిన బైరన్ నిశ్శబ్దంగా గంభీరంగా కనిపించాడు. పనివాళ్లు చితిని పేరుస్తున్నారు. మేము దుర్వాసనకు దూరంగా నిలబడి ఉన్నవాళ్లం – సుత్తితో కపాలాన్ని బద్దలుగొట్టిన శబ్దానికి ఉలిక్కిపడి అటుచూసాం. వాళ్లు షెల్లీ శరీరంపైన ఉన్న దుస్తుల్ని ఊడబీకి సున్నం పోయడంతో, కుళ్లిన శరీరం నీలపు మరకలతో అసహ్యంగా ఉన్నది. బైరన్ కోరాడు– షెల్లీ కపాలాన్ని తనకివ్వమని. అంతకు ముందు అతని దగ్గర ఓ కపాలపాత్ర ఉండేది. దుర్వాసన భరించలేకో ఏమో బైరన్ వెళ్లిపోయాడు. చితిమంటలలో కాలకుండా ఉన్న గుండెను తీసి నేను బ్రిటన్‌కు ఖననం నిమిత్తం తీసుకెళ్లాను" – ఇది షెల్లీ మరణం, చితిమంటలకు కాలని గుండె కథ.

19వ శతాబ్దం నాటికి స్మశానాలు నిండిపోవడం, అక్కడ ఉన్న దారుణ పరిస్థితులు ప్రజల్లో ఖననంపై ఉన్న అభిప్రాయాల్లో మార్పును తెచ్చాయి. విక్టోరియా రాణి ఆస్థాన వైద్యుడు సర్ హెన్రీ థాంప్సన్ 1874లో Cremation Society of England స్థాపించాడు. దహన వాటిక నిర్మించినా ఎవరూ వాడలేదు. 1882లో కెప్టెన్ హన్‌హామ్ ధైర్యం చేసి తన భార్యను, తల్లిని తన ఎస్టేట్‌లో దహనం చేసినా అతనిపై చర్య తీసుకోకపోవడం, అతడు మరణించినాక అతడి దేహాన్ని దహనం చేయడంతో 'సర్రే' ప్రజల ఆలోచనలో మార్పు వచ్చింది.

1883లో డాక్టర్ విలియం ప్రైస్ అనే మతాధికారి ఎనభైమూడవ ఏట తండ్రి అయ్యాడు. జీసస్ క్రీస్ట్ ప్రైస్ అని పేరు పెట్టబడిన పసిపాప అయిదు నెలల వయసులో మరణించగా అతడు ఆ పాప దేహాన్ని పారఫిన్ పీపాలో ఉంచి దహనం చేయబోగా మంటలను చూసిన గ్రామస్థులు అధికారులకు తెలిపారు. అతడిని అరెస్టు చేసి తరువాత విడుదల చేయడంతో ప్రజలు దహనానికి న్యాయబద్ధత ఉన్నదని గ్రహించారు.

నవీన దహనశాలల్లో శవాన్ని దహనం చేయడానికి దాదాపు ఒకటిన్నర నుంచి రెండు గంటలు పడుతుంది. నూనె, గ్యాస్‌లస్థానే ఎలక్ట్రిక్ క్రెమటోరియంలు ఇప్పుడు పనిచేస్తున్నాయి.

ఇండోనేసియాలోని బాలి దేశంలో దహన సంస్కారం అనేది ఒక పండుగలా జరుపుకుంటారు. అయితే అది ఖర్చుతో కూడిన వ్యవహారం కనుక ధనవంతులకు అందుబాటులో ఉంటుంది. పేదవాళ్లు సామూహిక దహన సంస్కారాలను నిర్వహిస్తారు. శవాన్ని ముందు ఖననం చేసి డబ్బు సరిపడా పోగడినాక శరీరాన్ని ఎముకల్ని బయటకు తీసి ఆర్భాటంగా దహన సంస్కారాన్ని నిర్వహిస్తారు. అదొక ఉత్సవంలా ఉంటుంది. బంధువుకు దహన సంస్కారం చేసామని వాళ్లు గర్వంగా, మెరిసే కళ్లతో చెప్పడం నేను ఆ దేశం వెళ్లినప్పుడు స్వయంగా చూసాను. అక్కడ 93 శాతం మంది హిందూ మతావలంబకులే. ఆ ద్వీపంలో ఎక్కడ చూసినా పితృదేవతల, దేవతలు గుళ్లూగోపురాలు కనిపిస్తాయి. నాలుగు రోడ్ల కూడలిలో ఘటోత్కచుడు, భీమార్జునుల పెద్దపెద్ద విగ్రహాలు, అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న కృష్ణుడు, బృహత్ నిర్మాణంగా చేపట్టిన గరుత్మంతుడిపై విష్ణుమూర్తి విగ్రహం చూపరులను ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి.

సతీసహగమన క్రియ ఒకప్పుడు హిందూదేశంలో చాలా ప్రాచుర్యంలో ఉండేది. భర్తతోపాటు భార్య సహగమనం చేయడం గొప్ప ఆదర్శంగా, సౌశీల్యానికి నిదర్శనంగా భావించేవారు.

పాండురాజుతో సహగమనం చేసిన మాద్రి గురించి భారతంలో వ్రాయబడింది. వసుదేవుని భార్యలు నలుగురు, కృష్ణుని భార్యలు నలుగురు తమతమ భర్తల దేహాలతో సహగమనం చేసారని కొన్ని కథలు చెబుతాయి. ఈ విషయం భాగవతంలో లేదు.

తన తండ్రి దక్షుని యజ్ఞవాటికకు పిలవని పేరంటంగా వెళ్లి తండ్రి తనను నిరాదరించడంతో, వెళ్లవద్దని చెప్పిన భర్త– పరమశివునికి మొహం

చూపించలేక తన కాలి బొటనవ్రేలితో అగ్నిని సృష్టించి ఆ అగ్నిలో భస్మమైన 'సతి' గురించి పురాణాల్లో అద్భుతంగా వర్ణించబడింది. శివుడి ఆగ్రహం, వీరభద్ర జననం, దక్షయజ్ఞం ఘట్టాలు భాగవతంలో ఇతర పురాణాల్లో వర్ణించబడినాయి. ఇలా స్వశరీరాగ్నిలో మరణించడాన్ని Spontaneous Combustion అంటారు.

'అరోచంతు జనయో యోనిం అగ్రె' అన్న పవిత్ర వాక్యాన్ని 'ఆరోచంతు జనయో యోనిం అగ్ని'గా మార్చడంతో– 'స్త్రీలు ముందుగా పూజాపీఠం వద్దకు వెళ్లాలి' అన్న వాక్యం– స్త్రీలు ముందుగా అగ్నిప్రవేశం చేయాలి – అన్నదిగా మారి 'సతీ' సహగమన దురాచారంగా మారిందని Max Muller అభిప్రాయం. ఇతడు Anthropologist.

జోథ్‌పూర్ రాజు అజిత్‌సింగ్ 1718లో చనిపోయి నప్పుడు 64 మంది స్త్రీలు చితినెక్కితే; జయపూర్ మహరాజు 1818లో చనిపోయి నప్పుడు అతడితోపాటు 18 స్త్రీలు, 18 పురుషులు, రాజు గారి గడ్డం గీయడానికి ఆస్థాన క్షురకుడు అగ్నిప్రవేశం చేసారట. పోర్చుగీసు మిషనరీల రిపోర్టు ప్రకారం ఓ దక్షిణ భారతదేశపు రాజు మరణించినపుడు దాదాపు పదకొండు వేల మంది అంతఃపుర స్త్రీలు చితిమంటల్లో చితికిపోయారట.

కొడుకుతో తల్లి చనిపోయిన 'తల్లి సతి', 'సోదరి సతి'లాంటి సంఘటనలూ ఉన్నాయి. 'సతీ' సంఘటనలలో కొన్ని ఐచ్ఛికమైతే ఎక్కువ బలవంతం మీద జరిగేవే! భర్తలు యుద్ధానికి వెళ్లి మరణించారన్న వార్త రాగానే అంతఃపుర స్త్రీలు చితి పేర్చుకుని చనిపోయేవారు. కొందరు శత్రువుల చేతుల్లో పడి అవమానాలపాలు కాలేక అగ్నిప్రవేశం చేసేవారు. కొందరు పిల్లలకు భారం కాలేక భర్తతో, కాటికిపోయి కాలిపోయేవారు.

'సతి'ని నిరాకరించడం కుటుంబ గౌరవానికి భంగంగా భావించిన రోజులవి. మత్తుమందు తాగించో, పాడెకు కట్టో బలవంతంగా చితిలో పడవేసి ఆ అభాగ్యుల కేకలు వినబడకుండా దైవ నామస్మరణ ఉచ్ఛైస్వరాలతో, చుట్టూ మూగిన వారు చేసేవారు.

ఇప్పటికీ గంగా సింధు మైదాన ప్రాంతాల్లో, రాజస్థాన్‌లో అడప దడపా 'సతి' జరిగిన వార్తలు వచ్చి మనసులను కలతబెడ్తుంటాయి. 1829లో రాజా రామమోహన్‌రాయ్, విలియం బెంటిక్‌ల చొరవతో 'సతీ సహగమన నిషేధ చట్టం' భారతదేశంలో అమలులోకి వచ్చి ఆ దురాచారాన్ని చాలావరకు రూపుమాప గలిగింది.

దహనం చేసేప్పుడు వెదురుబొంగుతో కపాలాన్ని పగలగొట్టే ఘట్టాన్ని కపాలక్రియ అంటారు. దాని ద్వారా ఆత్మ కపాలం నుంచి వెలువడి పరమాత్మలో కలుస్తుందని నమ్మకం. (పిండంలోకి పరమాత్మ ఆత్మను కపాలంలోకి ప్రవేశ పెట్టడాన్ని 'విదృతి' అంటారు). కపాలక్రియ ద్వారా ఆత్మను విడుదల చేస్తారన్న మాట.

**'ఇమౌ యునిజ్మి తె వహ్నీ అసునీతయ వోఢవె**
**తాంఖ్యా యమస్య సదనం సమితీశ్చవ గచ్ఛతాత్'**
– అధర్వవేదం 18–2–56

ఓ ఆత్మా! నీ పార్థివ దేహాన్ని అగ్నికి అర్పిస్తున్నాము. ఆ విధంగా రెండు అగ్నులు కలిసి నిన్ను మృత్యులోకాధిపతి యమధర్మరాజు వద్దకు సరైన స్థితిలో తీసుకువెళ్లి నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాయి.

**చతురంభోధి పరీత భూవలయ రక్షాదక్ష చామీకరా**
**యత దండంబు ధరించు నీకరమె, యాహో, యిప్పుడిక్కాటిలో**
**జితిలో గాలుచున్న యీ కొరవి దాల్చెన్; నవ్యమాణిక్య రా**
**జిత నీరాజన కాంతికిన్ బదులు వచ్చెన్ శోచనీయంబుగన్**

అని బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు సత్యహరిశ్చంద్రుని స్థితిని కడు హృదయ విదారకంగా అద్భుతంగా వర్ణించారు. ఆ ప్రదేశమటువంటిది. It is the great leveller. రాజూ పేదలను సమానంగా మార్చే స్థలం. నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా అంటాడు–

**'ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పులలోన కరిగిపోయె**
**యిచ్చోటనే భూములేలు రాజన్యుని యధికారముద్రిక లంతరించె**
**యిచ్చోటనే లేత యిల్లాలి నల్లపూసల సౌరు గంగలో గలసిపోయె**
**యిచ్చోట నెట్టి పేరెన్నికంగనుగొన్న చిత్రలేఖకుని కుంచియ నశించె**

**ఇది పిశాచులతో నిటలేక్షణుండు**
**గజ్జె కదలించి యాడు రంగస్థలంబు**
**ఇది మరణదూత తీక్షమౌ దృష్టులొలయ**
**నవని బాలించు భస్మ సింహాసనంబు'**

✧✧✧✧✧

# 15. నిశ్శబ్ద గోపురాలు
## (Towers of Silence)

అగ్ని ఆరాధకులైన జోరాష్ట్రియన్ మతావలంబీకులు పార్శీలు– ప్రాచీన పర్షియన్ సంతతివారు. వీరు మరణించినవారి దేహాలను నిశ్శబ్ద గోపురాలుగా పిలువబడే ఎత్తైన భవనాలపై పక్షులకు ఆహారంగా వదిలివేస్తారు. ఒక్కో గోపురం ఇరవై అయిదు అడుగుల ఎత్తు, నలభై అడుగుల వ్యాసంతో ఉంటాయి. వాటి పై శిలల్లా వల్చర్స్‌గా పిలువబడే రాబందులు కూర్చుని ఉంటాయి. బయటి వృత్తంలోని తొట్టెలలో మగవాళ్ల శవాలు, మధ్యవాటిలో స్త్రీల శవాలు, లోపలి వృత్తంలో చిన్నపిల్లల శవాలను ఉంచుతారు.

శవాన్ని గోపురంపై ఉంచి, పక్షుల ఆరగింపు పూర్తయినాక, అంటే షుమారు రెండు వారాలకు ఎముకల్ని పూర్వీకుల అస్థికలతో కలుపుతారు. ఆరువేల సంవత్సరాల క్రితం జోరాస్టర్ ప్రవక్త – భూమి, నీరు, అగ్ని ఎట్టి పరిస్థితుల్లో కుళ్లిన దేహ భాగాల వల్ల కలుషితం కారాదని బోధించాడు. చీమల కన్నా, పురుగులకన్నా రాబందులు త్వరగా శరీరాన్ని శుభ్రం చేస్తాయని అతడు పేర్కొన్నాడు. వ్యక్తుల ఎముకలను అదే సమాజంలోని వ్యక్తుల ఎముకలతో కలిపి ఉంచడమనే భావన ఆ సమాజంలోని వారినందరిని సమూహంగా ఉంచుతుందని వారి విశ్వాసం.

## మంచెలపై శవాలు

ఈ రకమైన పద్ధతి రెడ్ ఇండియన్లలోని కొన్ని తెగలలో కనిపిస్తుంది. మరణించిన వారి దేహాలను చెట్లపై మంచెలు కట్టి వాటి పై ఉంచుతారు.

న్యూగినిలోని కొన్ని నరమాంస భక్షక తెగల వాళ్లు వ్యక్తి చనిపోయినాక అతని శరీరాన్ని వండుకుని మరీ తింటారుట. 'వాళ్ల పొట్టలే వాళ్ల స్మశానాలు' అనేది అక్కడి సామెత.

సహదేవుడు పాండురాజు మరణించాక తండ్రి ఆనతి ప్రకారం అతని బొటనవేలు కొరికాడని, అది గమనించిన కృష్ణుడు అతడు దానిని తినకుండా వారించాడని, అందుకే సహదేవుడికి భవిష్యత్ జ్ఞానం వచ్చింది. కాని ఎవరికి చెప్పవద్దని కృష్ణ పరమాత్మ వాగ్దానం చేయించుకున్నాడని కొందరి విశ్వాసం.

✧✧✧✧✧



# ఆత్మహత్యలు




RADIOFLYER 2006











# 1. ఆత్మహత్య మహాపాపం!

'ఆత్మహత్య మహాపాపం' అన్న విషయం అందరికీ తెలిసిందే. అయినా ప్రతి దినం అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడి తమ జీవితాల్ని అంతం చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం.

సూయిసైడ్ (Suicide - ఆత్మహత్య) అనే పదం Sui - of one self; cidium - killing or slaying అనే లాటిన్ మూలాల్నుంచి వచ్చింది.

అమెరికాలో ప్రతి నిముషానికొకరు ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంటే, పదిహేడు నిముషాలకొకరు సఫలీకృతులౌతారట. అక్కడ ఎనిమిదవ ముఖ్య కారణం ఆత్మహత్య మనుషులు చావడానికి. చైనాలో ప్రతి రెండు నిముషాలకొకరు ఆత్మహత్య చేసుకుంటారట. దాదాపు మూడు లక్షల మంది అలా తమ జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తారు. 2012లో ఆత్మహత్య మానవ మరణాలకు తొలి కారణంగా అమెరికాలో వార్తకెక్కింది. తరువాత కారణాలుగా కారు ప్రమాదాలు, విష ప్రయోగం, ఎత్తులపై నుంచి పడడం, హత్యలుగా పేర్కొన్నారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ (Sigmund Freud); క్లియోపాత్రా (Cleopatra); మార్క్ ఏంటోని (Mark Antony); బ్రూటస్ (Brutus); జూదా ఇస్కారియెట్ (Judas Iscariot); నీరో (Nero); హన్నిబాల్ (Hannibal), హిట్లర్ (Hitler); హెమింగ్‌వే (Ernest Hemmingway); సిల్వియాప్లాత్ (Sylvia Plath); వాన్‌గో (Vincent Van Gogh) డిలాన్ థామస్ (Dylan Thomas); సోక్రటీస్ (Socrates); ఛైకోవ్‌స్కీ (Tchaikovsky); ఎల్విస్ ప్రిస్లీ (Elvis Prisley); మార్లిన్ మన్రో (Marilyn Monroe)ల పేర్లు ఆత్మహత్యలు చేసుకున్నవారిలో ప్రముఖంగా కానవస్తాయి.

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువ. 5-10 శాతం ఆత్మహత్యలు మానసిక వైద్యాలయాల్లో సంభవిస్తాయిట. ఆడవాళ్లలో నెల మొదటి వారంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉన్నపుడు ఆత్మహత్యల శాతం ఎక్కువని ఓ అంచనా! కృష్ణవర్ణం వారికన్నా శ్వేతవర్ణపు వాళ్లలో ఆత్మహత్యా స్వభావం ఎక్కువట. ఈమధ్య కాలంలో 5-14 ఏళ్ల మధ్య పిల్లల ఆత్మహత్యలెక్కువయ్యాయని అంటున్నారు.

హిందూ దేశంలో సతీ సహగమనం ఒకప్పుడు సమాజంలో వేళ్లూనుకుని ఉండింది. 1829లో విలియం బెంటింక్ దానిని నిషేధించి సమాజానికి మేలు

చేసినాడు. జపాన్ దేశంలో 'సమురాయి' లాంటి యుద్ధవీరులు ఆత్మార్పణ చేసుకునే పద్ధతిని 'సెప్పుకు' (Seppuku - Stomach cutting) అంటారు.

పవిత్ర గ్రంథం – ఖురాన్‌లో ఆత్మహత్య అన్ని నేరాల కన్నా ఘోరమైనదిగా చెప్పబడినది. అయితే పవిత్ర యుద్ధంలో మరణించడం (జిహాద్-Jihad) నేరం కాదు.

బైబిల్‌లో సూయిసైడ్ అనే మాట కానరాదు. పాత నిబంధనలో ఏడుగురు – శాంసన్, సాల్, సాల్ అంగరక్షకుడు, అహిటొఫెల్, జిమ్రి, రాజెస్, అభిమెలెక్; కొత్త నిబంధనలో జూడాస్ ఇస్కారియెట్‌లు ఈ నేరానికి పాల్పడిన వాళ్లుగా చెప్పబడుతున్నారు.

యూదా ఇస్కారియెట్ (Judas Iscariot) ఆత్మహత్య చేసుకున్న ప్రాంతాన్ని క్రీస్తును అమ్మిన ముప్పై వెండి నాణేలతో కొన్న జెరుసలెం దగ్గరున్న 'పాటర్స్ ఫీల్డ్' (Potter's field)ను అనాథలు, పరదేశీయులు, నిరుపేదల్ని పాతిపెట్టే స్థలంగా వినియోగించారు. దాని మరోపేరు రక్తక్షేత్రం (Field of Blood - Aceldama).

మాయన్ (Mayan) నాగరికతలో ఆత్మహత్య చేసుకోవాలంటే 'ఉరి' ఒక్కటే అంగీకరించబడిన మార్గం. వాళ్ల ఉరికొయ్య, ఉరితాడు దేవతపేరుఇక్స్‌టాబ్ (ixtab-Rope Woman). ప్రపంచమంతటా ఎక్కువమంది 'ఉరి' వేసుకునే మరణిస్తారు. రష్యన్లు 'ఉరి'ని; ఇంగ్లీషువాళ్లు 'విషాన్ని'; ఇటాలియన్లు తుపాకుల్ని, అమెరికన్లు తుపాకులు, గ్యాస్, విషాన్ని; రోమన్లు కత్తుల్ని అభిమానిస్తారట. మధ్యయుగంలో ఆత్మహత్యను మహానేరంగా పరిగణించేవారు. చనిపోయినవారి ఆస్థిని స్వాధీన పరచుకొనడమే కాక, పార్థివ దేహానికి సరైన కర్మకాండలు చేయకుండా, ఒక్కోసారి నాలుగు రోడ్ల కూడలిలో పాతిపెట్టేవారు.కొన్నిచోట్ల శవాన్ని బండికి కట్టి నాలుగు వీధుల్లో నగ్నంగా ఈడ్చి అవమానించేవారు. పద్దెనిమిదవ శతాబ్దంలో ఈ శిక్షతో అనేక పట్టణాల్లో ఆత్మహత్యలు ఆగిపోయాయి.

శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం– మెదడులో సెరటొనిన్ (Serotonin) పరిమాణం తక్కువగా ఉన్నవాళ్లు ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఆరురెట్లు ఎక్కువ. మొటిమలకు వాడే మందు ఐసోట్రెటినాయిన్ (Isotretenoin) కూడా ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుందని అంటారు. ఆల్కహాలికులలో ఆత్మహత్యల శాతం

ఎక్కువే. చిన్నప్పుడు లైంగిక హింసలకు గురిచేయబడినవాళ్లు, లైంగిక విపరీత ధోరణులున్నవాళ్లు, కుటుంబ చరిత్ర వున్న వాళ్లలో ఆత్మహత్యలెక్కువ.

సామూహిక ఆత్మహత్యలు ఓ రకమైన వ్యాధి, అంటువ్యాధి కావచ్చును... క్రీస్తుశకం 473లో 960 మంది యూదులు రోమన్లకు బందీలుగా ఉండడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నారు. 2008లో 140 మంది, 2009 మొదటి మూడు నెలల్లో 91 మంది అమెరికన్ సైనికులు ఆత్మహత్యకు పాల్పడగా మానసిక శాస్త్రజ్ఞులు దాన్నొక అంటువ్యాధిగా, ఎపిడమిక్‌గా భావించారు. 1978 నవంబర్ 18 నాడు జిమ్‌జోన్స్ (Jim Jones) అనే మతగురువు ప్రోద్బలంతో 918 మంది చిన్నాపెద్దా సైనైడ్ కలిపిన పళ్లరసం తాగి సామూహిక ఆత్మార్పణ చేసుకున్నారు. భారతదేశంలోని చిత్తోర్ (Chittor)లో (క్రీస్తుశకం 1303) అల్లావుద్దీన్ ఖిల్జీని ఎదుర్కొని రాజా భీమ్‌సింగ్, అతని సైన్యం వీరమరణం చెందగా రాణి పద్మిని అంతఃపుర స్త్రీలతో కలిసి చితిలో దూకి (జోహర్–Jowhar) మరణించింది. 1535లో బహదూర్‌షాకు, 1568లో మొగల్ చక్రవర్తి అక్బర్‌కు లొంగకుండా సామూహిక ఆత్మార్పణలు చేసుకున్న ప్రాంతమిది. 1944లో 10,000 మంది జపనీయులు అలానే ఆత్మహత్య చేసుకున్నారు.

ప్రతిదేశంలోనూ ఆత్మహత్యలు జరిగే ప్రదేశాల్ని Suicide Pointsగా పిలుస్తారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని Golden gate bridge; జపాన్‌లోని ఒకిగహర్ అరణ్యం - Suicide forest; ఇంగ్లాండ్‌లోని Beachy Head - ఇలా ప్రసిద్ధికెక్కినవే. ఈఫిల్ టవర్ (Eiefil Tower); Empire State Building, Luminous Veil of Toronto; చార్‌మినార్‌కూ ఈ ఖ్యాతి ఉన్నది.

విడాకులు తీసుకున్నవాళ్లలో, వాళ్ల పిల్లల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువ. వైద్యులలో మహిళలు, మానసిక వైద్యులు, నేత్రవైద్యులు, మత్తు డాక్టర్లు – వీళ్లలో ఆత్మహత్యలెక్కువట.

ఆత్మహత్యకు కారణం నిరాశ, మానసికంగా క్రుంగిపోవడం ప్రధాన కారణాలు కాగా, ఉన్మాదం, మాదక ద్రవ్యాలు, ఆర్థిక ఇబ్బందులు, స్నేహ సంబంధాలలోని మార్పులు వ్యక్తిని ఆత్మహత్యకు పురికొల్పుతాయి.

దాదాపు ఒక మిలియన్ వ్యక్తులు సంవత్సరానికి ఆత్మహత్యలు చేసుకుంటుండగా ప్రపంచంలో మృత్యువుకిది దశమ కారణంగా పేర్కొనబడింది. ప్రతి పది ఆత్మహత్యా ప్రయత్నాలలో ఒకటి సఫలమవుతుందట.

అబ్రహం మతాలలో (యూదు, క్రిస్టియన్, ఇస్లాం) ఆత్మహత్య దైవ ధిక్కారమైన నేరం. హిందూ ధర్మంలో ప్రాయోపవేశం, సతి, జోహార్‌లు ఒకప్పుడు అనుమతించబడినా అవి ఇప్పుడు నిషేధించబడినవి. సంగం కాలంలో ద్రవిడ దేశాన రాజులు, వారి స్నేహితులు నిరాహారులై ఆత్మార్పణ చేసుకునేవారు. ఈ కాలంలో బహిరంగంగా తగలబడడం, కమికజె, సూయిసైడ్ బాంబింగ్‌లు ప్రజలు నిరసన చేసుకునే ఆయుధాలుగా మారినాయి.

తన జీవితాన్ని తానే అంతం చేసుకోవడం – ఆత్మహత్య లేదా Suicide; ఎవరన్నా మాటలతో, చేతలతో సహాయం చేస్తే అది Assisted Suicide; వైద్యుడు లేదా మరొహరు తోడ్పడితే – Euthanasia - Mercy Killing దయాహత్య; ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం – Suicidal ideation; తనకు తాను గాయం చేసుకోవడం – Self injury.

ఆత్మహత్య చేసుకునేవారిలో 30–90 శాతం మంది మానసిక వ్యాధులతో బాధపడ్తుంటారు. ఉన్మాదం, మతిస్థిమితం లేకపోవడం, ఆహారపు విపరీతపు అలవాట్లు, వ్యక్తిత్వ లోపాలు, ఆందోళన, నిరాశ, నిస్పృహ ఇవన్నీ ఆత్మహత్యకు దారితీయవచ్చు. ఆల్కహాలు, నిద్రమందులు, కొకేన్, ఆంఫిటమైన్, సిగరెట్లు ఇవన్నీ ప్రేరకాలే! సమస్యను జూదంలా భావించే వ్యక్తులు (Problem gambling) సాధారణంగా ఆత్మహత్యలకు పూనుకుంటారు. దీర్ఘకాలపు నెప్పులు, తలకు దెబ్బలు, హీమోడయాలసిస్, హెచ్.ఐ.వి, కాన్సరు పేషంట్లు ఆత్మహత్యను తరుణోపాయంగా ఎంచుకుంటారు. నిద్రలేకపోవడం, గురక, హైపోథైరాయిడిజం, ఆల్జీమర్ వ్యాధి, బ్రెయిన్ ట్యూమర్లు, బీటాబ్లాకర్లు, స్టెరాయిడ్లు, సిస్టమిక్ ల్యూపస్ ఎరిథిమటోసిస్ లాంటివి ఆత్మహత్యను ప్రేరేపించేవిగా చెప్పుకోవచ్చును.

నిరాశ, ఆధిపత్య ధోరణులు, లైంగిక హింస, సర్దుకోలేకపోవడం – ఇవన్నీ ఒక ఎత్తైతే, ప్రసార మాధ్యమాల ప్రచారం మరొక ఎత్తు. వార్తలు దావానలంలా వ్యాపించి దుర్బలులైన వాళ్లను ఆవేశించి ఆత్మహత్యకు పురికొల్పుతాయి. దీనినే Copy Cat Suicide లేదా Werther effect (Goethe's The Sorrows of Young Werther) అంటారు. ఇప్పుడు మన రాష్ట్రంలో జరుగుతున్న రైతుల, విద్యార్థుల ఆత్మహత్యలు దీనికి ఉదాహరణ. దీనికి వ్యతిరేకమైనది Papageno effect - ఇది ఆత్మహత్యా భావాన్నెదుర్కొనే ధైర్యాన్నిస్తుంది. (Mozart's opera - The magic flute లోని పాత్ర - Papageno).

ఆత్మహత్యలకు సహేతుకమైన కారణాలను చూపించేది–Rational Suicide;
పదుగురి కోసం దేహత్యాగం చేయడం – Altruistic Suicide;
ఇతరుల్ని చంపుతూ తాను మరణించేది – Murder Suicide;
ఒక నాయకుడి కింద సామూహిక ఆత్మహత్య– Mass-Suicide;
ఆ ఒప్పందమే Suicide Pact.

మెదడులో ఒక రసాయనం - BDNF - Brain derived Neurotrophic factor – తగ్గిపోవడం ఆత్మహత్యలకు కారణంగా శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. సెరొటొనిన్ (Serotonin) కూడా సాధారణ స్థాయిని తగ్గి ఉండడం గమనార్హం.

ఆత్మహత్యలు ఆఫ్రికాలో తక్కువ (0.5). ఆస్ట్రేలియాలో లక్షకు 8.6; కెనడాలో 11.1; చైనాలో 12.7; ఇండియాలో 13.2; ఇంగ్లండ్‌లో 7.6; అమెరికాలో 11.4. లిథుయేనియా, జపాన్, హంగరీలలో మరింత ఎక్కువ. చైనా, ఇండియాలలో కలిపితే ఆత్మహత్యలు చేసుకునేవాళ్లలో సగం ఈ రెండు దేశాల్లోనే ఉన్నారు. చైనాలో ఆత్మహత్య మృత్యువుకు అయిదవ కారణంగా చెప్పబడింది.

'Suicide is a permanent solution to a temporary problem' – తాత్కాలికమైన సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆత్మహత్యను భావించడం అనైతికంగా చాలామంది విజ్ఞులు భావిస్తారు. నిరాశ నిస్పృహలు, మానసిక ఆందోళనలు, ఆర్థిక ఇబ్బందులు ఇవన్నీ తాత్కాలికమే. పరిష్కరించగలిగిన సమస్యలే కదా!

ఆల్బర్ట్ కామస్ (Albert Camus) ప్రతిపాదించిన Absurdism (అసంగత వాదం) ప్రకారం ఆత్మహత్య అంటే స్వేచ్ఛను తిరస్కరించడమే. భ్రమలలోకి, మృత్యువు, మతంలోకి నిష్క్రమించడం కన్నా జీవితాన్ని గాఢంగా కౌగిలించుకోవడం ఉత్తమం.

అస్తిత్వవాది (Existentialist) సార్త్రె (Sartre) అంటాడు– "తదేక దీక్షతో మృత్యు వదనంలోకి చూస్తూ మృత్యువును స్వీకరించాలి. శిక్షింపబడిన మానవుడిపై దేవునికున్న బాధ్యతా రాహిత్యాన్ని అనుభవించాలి".

తనను తాను చంపుకునే వాడు ఈ ప్రపంచాన్నే చంపుతాడు అంటాడు – ఛెస్టర్‌టన్ (G.K. Chesterton). తనని తాను అమ్ముకోవడం, తనని తాను

చంపుకోవడం అనేవి అధమ కార్యాలు. దానివల్ల అన్య మార్గాన్వేషణ ఆగిపోతుంది – జాన్ స్టువర్ట్ మిల్ (JohnStuart Mill) అభిప్రాయమిది. ఇమ్మాన్యుయెల్ కాంట్ (Immanuel Kant) అంటాడు– 'నిన్ను నీవు తృప్తి పరచుకోడానికి చేసుకునే ఆత్మహత్య నీతిబాహ్యామైనది'.

రూసో (Jean Jaques Rousseau)– జీవితాన్ని కాపాడుకోడానికి ఎంత ఉపద్రవాన్నైనా ఎదుర్కోవాలంటాడు.

పరువు కోసం చేసుకునే ఆత్మహత్యలు, జపాన్‌లోని సెప్పుకు; ఇండియాలో సతి, జౌహర్, ప్రాయోపవేశాలు– ఇవి ఆత్మహత్యలను సమర్థిస్తాయి. డేవిడ్ హ్యూమ్ (David Hume) ఆత్మహత్య దేవునికి వ్యతిరేకం కాదంటాడు. కొందరు మరణించే హక్కు (Right to die) ఉండాలంటాడు. ముఖ్యంగా దీర్ఘ వ్యాధులతో, ముసలితనంతో బాధపడేవారికి ఇది ఉపశమనం అని వారి అభిప్రాయం.

అయాన్ ర్యాండ్ (Ayn Ryand)– పదార్థ విజ్ఞాన వాదం (Objectivism) ప్రకారం – వ్యక్తి అదుపులో లేని పరిస్థితులలో ఆత్మహత్య సమర్థనీయమే! జీవితం అత్యంత విలువైనది. కాని జీవన్మృతులకన్నా మృతజీవనులే ఆదరింపదగినవారు.

హెరొడొటస్ (Herodotus) – జీవితం దుర్భరమైనప్పుడు మృత్యువే కదా ఆఖరి మజిలీ – అంటాడు; స్కొపెనార్ (Schopenhaur) అంగీకరిస్తాడు. వాళ్లంటారు– ఆత్మహత్య పిరికితనమని. కాని తను జీవించాలా వద్దా అనే నిర్ణయించుకునే అర్హత ఆ వ్యక్తికి తప్ప మరింకెవరికి ఉంటుంది?"

లిబరలిజం (Liberalism)– ఎవరి జీవితం వాళ్లది. వాటిపై ఇంకొకరికి అధికారం లేదు – అని చెబుతుంది. థామస్ జాజ్ (Thomas Szasz) - మరణించే హక్కు అన్ని ప్రాథమిక హక్కులకన్నా ముఖ్యమైనదంటాడు. జీన్ అమెరి (Jean Amery) – స్వేచ్ఛామృత్యువు కోసమే మనం జీవిస్తున్నాం – ఏమిటీ బతుకు? ఎందుకీ నిరంతర పోరాటం! ఆరాటం!" అని ప్రశ్నిస్తాడు ఆవేశంగా!

స్టొయిక్ వేదాంతులు (Stoics) – సౌశీల్యమే పరమ శ్రేయమనే స్టొయిక్‌లలో ముఖ్యులలో సెనెకా, ఎపిక్టెటస్, మార్కస్ అరిలియస్‌లు మృత్యువును మన చేతితోనే అదుపులో ఉంచుకోవాలన్నారు.

కన్ఫ్యూసియస్ (Confucius) – సమాజ శ్రేయస్సు కొరకు ఆత్మహత్య దోషం కాదన్నాడు.

'ఆత్మహత్య మహాపాపం' అన్నది మన ఆర్యోక్తి.

మనదేశంలో ఆత్మహత్యల రేటు ప్రపంచపు సగటు కన్నా ఎక్కువే. ప్రపంచంలో ఆత్మహత్య చేసుకునే ప్రతి అయిదుగురిలో ఒకడు భారతీయుడు. 2010వ సంవత్సరంలో లాన్సెట్ (Lancet) ప్రకారం ఇండియాలో 187000 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఎక్కువ మంది వయస్సు 15-29 సంవత్సరాల మధ్య.

ఉత్తర భారతం కన్నా దక్షిణ దేశాల్లో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ఆత్మహత్యలు 15 శాతం మించి ఉండగా ఉత్తరాదిని ఇది మూడు శాతం కన్నా తక్కువే. 40 శాతం మంది వయస్సు 30 లోపే; 70 శాతం మందిది 44 సంవత్సరాల లోపు వయస్సే. గృహహింస, లైంగిక హింసల వల్ల, ఆత్మహత్యల వార్తల వల్ల (Suicide Ideation) ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం ఆర్థిక రాజకీయ పరిస్థితులు. మీడియా అనైతిక ప్రచారం, నిరాశ నిస్పృహలుగా విజ్ఞులు పేర్కొన్నారు. తరుణోపాయాలుగా వ్యక్తులను-

1) సామాజిక ఒంటరితనాన్నుంచి విముక్తి చేయడం.
2) సాంఘిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కాకుండా చూడడం.
3) మానసిక ఒత్తిడుల్ని అధిగమించడం, వ్యాధుల్ని నివారించడం.

ఈ మూడింటిని అమలు పరచేలా 2003లో నిర్ణయాలు తీసుకున్నారు.

✧✧✧✧✧

# 2. ఆత్మహత్య (Suicide)

సంవత్సరానికి పదిలక్షల మందికి పైగా, ప్రతి నలభై సెకన్లకూ ఒక్కరు, లక్ష జనాభాలో పదహారు మంది ఆత్మహత్య వల్ల ఈలోకాన్ని వీడుతున్నారు. హత్యలకన్నా ఆత్మహత్యల వల్ల మరణించే వారి సంఖ్య దాదాపు ఒకటిన్నర రెట్లెక్కువ. గత యాభై ఏళ్లుగా ఆత్మహత్యల రేటు అరవై శాతం పెరిగిందని, ముఖ్యంగా 15–44 ఏళ్ల మధ్య వారిలో మరింత ఎక్కువైందని WHO అంచనా. ఆత్మహత్యలకు పాల్పడేవారు పదిమంది ఉంటే వారిలో ఒకరు సఫలీకృతులౌతారు. మహిళలు ఆత్మహత్యా ప్రయత్నాలెక్కువ చేస్తారు. పురుషులు నాలుగు రెట్లెక్కువగా ఆత్మహత్యతో ప్రాణాలు విడుస్తారు.

ఆత్మహత్య చేసుకుని ఖచ్చితంగా మరణించేట్లు ప్రణాళిక రూపొందించుకునేవారు కొందరు, దానిని గమనించగా రక్షింపబడిన వారు కొందరు, ముందే తమని ఎవరో ఒకరు రక్షిస్తారన్న నమ్మకంతో తమ పథకంలోనే లొసుగులుంచే వారు మరికొందరు. వీటిని Suicide, failed Suicide, Parasuicideగా అభివర్ణించ వచ్చును.

'ఆత్మహత్య మహాపాపం' అని పెద్దలు వచించినా 'సతీసహగమనం' గొప్ప ఆచారంగా హిందూ మతస్థులు భావిస్తారు. తమిళ దేశంలో క్రీస్తుపూర్వం 200–200 – క్రీస్తుశకం నాటికే (సంగం కాలం) ప్రాయోపవేశంతో రాజులు ఆత్మహత్య చేసుకునేవారు. నిశితంగా పరిశీలిస్తే అవతారాల నిష్క్రమణ ఆ విధంగానే సంభవించిందని అర్థమవుతుంది. క్రిస్టియన్ చర్చి, ఖురాన్ గ్రంథాలు ఆత్మహత్యను వ్యతిరేకించాయి. జపాన్‌లో ప్రసిద్ధికెక్కిన 'హరాకిరి' ఆత్మహత్య, వీరుల, యోగుల ఆత్మత్యాగాలు, సజీవ సమాధులు అందరికీ తెలిసినవే.

సూయిసైడ్ (Suicide) అనే పదం Sui-of one self; cide - killing of; అనే విడి పదాల కలయిక వలన ఏర్పడింది.

హావెన్ (1965)– 'ఆత్మహత్య అనేది విభిన్న పరిస్థితులు అనేక కారణాలు, ఒత్తిడులు ఒకే కాల, స్థితి చుట్టూ బిగదీసుకునే మహాప్రస్థానం' అంటాడు.

టీనేజి పిల్లలు, వృద్ధులు, స్వలింగ సంపర్కులు, నేరస్తులు, సమాజపు వైవిధ్యాలు, ఊహావైచిత్రులు, ఆస్థి నష్టాలు, విడాకులు, ఎడబాటు, వంశపారంపర్య

చరిత్ర; నిరాశ, ఉద్రేకం, నిద్రలేమి, ఒంటరితనం, దీర్ఘకాలపు రుగ్మత, పరువు ప్రతిష్ఠలకు భంగపాటు, కాన్పులు; లైంగిక హింస, ఆల్కహాల్, బలాత్కారం; నిరుద్యోగం, శ్వేతవర్ణపు తెగ, మగవాళ్లలో– ఆత్మహత్యల రేటు ఎక్కువ అని విశ్లేషకుల అభిప్రాయం.

నయం కాని వ్యాధులు, ప్రేమలో విఫలం, జీవన సహచరుడితో తగాదా, ఎడబాటు; దారిద్ర్యం, ఉన్మాదం, ఆస్థి తగాదాలు, పరీక్షలలో తప్పడం; పరువు నష్టం, నిరుద్యోగం మనదేశంలో ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు.

విషం, ఉరి, నీళ్లలో దూకడం, రైలు పట్టాలపై పడుకోవడం; బట్టలకు నిప్పు అంటించుకోవడం; ఎత్తైన ప్రదేశాల్నుంచి దూకడం, తుపాకులు – ఇవన్నీ ఆత్మహత్య చేసుకోడానికి వ్యక్తులు ఎన్నుకునే మార్గాలు.

మనదేశంలో ఆత్మహత్యలలో కేరళ ప్రథమ స్థానం ఆక్రమించింది. తరువాత వరసగా కర్ణాటక, త్రిపుర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లు వస్తాయి. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో కుటుంబం యావత్తూ ఆత్మహత్యలకు పాల్పడడం ఎక్కువ.

19వ శతాబ్దపు ఎమిలి దుర్ఖీమ్ (Emile Durkheim) ఆత్మహత్యలను– Egoistic, Altruistic, anomic అనే మూడు రకాలుగా పేర్కొన్నది.

Egoistic Suicide - వీళ్లకు కుటుంబ సంబంధాలు తక్కువ. ఒంటరిగా ఉంటారు. ఉదాహరణగా– పెళ్లైన వారికన్నా బ్రహ్మచారులలోనూ, పల్లెటూర్లలో కన్నా పట్టణాలలోనూ, కాథలిక్కులకన్నా ప్రొటెస్టంట్లలో ఆత్మహత్యలెక్కువగా ఉండడం గమనించవచ్చు.

Altruistic Suicide - తోటివారి క్షేమం కోసం ఆత్మత్యాగం చేయడం.

Anomic Suicide - పరిస్థితుల్లో మార్పు వలన తాము సమాజంలో ఇమడలేమని భావించి ఆత్మహత్య చేసుకోవడం.

మానసిక కారణాలు– సిగ్మండ్ ఫ్రాయిడ్ అభిప్రాయం ప్రకారం ఆత్మహత్య అనేది తనవేపు మరల్చబడిన ప్రతీకారేచ్ఛ. ఇతరులకు హాని కలిగించు దామనుకున్న ఉద్దేశాన్ని తనవేపు తిప్పుకోవడం.

మెన్నింగర్ (Menninger)– ఫ్రాయిడ్‌తో ఏకీభవిస్తూ– ఆత్మహత్యలో– చంపాలనుకోవడం, చంపబడాలనుకోవడం; చావాలనుకోవడం అనే మూడు భాగాలున్నాయంటాడు.

సమాజంలో కలిసి బతకడం, సమాజపు తోడ్పాటు; ఆశయాలకు, విజయాలకు మధ్య ఉన్న దూరం, సమాజంలో స్థానం, ఇవన్నీ ఆత్మహత్యలను నిర్దేశిస్తాయి.

మనదేశంలో యోగులు, ఆచార్యులు నిర్వాణానికి వాడిన పద్ధతులు అనేక రకాలుగా ఉన్నాయి. మీమాంసా వేదాంతి కుమారిలభట్టు తన చితికి తానే నిప్పంటించుకున్నాడు. ఆదిశంకరాచార్య కాశ్మీరులోని కొండగుహలో తపస్సమాధికి చేరుకోగా శిష్యులు ఆతని ఆజ్ఞపై గుహద్వారాన్ని మూసివేసారు. ధ్యానేశ్వర్, వీరబ్రహేంద్రస్వామి లాంటివారు సజీవసమాధి అయ్యారు. చైతన్య మహాప్రభు– పూరి వద్ద బంగాళాఖాతంలో నీలమేఘశ్యాముణ్ణి చూసి ఆ నీటిలోకి దూకినాడు. ఏకనాథ్ గోదావరి జలాల్లో ప్రవేశించినాడు. భక్త తుకారాం ఇంద్రియాణి నదిలోకి దూకినాడు. అనేకమంది బౌద్ధ భిక్షుకులు తమకు నిప్పు అంటించుకోవడం ద్వారా ఆత్మత్యాగాన్ని చేసి తమ నిరసనను తెలియజేసేవారు.

ఇంకో అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం 53–460 మంది ప్రతి మిలియన్ జనాభాకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఉత్తరాదిన కంటే దక్షిణాదిలో ఆత్మహత్యలెక్కువ. (కేరళ 270/మిలియన్; త్రిపుర 187/మిలియన్, కర్ణాటక 173/మిలియన్)

సూయిసైడ్ నోట్– ఆత్మహత్యను విశ్లేషించడానికి ఉపయోగపడ్తుంది. 'చనిపోయిన వారి మనస్సును చూపించే అద్దం'గా సూయిసైడ్ నోట్ (Suicide Note)ను పేర్కొంటారు.

మానసిక వ్యాధుల్లో– mixed anxiety depressive disorders; షైజొఫ్రినియా, వాగుడుకాయలు, ఆదర్శవంతులు ఆత్మహత్యలకు లోనవుతుంటారు.

చస్తానని బెదిరించేవాళ్లందరూ చావరు కాని వాళ్లను ఒక కంట కనిపెట్టి ఉండడం మంచిది. ఇతరుల్ని లొంగదీసుకోడానికి కొందరు ఆడే నాటకం ఇది. వాళ్ల మాటలను గమనించాలి.

'సూయిసైడ్ నోట్'లలో ఏది అసలు, ఏది నకిలీ కనిపెట్టవచ్చు. ఎక్కువ మాటలు, తీవ్ర పదజాలం, ఆత్మనింద, పరనింద, ప్రతీకారం, హెచ్చరికలు, ఒకేరకమైన మాటలు, వాక్యాలు, ఎల్లప్పుడూ– Always; లేదు, కాదు, Never అనే పదాలు, వీడ్కోలు వాక్యాలు, సహచరులపై విమర్శ; తల్లిదండ్రులు, దేవుడు,

మతంపై అభిప్రాయాలు; లవ్, ప్రేమ అనే పదాలు ఎక్కువగా వాడడం, పేర్లు స్థలాల్ని ఉదహరించడం అసలైన Suicide Noteలో ఎక్కువగా గమనించవచ్చును. నిందాపూర్వకమైనవి (Accusatory); కారణహేతువు (Thematie), క్షమను కోరేవి (Relenting); విధి నిర్వహణ (Instructional) నాలుగు రకాలుగా Suicide Note ఉంటాయంటారు.

మనదేశంలో ఆత్మహత్యా ప్రయత్నం నేరం. సెక్షన్ 309 IPC ప్రకారం ఒక సంవత్సరం జైలుశిక్ష విధించబడవచ్చును. సహకరించిన వారికి సెక్షన్ 306 IPC క్రింద పది సంవత్సరాల వరకు జైలుశిక్ష పడ్తుంది.

సిరిల్ జోయడ్ (Cyril Joad 1891-1953) ఏమన్నాడంటే– 'చచ్చినా ఇంగ్లాండ్‌లో ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవద్దు. చచ్చావా పిచ్చోడంటారు. బతికితే నేరస్థుడంటారు'. ఆత్మహత్యపై ఉన్న అభప్రాయాలు కూడా అంతే. కొందరు మానవుడికి తన జీవితాన్ని ఎలా అంతం చేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు ఉన్నదని వాదిస్తే, మరికొందరు మానవ జీవితం అనేది భగవత్ ప్రసాదం, దానిని అంతమొందిచే హక్కు మానవుడికి లేదంటారు. ఏది ఏమైనా 'సూయిసైడ్' అనే పదం పదిహేడవ శతాబ్దంలో ప్రాచుర్యానికి వచ్చింది. అంతకుముందు ఆత్మహత్యను Self Homicide లేదా Self-murder అనేవారు.

'ఆత్మహత్య అనేది నాగరిక ప్రపంచపు వ్యాధి' అని అనేవారు. ఎందుకంటే ఆదిమ మానవులకు ఆత్మహత్య చేసుకునేంత ఉద్వేగాలూ, బలమైన కారణాలు లేవని శాస్త్రజ్ఞుల విశ్వాసం. అయితే వేలాదిమంది నీగ్రో బానిసలు తమను ఓడలపై విదేశాలకు తీసుకుపోతుంటే తమ ఆత్మలు ఆఫ్రికాలోనే ఉండేందుకు సామూహిక ఆత్మహత్యలకు తలపడ్డారు.

గ్రీకులు, రోమన్లు 'ఆత్మహత్య' ద్వారా తమ పూర్వీకులను చేరుకోవచ్చని నమ్మేవారు. అది 'Honour Suicide' కాలం. వీరమరణం, శీల రక్షణ, వ్యాధితో గాని వృద్ధాప్యంలోగాని మరణించకుండా – ఆత్మహత్య చేసుకోవడం ఉన్నత సంప్రదాయంగా వాళ్లు భావించేవారు. Cynics, Stoics, Epicureans ఆత్మహత్యను సమర్థించినా పైథాగరస్, అరిస్టాటిల్, ప్లాటోలు తీవ్రంగా వ్యతిరేకించారు.

కొత్త నిబంధనలో ఎక్కడా ఆత్మహత్యను నిరసించిన దాఖలాలు లేవు. ఈ పని చేస్తే మరణదండన విధించబడ్తుందని తెలిసీ చేయడం ఆత్మహత్యతో సమానమని కొందరు వాదిస్తారు. జీసస్ శిలువనెక్కడం అటువంటిదే అని వారి అభిప్రాయం. అయితే క్రీస్తుశకం నాలుగవ శతాబ్దంలో సెయింట్ ఆగస్టిన్

కాలం నుంచి ఆత్మహత్య మహాపాపంగా ఎంచబడింది. ఆత్మహత్య అంటే దేవుని సృష్టిని చంపడమే కదా! జీసస్‌ను మోసం చేయడం కన్నా, ఆత్మహత్య చేసుకోవడంతో యూదా (Judas) అపరాధం మరింత ఎక్కువైంది.

క్రీస్తుశకం 563 నాటికి ఆత్మహత్యలను నేరాలుగా భావించారు. వాళ్ల ఆస్థిపాస్థుల్ని వశం చేసుకునేవారు. శవాన్ని ద్వారం గుండా గాక, కిటికీ గుండా బయటకు లాగేవారు. చర్చి ప్రధాన ద్వారం నుండి కాక గోడమీదుగా చర్చిలో ప్రవేశపెట్టేవారు.

చర్చి ఆవరణలో కాక నాలుగు రోడ్ల కూడలిలో పాతిపెట్టేవారు. ఆత్మహత్య చేసుకున్నవాడి దయ్యం పగబట్టకుండా శవాన్ని తగలబెట్టేవారు. కొన్నిచోట్ల ఆత్మహత్యకు వాడిన చేతిని తొలగించేవారు. గుండెలో చెక్కముక్క దిగగొట్టేవారు. నాలుగు రోడ్ల కూడలిలో పాతిపెడితే వ్యక్తి ఆత్మ ఎటుపోవాలో తేల్చుకోలేక అక్కడే ఉండిపోతుందని వాళ్ల నమ్మకం.

ఫ్రాన్సులో ఆత్మహత్య చేసుకున్నవాళ్ల శవాలను బండికి తలకిందులుగా కట్టి వీధుల్లో ఈడ్చుకుంటూ ఊరేగించేవారు. కొన్నిచోట్ల శవాన్ని పీపాలో వేసి సముద్రంలో పారేసేవారు. ఇన్ని గొడవలుండేసరికి ఆరోజుల్లో ఆత్మహత్య మాట కూడా ఎవ్వరూ తలపెట్టేవారు కాదుట.

పునరుజ్జీవన కాలం వచ్చింది (Renaissance) హామ్లెట్ లా 'To be or not to be' ఆలోచన మొదలైంది. రాబర్ట్ బర్టన్ 1621లో Anatomy of Melancholy రాసాడు. జాన్ డొనె (John Donne) వ్రాసిన Biothanatos – అతడు చనిపోయినాక 1644లో ప్రచురించబడింది. ఆత్మహత్యను సమర్థించిన మొదటి వ్యాసం అది. పెలికాన్ పక్షులు ఆత్మహత్యతో తమ జీవితాన్ని అంతం చేసుకుంటాయని Pelicanicidium - వ్రాసినవాడు– సర్ విలియం డెన్ని (1653). దాదాపు 14 షేక్స్పియర్ పాత్రలు ఆత్మహత్య చేసుకున్నాయంటారు.

అయినా 'చర్చి' మనసు మారలేదు. ఎప్పుడో ఒకసారి రాజవంశీకుల ఆత్మహత్యలకు ఏదో కాస్త మినహాయింపు దొరికేది.

అంధకారం నుంచి జ్ఞానపు వెలుగు కాలం (Age of Enlightenment)లో డేవిడ్ హ్యూమ్ (1789) 'On Suicide' అనే ప్రామాణిక వ్యాసం ప్రచురితమైంది. ఇంగ్లీషు వాళ్లన్నా, వాళ్ల వాతావరణమన్నా పడని (Anglomane - English madness) ఫ్రెంచివాళ్లు ఇంగ్లీషువాళ్లలో ఆత్మహత్యలెక్కువని నమ్మినా,

మాంటెస్క్యూ, వొల్టెర్, రూసో లాంటి ఫ్రెంచి వేదాంతులు ఆత్మహత్యలను సమర్థించారు.

క్రీస్తుశకం 1700లో సంభవించిన థామస్ క్రీచ్ ఆత్మహత్య, 1732లోని రిఛర్డ్స్మిత్, అతనిభార్య, కుమార్తెల సామూహిక ఆత్మహత్యలు బ్రిటన్‌ను కుదిపి వేసాయి. 1823 నాటికి ఆత్మహత్య చేసుకున్నవాళ్ల శవాలను, నాలుగు రోడ్ల కూడలిలో పాతిపెట్టడాన్ని పార్లమెంట్ నిషేధించింది. 1882 కల్లా ఆత్మహత్య, హత్యకు లోనైన శవాలను ఒకేరకంగా పరగణించడం మొదలైంది.

Age of Romanticism వచ్చేసరికి ఆత్మహత్య ఒక సరదాగా, ఫాషన్‌గా మారింది. థామస్ ఛాటర్‌టన్, వెర్థర్ (గేథే వ్రాసిన కావ్యం)ల ఆత్మహత్యలు సంచలనాన్ని కలిగించాయి.

ఇరవై శతాబ్దంలో ఆర్థిక, మానసిక కారణాలతో ఆత్మహత్యల సంఖ్య పెరిగింది. ఎమిల్ దుర్ఖీమ్ (Emil Durkheim) పేర్కొన్నట్లు– 'the prevalence of suicide in a society varies inversely with its sense of cohesion' – అందుకే ఉమ్మడి కుటుంబాలలో కన్నా ఆదర్శ కుటుంబాల్లో, ఒంటరి జీవితాల్లో ఆత్మహత్యలెక్కువ. డబ్బుకు, అందానికి ప్రాముఖ్యతనిచ్చే సమాజంలో పేదవాళ్లు, అనాకారులు ఆత్మహత్యకు పాల్పడడం అందరికీ తెలిసిందే.

✧✧✧✧✧



The Suicide by Édouard Manet 1877–1881

# 3. రకరకాల ఆత్మహత్యలు!

ఆత్మహత్యలలో అనేక రకాలున్నాయి. కారణాలనుబట్టి, ప్రాముఖ్యతను బట్టి వాటిని స్థూలంగా ఇలా విభజించవచ్చును.

**1) పరువుకోసం ఆత్మహత్యలు (Honour Suicides) :**

తన కన్న కొడుకుని పెళ్లాడి సంతానాన్ని కన్న తల్లిగా అపఖ్యాతి గాంచిన జొకాస్టా-ఎడిపస్ (Jocasta-Oedipus)ల గాథ అందరికీ తెలిసిందే. చివరకు ఆమె ఆత్మహత్య చేసుకుని తన జీవితాన్ని ముగిస్తుంది. 'ఎడిపస్ కాంప్లెక్స్' ఈ కథ నుండి వచ్చిందే.

శత్రువులకు లొంగడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నవాళ్లలో- ఆల్ప్స్ కొండలమీదుగా ఏనుగుల్ని నడిపించిన హన్నిబాల్, బ్రిటిష్‌రాణి బొయడిసియా; ఇరవై శతాబ్దంలో హిట్లర్, హిమిలెర్‌లు ముఖ్యులు.

జపనీయులు పాటించే 'హరాకిరి' (Harakiri) రెండు విధాలు. ఒకటి ఐచ్ఛికం; రెండోది శిక్ష. ఎవరైనా రాజవంశీకుడు చట్టాన్ని అతిక్రమించినా, రాజ ద్రోహం చేసినా చక్రవర్తి (మికాడొ-Micado) అతడి వద్దకు 'వజ్రాలపిడి బాకు' పంపుతాడు. అందరిముందూ, ఎర్రటి కార్పెట్ పరచబడిన ఎత్తున్న స్టేజీపై, సందర్భోచితంగా దుస్తులు ధరించిన వీరుడు, వజ్రాలపిడిబాకును తన చేతిలోకి తీసుకుని పొట్టకు ఎడమ పక్క పొడుచుకుని, క్రమేపీ పొట్టలోపల కుడి పక్కన ఉన్న భాగాల్ని పెల్లగిస్తాడు. అయినా అతడి మొఖంపై ఏ బాధా కనబడకూడదు. అతడు పొట్టలో పొడుచుకున్నాడని రూఢి అయిన వెంటనే ఆ వ్యక్తి స్నేహితుడు తన ఖడ్గంతో వ్యక్తి శిరచ్ఛేదం చేసి మరింత బాధ నుంచి విముక్తం చేస్తాడు. 1868లో హరాకిరి శిక్ష నిషేధించబడింది. కాని ఐచ్ఛిక 'హరాకిరి' ఇప్పటికీ మనం వింటూనే ఉన్నాము. దీనినే సెప్పుకు - Seppuku - అంటారు.

శత్రువుకు లొంగిపోవడానికి ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్న వాళ్లలో ప్రసిద్ధుడు మార్కస్ ప్రొసియస్ కాటొ (95-46 B.C.). నియంత జూలియస్ సీజర్ పరిపాలనలో ఉండటం ఇష్టం లేని కాటో గ్రీసుకు, ఆ తరువాత లిబియాకు పారిపోయాడు. జూలియస్ సీజర్ నీడ తనపై పడేలోపునే తన గుండెలోకి కత్తి దింపుకుని- And now I am master of myself' అంటూ కన్నుమూసినాడు.

నీరో ప్రభువుతో విభేధించిన సెనెకా (5 B.C. - 65 A.D.) గృహాన్ని నీరో సైనికులు చుట్టుముట్టారు. ఒకప్పుడు తన శిష్యుడైన 'నీరో'కు లొంగిపోవడం

ఇష్టంలేని సెనెకా, అతని భార్య 'పౌలినా'లు రక్తనాళాల్ని కోసుకుని ఆత్మహత్యకు పాల్పడినారు. రెండు మూడు రక్తనాళాలు కోసినా ఎక్కువ రక్తస్రావం కాకపోవడంతో సెనెకా – అయిదు వందల ఏళ్ల క్రితం సోక్రటీస్ తాగినటువంటి హెమ్‌లాక్ విషాన్ని ఓ కప్పు తాగి, వేడి నీళ్లతొట్టిలో పడుకుని రక్తస్రావం వేగవంతం కాగా కన్నుమూసాడు. అయితే పౌలినా బతికి బట్టకట్టింది.

బ్రూటస్ భార్య పోర్షియా (Portia) తన భర్త ఫిలిప్పెలో ఆత్మహత్య చేసుకున్నాడని తెలవగానే ఎర్రటి మండే బొగ్గుల్ని మింగి చనిపోయింది. క్లాడియస్ చక్రవర్తి సీసినా పీటస్ అనే అతడికి మరణశిక్ష విధించగా, ఆత్మహత్య చేసుకోవాలనుకుని సంశయిస్తున్న తన భర్తముందే గుండెల్లోకి బాకు గుచ్చుకుని– 'పీటస్! ఏం నెప్పిలేదు' అంటూనే బాకును లాగి భర్తకిచ్చింది. అలా ఇద్దరూ చనిపోయారు. మాగ్జెంటియస్ చక్రవర్తి మనసుపడ్డ సోఫ్రానియా (Sophronia) తన భర్త కళ్లెదుటే కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకోగా సెయింట్ ఆగస్టీన్ ఆమెను దివ్యాత్మగా పరిగణించాడు. సెక్సస్ (Sextus) వల్ల బలాత్కారానికి గురై లుక్రెసి (Lucrece) ఆత్మహత్య చేసుకోగా తదనంతర పరిణామాలు రోమన్ రాజకీయ చరిత్రను మార్చివేసి రాచరిక పాలనకు అంతం పలికాయి. క్రీ.శ. 870లో యార్క్‌షైర్ కాన్వెంటును డేన్స్ చుట్టుముట్టగా వాళ్ల చేతిలో అవమానంపాలు గాకుండా అక్కడున్న నన్స్ అందరూ ముక్కు, పైపెదవి కోసుకున్నారు.

## 2) అనుకరణ ఆత్మహత్య (Imitative Suicide) :

బైరన్ కవి అన్నాడు– 'రేజర్ కత్తిని చూసినప్పుడల్లా పీక తెగ్గోసుకోవాలనిపిస్తుంది'. అలాగే కొండ శిఖరాల్నెక్కినవారికి అక్కడి నుంచి కిందికి దూకాలనిపించడం, పడవల్లో, నౌకల్లో ప్రయాణం చేసేవాళ్లు నీళ్లలో మునిగిపోవాలనుకోడం సహజమే. లండన్ మాన్యుమెంట్, రోమ్‌లోని సెయింట్ పీటర్ బాసిలికా, టోక్యోలోని కెగాన్ వాటర్‌ఫాల్; ఇండియాలోని కుతుబ్‌మినార్, చార్‌మినార్; అనేక నగరాల్లోని బహుళ అంతస్థుల భవనాలు– ఈ రకం ఆత్మహత్యలకు ప్రసిద్ధికెక్కినవి.

1933 ఫిబ్రవరిలో పంధొమ్మిదేళ్ల యువతి– కియోకొ మట్సుమొటో జపాన్‌లోని మిహారా-యమా అగ్నిపర్వతపు నోటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నది. అదే సంవత్సరం మరో 143 మంది, తరువాత సంవత్సరం 167 మంది ఆత్మహత్య చేసుకోగా ఆ ప్రదేశం ఒక విహారకేంద్రంగా మారింది.

ప్రత్యేక ఆకర్షణ– 'ఆత్మహత్య చూడవచ్చునని'. తరువాత ఆ వొల్కానో మౌత్ (Volcano Mouth) చుట్టూరా కంచెనేర్పాటు చేసారు.

మిలెటాస్ (Miletos) నగరంలో ఓ ఏడాది ఉరివేసుకుని చావడాలెక్కువయ్యాయని– అలా ఆత్మహత్య చేసుకున్నవారి దేహాలను ఉరితాడుతో బండికి కట్టి, నగ్నంగా ఊరేగించేసరికి ఆత్మహత్యలకు ఫుల్‌స్టాప్ పడింది. అదే మార్సెల్లెస్‌లో కూడా అవలంబించేసరికి అక్కడ ఆత్మహత్యల అలజడి అంతరించిపోయింది. 1792లో ఒక ఫ్రెంచి సైనికుడు ఓ కొక్కేనికి ఉరి తగిలించుకుని ఆత్మహత్య చేసుకోగా మరో పన్నెండు మంది అక్కడే అలానే చనిపోయారు. ఎవరో తెలివిగలవాడు ఆ కొక్కేన్ని తీసివేయగా ఆత్మహత్యలు ఆగిపోయాయట.

### 3) అసాధారణ ఆత్మహత్యలు (Eccentric Suicide) :

క్రీస్తుపూర్వం 342–279 మధ్యకాలంలో ఉన్న జెనొ (Zeno) వేదాంతి– స్టాయిక్ ఫిలాసఫి మూలపురుషుడు– కాలివేలుకు దెబ్బతగిలి బోర్లాపడి పడీ కొన్ని సంవత్సరాల పాటు ఓర్చుకుని ఎంత విసిగిపోయాడంటే ఇదే ఆఖరిసారి దెబ్బ అనుకుని సరాసరి ఇంటికిపోయి ఉరివేసుకుని మరణించాడు.

పారిస్‌లో ఇద్దరు కుర్రాళ్లు జీవితంపై విసిగిపోయి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. బాగా పేరున్న రెస్టారెంటుకు పోయి నవ్వుతూ, తుళ్లుతూ, హాయిగా ఖరీదైనవి, తినాలనుకున్నవి తినేసి, తాగాలనుకున్న ఖరీదైన ఛాంపేను, వైను నిండా పుచ్చుకున్నారు. పడిపడి నవ్వుతుంటే పక్కవాళ్లు వింతగా చూస్తున్నా పట్టించుకోలేదు. ఈలోగా బిల్లు వచ్చింది. బిల్లును చూసి మళ్లీ పొట్ట చెక్కలయ్యేలాగా నవ్వుతుంటే రెస్టారెంట్ యజమాని వచ్చాడు. ఇద్దరి చేతుల్లో గ్లాసు, గ్లాసులో మందూ ఉన్నాయి. సారీబాస్! మామూలంగా నీకు గొప్ప పేరొస్తుంది. ఎందుకంటే మా దగ్గర చిల్లిగవ్వలేదు, కాని, నీ మర్యాద, మన్నన, భోజనం బహు భేష్. అట్లా అని మమ్మల్ని గెంటెయ్యకు... ఎందుకంటే అనేయగానే యజమాని 'జెండార్మ్'లనే ఫ్రెంచి పోలీసులను పిలిపించాడు. వాళ్లు వచ్చేలోపులే వాళ్లు విషం కలుపుకున్న వైను తాగి టేబుల్ దగ్గరే కన్నుమూసారు. వాళ్లన్నట్లు ఆ రెస్టారెంటు పేరు అందరినోటా నానింది.

పోలిష్ యువతి ఒకామె ప్రేమలో విఫలమై అయిదునెల్లపాటు నాలుగు చెంచాలు, మూడు కత్తులు, పంధొమ్మిది నాణేలు, ఇరవై గోళ్లు, ఏడు బోల్టులు, ఒక ఇత్తడి శిలువ, నూటఒక్క గుండుసూదులు, ఒక చిన్న రాయి, మూడు గాజుముక్కలు, రెండు రుద్రాక్షల్ని మింగి మొత్తానికి చచ్చిపోయిందట.

ఇంకో ఫ్రెంచి మహిళ శరీరం మీద వంద జలగల్ని కరిపించుకుని మరణిస్తే, ఇంకొక మానవుడు ఎలుగుబంటి గుహలోకి దూకి, దానితో చావుదెబ్బలు తిని చనిపోయాడట. మాథ్యూ లోవట్ అనేవాడు చిత్రమైన మానసిక రోగి. ముందుగా తనంతట తాను తన రహస్యాంగాల్ని కోసుకున్నాడు. తరువాత కొన్నిరోజులకు వెనిస్ పోయి శిలువ వేసుకోబోతే దారినపోయేవాళ్లు ఆపారట. ఈసారి స్వంత ఊరు 'కాసలి' (Casale) వచ్చి రెండో శిలువ పకడ్బందీగా ప్లాను చేసుకున్నా చనిపోలేదు. మూడోసారి మానసిక వైద్యాలయంలో తిండీ నీరు మాని మరణించాడట.

మొదటి ప్రపంచ యుద్ధంలో జరిగిన జననష్టం, భీభత్సాలకు కలవర పడిన ఆనాటి మేధావులు పాతకాలపు విలువలను ప్రశ్నించడం మొదలుబెట్టారు. అంతేకాక పాత విలువలను పూర్తిగా తిరస్కరించే 'దాదా ఉద్యమం' (Dada Movement) మొదలైంది. కళలు, జీవితం ఇవన్నీ అర్థంలేనివి. నీతిబాహ్యమైన ప్రపంచంలో ఆత్మహత్య ఓ విలువలేని కళలాంటిది అని విశ్వసించారు. వాచె (Vache)అనే అతడు 1919లో తన ఇద్దరు మిత్రులకు ఓపియం ఇచ్చి తానూ తీసుకుని ముగ్గురూ చనిపోయారు.

ఛానెల్ 40లో వార్తలు చదివే క్రిస్టిన్ హబ్బక్ 1970లో ప్రోగ్రాం మధ్యలో– And now, in keeping with policy of always bringing you the latest in Blood and guts, in living colour, you are about to see anthor first - an attempted suicide' – అని నుదుటిపై కాల్చుకుని టీవీప్రోగ్రాం చేస్తున్నవాళ్లు, చూస్తున్నవాళ్లు, తేరుకునే లోపలే రక్తం వరదలై పారుతుండగా అక్కడికక్కడే చనిపోయింది.

### 4) నీవు బాధపడక తప్పదు (You will be Sorry) :

ఇంకొందరకు చచ్చి సాధిద్దామనే కోరిక తీవ్రంగా ఉంటుంది. కొంతమంది వ్యక్తుల్ని, కొందరు సమాజాన్ని తమ చావుకు కారణంగా పేర్కొంటారు. థామస్ ఛాటర్టన్ (1752–70) బ్రిస్టల్‌లో పేద కుటుంబంలో పుట్టాడు. దస్తావేజులకు నకళ్లు వ్రాసే ఉద్యోగికి సహాయకుడిగా చేరిన అతడు మధ్యయుగపు కవిత్వంపై అభిమానం పెంచుకుని– ఛాసర్ దస్తూరీని అనుకరించడం మొదలుపెట్టాడు. పాత కాగితాలపై స్వంత కవిత్వాన్ని వ్రాసి మధ్యయుగపు కవుల పేరిట చెలామణి చేయబోగా ప్రయత్నం బెడిసికొట్టింది. పదిహేడేళ్ల వయసులో అవమానాలు భరించలేక రెండుసార్లు ఆత్మహత్యా యత్నాలు చేసాడు. 'You will be sorry when I am dead' లాంటి ఉత్తరాలు

వ్రాయగా యజమాని వాటిని చూసి అతడిని మందలించడమే గాక ఉద్వాసన చెప్పాడు. ఛాటర్‌టన్‌కు తనమీద అపరిమితమైన నమ్మకం ఉండడంతో లండన్ వెళ్లి విలియం బింగ్లి అనే North Briton Weekly ఎడిటర్‌ను కలిసాడు. అతడు ఛాటర్‌టన్ కవిత్వాన్ని ప్రత్యేక సంచికగా తేవాలనుకున్న సమయంలో దురదృష్ట వశాత్తూ రుమాటిక్ ఫీవర్‌తో మరణించడంతో ఛాటర్‌టన్ ఆశలు ఆవిరై ఆత్మహత్య చేసుకున్నాడు.

అతని ఆత్మహత్య ఆనాటి రచయితలు, చిత్రకారులపై ఎంత ప్రభావాన్ని చూపిందంటే అనేక సూయిసైడ్ క్లబ్బులు వెలిసాయి. 1830లో ఆత్మహత్యల రేటు రెట్టింపు అయ్యింది. రొమాంటిక్ సూయిసైడ్ ఘట్టానికి తెరలేచింది.

## 5) ప్రేమకోసం ఆత్మహత్య (Romantic Suicide) :

ఒకరినొకరు విడిచి వుండలేక ఆత్మహత్య చేసుకున్న ఘట్టాలు, కథలు చరిత్రలో అనేకం. హీరో–లియాండెర్, లైలా–మజ్నూ; సలీం–అనార్కలి కథలు అందరికీ తెలిసినవే. లియాండర్, హీరోలు ప్రేమించుకున్నారు. హీరోను చేరుకోడానికి లియాండర్–హెల్లెస్‌పాంట్‌ను ఈదుకుంటూ ఆవలి తీరం వేపు హీరో ఉంచిన దీపం వేపు చేరేవాడు. ఒకరోజు తుఫానుగాలికి దీపం ఆరిపోయింది. నీటి మధ్యలో ఉన్న లియాండర్ దారితప్పి మునిగి చనిపోయాడు. హీరో సముద్రంలో దూకి తానూ తనువు చాలిస్తుంది.

ఫాల్డొని– అతడి ప్రియురాలు ఒకరినొకరు కాల్చుకుని మరణిస్తారు. ఎందుకంటే వాళ్ల ప్రేమను పెద్దవాళ్లు తిరస్కరించడమే కాక, ఫాల్డొనికి తగిలిన కత్తిదెబ్బ ప్రాణాంతకమైనదని తెలియడంతో 'రూసో' వీళ్లను 'Lovers of Lyons' అన్నాడు. రుడాల్ఫ్ యువరాజు–మేరీ వెట్సెరా జంట అలాగే మరణించారు.

'Sorrows of Young werther' – అనే నవలలో గేథే (Goethe)– వివాహిత స్త్రీని ప్రేమించి విఫలమై ఆత్మహత్య చేసుకున్న 'వెర్థర్' గురించి వ్రాసాడు. వెర్థర్ అనే ఆర్టిస్టు 'ఛార్లొట్టి' అనే ఆమెను ప్రేమిస్తాడు. ఆమెకు వేరొకరితో నిశ్చితార్థం జరగగా ఆవేదనతో తనను తాను కాల్చుకుని మరణిస్తాడు.

ఆ తరువాత తామరతంపరగా జరిగిన ఆత్మహత్యలను 'Werther epidemic' అని పిలిచారు.

## 6) ఆత్మహత్య ఒప్పందాలు; సామూహిక ఆత్మహత్యలు :

మేరీ అనే ఆమెను ప్రేమించిన క్లీస్ట్ (Heinrich Von Kleist) అనే జర్మన్ కవి ఇద్దరం కలిసి చనిపోదామని అడిగితే ఆమె ఒప్పుకోకపోవడంతో,

కాన్సర్‌తో ఆఖరి ఘడియలలో ఉన్న హెన్రియెట్టి (Henriette) అనే ఆమెను ఒప్పించి ఆమెను కాల్చి, తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్లేగు, కలరా లాంటి ఎపిడమిక్ జనాల్ని కబళించి వేస్తున్నపుడు కొందరు తుపాకులతో కాల్చుకునో, మేడలపై నుంచి దూకో ఆత్మహత్యలు చేసుకున్నారు.

పాత నిబంధన మొత్తంలో (Old Testament) నాలుగు ఆత్మహత్యలు కానవస్తాయి. (శాంసన్, సౌల్, అబిమెలెక్, అహితొఫెల్) తమపై విధించబడిన నిషేధాలకు వ్యతిరేకంగా యూదులనేకసార్లు సామూహిక ఆత్మహత్యలకు పాల్పడినారు. ఇవికాక సౌల్ అంగరక్షకుడు, జిమ్రి, రాజెస్ అనేవాళ్లు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడిచారు.

ఇండియాలో (1303) చిత్తోర్ దుర్గంను అల్లావుద్దీన్ ఖిల్జీ చుట్టుముట్టగా భీంసింగ్ యుద్ధంలో మరణిస్తే రాణి పద్మిని, ఆమె చెలికత్తెలు, స్త్రీలు 'జౌహర్' చితిమంటలపై దూకి చనిపోయారు. మరల 1535లో బహదూర్‌షా చిత్తోర్‌ను ముట్టడిస్తే 32000 మంది వీరులు యుద్ధంలో చనిపోగా, 13000 మంది స్త్రీలు 'జౌహర్'లో మరణించారు. ఆఖరుసారి 1568లో అక్బర్ చిత్తోర్ దుర్గాన్ని ఆక్రమించినప్పుడు మరోసారి అక్కడి స్త్రీలు చితిమంటలలో పడి ఆత్మహత్య చేసుకున్నారు.

నవంబర్ 1978లో రెవరెండ్ జిమ్ జోన్స్ అనే మూర్ఖవేదాంతి మాటలను నమ్మి జోన్స్‌టౌన్‌లోని ప్రజల దేవాలయంలో 163 మంది మహిళలు, 138 మంది పురుషులు, 82 మంది పిల్లలు సామూహిక ఆత్మహత్య చేసుకున్నారు. కాన్సర్‌తో బాధపడ్తున్న జిమ్‌జోన్స్, అతడి భార్య, ప్రియురాలు, కుమారుడు– నలుగురూ తుపాకితో కాల్చుకుని మరణించారు.

**7) ప్రతీకారపు ఆత్మహత్యలు (Revenge Suicides) :**

తనను మోసం చేసిన ప్రియురాలికి కానుకగా ఒక కొవ్వొత్తిని, ఒక లేఖను పంపాడు. ఆ లేఖ చదువుతుంటే ఆమెకు అర్థమయ్యిందేమిటంటే 'బ్రతికున్నపుడు తానెలా ఆమె ప్రేమకోసం కాలిపోయాడో, ఇప్పుడు చనిపోయాక కూడా అలానే కాలిపోతున్నాడని. ఆమె చేతిలో ఉన్న కొవ్వొత్తి తాను చనిపోయాక తన శరీరం నుంచి తీసిన కొవ్వుతో తయారు చేసిందనీ' - You will be sorry when I am dead'–.

✧✧✧✧✧

# 4. ఆత్మహత్యలు

బెదిరించడానికి 'ఆత్మహత్యా ప్రయత్నం' చేసేవాళ్లకు, ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్న వాళ్ల పద్ధతుల్లో (Modus operandi) స్పష్టమైన తేడాలున్నాయి.

1) ఒంటరిగా ఉండడం
2) సాయం దొరకని సమయం
3) ఇతరుల కంటబడకుండా తీసుకునే జాగ్రత్తలు
4) ఆత్మహత్యకు కావాల్సిన సరంజామాను సిద్ధం చేసుకునే పద్ధతి
5) ముందే ఇతరులను హెచ్చరించడం
6) దీర్ఘకాలం అంతర్గత చర్చ
7) మరణించేముందు వ్రాసిన ఉత్తరం
8) తనను అడ్డుకుంటారని భావించిన వాళ్లను దూరంగా ఉంచడం
9) ఆత్మహత్య చేసుకోవాలనే కోరికను బహిర్గతం చేయడం

ఇవి ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయం గట్టిదే అన్న విషయాన్ని తెలుపుతాయి.

తనకు హాని కలిగించుకోడానికి (Self-harm) ఎవరైనా నిశ్చయించుకున్నారంటే, ఖచ్చితంగా ఏదో బలవత్తరమైన కారణం ఉండి ఉంటుంది.

1) చనిపోవాలని నిశ్చయించుకోవడం
2) భరించలేని దుఃఖాన్ని, నిరాశ నుంచి తప్పించుకోవడానికి
3) విశ్రాంతికి, కష్టాల నుంచి ఉపశమనానికి
4) ఇతరులను మార్చడానికి
5) ఒక క్లిష్ట పరిస్థితి నుంచి తప్పించుకోడానికి
6) తన తెగువను, మొండితనాన్ని ఇతరులకు ప్రదర్శించడానికి
7) ఇతరులు అపరాధ భావనతో కృంగేలా చేయడానికి
8) ఇతరుల సాయాన్ని పొందడానికి

ఈ పద్ధతిని కొందరు అవలంబిస్తారు.

ముప్పైమంది ఆత్మహత్యకు ప్రయత్నిస్తే ఒక్కరు సఫలమవుతారని ఒక అంచనా. దిగులు, దుఃఖం, నిరాశ, ఆల్కహాల్, మందులు, మానసిక వ్యాధులు

ఉన్నవాళ్లలో ఆత్మహత్యలు, మామూలు జనాభాకన్నా దాదాపు వందరెట్లు ఎక్కువట.

1) ఇదివరకు ఆత్మహత్యాప్రయత్నం చేసినవారు
2) వ్యక్తిత్వ లోపాలున్నవారు
3) ఆల్కహాల్‌కు, డ్రగ్స్‌కు బానిసలు
4) ఇంతకు ముందు మానసిక చికిత్స పొందినవారు
5) నిరుద్యోగులు
6) వెనుకబడిన కులాలవారు (ఆర్థికంగా, సామాజికంగా)
7) నేరచరిత్ర కలిగినవారు
8) హింసాప్రవృత్తి కలవారు
9) ఒంటరివాళ్లు, విడాకులు తీసుకున్నవాళ్లు, 25-54 మధ్య వయస్సున్న వాళ్లల్లో ఆత్మహత్యల శాతం ఎక్కువ అని శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలలో తేల్చిచెప్పారు.

సంచలనం సృష్టించిన కొందరి ఆత్మహత్యలను పరిశీలిద్దాం.

**1) ఫ్రాయిడ్ :** ప్రముఖ మానసిక శాస్త్రవేత్త, న్యూరాలజిస్టు సిగ్మండ్ ఫ్రాయిడ్‌కు నోటి కాన్సర్ కలిగిస్తున్న బాధ మరింత తీవ్రమైంది. అనేకసార్లు శస్త్రచికిత్సలైనా మరల మరల తిరగబెట్టడం, బాధ భరించరానిది కావడంతో ఫ్రాయిడ్ ఒక నిర్ణయానికి వచ్చాడు. 1939 సెప్టెంబరు నాటికి వ్యాధి మరింత జటిలం కావడంతో వైద్యులు పరీక్షించి శస్త్రచికిత్సకు లొంగనిదిగా నిర్ధారించారు. నాజీల ధాటికి స్వదేశాన్ని వదిలి లండన్‌లో ఉంటున్న ఫ్రాయిడ్ తన ఆంతరంగిక మిత్రుడు, తమ దేశస్థుడైన డాక్టర్ మాక్స్ స్కర్ (Max Schur)ను పిలిచి ఇద్దరి మధ్య ఉన్న ఒప్పందాన్ని గుర్తుచేసాడు– 'ఆఖరి క్షణాల్లో నన్ను విధి నిర్ణయానికి వదిలేయడం లేదుకదా!'. డాక్టర్ స్కర్ తన స్నేహితుడికి భరోసా యిచ్చాడు. ఫ్రాయిడ్‌కుమార్తె అన్నాతో సంప్రదించాడు. మొదట ఒప్పుకోకపోయినా తండ్రి పడ్తున్న బాధను చూసి ఆమె తన అంగీకారాన్ని తెలిపింది. 21-22 సెప్టెంబరు 1939, రెండు రోజుల్లో డాక్టర్ మాక్స్ స్కర్ చిరునవ్వుతో విశ్రమిస్తున్న ఫ్రాయిడ్‌కు 'మార్ఫిన్' ఎక్కువ మోతాదులో ఇచ్చాడు. మామూలు నిద్ర నుంచి, గాఢ నిద్రలోకి, ఆ తరువాత 23 సెప్టెంబర్ 1939 నాడు ఫ్రాయిడ్ శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. తరువాత మూడు రోజులకు దహన సంస్కారం అనంతరం అస్థికలను ఫ్రాయిడ్‌కు ప్రిన్సెస్ బొనపార్టి కానుకగా ఇచ్చిన గ్రీకు కలశంలో

ఉంచారు. ఆ విధంగా సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆఖరి క్షణాలు Assisted Suicideతో ముగిసాయి.

**2) సిల్వియా ప్లాత్ :** అద్భుతమైన కవయిత్రి. కవి హ్యూగెస్ (Hughes) తో విడాకులు తీసుకుని అయిదు నెలలైంది. అప్పుడప్పుడూ మానసిక దిగుళ్లతో బాధపడ్తున్న ప్లాత్‌కు మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ హోర్డర్ వైద్యం చేస్తున్నాడు. ఆమెలో ఆత్మహత్య చేసుకునే లక్షణాలు కనబడడంతో హాస్పిటల్‌లో ఎడ్మిట్ కమ్మని చెప్పగా ఆమె నిరాకరించింది. అయినా డాక్టర్ హోర్డర్ ఆమెను ప్రతిరోజూ పరీక్షిస్తూ, ఆమెను కనిపెట్టుకుని ఉండడానికి ఓ 'నర్సు'ను కూడా నియమించాడు.

11 ఫిబ్రవరి 1963 ఉదయం తొమ్మిది గంటల కల్లా నర్సు వచ్చేప్పటికి 'ప్లాత్' ఇంటి తలుపులు బిగించి ఉన్నాయి. అనుమానంతో ఆమె దగ్గర్లో పనిచేస్తున్న ఛార్లెస్ లాంగ్‌రిడ్జ్ అనే అతడి సాయంతో ఫ్లాట్ తలుపులు తెరిచి లోపలకు వెళ్లేసరికి వంటగది మూసి ఉన్నది. వంటగదిలో గాస్ ఓవెన్ లోపల తన తలను లోపలకు ఉంచి గాస్ ఆన్ చేసుకుని మరణించి ఉన్నది సిల్వియా పాత్.

కార్బన్ మోనాక్సైడ్ విషవాయువు పిల్లలవేపు పోకుండా కిచెన్ గది తలుపులకు కిటికీలకు తడి తువాళ్లు, గుడ్డలు అడ్డం పెట్టిమరీ పకడ్బందీగా ఆత్మహత్య చేసుకున్నది.

ఆమె ఆత్మహత్యపై వచ్చినంత వివాదం బహుశా ఇంకెవ్వరి మరణం లోనూ రాలేదేమో! ఫెమినిస్టులు ముక్తకంఠంతో ఆమె చావుకు హ్యూగెస్ కారణమని నిందించారు. 1969లో హ్యూగెస్ సహచరి ఎస్సియా వెవిల్ (Assia Wevill) తన నాలుగేళ్ల కుమార్తె షురా (Shura)తో కలిసి ఆత్మహత్యకు పాల్పడడంతో మరలా హ్యూగెస్ అందరి నిందలకు గురైనాడు. ఇరవై ఏళ్లపాటు సాగిన వాగ్వాదాల్లో ఒకసారి ఫెమినిస్టులు అతడిని చంపుతామని హెచ్చరించారు కూడా! విచిత్ర మేమంటే మార్చి 16-2009 నాడు ప్లాత్-హ్యూగెస్‌ల కుమారుడు కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాత్ జీవిత ఘట్టాలలోని వ్యక్తుల ఆత్మహత్యలకు కారణం తీవ్రమైన దిగులు, నిరాశ, Depression.

**3) వాన్ గో (Van Gogh) :** ఎన్నో అద్భుతమైన కళాఖండాలను సృష్టించిన విన్సెంట్ వాన్‌గో 22 ఫిబ్రవరి 1890 నాడు మరోసారి మానసిక అశాంతికి లోనైనాడు. ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు, తన సోదరుడు 'థియో'పై ఎన్నాళ్లు ఇలా ఆధారపడాలి అన్న భావన, చాలదా ఈ జీవితం అన్న ఆలోచన, ఇలా అనుకుంటూనే తనకెంతో ఇష్టమైన గోధుమ పొలాల గుండా నడుస్తున్నాడు.

అకస్మాత్తుగా ఆగి తన దగ్గర ఉన్న రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. అది నిర్మానుష్య ప్రదేశం. 37 ఏళ్ల వయసున్న వాన్ గో 27 జులై 1890 నాడు రొమ్ముపై కాల్చుకుని నెమ్మదిగా నడుచుకుంటూ తన గదికి చేరుకున్నాడు. ఆబర్గ్ రావాక్స్ (Auberge Ravoux) లోని వైద్యులు వచ్చి చూసారు కాని పెదవి విరిచారు. వాన్ గో పైప్ కాల్చుకుంటూ ఆ రాత్రంతా నిద్రపోయాడు. బుల్లెట్ లోపల పెద్ద గాయం చేసినట్లు లేదు. తెల్లవారే విషయం తెలిసి సోదరుడు 'థియొ' వచ్చేసరికి 'వాన్ గో' స్థిమితంగానే ఉన్నట్లు కనిపించినా, కాల్చుకున్న 29 గంటలకు 28 జులై 1890 సాయంకాలం తుదిశ్వాస తీసుకున్నాడు.

అతని చిత్రాలలోని వైవిధ్యాల్ని పరిశీలించిన దాదాపు 150 మంది మానసిక శాస్త్రవేత్తలు మానసిక స్థితి బాగున్నపుడు, లేనప్పుడు చిత్రీకరించిన వాటిని విశ్లేషిస్తూ అతడికున్న మనోవ్యాధిని అంచనా వేయడానికి ప్రయత్నించారు. వాన్ గో ఆత్మహత్య చేసుకోలేదనీ, ఇద్దరు కుర్రాళ్లు అతనిని కాల్చారనేది ఒక వాదం. ఆ రివాల్వర్ దొరకకపోవడం, వాన్ గో ఏమీ చెప్పకపోవడం ఇవన్నీ ఈ ఆత్మహత్యలోని కొన్ని సమాధానం దొరకని ప్రశ్నలు.

**4) క్లియొపాత్రా :** 'ఆ చిన్నదాని ముక్కు కొంచెం చిన్నదిగా ఉంటే ప్రపంచపు ముఖచిత్రమే మరోలా ఉండేది' - అన్నాడు బ్లెయిజ్ పాస్కల్. క్లియొపాత్రా క్రీస్తుపూర్వం 69లో అలెగ్జాండ్రియాలో పుట్టింది. ఆమె తండ్రి టాలమి-XII (Ptolemy XII) అలెగ్జాండర్ వంశస్థుడు. 48 B.C. లో జూలియస్ సీజర్ తన శత్రువు పాంపేను వెదకుతూ ఈజిప్టు వచ్చేసరికి, సోదరుడితో గొడవపడి ఉన్న క్లియొపాత్రా, జూలియస్ సీజర్ ప్రాపకం కోసం– 'ఒక అందాల తివాచీలో దాక్కుని, సీజర్‌కు కానుకగా అతని ముందు ప్రత్యక్షమయ్యింది. ఆమె అందానికి, తెగువకు, తెలివికి ముగ్ధుడైన సీజర్ తన 52వ ఏట 21 ఏళ్ల క్లియొపాత్రాను వివాహం చేసుకున్నాడు. 47 B.C. లో ఇద్దరి ప్రేమఫలం 'సిజెరియాన్' (Caesarion) జన్మించాడు. సెనెటర్ల కుట్ర వల్ల జూలియస్ సీజర్ 15 మార్చి 44 B.C. నాడు హత్య చేయబడినాడు.

41 B.C.లో ఏంటోనీ ఈజిప్టు వచ్చినపుడు గులాబీ రేకులు నింపబడిన నౌకలో 'వీనస్' రూపంలో క్లియొపాత్రా, ఆంటోనికి స్వాగతం పలికింది. అతని వలన తనకు కలిగిన కవలలకు క్లియొపాత్ర సెలెని–II (Moon), అలెగ్జాండర్ హెలియాస్ (Sun) అని పేర్లు పెట్టింది. ముగ్గురు చక్రవర్తులు (Triumvirate) – ఏంటోని, ఆక్టెవియస్, లెపిడస్‌ల మధ్య విభేధాలు పొడసూప సాగినాయి. రాజకీయ కారణాల వల్ల ఆక్టెవియస్ సోదరిని ఏంటోని వివాహం చేసుకున్నాడు.

ఆక్టేవియస్ క్రమేపీ పుంజుకుంటూ 'లెపిడస్'ను ఖైదు చేసినాడు. అతని ప్రవర్తన నచ్చక ఏంటోని ఈజిప్టు వెళ్లి క్లియోపాత్రా ప్రేమలో మునిగిపోగా, ఆక్టేవియస్ ఏంటోనీల మధ్య యుద్ధం తప్పనిసరైంది.

ఏక్టియం వద్ద జరిగిన నౌకాయుద్ధం మధ్యలో క్లియోపాత్రా తన అరవై నౌకలతో వెనుదిరగడం చూసిన ఏంటోని తానూ యుద్ధం ఆపి క్లియోపాత్రాను అనుసరించాడు. 'This foul Egyptian hath betrayed me' అంటూ. అయితే క్లియోపాత్రా ఆత్మహత్య చేసుకుందన్న పుకారు వినగానే ఏంటోని కత్తితో పొడుచుకుని, క్లియోపాత్రా దాగి ఉన్న మందిరంలోకి గోడపై నుండి లోపలికి పడేట్లు చేయించుకుని ఆమె ఒడిలో కన్నుమూస్తాడు.

ఆక్టేవియన్ తనను అంగీకరించడని అర్థమయిన క్లియోపాత్రా 30 B.C. ఆగష్టు 12 నాడు Asp విషసర్పంతో తన పెదాలపై, రొమ్ములపై కాటు వేయించుకుని చనిపోతుంది.

ఇద్దరు ప్రేమికుల్ని ఒకేచోట శవాలుగా చూసిన ఆక్టేవియన్ మనసు ద్రవించగా– 'వారిద్దరినీ ఒక్కచోటనే సమాధికానివ్వండి. ఏ సమాధి వారిని వేరు చేయరాదు' అని వారికి సమస్త లాంఛనాలతో అంత్యక్రియలు కావిస్తాడు.

**5) డిడొ మహారాణి :** కొయ్యగుర్రంలో దాక్కుని మాయోపాయంతో ట్రాయ్ నగరంలోకి ప్రవేశించిన గ్రీకు వీరులు నగరాన్ని సర్వనాశనం గావిస్తున్నారు. విపత్తును ముందే ఊహించిన ఈనియస్ కొంతమంది అనుచరులు, సంపదలతో తండ్రిని భుజాలపైకెక్కించుకుని, కుమారుడు వెంట రాగా ట్రాయ్ నగరాన్ని వదిలి పారిపోతుండగా, ఆ గందరగోళంలో చీకటిలో అతని భార్య దారితప్పి మరణిస్తుంది.

ఆ తరువాత సముద్ర ప్రయాణంలో అనేక గండాలు గడచి కార్థేజ్ చేరుకుంటాడు ఈనియస్. ఫొనిషియా నుంచి తన సోదరుడి దుశ్చర్యలకు లోనై భర్తను పోగొట్టుకున్న డిడొరాణి, ఎద్దు చర్మాన్ని పీలికలుగా చేసి అది ఆక్రమించినంత స్థలాన్ని (Bursa-Ox hyde) కొనుక్కుని అక్కడ కోట నిర్మాణం కావిస్తుంది.

నౌకా ప్రమాదంలో చావుతప్పి తన రాజ్యానికి చేరిన ఈనియస్‌ను చూడగానే ఆమెలో ప్రేమ, తనను స్థానిక గెటూలియన్ రాజు అయార్బస్ నుంచి రక్షణ కల్పించగలడనే నమ్మకం కలిగి, ఈనియస్‌తో సన్నిహితమయ్యే పరిస్థితులను కల్పించి అతనికి తననర్పించుకుంటుంది.

ఈనియస్ ఆలోచనలు వేరు. దేవతలు అతడిని భవిష్యత్ రోమ్ సామ్రాజ్య నిర్మాతగా భావించి ఉన్నారు. అందుచేత అతడు డిడోరాణితో తన కలయికను వివాహంగా భావించలేదు. దేవతలు హెచ్చరించగానే 'డిడో'పై ప్రేమను చంపుకుని కార్యదీక్షలో సముద్రమార్గం పట్టినాడు ఈనియస్.

తాననుకున్నది జరగకపోవడం, తన ప్రేమ విఫలం కావడంతో డిడోరాణి ఆగ్రహోన్మాదాలు ముప్పిరికొనగా, చితినేర్పాటు చేసుకుని దానిపై తామిద్దరు శయనించిన మంచాన్ని, ఈనియస్ వస్త్రాల్ని ఉంచి, ఈనియస్ కత్తితో గుండెల్లో పొడుచుకుని తన కార్థేజియన్లు, ఈనియస్ వారసులపై తరతరాలుగా ప్రతీకారం తీర్చుకుంటారని పలుకుతూ ప్రాణాలు విడుస్తుంది. దూరంగా సముద్రంలో ఓడలపై పయనిస్తున్న ఈనియస్, అతని అనుచరులు ఆ చితిమంటలను చూసి 'డిడొరాణి' మరణాన్ని గ్రహిస్తారు.

ఆ రకంగా రోమ్, కార్థేజిల మధ్య మూడు యుద్ధాలు (Punic wars) సంభవించడం, హన్నిబాల్ బార్కా రోమ్‌ను ముట్టడించేలా 'డిడొ' పగ పురికొల్పుతుంది.

**6) హన్నిబాల్ బార్కా (182 B.C.) :** ఏనుగులను ఆల్ప్స్ పర్వతాల మీదుగా నడిపించి రోమన్లను ముప్పుతిప్పలు పెట్టినవాడు. రెండవ ప్యూనిక్ యుద్ధంలో రోమ్ సామ్రాజ్యాన్ని మోకాళ్లపైకి తెచ్చిన కార్థజినియన్ జనరల్ హన్నిబాల్ బార్కా. డిడొరాణి ఆశయాన్ని దాదాపు సఫలం చేసినవాడు. దాదాపు ఇరవై ఏళ్లు రోమన్లను వణికించిన ఆ మహాసేనానిని అతడి అరవై నాలుగవ ఏట రోమన్లు చుట్టుముట్టారు. 'ఇంకెక్కడికి పోతుందీ ముసలిపక్షి? Like a bird that has grown too old to fly' – అని రోమన్లు జామా యుద్ధంలో (The battle of Zama) అతడిని ప్రాణాలతో బంధించాలనుకున్నారు. 'రోమన్ల నిరీక్షణకు తెరతీద్దాం. ఎన్నాళ్లని పాపం నా మృత్యువు కోసం ఎదురు చూస్తారు వాళ్లు' అంటూ ఆ మహాయోధుడు విషాన్ని తాగి విగతజీవుడైనాడు.

**7) లుక్రెషియా (508 B.C.) :** క్రీస్తుపూర్వం 753–509 మధ్య రోమ్‌లో రాచరిక వ్యవస్థ ఉండింది. ఈ కాలపు చివరి రోజుల్లో Tarquin the proud అని పిలువబడిన ల్యుసియస్ టార్క్వినస్ సుపర్బస్– రోమ్‌ను పరిపాలిస్తున్నాడు. అతడి మూడవ కుమారుడి కన్ను లుక్రెషియా అనే గౌరవనీయ కుటుంబానికి చెందిన స్త్రీపై పడింది. ఆమె భర్త, బంధువులు యుద్ధానికి వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెను బెదిరించి తన కోరిక తీర్చుకున్నాడు.

మరుసటిరోజు ఉదయాన్నే 'లుక్రెషియా' తన తండ్రి ఇంటికి వెళ్లి జరిగింది వివరించి కత్తితో పొడుచుకుని, ప్రతీకారం తీర్చుకోమని కోరుతూ కన్నుమూసింది. ఆమె ఆత్మహత్య రోమన్లలో ప్రతీకార వాంఛ రేపగా, ప్రజల తిరుగుబాటుతో రాచరికం అంతమైంది.

**8) సోక్రటీస్ (399 B.C.) :** ప్రతి ఒక్కరినీ ప్రశ్నించే తత్త్వం, నిజాన్ని అన్వేషించే జిజ్ఞాస ఉన్న వేదాంతి సోక్రటీస్. ఆనాటి రాజకీయ నాయకులను, మేధావులను, కళాకారులను తన ప్రశ్నలతో ఇరుకున పడేసేవాడు. అలా అతడికి తన నగరం ఏథెన్స్ (Athens) నిండా శత్రువులు పోగయ్యారు. బాణాలకన్నా పదునైన ప్రశ్నలు వేస్తుండడంతో విసిగిన వీళ్లు సోక్రటీస్‌ను న్యాయస్థానం ముందు నిలబెట్టారు. ఓటింగ్‌లో సోక్రెటీస్ వెనకబడడంతో ఆనాటి సంప్రదాయం ప్రకారం నగర బహిష్కరణ కావాలా, విషం పుచ్చుకుని చనిపోతావా అని అడిగారు. మళ్లీ ప్రశ్నలు. చనిపోవడానికే ఇష్టపడిన సోక్రటీస్ హెమ్‌లాక్ (Hemlock) విషాన్ని తాగి, మరణించే ముందు ఆత్మయొక్క శాశ్వతత్వాన్ని గురించి మాట్లాడుతూ కన్నుమూసాడు.

**9) కాటో (Cato the Younger)** (46 B.C.) – 'కాటో' గొప్ప ప్రసంగి. నియంతృత్వాన్ని వ్యతిరేకించేవాడు. పాంపేను ఓడించి జూలియస్ సీజర్ మంచి ఊపులో ఉన్నాడు. కాటో, స్కిపియోలు ఆఫ్రికాలో పెద్ద సైన్యంతో ఉన్నా, సీజర్ దళాలు వారిని ఓడించాయి. జూలియస్ సీజర్‌కు లొంగడం ఇష్టంలేని 'కాటో' కత్తితో పొడుచుకున్నాడు. అయినా చావు రాకపోయేసరికి గాయాన్ని మరింత వెడల్పు చేసుకుంటూ అతడు మరణించినాడు. అతడి దేహాన్ని చూసిన 'జూలియస్ సీజర్' ఇలా అన్నాడంటారు– "Cato, I grudge you your death, as you would have grudged me the preservation of your life".

**10) బ్రూటస్ (42 B.C.)-** సెనెటర్ల కుట్రతో కాసియస్, బ్రూటస్‌లు 44 B.C. లో జూలియస్ సీజర్‌ను హత్యగావించినారు. ఏంటోని తెలివిగా ప్రజాగ్రహాన్ని బ్రూటస్, కాసియస్‌లపై మళ్లించగా అంతర్యుద్ధం మొదలైంది. ఆక్టేవియన్, ఏంటోనీలు బ్రూటస్ తదితరులను రోమ్ నుంచి బహిష్కరించారు. ఫిలిప్పి వద్ద జరిగిన యుద్ధంలో బ్రూటస్ పక్షం ఓడిపోగా బ్రూటస్ తన కత్తిపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

**11) సెనెకా (65 A.D.) :** నీరో ప్రభువుకు గురువు, స్టాయిక్ వేదాంతి అయిన సెనెకాపై రాజద్రోహ నేరం ఆరోపించబడింది. శిష్యుడు నీరో గురువును బంధించమని ఆజ్ఞాపించాడు. సైనికులు 'సెనెకా' భవనాన్ని చుట్టుముట్టినారు.

సెనెకా, అతని భార్య రక్తనాళాలు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సెనెకాకు రక్తస్రావం నెమ్మదిగా అవుతుండడంతో ఆతడు తనను వేడినీళ్ల తొట్టిలో ఉంచమన్నాడు. అదికాక ఇంత హెమ్‌లాక్ విషాన్ని తాగి విగతజీవుడైనాడు.

నీరో వచ్చి చూసేసరికి స్పృహతప్పి పడి ఉన్న సెనెకా భార్య (ఆమె తర్వాత కోలుకున్నది), మరణించిన సెనెకా దేహం కనిపించాయి. నియంతలకు దేహాలతో పనిలేదు కదా!

**12) నీరో (68 A.D.) :** గురువును చంపిన పాపం ఊరికే పోదు! తన భోగలాలసతో, విశృంఖల విన్యాసాలతో రోమ్ ప్రజలతో అసహ్యాంప బడినాడు. రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్నాడనీ, రోమ్ నగరాన్ని తగలబెట్టమని తన అంతరంగిక సైనికులకు ఆజ్ఞ ఇచ్చింది 'నీరో' అని కొందరు భావిస్తారు. మాతృహత్య, ఆర్థిక దుస్థితి, రోమ్ నగరం తగలబడడం ఇవన్నీ తిరుగుబాటుకు దారితీయగా నగరం నుంచి పారిపోయి, బయటెవరి అండా, సాయం దొరకక మరల నగరంలోకి వచ్చి ఓ మూల దాక్కున్నాడు. "Have I neither friend nor foe' అంటూ

సెనెట్ అతడిని ప్రజాశత్రువుగా పరిగణించడంతో తనని బంధించడానికి వస్తున్న అశ్వికుల సందడి వినగానే ఆత్మహత్య చేసుకునే ధైర్యం కోల్పోయి తన అంతరంగికుడితో గుండెలో పొడిపించుకుని 'What an artist dies in me' అంటూ మరణించాడు.

**13) ఓథొ (Otho 69 A.D.):** నీరో చనిపోయాక ఒక్క సంవత్సరంలో నలుగురు చక్రవర్తులు మారినారు. వీరిలో రెండవ చక్రవర్తి ఓథొ. ఒకప్పుడు 'నీరో'కు సన్నిహితుడు కూడా! మార్కస్ సాల్వియస్ ఓథొ తన శత్రువు గల్బా (Galba)ను తొలగదోసి రాజైనాడు. విటెల్లియస్‌తో జరిగిన యుద్ధంలో ఇరుపక్కలా దారుణ నష్టం జరిగింది. మరింత రక్తపాతం ఇష్టం లేక తెల్లవారుజామున లేచిన ఓథొ గుండెలో కత్తితో పొడుచుకుని మరణించాడు. 'It is far more Just to perish one for all, than many for one'.

**14) వర్జినియా వుల్ఫ్ (Virginia Woolf) (25-1-1882 to 28-3-1941) :** "A woman must have money and a room of her own if she is to write fiction" – అని చెప్పిన వర్జినియా వుల్ఫ్ – ఇరవై శతాబ్దాల మోడర్నిస్టులలో అగ్రభాగాన ఉండి, బ్లూమ్స్ బరీ మేధావులలో ముఖ్యురాలుగా ప్రసిద్ధికెక్కింది.

'Between the acts' అన్న పుస్తకాన్ని వ్రాసాక మరోసారి డిప్రెషన్‌కు గురైంది. రెండవ ప్రపంచ యుద్ధం, తన తాజా పుస్తకంపైని విమర్శలు, నిరాదరణ

ఆమెను మరింత దిగులుకు గురిచేసాయి. భర్తకు లేఖ వ్రాసి, 28 మార్చి 1941 నాడు ఓవర్ కోటు నిండా రాళ్లు నింపుకుని River Ouse లో మునిగి చనిపోయింది. 18 ఏప్రిల్ 1941 నాడు ఆమె శవం బయటపడగా దహన సంస్కారాలు నిర్వహించారు.

"Dearest, I feel certain that I am going mad again. I feel me can't go through another of those terrible times. And I shall not recover this time....' – ఇలా తన నిర్ణయాన్ని లేఖలో వ్రాసిందామె.

**15) ఆరన్ హెచ్. స్వార్ట్జ్ (Aaron H. Swartz - 8-11-1986 to 11-1-2013) -** Web feed, Reddit, Demand Progress, Stop Online Piracy act లాంటి సంస్థల్లో, ఉద్యమాల్లో ప్రముఖపాత్ర వహించిన ఆరన్ స్వార్ట్జ్ అమెరికన్ కంప్యూటర్ ప్రోగ్రామర్, రచయిత, పొలిటికల్ ఆర్గనైజర్, ఇంటర్నెట్ ఏక్టివిస్టు Wire fraud, Computer fraud and abuse act క్రింద నిందించబడినాడు. నేరం ఋజువైతే ముప్ఫై అయిదేళ్ల జైలుశిక్ష, మిలియన్ డాలర్ల జరిమానా, ఇంకా తదితర ఆంక్షలు తప్పవు.

రెండేళ్లపాటు వాద ప్రతివాదనలు నడిచాక 11 జనవరి, 2013 ఉదయం ఆరన్ స్వార్ట్జ్ ఉరివేసుకుని మరణించి ఉండగా కనుగొన్నారు. ఒక కంప్యూటర్ మేధావి ఇరవై ఏడేళ్ల వయసులో అకాల మృత్యువు పాలైనాడు.

అలాగే న్యూరెంబర్గ్ విచారణలో నేరస్థుడిగా ఋజువైన ప్రముఖ నాజీ, రీఛ్‌లో ముఖ్యుడు గోరింగ్ కస్టడిలో ఉండగానే పొటాసియం సైనేడ్ కాప్యూల్ మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి ఆ విషపు గోళీ ఎలా దొరికిందన్నది ఇప్పటికీ మిస్టరీయే!

సంచలనం కలిగించిన మార్లిన్ మన్రో ఆత్మహత్య, అందరికీ తెలిసిందే!

**మూకుమ్మడి ఆత్మహత్యలు :**

**1) పుపుటాన్ (బాలి) 1906 :** డచ్ సైన్యం తమపైకి దండెత్తి వస్తుందని తెలియగానే వేలాదిమంది బాలినీస్ రాజవంశీకులు విలువైన వస్తువులను తగలబెట్టి డచ్ సైన్యం కళ్లెదురుగానే ఒకరినొకరు పొడుచుకుని చనిపోయారు. ఈ 'పుపుటాన్' అనే సామూహిక ఆత్మహత్యను ఇప్పటికీ అక్కడి పిల్లలకు నాటక రూపాన చూపిస్తుంటారు.

**2) సూర్యదేవాలయపు సైనికులు (Order of the Solar Temple - Switzerland and Canada) :** 1994లో మూడేళ్ల బాలుడిని Anti Christ గా

గుర్తించి బలిఇచ్చిన వీళ్లు, అదే సంవత్సరం అక్టోబరులో స్విట్జర్లాండ్‌లోని ఓ చర్చి నేలమాళిగలో 48 మంది పిల్లా పెద్దా ఒకరినొకరు తుపాకులతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

**3) హరాకిరి (జపాన్) :** సమురాయి బుషిడొ కోడ్‌లోని భాగంగా జపాన్ సైనికులు శిక్షగా గాని, ఇచ్ఛతో గాని ఆత్మహత్య చేసుకునే విధానాన్ని సెప్పుకు లేదా హరాకిరి (Seppuku, Harakiri) అని పిలుస్తారు. 1900 వరకు ప్రాచుర్యంలో ఉన్న పద్ధతి, మరల 1970లో కొందరు తిరుగుబాటుదారుల వలన వార్తలలోకెక్కింది.

**4) సికారి తిరుగుబాటుదారుల (Masada, Israel) :** క్రీస్తుశకం 72లో యూదులు తలదాచుకున్న హెరోదు కోటను సిల్వియస్ చక్రవర్తి ఆజ్ఞతో రోమన్ సైనికులు ముట్టడించగా 960 మంది యూదులు సామూహికంగా ఆత్మహత్య చేసుకున్నారు. కేవలం ఇద్దరు స్త్రీలు అయిదుగురు పిల్లలు బతికి ఉన్నారట.

ఇప్పుడు ఈ మసాదా ప్రాంతం ప్రముఖ పర్యాటక స్థలంగా ఇజ్రాయెల్‌లో ప్రసిద్ధికెక్కింది.

**5) జోహర్ (రాజస్థాన్, ఇండియా) :** చిత్తోర్ రాణి పద్మిని అంతఃపుర స్త్రీలతో చితిలో దూకి మరణించగా, మగవాళ్లు అల్లాద్దీన్ ఖిల్జీ సైనికుల్నెదుర్కొని యుద్ధంలో మరణించారు. అదే చిత్తోర్‌లో మరో రెండుసార్లు జరిగిన సామూహిక ఆత్మహత్యలతో అక్కడ రాజపుత్ర వంశం దాదాపు నిర్మూలమైంది.

**6) స్వయం దహనం (Self Immolation):** థ్విచ్ క్వాంగ్ డక్ అనే బౌద్ధ భిక్షువు తమపై అణచివేతకు నిరసనగా 1963లో సైగాన్ పట్టణపు కూడలిలో నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వియత్నాం ప్రభుత్వపు ఆంక్షలు పెరిగినా చలించని అనేకమంది బౌద్ధ భిక్షువులు ఈ Ritual Suicide ద్వారా ఆత్మార్పణ చేసుకున్నారు.

**7) స్వర్గలోకపు ద్వారం (Heaven's gate, San Diego, California)** మార్షల్ ఏపిల్ వైట్ అనే అతడు, 38 మంది అనుయాయులతో, హాలె-బాప్ తోకచుక్క ప్రకాశవంతంగా వెలుగుతున్న రోజున మూకుమ్మడి ఆత్మహత్య చేసుకున్నాడు. వాళ్ల ఆత్మలు అలా దివ్యనౌక ద్వారా పైలోకానికి చేరుకుంటాయని తన విశ్వాసులను నమ్మించాడతడు.

**8) The branch Davidian Seventh day Adventists-Waco-Texas** ఫ్లారెన్స్ హౌటెఫ్ అనే అతడు 1959లో 'జీసస్ వస్తున్నాడు టెక్సాస్

కొండపై నుంచి' అని ప్రకటించినాడు. ఆ జోస్యం తప్పని తేలడంతో సెవంత్ డే ఎడ్వంటిస్టులలో ప్రముఖుడైన వెర్నార్ హొవెల్ (డేవిడ్ కొరెష్) House of David ను నెలకొల్పివాడు. మారణాయుధాలు కలిగి ఉండడం, పిల్లలను హింసించడం వంటి ఆరోపణలతో, FBI ఈ సంస్థ కార్యాలయంపై దాడిచేయగా కాల్పులు, ఎదురు కాల్పులు, అగ్నిమంటలలో ఆ ప్రాంతం తగలబడి ఎనభైమంది చనిపోయారు. దీనిని సామూహిక ఆత్మహత్యగా ఎక్కువమంది భావించనా, FBI ఏదో దాస్తోందని కొందరు ఆరోపించారు.

**9) దేవుని దశాజ్ఞల పునరుద్ధరణ (ఉగాండా) :** మేరీ కన్య తమ కలలో కనబడి దశాజ్ఞలను పాటించమని చెప్పిందని 1980లో ఒక సంఘం ఏర్పడింది. దశాజ్ఞలను పాటించినా, వాళ్ల నాయకుడు చెప్పినట్లు అంతిమ తీర్పు రోజు రాకపోవడంతో వాళ్లతనిని ప్రశ్నించారు. లెక్కల్లో తేడా వచ్చిందని చెప్పిన అతగాడు ఈసారి మార్చి 17 'జడ్జిమెంట్ డే'గా నిర్ణయించి, ఆరోజు సమావేశమైన వేయిమందిని విషంతోనూ, మంటలలోనూ చనిపోయేట్లు ప్రోత్సహించి సఫలుడయ్యాడు.

**10) ప్రజాదేవాలయం (People's Temple - Jones Town - Guyana):** జిమ్ జోన్స్ అనే వ్యక్తి గయానాలో, అందరూ సమానం అన్న సూత్రంతో 'జోన్స్ టౌన్'ను స్థాపించాడు. అనేక రకాల పద్ధతులతో తన అనుయాయులను తనమాటే శిలాశాసనంగా నమ్మేట్లు చేయగలిగాడు. నవంబర్ 1978లో లియొర్యాన్ అనే కాలిఫోర్నియా కాంగ్రెస్‌మాన్ హత్యకు గురికావడంతో, అమెరికన్ల ప్రతీకారం తప్పదనుకున్న జోన్స్ తన అనుయాయులందరికి దాదాపు 918 మంది విషం కలిపిన పళ్లరసం తాగి సామూహిక ఆత్మహత్యకు పాల్పడేట్లు చేసి తానూ మరణించాడు. ఆధునిక కాలంలో ప్రసిద్ధికెక్కిన సామూహిక ఆత్మహత్య ఇదే!

✧✧✧✧✧


Sigmund Freud


Sylvia Plath


Von Gough



*The Death of Cleopatra by Reginald Arthur*



*Death of Dido, by Guercino*



*Lucretia, Suicide of a Roman Matron*



*Socrates, Suicide of a Philosopher*



*Hannibal Barca, Suicide of a Colossus*



*Cato the Younger, Suicide of a Stoic*




*Marcus Junius Brutus, Suicide of a Conspirator*



*Seneca, Suicide of a Philosopher*



*Nero, Suicide of an Artist*



*Otho, Suicide the Noble Way*

---

# List of Most Notorious Suicides in History



**Puputan, Bali**



**Order of the Solar Temple, Switzerland and Canada**



**Harakiri, Japan**



**Sicarii Rebels, Masada, Israel**



**Jauhar, Rajput, India**



**Self-immolation, Vietnam**



**Heaven's Gate, San Diego, California**



**The Branch Davidian Seventh-Day Adventists, Waco, Texas**



**Movement for the Restoration of the**
**Ten Commandments of God, Uganda**



**People's Temple Jonestown Massacre, Guyana**

---



**Marilyn Monroe**

# కవిత్వం

***Where, O Death, is your victory?***
***Where, O Death, is your sting?***

**The Bible- 1-Corinthians-15:55**

# 1. సమవర్తి

## (Death the leveller)

ఈ పేరు ప్రఖ్యాతులూ, రాచరిక రక్తం, హోదాలు
ఎందుకూ కొరగాని నిశీధి నీడలు
విధి నెదిరించే కవచమూ ఖడ్గమూ ఎక్కడన్నా ఉన్నాయా?
మృత్యు శీతల హస్తాలు తాకిన మరుక్షణం
రాజుల కిరీటం, రాజదండం
అన్నీ నేలపై రాలిపడతాయి
ఆ దుమ్మూధూళిలో అందరూ సమానమే!
పేదల పలుగూ, పారా, కొడవలీ!

కొందరు తమ కత్తులతో నేలను కోసి
వాళ్లు చంపిన చోట నాటుతారు తమాల వృక్షాన్ని
అంతటి సాహసవంతులూ తలవంచుతారు;
తమబోటి వాళ్లను లొంగదీసుకున్నవాళ్లూ
ఇప్పుడో, తరువాతనో
తమ గుసగుసలాడే విధికి తల ఒగ్గి ఊపిరి వదిలిపెట్టి
పాలిపోయిన ఖైదీల్లా మృత్యువుకు ప్రణమిల్లుతారు.

నీ నుదుటిపై పూలదండలు వడిలిపోతాయి
ఇంకెప్పుడూ నీ గురించి గొప్పలు చెప్పుకోలేవు
మృత్యువు ఊదారంగు బలిపీఠంపై చూడు
విజేత – పరాజితులిద్దరి రక్తాన్ని గమనించు
మీ తలలు తప్పకుండా
ఈ శీతల సమాధికి రావాల్సిందే
న్యాయ మార్గాన నడిచిన వాళ్ల పనులే
వాళ్ల మట్టినుంచి సుగంధ పుష్పాలై వికసిస్తాయి.

**– జె. షిర్లి (J. Shirley)**

## 2. మృత్యువుతో భేటీ

## (I have a Rendezvous with Death)

సరిహద్దుపై వివాదం గురించి
సార్వజనిక విశ్రమ స్థలంలో
మృత్యువుతో నాకు సమావేశం ఉన్నది.
ఎండుటాకుల నీడలు, ఏపిల్ పూల గుత్తులతో
వసంత ఋతువు వస్తున్నప్పుడే
మృత్యువుతో నాకు రహస్య సమావేశమున్నది.
అందమైన నీలికాంతుల రోజులవి.

అతడు నాకు కరచాలనం చేసి
తన చీకటిలోకానికి దారి తీస్తాడు
నా కన్నుల్ని మూసి, ఊపిరిని ఆపుతాడు
నేను నిశ్చలంగా ఉన్న నిశ్శబ్దపు స్థలంలో
మృత్యువుతో నాకు రహస్య సమావేశమున్నది.
దెబ్బతిని గాయపడ్డ కొండవాలులపైకి
కొత్త వసంతకాలం తెచ్చిన మైదాన పుష్పాల సాక్షిగా!

ఆ సృష్టికర్తకే తెలుసు ఏది ఉత్తమమో
పట్టు పరుపులు, సువాసనల మధ్య
ప్రేమ పొంగి పొరలే పరమానందకరమైన నిద్రలో
నాడికి నాడి, ఊపిరికి ఊపిరి దగ్గరై
మెలకువ లేని అగాధంలో విశ్రమిస్తున్నపుడు
మృత్యువుతో నాకు రహస్య సమావేశమున్నది.
ఏదో జ్వలిస్తున్న పట్టణంలో అర్ధరాత్రి
వసంత కాలమీ యేడు ఉత్తర దిక్కుకు ఒరిగినప్పుడు
నేను వాగ్దానం చేసినట్టుగానే
ఆ సమావేశ స్థలానికి చేరకుండా ఉండబోను.

**– అలన్ సీగర్ (Alan Seeger)**

# 3. ఆకస్మిక మృత్యువు

## (Sudden Death)

నాలుగో నెంబరు - టేబుల్ మీద చనిపోయిన బాలిక-
బంగారు శిరోజాల బాలిక-
నునుపుగా ఉన్న చలువరాతి బల్లపై ఉదారంగులో ఆమె-
గొంతుపై కత్తి గాటుతో, ఆమె థైరాయిడ్ గ్రంథి.

ఈథర్ మత్తు శంకువును పట్టుకున్న అతడికి
ఆమె లోతైన నీలికళ్లు భయంతో కదలాడడం గుర్తుంది
ఆమె ఊపిరి వణకడం, ఆమె రొమ్ములు
మరింతగా ఎగసిపడి, ఎగసిపడి ఆగడం గుర్తుంది.
ఆమె చేతులు ఏవో వృథా సంజ్ఞలు చేసాయి
మరింత మంచిగాలి కోసం ఆమె తన్నుకులాడింది.
తల తిప్పింది; ఆమె బుగ్గలు రక్తవర్ణంలో-
అకస్మాత్తుగా, ఆమె మరణించింది.

ఆమె కలలు కూడా, ఆమె రక్త నాళాల వెంబడి ప్రవహించి
ఉన్నట్టుండి ఓ చీకటి గోడపక్కన నిలిచిపోయాయి.
అక్కడంతా గందరగోళం; గుసగుసలు, కేకలు
అటు యిటూ తిరుగుతున్నారు, అరుస్తున్నారు
ఆమెను కదిలించారు, గదిమారు...
చివరకు పాలిపోయిన నిశ్శబ్దం వాళ్ల నోళ్లు మూసింది.

ఆమె పేరేమిటి? ఎక్కడ నుంచీ ఈ ఉదయం వచ్చిందామె?
ఆమె పాదాలు నడచి వచ్చిన అరణ్యమేది?
ఏ వెలుతురు గోడల వెంబడి? ఏ జన సందోహపు వీధి?
అతడి మనస్సు కొన్ని రోజుల వెనక్కు స్వప్నించింది,
ఆమె వెళ్తున్న వింత, విచిత్ర రహదారుల్ని-
నిద్రామెలకువల్లో, రాత్రింబవళ్లలో-
తన బంగారు జుట్టును జడవేసుకుంటూ
అద్దం ముందు ఆ బాలిక
దీపపు కాంతిలో కథ చదువుతున్న ఆ బాలిక!

ఆమె కంటె ముందు ఆమె నీడ కన్పించేదా వీధిలో
లయబద్ధంగా ఆమె నడక
మూలమలుపులో మెట్లు దిగి
వార్తాపత్రిక కొని, ప్రధానమైన వార్తలను చూసి
ఎండలో ఎగుర్తున్న సముద్రపు పక్షుల్ని పలకరించి
దీర్ఘ నిశ్వాసాలను విడిచిపుచ్చేది.

రోజులు గడిచాయి, ప్రకాశవంతమైన దినాలు,
రాత్రుళ్లూ గడిచాయి.
వెలుతురు కిటికీల గోడల మధ్య మంద్రంగా సంగీతం
ఆమె తన తలపైకెత్తి వెలుగును చూస్తూ నాట్యమాడేది
ఆమె సహచరులు అనేక రకాల విన్యాసాలూ
అభినయాలూ, భంగిమలతో అబ్బురపరిచేవారు.

ఊదారంగు వస్త్రాలు, బంగరు కాలిజోళ్లు,
ఆమె కళ్లు నీలలోహితాలు, ఆమె హృదయంపై
పర్పుల్ ఆర్చిడ్ పుష్పం తన బంగరు గుండెను విప్పార్చింది.
నెమ్మదిగా ప్రవహిస్తున్న సంగీతపు ఒరవడికి
ఆమె తన సహచరుని భుజంపై తలవాల్చింది.
వయొలిన్లు వెండి జలతారు తీగె వలల్ని విస్తరిస్తున్నాయి.
కొమ్ముబూరాలు బంగరు కాంతి జల్లుల్ని వెదజల్లుతున్నాయి
కాలం ఆ మెరుపుల్లో చిక్కుకున్నట్లయ్యింది.
దేనికీ చిక్కనిది, కాలం...

ఆమె వదనంపై ఆకుల నీడలు - సూర్యకాంతి-
తల తిప్పుకున్నదామె.
ప్రతిరోజూ, ప్రతి అడుగూ
వేచి చూస్తున్న చీకటివేపు వేసిందామె!
ఒక్క క్షణమే ఆమె గురించి యోచించిన మృత్యువు
అల్లంత దూరంలో, రాత్రి రహదారిలో
గవాక్షం నుంచి నవ్వుతూ, ఆమె ననుసరించింది.
చీకటి కాంతినుంచి కాంతిలోకి.

ఒకసారి, ఆమె స్వప్నాలలో, అతడు అరిచాడు
"నేను హంతకుడిని, మృత్యువును!
ఉచ్ఛ్వాస, నిశ్వాస ఊపిరి వాకిళ్ల దగ్గర
వేచివుండే ప్రేమికుడిని నేను!"

ఆమె లేచి నిలబడింది. తన నీడవైపు తదేకంగా చూసింది.
తన పక్కనే నిలబడి ఉన్న మృత్యురూపాన్ని చూసింది.
ఆమె భుజాలను ఆతడి చేతులు స్పృశించాయా?
లేక ఇదంతా ఆమె భ్రమా?

ఆమె తన తలను – అందంగా దువ్వుకున్నది.
శిరోజాలపై పడిన సూర్యకాంతి స్వర్ణకిరణాలైనాయి.
ఆ వెంట్రుకలలో స్తబ్ధత నిలిచి వున్నదా?
ఆ చేతులలో నిశ్శబ్దం గడ్డకట్టిందా?

మృత్యువు ఒక స్వప్నం!
అది ఈ కనులను ఏమార్చలేదు, కాంతిని
ఆర్పలేదు, ఈ నోటిని ధూళి చేయలేదు.
ఆమె తల దువ్వుకుంటూ పాట పాడుకుంటున్నది
"నేను కలకాలం జీవిస్తాను"–

గాలి విసురుకు ఆకులు ఆ కిటికీ వెంబడి ఎగిరాయి
నేలలో తవ్విన గోతుల్లోకి శవపేటికలు నిష్క్రమించాయి
అస్తమయపు వేళల్లోకి సంగీతం అంతర్ధానమై
స్వప్నాలు ఆమె రక్తనాళాల వెంబడి ప్రవహించాయి
చెల్లాచెదురైన మబ్బులు, గోడలపై గోపురాలపై
నీడల్ని, కాలువల్లా విసిరివేసాయి.

**– కాన్రాడ్ ఎయికెన్ (Conrad Aiken)**

# 4. మృత్యు నృత్యం
## (The Dance of Death)

చేతిలో పూలగుత్తి, జేబు రుమాలు, రబ్బరు తొడుగులు
బ్రతికున్నపుడు తన ఎత్తు గురించి గర్వపడిన ఆమె,
ఎవరినీ లెక్కచేయని మనసు, అనిర్వచనీయమైన సొగసు
రాచనర్తకి వదనంలా భాసిస్తూ ఆమె సాగుతోంది ముందుకు.

అంత సన్నని నడుము ఏ నర్తకికైనా చూసావా?
ప్రవహించే దుస్తులు, రాచకన్య సొబగులు
ఎండిన పాదంపై ముడతలు పడుతున్నాయిప్పుడు
పచ్చని నేలపై ప్రకాశిస్తున్న పుష్పమణిలా కాలిజోళ్లు.

ఆమె గూడ ఎముకలపై గుమికూడిన గుంపు స్వరాలు
కఠినశిలలను ముద్దాడుతున్న కాముక ప్రవాహాలై
ఆమె మేఘావృత లావణ్యం, అంచనాల కందని లోతైన కళ్లు
ఎగుర్తున్న ప్రతి పరిహాసపు ఎత్తిపొడుపుల్ని తరుముతున్నట్లై–

అవి నీడలతో శూన్యంతో చేయబడినాయి
పూల జల్లులతో ఆమె కపాలం పుష్పగుచ్ఛంలా ఉన్నది
దుర్బలమైన వెన్నుపూసలపై అది అటూయిటూ ఊగుతున్నది
ఏమీలేని, దాని లావణ్యం హాస్యాస్పదంగా అలంకరించబడినది.

నిన్నొక వ్యంగ్య చిత్రంగా భావించి నవ్వేవారు
నిన్ను రక్తమాంసాలున్నప్పటి అందాన్ని ఊహించలేరు
తెల్లగా మెరుస్తున్న పేరు తెలియని ఎముకలలా ఉన్నా
నీవంటే నాకెంతో ఇష్టం! ఓ దీర్ఘ కంకాళమా!

జీవితపు విందును నీ తిరస్కారపు నవ్వుతో
కలవరపరుస్తున్నావా? లేక ఆనందపు ఆటవిడుపు
– సబ్బాత్‌లోకి తరిమివేయబడినావా? లేక మృత్యుకామన,
నీ మృత దేహాన్ని, మొనకత్తితో, కదిలిస్తున్నదా?

నీవు ఆశిస్తున్నావా? వయొలిన్ల గానంలో,
మన పాపాల్ని వెలిగించే దీపాల కాంతిలో,
హేళన చేస్తున్న పీడ కలల్ని దూరంగా తరిమేస్తూ,
నీ ఎదలో నరకలోకం వెలిగించిన జ్వాలను చల్లారుస్తున్నావా?

మూర్ఖత్వం, తప్పిదాల లోతు తెలవని బావి.
అనాది నిరాశల శాశ్వతపు గాజుకుప్పె.
నీ శిరస్సు పక్కన నిశ్చలమైన తెల్ల పందిరి ఊడలు
స్థితిలేని, సదాసంచారి పాము చుట్టల కదలికలు.

నిజం చెప్పాలంటే, ఇక్కడ ఉన్న మాలో
వెంటనే నీ మనసుకు గుర్తుకు వచ్చే ప్రేమికులెవ్వరు?
నీ చిరునవ్వుకు స్పందించిన హృదయాలెవరివి?
భీభత్సపు లావణ్యాన్ని ధీరులే ఆనందించగలరు.

నీ కనుల అగాధాలలో నర్తించే భీకర జ్ఞాపికలు
కళ్లను బైర్లు కమ్మిస్తాయి. స్థితప్రజ్ఞుడు వీక్షించినా
అట్టడుగు భీభత్సం అతడిని చుట్టుముడ్తుంది,
ముప్ఫైరెండు తెల్లటి దంతాల ముప్పేటి చిరునవ్వై!

ఎవరైతే తన చేతుల్తో ఎముకల గూడును స్పృశించలేదో
ఎవరినైతే స్మశానపు అందాలు ఏమాత్రం సమ్మోహపరచలేదో
ఎవరినైతే శవపేటిక వస్త్రం, వర్ణం, వాసన కదిలించలేదో
అతడిని, సౌందర్యాన్ని తొలగదోసిన భీభత్సం అదిలించి తీర్తుంది.

"తృణీకరించలేని మాంసరహిత వదనమా!
పరుగుపందెంలో ప్రకాశిస్తున్న నాట్యగత్తెలతో పలుకుమా!
మీ ఎముకలపై చిత్రవర్ణాలున్న ప్రేమికులారా!
మీరు మృత్యువును రుచి చూస్తారు, సుగంధ కంకాళాలుగా!"

వాడిన నీతిబాహ్య పుష్పాలు, బాహ్యాడంబరపు వదనాల్లారా!
శుద్ధి పరచిన శవాలు, నల్లబడ్డ ప్రేమ అంచుల్లారా!
మృత్యునృత్యపు పుకార్ల ఆకర్షణలో మీరు,
ఊపిరి నిలవని అనామక లోకాల్లోకి పోతారు!

సియనే శీతల ప్రవాహాల నుంచి, రగిలే గంగా నదీ పాయల్లోకి
అశాశ్వత బృందాలు స్వప్న నృత్యాలతో నిష్క్రమిస్తాయి.
దేవదూత బాకా చప్పుడు పైకెత్తబడినా
తెరవబడిన ఆకాశంలో కూడా దానిని వాళ్లు గమనించలేరు.

ఎండలో వానలో ఎటువంటి వాతావరణంలోనూ
మృత్యువు మిమ్మల్ని చూసి ఫక్కున నవ్వుతుంది.
పారిపోతున్న మర్త్యుల గుగ్గిలంతో తనను సింగారించుకుంటుంది
మీ ఉన్మాద చేష్టలతో తానూ మిళితమవుతుంది పాపం!

**– ఛార్లెస్ బొదలేర్ (Charles Baudelaire)**

# 5. గర్వాంధుల మదమణిచే మృత్యువు
## (Death snips proud men)

అన్ని ప్రభుత్వాలకన్నా మృత్యువు అతి శక్తివంతమైనది
ప్రభుత్వాలంటే మనుషులు, మనుషులు చస్తారు, మృత్యువు
నవ్వుతుంది: ఇప్పుడు నీవు చూస్తావు, ఇప్పుడు చూడలేవు.

గర్విష్ఠులందరికన్నా మృత్యువు శక్తివంతమైనది.
మృత్యువు గర్వాంధుల ముక్కుమీద గుద్ది, ఓ రెండు పాచికల్ని
విసిరి అంటుంది– 'వాటిని చూడు, విలపించు!'

ప్రతిరోజు మృత్యువు ఒక సందేశం పంపుతుంది.
– 'నీవు కావాలని నేను అనుకున్నప్పుడు నేనే వస్తాను' – ఏదో
ఒకరోజున తాళం చెవులతో వచ్చి అంటుంది – 'పద వెళ్దాం!'

దీర్ఘ బాహువులున్న దాది మృత్యువు:
నిన్నేమాత్రం గాయపరచదు– 'ఇది నిద్రపోయే సమయం,
బిడ్డా; నిద్రను మించిన సుఖమేమున్నది? అనంతంగా నిద్రపో!'

**– కార్ల్ సాండ్‌బర్గ్ (Carl Sandburg)**

## 6. నన్ను యువకుడిగా చావనివ్వండి
**(Let me die a Young Man's Death)**

యువకుడిగా నన్ను మరణించనివ్వండి!
రెండు దుప్పట్ల మధ్య, పవిత్ర జలం
నోటిలో చుక్కలుగా పడేప్పుడు కాదు–
ఆఖరి ఊపిరి గరగర ధ్వనుల్లో వెలువడే
అస్పష్ట అంతిమ ప్రఖ్యాత పదాలూ కాదు–

నాకు డెబ్బై మూడేళ్లున్నప్పుడు,
ఇంకా హాస్యం నాలో తొంగి చూస్తున్నపుడు,
ఏ ఉదయ సంధ్యలోనో
ఎర్రటి విలాసవంతమైన స్పోర్ట్స్ కారు
రాత్రి జాగారం పార్టీ నుంచి ఇంటికి వస్తున్నపుడు
నన్ను గుద్దితే అది వేరే విషయం.

లేదా, నాకు తొంభై ఏళ్ల వయసున్నపుడు
వెండి వెంద్రుకలు పలచగా ఉండి
క్షౌరశాలలో కుర్చీలో కూర్చుని ఉన్నప్పుడు
నా విరోధి మాఫియా గ్యాంగు
టామీ గన్నుల నుంచి బుల్లెట్ల వర్షం కురిపించి
నా వీపును జల్లెడ చేస్తే అదింకో సంగతి.

లేదా, నాకు నూట నాలుగేళ్లు దాటినప్పుడు
పానశాల నుంచి బహిష్కరించబడినాకో,
లేక నా ఉంపుడుగత్తె
తన కూతురి వరసైన దానితో నేను కులకడం చూసాక
తన కొడుకు గురించి భయపడి
నన్ను ముక్కలు ముక్కలుగా నరికి
ఒక్క ముక్క తప్ప అన్నిటినీ విసిరిపారేసినప్పుడో కాదు,

నన్ను యువకుడిగా మరణించనివ్వండి!
ఏ కల్మషం, పాపం అంటని
వెలిగి ఆరుతున్న మృత్యువు కాదు–
'ఎంత చక్కగా చచ్చిపోయాడు'– అని
దేవదూతల్లాంటి వాళ్లు తెరలు మూసేదీ వద్దు–

**– రోజర్ మెక్ గో (Roger McGough)**

# 7. మరణించిన వారికి మరింత దగ్గర...

## (Death, to the dead for evermore)

మృత్యువు,
మృతులకు రాజు, దైవం, ఆఖరి ముఖ్య స్నేహితుడు–
ఎక్కడైతే ఈ మర్త్యయాత్ర ముగుస్తుందో
అక్కడ తన ద్వారం దగ్గర నిలబడి అతిథుల్ని ఆహ్వానిస్తాడు.
ఆ ప్రశాంత తీరంలో చిరునవ్వుతో పలకరిస్తాడు
ఆ శాశ్వత నిద్రను ఏ గొంతెత్తి అరిచే పక్షీ,
తొంగి చూసే సంధ్యాకాలమూ కలతపెట్టలేవు.
మన స్వప్నరహిత విశ్రాంతి ఆ నిస్తబ్దస్థితిలో
మరింత కాలం మనలనంటిపెట్టుకుని ఉంటుంది.

తెరచి ఉంచిన కిటికీల్లోంచి మనం తొంగి చూస్తున్నపుడు
నిశ్చల నిశీధితారలు, తడి మంచు బిందువులు
ఈ అలంకారాల మధ్య నుంచి ఆత్మ కనిపిస్తుంది.
అప్పుడే, మృత్యువు నిద్రపోతున్న నగరంలా వ్యాపించి
అందరిపై సమానంగా తన హస్తాల్ని చాపుతుంది.
ఈ యుద్ధ ప్రకంపనలు, విజయ నినాదాలు, బాకాలు, కన్నీళ్లు
మానవుడి ఉద్వేగ ప్రసంగాలు, ఈ గందరగోళాల మధ్య
మృత్యువు ప్రత్యక్షమవుతుంది. మనం లేచి అనుసరిస్తాము.

సూర్యకాంతితో అలసిన కళ్లు, చెవులు చూపునూ, వినికిడిని
కోల్పోతాయి. చూసింది చెబుతూ, ఆశలు భయాలు
దేహాన్ని ఊపేస్తుంటే, అన్నిటినీ చూస్తూ కల్పనలనల్లే
శిరస్సు, అన్ని విషయాలనూ, అన్ని సంవత్సరాల అలసటలనూ
భరిస్తూండగా, మన దుఃఖాత్మల దృష్టి మృతుల మీదకు మళ్లగా
అలసిపోయిన శిశువు, శరీరం, నిద్రాతల్పం వేపు నిరీక్షిస్తుంటాయి.

**– రాబర్ట్ లూయిస్ స్టీవెన్సన్**
**(Robert Louis Stevenson)**

# 8. కవి మరణం

## (A Poet's Death is his life)

నిశీధి నల్లరెక్కలు నగరాన్ని కమ్ముకున్నాయి.
ప్రకృతి తెల్లటి మంచుదుప్పటితో అన్నిటినీ కప్పివేసింది.
అందరూ వీధులు వదలి ఇళ్లల్లో వెచ్చదనం కౌగిలిని అపేక్షిస్తున్నారు.
ఉత్తరపు గాలి ఉద్యానవనాల్ని ధ్యానస్థితిలోకి తెచ్చింది.

నగరపు పొలిమేరల్లోని ఒక గుడిసె
మంచు బరువుకు కూలిపోయేట్టుంది.
ఆ చీకటింటి మారుమూల చింకి పరుపులో
మరణిస్తున్న యువకుడు మినుకు మినుకు మంటున్న దీపాన్ని
తలుపు సందుల్లోంచి వస్తున్న గాలుల్ని తదేకంగా గమనిస్తున్నాడు.

జీవితపు పిడికెళ్ల నుంచి విడిపోయే ప్రశాంత ఘడియను
అతడు ముందుగానే దర్శించాడు.
మృత్యువు రాకకై కృతజ్ఞతాపూర్వకంగా ఎదురు చూస్తూండగా
అతని వదనంపై ఆశాసంధ్య, పెదవులపై విషాదపు నవ్వు
కనులలో క్షమ కానవస్తున్నాయి.

ధనవంతులుండే ఆ నగరంలో ఆకలితో మరణిస్తున్న కవి అతడు.
తన అందమైన పద్యాలతో పదాలతో మానవుల ఎదలను కదిలించేందుకు
పుట్టిన పుణ్యాత్ముడు. మానవుని ఆత్మను స్వాంతన పరిచేందుకు
జ్ఞానదేవత పంపిన దూత. ఈ కఠిన లోకపు విసుర్లు
భరించి, కనీసం చిరునవ్వుకు నోచుకోక కలత పడుతున్నాడు.

అతని ఆఖరి నిశ్వాసానికి సాక్షి అక్కడున్న నూనె దీపమే.
పక్కనే పడివున్నాయి అతని భావాలను పొందుపరచుకున్న కాగితాలు
అతికష్టంపై చేతులు పైకెత్తి ఆకాశం వేపు చూసాడతడు.
అతని కళ్లు ఇంటి కప్పును చీల్చి నింగిలో

మబ్బుల వెనక దాగివున్న తారలను చూడాలని వృథా ప్రయత్నం చేసాయి.

అతడన్నాడు– “రా! ఓ అందమైన మృత్యువా! నా ఆత్మ నీ కోసం పరితపిస్తున్నది. దగ్గరకు రా! ఈ జీవితపు ఇనుప సంకెళ్లను బద్దలుకొట్టు! వాటిని మోయలేక అవస్థ పడుతున్నాను. దేవతల భాషను విడమరుస్తున్నందుకు నన్ను వింత మనిషిగా చూస్తున్న నా పొరుగువాళ్ల నుంచి నన్ను నీ మధురమైన లాలనలోకి తీసుకునిపో. త్వరగా! నన్ను ఈ చీకటి మూల నుంచి, క్రూర మనస్తత్వమున్న మనుష్యుల మధ్య నుంచి, పేదల రక్తాన్నుంచి లబ్ధిపొందే వీళ్ల నుంచి దూరంగా నీ ప్రశాంత ఆవరణలోకి కొనిపో! నన్ను వద్దనుకుంటున్న నా తోటి మనుష్యుల్నుండి సుదూరంగా నీ తెల్లని రెక్కల కింద నన్ను తీసుకుపో! ప్రేమతో కరుణతో నిండిన మృత్యుదేవతా! నన్ను నీ చేతుల్లోకి తీసుకుని, తల్లి ముద్దెరుగని, సోదరి బుగ్గలను స్పృశించని, ప్రియురాలి వేళ్లు తాకని ఈ పెదాల్ని నీ పెదాలతో స్పృశించు. ఓ ప్రియతమ మృత్యువా! నన్ను తీసుకుని వెళ్లు!”

అప్పుడు అతని మంచం వద్దకు అతీంద్రియ శక్తులున్న అత్యంత సుందరమైన దేవదూత తన చేతిలో లిల్లీపూల గుచ్ఛంతో వచ్చింది. ఆమె అతనిని తన చేతుల్లోకి తీసుకుని, అతని కనులను లలితంగా మూసింది. ఆత్మచక్షువుతో మాత్రమే చూడగల – అతని పెదవులపై ఆమె – ఓ సుదీర్ఘ చుంబనాన్నివ్వగా అతడి అధరాలపై ఓ సంతృప్తితో నిండిన చిరునవ్వు వికసించింది. ఇప్పుడు ఆ గుడిసె ఖాళీగా ఉన్నది. అయితే, కవి వ్రాసిన కాగితాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

వందల సంవత్సరాలు గడిచాయి. అజ్ఞానంలో నిదురిస్తున్న నగర ప్రజలు మేల్కొని, తమకు స్వేచ్ఛను జ్ఞానాన్నిచ్చిన పదాల సృష్టికర్త కవికి సుందర ఉద్యానవనంలో స్మృతిచిహ్నాన్ని నెలకొలిపి, ప్రతి సంవత్సరం ఆరోజును పండుగగా జరుపుకుంటున్నారు.

ఓ అజ్ఞానమా! నీవెంత క్రూరురాలివి?

**– ఖలీల్ జిబ్రాన్ (Khalil Gibran)**

# 9. మరణం
## (Death)

"మృత్యువు' గురించి తెలుసుకుందాం!" అన్నాడు ఆల్‌మిత్ర.
"సరే, జీవితపు హృదయంలోనే కదా మృత్యురహస్యం
ఇమిడి ఉన్నది! దివాంధపు కళ్లకు కాంతి ప్రశస్తి
తెలియదు కదా! మృత్యు స్వరూపాన్ని చూడాలంటే
జీవన దేహంలోకి నీ హృదయాన్ని విప్పార్చాలి సుమా!
నది, సముద్రంలా జీవనం, మృత్యువు ఒక్కటే!
నీ ఆశల కోరికల అడుగున నిశ్శబ్ద పరిజ్ఞానం నిలిచి ఉంటుంది.
మంచు కింద విత్తనాలు స్వప్నిస్తున్నట్లు నీ హృదయం వసంతాన్ని కలగంటుంది.
ఆ కలల్ని విశ్వసించు; వాటిలోనే శాశ్వతత్వపు వాకిలి దాగి ఉంది.
రాజు చెంత సత్కారాన్ని అందుకోబోతూ వణుకుతున్న
గొర్రెల కాపరిలా, మృత్యువు నిన్ను స్పృశించినప్పుడు నీవుంటావు.
ఆ వణుకు వెనుక సంతోషం దాగిలేదా గొర్రెలకాపరికి
తాను ప్రభువుతో సమ్మానింపబడుతున్నానని?
అయినా అతడు తాను వణుకుతున్న విషయాన్ని గమనిస్తాడు
చనిపోవడమంటే ఏమిటి? గాలిలో నగ్నంగా నిలబడి
ఎండలో కరిగిపోవడమే కదా!
ఊపిరి ఆగడమంటే ఏమిటి? నిరంతరపు ఆటుపోట్ల
నుంచి ప్రాణాన్ని విడుదల చేసి ప్రభువు వేపు నడిపించుటే కదా!
నిశ్శబ్దపు నదీ జలాల్ని తాగినప్పుడే నీవు మనోహరంగా పాడగలవు.
కొండ శిఖరాన్ని చేరుకున్నాకే పైకెక్కడం మొదలవుతుంది.
నేల నీ శరీర భాగాల్ని కైవసం చేసుకున్నాక మాత్రమే
నీవు నిజంగా నాట్యం చేయడం ప్రారంభిస్తావు.

**– ఖలీల్ జిబ్రాన్ (Khalil Gibran)**

# 10. మృత్యు సౌందర్యం
## (The beauty of Death)

**పిలుపు –**

నన్ను నిద్రపోనివ్వు, నా ఆత్మ ప్రేమతో మత్తెక్కి ఉన్నది.
నన్ను విశ్రాంతి తీసుకోనివ్వు, నా మనస్సు రాత్రింబవళ్ల సంపత్తితో నిండి ఉన్నది.
నా మంచం చుట్టూరా కొవ్వొత్తులు వెలిగించు, సాంబ్రాణి వెదజల్లు...
నా దేహంపై మల్లెల, గులాబి రేకులను విరజిమ్ము.
నా శిరోజాలకు గుగ్గిలం సుగంధపు నూనెల్ని వ్రాసి,
నా పాదాలపై అత్తరులనద్దు!
నా నుదుటిపై మృత్యు హస్తం లిఖించిన రాతను చదువు.

గాఢ నిద్రాదేవత బాహువుల్లో నన్ను నిదురపోనీ,
నా కనులు అలిసిపోయాయి.
వెండి తీగెల వీణ స్పందించి నా ఎదకు శాంతినొసగనీ.
వేణువు, వీణల గానపు తెరతో నా వడిలిపోతున్న హృదయాన్ని కప్పనీ.

నా కనులలోని ఆశను చూస్తూ గత కాలాన్ని గానం చేయి
ఆ మంత్రార్ధపు మెత్తని పడకపై నా హృదయాన్ని విశ్రాంతి తీసుకోనీ!

మీ కన్నీళ్లని తుడుచుకోండి మిత్రులారా!
పుష్పాల్లా తలలు పైకెత్తి ఉదయాన్ని స్వాగతించండి.
అనంతానికి, నా తల్పానికి మధ్య ఉన్న కాంతిస్తంభం పక్కన
 వేచి వున్న మృత్యు వధూ కన్యను వీక్షించండి.
ఆమె తెల్లని రెక్కల చప్పుడును ఊపిరాపి నాతోపాటు మీరూ వినండి.

నా దగ్గరకు రండి! వీడ్కోలు చెప్పండి!
నవ్వే పెదాలతో నా కనులను స్పృశించండి.
తమ కోమల మృదుహస్తాలతో, చిన్నారులను నన్ను తాకనివ్వండి!

వృద్ధులు తమ నరాలుబికన చేతులతో నన్ను తడమి ఆశీర్వదించనివ్వండి!
కన్యలు నా కళ్లలో దేవుని నీడను చూడనివ్వండి,
నా ఊపిరిలో దేవుని నిశ్చయపు ప్రతిధ్వనుల్ని విననివ్వండి!

**ఉత్థానం :**

నేను ఒక పర్వత శిఖరాన్ని దాటాను
నా ఆత్మ స్వేచ్ఛగా గగన మండలాన్ని దాటి పైకెగుస్తున్నది.
సహచరులారా! నేను చాలా చాలా దూరం వెళ్లిపోయాను.
కొండలను నా కళ్లకు కానరానీకుండా మేఘాలు అడ్డుగా ఉన్నవి.
లోయలను నిశ్శబ్ద సముద్రం ఆవరించినది
విస్మృతి హస్తాలు రహదారుల్ని, ఇళ్లను మింగి వేస్తున్నవి.
తెల్లటి రాజదండపు కాంతిలో ఆకుపచ్చని పొలాలు అదృశ్యమైనాయి.
అది వసంతమేఘంలా కొవ్వొత్తి పసుపు కాంతిలో
సంధ్యా సమయపు అరుణకాంతితో వెలుగుతున్నది.

తరంగాల పాటలు, సెలయేళ్ల స్తోత్రాలు
విరజిమ్మబడగా జనసమూహపు రణగొణధ్వని సమసిపోయింది.
శాశ్వతత్వపు సంగీతం మినహా నాకింకేమీ వినబడడం లేదు.

ఆత్మ ఇచ్ఛకు అనుగుణంగా
నేను శ్వేత వస్త్రాన్ని ధరించాను;
నేను హాయిగా ఉన్నాను.
నేను శాంతిగా ఉన్నాను.

**శేషం–**

నాపై ఉన్న ఈ శ్వేత నూలు వస్త్రాన్ని తొలగించి
నన్ను మల్లెలతో, లిల్లీలతో అలంకరించండి.
ఈ ఇనుప మందసాన్నుంచీ తీసి

నారింజ పూల మెత్తలపై విశ్రాంతి నివ్వండి.
నా గురించి విలపించవద్దు;
యవ్వనపు సంతోష గీతాల నాలపించండి.
నా గురించి కన్నీరు కార్చవద్దు.
పంటల కోతకాలం గురించి, ద్రాక్షారసపు తయారీ గురించి పాడండి.
బాధల నిట్టూర్పులు వద్దు;
నా వదనంపై నీ వ్రేళ్లతో ప్రేమ, ఆనందపు గుర్తులను లిఖించు.
గాలి ప్రశాంతతను శోక గీతాలతో మంత్రగానాలతో భంగపరచవద్దు.
మీ హృదయాలను నాతోపాటు అమరగీతాన్ని పాడనివ్వండి.
నల్లని దుస్తులను తొడిగి నాకై దుఃఖించవద్దు.
రంగు రంగుల వర్ణాల వస్త్రాలు ధరించి ఆనందించండి.
నిట్టూర్పులతో నా నిష్క్రమణ గురించి మాట్లాడుకోవద్దు.
మూసిన మీ కనుల వెనక నన్ను మరింత స్పష్టంగా చూడగలరు.
ఆకుల దొంతరపై నన్ను పరుండబెట్టి
మీ స్నేహపూరిత భుజాలపై నిర్మానుష్యమైన అడవి గుండా తీసుకువెళ్లండి.
కిక్కిరిన స్మశానాలలో, ధ్వనిస్తున్న కపాలాల కంకాళాల మధ్య కాదు
నన్ను సైప్రస్ అడవులలోకి తీసుకువెళ్లి, నీడలు పడని చోట
గోతిలో నన్ను ఖననం చేసి నాపై వయొలెట్లు, పాపీలు పుష్పించనివ్వండి.
నా సమాధి గోతిని బాగా లోతుగా తవ్వండి, ఏ వరద నీటికీ
నా ఎముకలు లోయల్లోకి కొట్టుకు పోకుండా చూడండి.
నాక్కాస్త ఎక్కువ చోటునివ్వండి, సంధ్యల నీడలు వచ్చి
నా పక్కనే కూర్చునే వీలునివ్వండి.
ఈ లౌకిక వస్త్రాలను, ఉడుపులను తీసి నేలతల్లి ఒడిలో
మరింత లోతులో నన్నుంచండి. నాపై మెత్తని మట్టి చల్లి
పైన మల్లెలు, లిల్లీపూలు, మిర్టిల్ విత్తనాలను నాటండి.
నాపై అవి మొలకెత్తి, నా దేహభాగాలను ఆస్వాదిస్తూ
అవి నా హృదయ సుగంధాన్ని అంతరిక్షానికి అందజేస్తాయి.

సూర్యుడికి కూడా నా శాంతి రహస్యాన్ని తెలియబరుస్తాయి.
గాలితో కలిసి బాటసారుల అలసట తీరుస్తాయి.

వీడ్కోలు! మిత్రులారా! నన్ను వదలి మెత్తని అడుగులతో
నిర్మానుష్యమైన లోయలో నిశ్శబ్దంలా నడవండి.
నన్ను పరమాత్మకు వదిలి మీరు నెమ్మదిగా నిష్క్రమించండి.
నిసాన్ గాలికి ఏపిల్, ఆల్మండ్ పూలు వెదజల్లబడినట్లు,
మీ నివాసాలకు వెళ్లి సంతోషంగా కాలం గడపండి.

ఆ ఆనందాన్ని మీనుండి, నా నుండి మృత్యువు తీసుకువెళ్లలేదు.
శాంతితో జీవించండి! మీరిక్కడ చూసేదానికి
బాహ్య ప్రపంచానికి ఎంతో తారతమ్యం ఉన్నది.
నన్ను వదలివెళ్లండి! మిత్రులారా! వీడుకోలు!

**– ఖలీల్ జిబ్రాన్ (Khalil Gibran)**

# 11. మృత్యు దేవతా! ఆమెనిక్కడకు తీసుకునిరా!
## (Go Down, Death)

ఏడవకు! ఏడవకు!
ఆమె మరణించలేదు;
ఆమె జీసస్ హృదయంలో విశ్రాంతి తీసుకుంటున్నది.
ఎద వ్రయ్యలైన ఆమె చెలికాడా, విలపించకు!
శోకతప్తుడవైన కుమారుడా, దుఃఖించకు!
ఒంటరిదానివైన చిన్నారీ, శోకించకు;
ఆమె తన యింటికి వెళ్ళిపోయింది.

మొన్న ఉదయం దేవుడు ఆ ఆకాశం నుంచి
తన పిల్లల వేపు చూసినాడు.
సిస్టర్ కరొలిన్ తన మంచంపై
బాధతో కదలాడడం గమనించినాడు.
దేవుని హృదయం అనంతమైన జాలితో నిండినది.

తన సింహాసనంపై కూర్చుని దేవుడు
తన కుడివేపు ఉన్న దేవదూతతో మృత్యువును పిలవమన్నాడు.
ఆ ప్రకాశవంతమైన దేవదూత అరిచాడు–
మృత్యువును పిలవండి! మృత్యువును పిలవండి!
ఆ పిలుపు స్వర్గలోకపు వీధుల్లో ప్రతిధ్వనించింది.
ఆ ప్రతిధ్వని చీకటి నీడలలో
పాలిపోయిన శ్వేతాశ్వాలుండే మృత్యునివాసాన్ని చేరింది.

జగత్ ప్రభువు ఆజ్ఞ వినగానే మృత్యువు
పాలిపోయిన వెన్నెల లాంటి తన జవనాశ్వంపై
స్వర్గ వీధుల గుండా తన గుర్రపు గిట్టలు
అడుగున స్వర్ణ జ్వాలలు పైకెగస్తుండగా
నిశ్శబ్దంగా ప్రభు సింహాసనం వద్దకు చేరుకుని
దైవాజ్ఞకై ఎదురు చూసినాడు.

పరమాత్మ పలికినాడు;
మృత్యుదేవతా! క్రింది లోకంలోకి వెళ్లు!
భువిపైని సావన్నా, జార్జియాకు;
అక్కడి యమక్రా గ్రామానికి
సిస్టర్ కరొలిన్‌ను వెదుకు.
ఆమె తనపై బరువును, జీవనపు వేడిని మోసి అలసినది.
నా ద్రాక్షతోటలో శ్రమించినది.
ఆమె ఇప్పుడు అలసిపోయి ఉన్నది.
బడలికతో ఉన్నది.
మృత్యుదేవతా! నీవు వెళ్లి ఆమెను ఇక్కడికి తీసుకురా!

మృత్యువు మారు పలకలేదు.
తన గుర్రపు కళ్లేలను వదులుచేసి
అశ్వాన్ని అదిలించి భువి వేపు బయల్దేరాడు.
స్వర్గలోకపు ముత్యాల ద్వారం గుండా
సూర్య, చంద్ర, తారల్ని దాటి
మృత్యువు నేలపైకి దిగి వస్తున్నపుడు
మెరుపు కాంతి అతని వెనక జాడగా మారింది.

మేము ఆమె మంచం పక్కనే ఉన్నాము.
ఆమె తన కనులను ఆకాశం వేపు మళ్లించింది.
మేం చూడలేని దృశ్యాన్ని ఆమె చూసింది.
ఆమె అనాది మృత్యువును చూసింది.
రాలిపడిన నక్షత్రంలా వచ్చిన మృత్యుదేవతను గమనించింది.

మృత్యువు ఆమెను భయపెట్టలేదు.
స్నేహితుడిలా ఆతడు ఆమెవేపు చూసాడు.
ఆమె మాతో గుసగుసలాడింది– 'నేను ఇంటికి వెళ్తున్నాను'–
చిరునవ్వు నవ్వుతూ ఆమె తన కనులు మూసుకున్నది.

పసిపాపలా ఉన్న ఆమెను మృత్యువు
తన శీతల హస్తాలతో స్పృశించి లేవనెత్తినాడు.
ఆమెకు చలిగా ఏమీ అనిపించలేదు.
మృత్యువు మరలా తన ప్రయాణాన్ని కొనసాగించినాడు.
ఆ సాయంకాలపు నక్షత్రం వేపు,
అద్భుత ప్రకాశవంతమైన దివ్య వెలుగు వేపు,
ఆ శ్వేత సింహాసనం వేపు–
సిస్టర్ కరొలిన్‌ను జీసస్ సన్నిధిలో ఉంచినాడు.

జీసస్ తన చేతితో ఆమె కన్నీళ్లు తుడిచి
ఆమె ముఖంపైని ముడతలను స్పృశించినాడు.
దేవదూతలు గానం చేస్తుండగా
జీసస్ పసిపాపలా ఉన్న ఆమెను
తన చేతులే ఊయలగా ఊపుతూ అంటున్నాడు–
'విశ్రాంతి తీసుకో, చిన్నారీ!, విశ్రాంతి తీసుకో!'

ఏడ్వకండి! ఏడవకండి!
ఆమె మరణించలేదు.
ఆమె జీసస్ హృదయంలో నిదురించుచున్నది.

**– జేమ్స్ వెల్డన్ జాన్‌సన్**
**(James Weldon Johnson)**

# 12. శాశ్వత దెయ్యం
## (Death)

అది మృత్యువు కాదు, వాగ్ధాటి గల ఊపిరి ఒక్కోసారి
నిట్టూర్పులో చేసే నిశ్శబ్ద ప్రయాణం;
ఈ ప్రకాశవంతమైన నక్షత్రాలు ఒక్కోసారి
సూర్యకాంతిలో సూర్యుడిని పలకరించేవి రాత్రి అస్తమిస్తాయి.
మెలకువగా ఉండే ఈ వేడి దేహం నిశ్శబ్దంగా నశిస్తుంది.
జీవితపు జలధారలు ప్రవహించడం మరచిపోతాయి.
ఆలోచనలు అంతరించి శాశ్వతమైన దయ్యం
కొత్త నేలలో పాతిపెట్టబడుతుంది.

మృత్యువుకు ఈ విషయం తెలియనవసరం లేదు. కాని
కొత్త సమాధులను దర్శించేప్పుడు
కలిగే పరిశుద్ధమైన ఆలోచనలు
ముందుకు వెళ్లడం మానివేస్తాయి.
అనేకసార్లు పాత జ్ఞాపకాల రహదారిపై
పచ్చిక అలలుగా మొలిచినప్పుడు బహుశా
మనుషుల మనస్సులలో పునరుత్థానం అంతరిస్తుంది.

**– థామస్ హుడ్**
**(Thomas Hood)**

# 13. జీవపు గొలుసు

## (On the Death of Mr. Robert Lavet)

ఆశయొక్క భ్రాంతి అనే గనిలోకి అధిక్షేపింపబడి
మనం ప్రతిరోజూ శ్రమపడుతూ ఉంటాము.
అకస్మాత్తు ప్రకంపనలకో, దీర్ఘ పతనాలకో
మన సాంఘిక భద్రతలు దూరమవుతాయి.

అనేక రకాలుగా అనేక సంవత్సరాలు గడచినకొద్దీ
సమాధి గోతి అడుగు సమీపంగా కనిపిస్తుంటుంది.
అమాయకంగా, బాధ్యతతో, అధికారయుతమైన
స్నేహ రాహిత్యం స్నేహితుడి పేరు చెబుతుంది.

ఆప్యాయతా నేత్రాన్ని అస్పష్ట జ్ఞానకాంతితో
నీరంధ్ర కారుణ్యంతో నింపుతాడతడు.
అక్షరీకరించబడని అహంకారం
సున్నితంగా ఉండని నీ శక్తిని పొగడనివ్వదు.

స్పృహ కోల్పోతున్న ప్రకృతిని సాయమడిగినప్పుడు
అటూ యిటూ తిరుగుతున్న మృత్యువు ఆఖరి దెబ్బ తీస్తుంది.
అతడి శక్తివంతమైన ఔషధం
ప్రదర్శన అక్కరలేని కళాప్రతిభను ప్రకటిస్తుంది.

దురదృష్టపు చీకటి గుహల్లో
అతని సంరక్షణ అసలే ఉండదు.
ఆశారహితపు ఆవేదన మూల్గుగా బయటపడినప్పుడు
ఒంటరి కోరిక విశ్రాంతిలో మరణిస్తుంది.

శీతల వణుకును హేళన చేసే ఆజ్ఞలేవీ ఆగవు
గర్వంతో తిరస్కరించే కొద్దిపాటి లాభమూ లేదు.

దైనందిన స్వల్ప కోరికలు
ప్రతిరోజూ శ్రమకు లభ్యమవుతాయి.

తీరికలేని పగలు, ప్రశాంత రాత్రి
స్పర్శకందక, లెక్కింపబడక ముందుకు పోతుంటుంది.
ప్రకాశవంతమైన కాంతి అతనిలో,
ఎనభయ్యోపడిలో పడినా, నడయాడుతున్నది.

బాధపెట్టేంత తీవ్రమైన నెప్పి లేదు
నశిస్తున్న స్థితిలోని శీతల శ్రేణులు లేవు
జీవపు గొలుసును మృత్యువు తెగ్గొట్టిన క్షణంలో
అతడి ఆత్మ దగ్గరలో ఉన్న దారిలోకి స్వేచ్ఛగా పయనమయ్యింది.

**– శామ్యూల్ జాన్సన్**
**(Samuel Johnson)**

# 14. వడిలిపోయిన కాలపు శాఖ

## (Death)

మృత్యువు! ఆనందపు నమ్మకాన్ని నేను
ప్రకటిస్తున్న క్షణంలోనే నన్ను దెబ్బతీసింది.
అనంతత్వపు తల్లివేరు నుంచి
ఒడిలిపోయిన కాలపు శాఖను వేరు చేసింది.

కాలపు శాఖపైని ఆకులు కళకళలాడుతున్నాయి.
నిండా జీవరసం, పైన వెండి ముత్యాల మంచు
పక్షులు ఆ ఆకుల నీడలో గుమికూడి ఉన్నాయి.
ప్రతిరోజూ ఆ చెట్టు పూల చుట్టూ తేనేటీగల ప్రదక్షిణాలు

దుఃఖం దాటిపోతూ బంగరు మొలకను పెరికివేసింది.
అపరాధ భావం గర్వపు ఆకుల్ని రాల్చివేసింది.
తన సంరక్షకుడి దయాపూరిత హృదయంలో
జీవన పునరుజ్జీవపు అల శాశ్వతంగా ప్రవహించింది.

నా నుంచి విడిపోయిన సంతోషం గురించినేను దుఃఖించలేదు.
ఆ వట్టిపోయిన గూడు, నిశ్శబ్దగానం
ఆశ నావేపు చూసి నవ్వుతూ గుసగుసలాడింది
'ఎక్కువకాలం శీతాకాలం ఉండదులే సుమా'

చూడు! పదిరెట్లు ఎక్కువైన ఆశీస్సులతో
వసంతకాలం అందాల్ని విరజిమ్ముతున్నది.
గాలి, వాన, వేడిమి, ముద్దులాడుతూ
మే రెండవ తేదీకి పేరు ప్రఖ్యాతులనిచ్చాయి.

ఎంత ఉన్నతంగా ఎగసిందంటే, ఏ రెక్కల విషాదమూ
దానిని తాకలేదు; పాపం ఎంత ప్రయత్నించినా దానిని అంటలేదు.

ప్రేమ తన స్వంత జీవితంతో శక్తితో
చెడుకు, పొరపాట్లకు సుదూరంగా ఉంటుంది.

క్రూరుడవైన మృత్యువా! లేత ఆకులు రాలిపోతున్నాయి.
సాయంకాలపు సుతిమెత్తని వాయువులు వాటికి
ప్రాణం పోయగలవా? లేదు! ఉదయసంధ్య నా
ఆందోళనను వెక్కిరిస్తున్నది. కాలమింక నాలో పుష్పించదు.

ఆ కొమ్మను కూల్చివేయి! ఇతర శాఖలను వర్ధిల్లజేయి
ఆ వడిలిపోయిన కాలపు శాఖ స్థానంలో!
అలా అయినా నేలరాలిన శాఖ నేలలో కలిసి ఎరువై
అనంతాన్ని ఆ నేల నుంచి మొలకలెత్తనీ!

**– ఎమిలి బ్రాంటె**
**(Emily Bronte)**

# 15. మిత్రుడైన మృత్యువు
## (Death)

స్నేహితుడవైన మృత్యువా! ఏమిటీ దేహ వివాదం!
ఈ ఆడంబరపు గొడవ లేమిటి?
గత యాభై ఏళ్ల నుంచి నెమ్మది నెమ్మదిగా
కొద్దికొద్దిగా నన్ను వశం చేసుకుంటున్నావుగా!

నా కన్నా నీకే ఎక్కువ తెలుసు
అదెక్కడ కనబడుతుందో
ముడతలు పడ్డ ఈ బాధాతప్త మట్టి ముద్దకు
సంకెళ్లతో బంధించబడి నేనున్నాను.

ఒకప్పుడు నా వారనుకున్నవాళ్లొక్కరూ చూడడం లేదు
ఈ కృశించి నశిస్తున్న దయ్యపు మొహాన్ని!
ఆ రోజుల్లో నాది ఆరోగ్యవంతమైన శరీరమే
ఈ మొహాన్ని ఇంతకు ముందెన్నడూ ఇలా చూడలేదా!

స్నేహితుడవైన మృత్యువా! మంచి మిత్రుడివే నీవు!
నీలో లోపమల్లా నీ నెమ్మది నడకే!
దాన్ని నీ దయగా భావించి లోకులు
స్వల్ప కారణాలతో నిన్ను వేచి ఉండేట్లు చేస్తారు.

నీవేం చేయాలో త్వరగా చేసేయి
నేనెటువంటి అడ్డంకులనూ కల్పించబోను
నీ పనైపోతే నేను స్వేచ్ఛ పొందుతాను.
నీపై నేనెటువంటి కసినీ పెంచుకోను.

ఉండు! నేను నీతో అబద్ధం చెప్పాను!
నీపై ద్వేషం ఉంది నాకు! ఈ ఆఖరి క్షణాల్లో
నా ఇచ్ఛాసంకల్పాన్ని, నా గత కాలాన్ని
నా ఇన్నాళ్లూ విశ్వాసంగా ఉన్నవాళ్లను గుర్తుచేసుకోనీ!

నా కుడిచేతిని నేను ద్వేషిస్తున్నాను.
నా హృదయ స్పందనను నేను ద్వేషిస్తున్నాను.
అవి ఏనాడూ నాకు పిరికి ముద్రను వేయలేదు
నన్ను నయవంచకుడిగా చిత్రించ ప్రయత్నించలేదు.

నాకిప్పుడు తెలుస్తున్నది పాతరోజుల్లో, ఎందుకు ప్రజలు
అనాగరిక ప్రేమ, ద్వేషాల్లో తమకిష్టం లేని వాళ్లకు
నాలుగురోడ్ల కూడళ్లలో చేతులకు మేకులు దిగగొట్టేవారో!
సంపన్న దేశాలలో నేతల హృదయాలకు గుడులు కట్టేవారో

ఆ చిహ్నం, ఆ ముద్ర, ఆ పనిముట్టు
ప్రతి ఆత్మ లక్ష్యం, ఆశయం, కష్టాల గుర్తు!
ప్రజ్వరిల్లిన, చల్లారిన ఆ అగ్నుల సాక్షి
వాళ్ల ప్రేమలు, వాళ్ల జీవితాలు యావత్తూ.

బలహీనమైన మానవ హస్తమా!
సున్నితమైన, మొక్కవోని మానవ హృదయమా!
అటువంటి మనోహరమైన, అంతర్లోక కళలను
కలిగి ఉన్న ప్రపంచమేదో ముందుగా ప్రవచించు!

నిజం చెబుతున్నాను మృత్యుదేవతా!
నా యీ హస్తాన్ని, ఈ ముడతలు పడి, బలహీనమై,
అస్పష్ట రేఖలతో కూడి, పాలిపోయి
నరాలు తేలిన ఈ దుర్భల హస్తాన్ని ద్వేషిస్తాను.

మృత్యువా, నీవు నా స్నేహితుడివే!
నీవు నన్ను చేరగానే నేను స్వేచ్ఛను పొందుతాను.
నా దగ్గరున్నదంతా తీసుకో! నా హస్తాన్ని, హృదయాన్ని!
బహుశా ఎక్కడో వాటితో పని ఉండి ఉంటుంది.

**– హెలెన్ హంట్ జాక్సన్**
**(Helen Hunt Jackson)**

## 16. కాసేపు ఆగుము, మృత్యుదేవతా!

**(The Poet to Death)**

కాసేపు ఆగుము, ఓ మృత్యుదేవతా!
నా సుందర జీవితం వసంత శోభతో కళకళలాడుతున్నది.
నా యవ్వన వనం మనోహరమై, పక్షుల కిలకిలా రవములతో
ప్రతిధ్వనిస్తున్నది.

కాసేపు తాళుము, ఓ మృత్యుదేవతా!
నా పుష్పిస్తున్న ఆశల పంటలు కోతకు వచ్చు సమయమున్నది.
నా ఆనందాలు పరిఢవిల్లి, నా గానం చేయబడని పాటలు,
నాలో మిగిలిన కన్నీరు ఏరులై ప్రవహించనిమ్ము!

కాసేపు వేచియుండుము, ఓ మృత్యుదేవతా!
ప్రేమ, దుఃఖాలతో నన్ను తృప్తినొందనీ; భూమి ఆకాశపు
వెలుగులు, నా మానవ జీవితపు క్షుత్పిపాసలు
తీరేవరకూ, ఓ మృత్యుదేవతా! నేను మరణించబోను!

– సరోజిని నాయుడు
**(Sarojini Naidu)**

# 17. వైద్యుడూ - మృత్యువూ

## (Death and Dr. Hornbook)

కొన్ని పుస్తకాలు ఆద్యంతం శుద్ధ తప్పులే!
ఒక్కోసారి ఘోర అసత్యాలు లిఖితం చేయబడవు.
పరమానందభరితులై ప్రభుసేవకులున్నప్పుడు
ఉప్పొంగిన గాలి కూడా దైవశాసనాలకు కట్టివేయబడ్తుంది.

ఈసారి అర్ధరాత్రి నేను ప్రకటిస్తాను.
అది నరకంలో సైతాను ఉన్నంత సత్యం.
అతడు మనల్ని సమీపించడమనేది దెబ్బతిన్న దయంత నిజం.

నా మొండి పట్టుదల నన్ను తిన్నగా చేసింది
నేనేమీ మూర్ఖుణ్ణి కాదు! తప్పులు చేసి చేసి
దెయ్యాల్ని, భూతాల్ని కొండల్లో, లోయల్లో, తుప్పల్లో,
తోపుల్లో వదిలిపెట్టాను.

ఉదయిస్తున్న చంద్రుడు వెలగడం మొదలెట్టాడు
దూరపు కొండలు మెరుస్తుంటే వాటి శిఖరాల్ని లెక్కపెడ్తున్నాను
అవి మూడో, నాలుగో లెక్క తెలీడం లేదు.

కొండల్ని దాటి, గాలి మరల్ని దాటి వస్తూ
కొంకి కర్రను నా తలకాన్చి మరింత నీరసంగా
నా ఇష్టానికి వ్యతిరేకంగా గట్టిగా మూలిగాను.

అక్కడ నన్నెవరో భుజం తట్టినట్లనిపించింది.
ఓ వింత మనిషి చేతిలో పెద్ద కొడవలి
భుజాన మూడు వరసల తాడు వేలాడుతున్నది.

పొడుగాటి వ్యక్తి, సన్నటి వెదురు పుల్లల్లాంటి కాళ్లు, చేతులు-
ఆ వింత మనిషిని చూసి విస్మయంగా అడిగాను-
'మిత్రుడా! ఎటుపోతున్నావు? తిరిగి వస్తావా మళ్లా?'

అతడన్నాడు– 'నాపేరు మృత్యువు! భయపడకు!'
నేనన్నాను– 'నా ఊపిరి కొనిపోడానికే గదా వచ్చావు నీవు.
ఎన్నో ఏళ్లు, ఊళ్లు తిరిగుంటావు కదా ఎన్ని విశేషాలు చెప్పగలవు!
కాస్త విశ్రాంతి తీసుకో, కాళ్లనెప్పులు తగ్గగలవు!'

'ఆరువేల ఏళ్ల పైబడింది నేనీపనిలో ఉండి;
అదిగో కొడవలి, ఇదుగో బాణం,
ఎన్నో గొప్ప గుండెల్ని గుచ్చాయివి.
అన్నీ ఆ వైద్యుడి గొప్పతనం ముందు తలవంచాయి.
నా పాలబడ్డ వాళ్లనెందర్నో అతడు రక్షించినాడు.'

నేనన్నాను– 'నేనొక ఉపాయం చెబుతాను.
ఈసారి నీవొచ్చినపుడు అతణ్ణి నేను పట్టుకుంటాను.
నీవు గురిచూసి కొట్టు నీ బాణాన్ని.
నీ పని నెరవేరుతుంది. నాకూ నీ స్నేహం దక్కుతుంది'

మేమిట్లా మాట్లాడుకుంటూ ఉండగానే
ఎక్కడో నా ఎదలో ఏదో గుచ్చుకుని మేము గాలిలోకి తేలాము.
నాకిష్టమైన దారిలో నేను వెళ్లాను.
మృత్యువు తన పనిమీద తానూ నిష్క్రమించాడు.

**– రాబర్ట్ బర్న్స్**
**(Robert Burns)**

# 18. సంభాషణ

## (Death is a dialogue between...)

మృత్యువంటే ఆత్మకూ మట్టికీ మధ్య సంభాషణ.
'కరిగిపో'– అంటుంది మృత్యువు
'నాకింకా విశ్వాసముంది' జవాబిస్తుంది ఆత్మ.

మృత్యువుకు సందేహం–
నేలతో వాగ్వాదం చేస్తుంది.
ఆత్మ సాక్ష్యం కోసం వెనక్కు తిరుగుతుంది.
దానిపై మెత్తని అంగీలా కొత్త మట్టి.

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 19. మారనిది

## (All but Death, Can be adjusted)

దేన్నైనా సర్దవచ్చు
ఒక్క మృత్యువు మినహా–
రాజవంశావళిని బాగు చేయవచ్చు–
మండలాల్ని, సంస్థల్ని దారిలో పెట్టవచ్చు–
పురాతన పురాల్ని, కోటల్ని పునరుద్ధరించవచ్చు–

ప్రాణాల వ్యర్థ కుప్పల్ని, వర్ణాలుగా మొలకెత్తించవచ్చు–
వసంతాల్ని వర్షింపచేసి కాంతులు వెదజల్లవచ్చు–
మృత్యువు– దానికదే సాటి–
మార్పులేనిదది ఒక్కటే!

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 20. ఫ్రెడ్‌మార్స్‌డెన్ విషాదాంతం

## (The Death of Fred Morsden)

ఒక విషాదాంత సంఘటనను నేను వివరిస్తాను.
దురదృష్టవంతుడైన ఫ్రెడ్ మార్స్‌డెన్ గురించి.
విషధూమాల్ని పీల్చి విగతజీవుడైనాడతడు.
పద్ధెనిమిది మే నెల పద్ధెనిమిది వందల ఎనభై ఎనిమిది నాడు.

ప్రసిద్ధికెక్కిన నాటక రచయిత, అజాత శత్రువు,
ప్రజల మన్నన పొందినవాడు, మేధావి,
న్యూయార్క్‌లోని తన పడకగదిలో శవమై పడి ఉన్నాడు.
పకడ్బందీగా చేసుకున్నాడతడు ఆత్మహత్య!

లోపల్నుంచి తలుపుకు తాళం వేసుకుని
కిటికీ తలుపులు మూసి, దుప్పటి చింపి
పీలికలతో రంధ్రాలన్నిటినీ మూసివేసాడు.
గాస్ బర్నర్ మీట తిప్పినాడు, పని ముగించుకున్నాడు.

సాయంకాలం ఏడు గంటలకు సిగరెట్ తాగుతూ
భార్యకు గుడ్‌నైట్ చెప్పినాడు. ఆమె వేరే
గదిలో శయనించింది. ఉదయాన్నే వారి కుమార్తె
గ్యాస్ వాసన పసికట్టింది. సేవకుడు విలియమ్స్ కేక పెట్టాడు.

వెంటనే తలుపు పగలగొట్టాడు, ఆ తరువాత మార్మోగాయి
రోదనలూ, పెడబొబ్బలూ; గదిలో గ్యాస్; మార్స్‌డెన్ శవం!
అందరిని దయతో చూసే అతడు మరింక బతికిలేడు.
అతడి మంచితనం, ప్రేమ అతడి కూతుర్ని చెడగొట్టాయి.

'బ్లాంచె', అతడి రాకుమార్తె, ఒక్కోసారి అందాల దేవరాణి
ఇంకోసారి శివమెత్తిన సివంగి, సైతాను స్వరూపిణీ.
కన్నతండ్రి తనకిచ్చిన అవకాశాల్ని కాలదన్ని
అస్తమానూ స్వార్థంతో అడ్డదార్లు తొక్కిందామె.

విందులూ, వినోదాలూ, వాటికి తోడు విలాసవంతమైన నౌక
ఇన్ని సౌకర్యాలు సమకూర్చినా, ఇంటిని నరకంలా చేసిందామె.
ఆమె తప్పులకు తన తలదించుకుని, అతడుచేసుకున్నాడాత్మహత్య.
ఆమె నేరాలు తనపై వేసుకుని, చాలించాడీ జీవితాన్నిలా

నా దృష్టిలో ఆమె కృతఘ్నురాలు! ఇంటి నుంచి పారిపోయింది.
నానా రకాలుగా బతిమలాడి నచ్చచెప్పి తీసుకువచ్చాడా తండ్రి.
తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది, మీద పడి రక్కింది.
అయ్యో పాపం! తెల్లారేసరికి అతగాడు తన గదిలో శవమైనాడు.

నాటకరంగంలోని ప్రముఖులంతా నిర్విణ్ణులయ్యారు.
తమనాదరించే దయాళువు తనువు చాలించాడని విచారించారు.
ఫ్రెడ్ మార్స్‌డెన్ సతీమణి దుఃఖానికి అంతేలేదు.
ఈ విషాదమన్నా అతని కుమార్తె కన్నులు తెరిపిస్తే అదే పదివేలు!

అందుకే నేనంటున్నాను మిత్రులారా!
పిల్లల్ని ప్రేమతో పెంచండి! గారాబం చేసి చెడగొట్టకండి!
ఫ్రెడ్ మార్స్‌డెన్ జీవితాన్ని పాఠంగా తీసుకోండి.
ఈ విషాదాంత కథ నుండి విశ్వసందేశాన్ని వినరండి!

**– విలియం టొపాజ్‌మెక్ గొనాగల్**
**(William Topaz Mc Gonagall))**

# 21. మార్గరిటె - షులామితె

## (Death Fugue)

ఉదయ సంధ్యపు కృష్ణక్షీరాన్ని సూర్యాస్తమయ వేళలో సేవిస్తాము
మధ్యాహ్నం, సాయంకాలం మరల మరల తాగుతూనే ఉంటాము.
బంధింపబడని వాడున్నచోట తిరుగాడే గాలుల మధ్య గోతిని తవ్వుతాము.
ఒక యింటిలో ఉండే వ్యక్తి తాను వ్రాసిన సర్పాలతో ఆడుకుంటాడు.
అతడు జర్మనీలో చీకటి పడే వేళకు నీ బంగారు శిరోజాల గురించి వ్రాస్తుంటాడు.
వ్రాసాక బయటకు వచ్చి నింగిలోని తారలను చూస్తూ ఈల వేస్తాడు.
అతడు భూమ్మీద ఉన్న యూదులందరిని ఈలవేసి పిలుస్తాడు.
వాళ్లు సమాధి తవ్వాక అతడు మనల్ని నాట్యం చేయమని ఆజ్ఞాపిస్తాడు.

ఉదయ సంధ్యపు కృష్ణక్షీరం లాంటి నిన్ను మేము రాత్రిపూట తాగుతాము
ఉదయ, మధ్యాహ్నా, సాయంకాలాలలో మరల మరల తాగుతూనే ఉంటాము.
ఒక యింటిలో ఉండే వ్యక్తి తాను వ్రాసిన సర్పాలతో ఆడుకుంటాడు.
మార్గరిటా! అతడు నీ బంగరు శిరోజాల గురించి వ్రాస్తుంటాడు.
బంధింపబడని వాడున్న చోట తిరుగాడే గాలుల మధ్య బూడిదరంగున్న
నీ శిరోజాల్ని సమాధి దగ్గర చూస్తాము.

మీరాడుకునే భూమి లోపలకు వినబడేలా అతడు కేకలు పెడ్తాడు.
తన నడుముకున్న ఇనుప బద్దను పైకెత్తినపుడు అతని నీలికళ్లు మెరుస్తాయి.
మీలో కొందరు పారలతో అదిమిపెడ్తుంటే, మిగతావాళ్లు నృత్యం చేస్తారు.

ఉదయ సంధ్యపు కృష్ణక్షీరం లాంటి నిన్ను రాత్రిపూట తాగుతాం మేము
ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం అలా తాగుతూనే ఉంటాం.
నీ బంగారు జుట్టున్న ఇంటిలోనే ఆ వ్యక్తి నివసిస్తుంటాడు.
నీ బూడిద రంగు శిరోజాల సర్పాలతో ఆడుకుంటాడు.
జర్మనీలో తన యజమాని మృత్యువును, అతడు ప్రేమగా ఆహ్వానిస్తాడు.
నీ సంకెళ్లను ఆతడు తడమగానే నీవు గాలిలోకి లేస్తావు.
మేఘాల్లో నీ సమాధి దగ్గర బంధింపబడని వాడుంటాడు.

ఉదయ సంధ్యపు నల్లటి పాలలాంటి నిన్ను రాత్రిపూట మేము తాగుతాము.
జర్మనీ యజమాని మృత్యువు ఉన్నప్పుడు మధ్యాహ్నం నిన్ను సేవిస్తాము.
సాయంకాలం, పొద్దున అలా తాగుతూనే ఉంటాము.
జర్మనీ నుంచి వచ్చిన ఆ యజమాని కళ్లు నీలంగా మెరుస్తుంటాయి.
అతడునిన్ను సీసపు గుళ్లతో సూటిగా కాలుస్తాడు.
బంగారు శిరోజాలున్న నీ యింటిలోనే అతడు నివసిస్తుంటాడు.
మార్గరిటె! అతడి దళాన్ని మాపై ఉసికొలిపి మబ్బుల్లో సమాధి తవ్వుతాడు.
సర్పాలతో, పగటి కలలతో ఆడుకుంటాడు జర్మనీ నుంచి
వచ్చే యజమాని అనే మృత్యువు.

నీ బంగారు రంగు శిరోజాలు మార్గరిటె!
నీ బూడిద రంగు జుట్టు షులామితె!

**– పాల్ సెలాన్**
**(Paul Celan)**

## 22. మృత్యువు గురించి భయపడకు!

**(Don't fear Death)**

మర్త్యలోక ప్రయాణంలో మృత్యువును చూసి భయపడకు
స్నేహితులైనా, శత్రువులైనా నీవు భయపడాల్సిందేమీ లేదు.
ప్రార్థనలోని పదాలను విను! భయాల వదనాలను దాటి పోనివ్వు.

మృత్యువు నిన్ను వెదుక్కుంటూ వస్తుంది.
నీ వప్పుడు జీవితానికి బానిసగా ఉండబోవు
దారిద్ర్యం కష్టాల రాత్రుళ్ల నుండి చీకటి వేపు నడుస్తావు.

శాశ్వత ప్రదేశపు సమాన న్యాయాన్ని మృత్యువు నీకిస్తుంది.
నీ జీవితానికి నెమ్మదిగా నడిచే శిక్ష విధించబడదు
శాశ్వతమనిపించే దారుణ బాధలిక ఉండబోవు.

**– అలెగ్జాండర్ బ్లోక్**
**(Alexander Blok)**

## 23. అప్పగింతలు

**(So give me back to Death)**

నన్ను మృత్యువుకు అప్పగించండి!
మృత్యువంటే నాకు భయంలేదెన్నడూ!
మిమ్మల్నించీ నన్ను దూరం చేసిందన్న బాధ ఒక్కటే–

నా ప్రాణమెలాగూ పోయింది.
నా సమాధిలో ఇలా నేనున్నాను.
దీని పరిమాణమెంత? అని అంచనా వేస్తున్నాను.
బహుశా నరకం ఊహించినంత–
మరియు ఆ స్వర్గలోకమంత!

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 24. సంతాపం

**(Bereavement in their death to feel)**

మనమెన్నడూ చూడని వాళ్ల గురించి
మనం అశ్రునయనాలతో సంతాపం ప్రకటిస్తున్నామంటే,
మన, వాళ్ల ఆత్మల మధ్య ఖచ్చితంగా
ఏదో విడదీయరాని దగ్గర బంధం ఉండే ఉంటుంది.

నూతన వ్యక్తి– అపరిచితులు శోకించరు–
మరణం అంటని స్నేహితులు కావచ్చు వాళ్లు.
వారిలో ఒకరిని మృత్యువు సందర్శిస్తే
మిగతావాళ్లకు అది అశనిపాతమై నేలకూలతారు.

మన ఆలోచనలలో సదా మెదిలే వ్యక్తి–
మృత్యువు నీడలోకి నిష్క్రమిస్తే,
మన ఆత్మలే మన నుంచి వేరైనట్లు–
అకస్మాత్తుగా–

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 25. మృత్యువు కొరకు

## (For Death... or rather)

మృత్యువు కొరకు - లేదా
అది కొనే వస్తువుల కొరకు-
జీవితంలోని అవకాశాల్ని
అది అవతల పెట్టేస్తుంది.

మృత్యువు కొనగలిగిన విషయాలు
ఒక గది-
పరిస్థితుల నుంచి తప్పించుకోవడం
ఒక పేరు-

జీవితపు బహుమతుల్తో-
మృత్యువిచ్చే బహుమతుల్ని తూచగలమా?
అక్కడుండే మారకపు విలువలు-
మనకు తెలియవు కదా!

**- ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 26. మృత్యు దోపిడి
## (Robbed by Death)

మృత్యువు చేత దోచుకోబడ్డాను.
అది సులభమే!
కన్ను మూతబడుతున్నది.
కడపటి కాంతిని కన్నులలో దాచుకున్నాను.
స్వేచ్ఛ చేత దోచుకోబడ్డాను
ఆమె రక్షణకై
దానినీ భరించాను
కీర్తికాంక్ష – తగినదే –
సాహస ప్రేమికులకు.
దూరంలోని మోసం, ప్రమాదంలోని మోసం
మృత్యువులోని మోసం – వీటిని భరించాను.
ఎంతో సంపన్నమైనది – ఉత్కంఠత –
దానిలోని అస్పష్ట విధ్వంసమూ–
మన దగ్గర ఉన్న సంపదలన్నిటినీ,
ఒక వెంట్రుక బలంపై నిలబెట్టి,
జయాపజయాల కోసం ఊగిసలాట,
వెంట్రుక చీలుతుందా, లేదా, అని!

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 27. బాధ

## (The Frost of Death was on the Pane)

మృత్యు శీతల మంచు ధూళి తెరలు తెరలుగా వస్తున్నది.
'మీ పుష్పాల్ని భద్రపరచుకోండి' –అన్నాడతడు.
నౌక అడుగున పడ్డ రంధ్రాన్ని మూసేందుకు
తంటాలు పడుతున్న నావికుల్లా మా మృత్యుపోరాటం.

ఈ వికసించిన పుష్పాన్ని సముద్రం వేపు
పర్వతాలవేపు, సూర్యుని వేపు నిలిపి ఉంచాము.
సూర్యుని అరుణవర్ణపు అరపై కూడా
మంచుపొర పాకుతున్నది.

అతడి నుంచి దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తూ
పుష్పానికి అతడికి మధ్య మేం నిలబడ్డాం
సన్నటి సర్పంలా అతడు
మా మధ్య నుంచి దూసుకుపోయాడు.

నిస్సహాయురాలైన ఆమె అందం ఓడిపోతుంటే
మా కోపం కట్టలు తెంచుకోగా
మేమాతడిని అతడి లోయలగుండా
అతడి నివాసం వరకు వెంటాడినాము.

మేము మృత్యువును, జీవనాన్ని రెంటినీ ద్వేషించాము.
ఇప్పుడు ఎటూ పోయే దారిలేదు.
సముద్రం కన్నా, భూఖండం కన్నా
పెద్దది ఒకటి ఉన్నది – అదే బాధ!

**– ఎమిలి డికెన్‌సన్**
**(Emily Dickenson)**

# 28. మృత్యు రహస్యం
## (Death)

చనిపోతున్న జంతువును
భయం లేదా ఆశ ఏదీ ఆదుకోదు.
మానవుడు మాత్రం అంతిమ ఘడియల్లో
భయం లేదా ఆశ లేదా రెండిటితో ఎదురు చూస్తాడు.

అలా మరల మరల మరణించి
మళ్లీ మళ్లీ బతుకుతాడు.

గర్విష్ఠుడైన ఒక గొప్ప వ్యక్తి
హంతకులను ఎదుర్కొంటున్నపుడు
ఊపిరి ఝుంఝూటనపై
నిరాశ దుప్పటి కప్పుతాడు.

అతడి ఎముకలకు కూడా తెలుసు మృత్యువు గురించి–
మానవుడే మృత్యువును సృష్టించాడనీనూ–

**– విలియం బట్లర్ ఈట్స్**
**(William Butler Yeats)**

# 29. తగలబడిన నగరం

**(A City's Death)**

అందర్నీ సమానం చేసిన ఆ అగ్నిజ్వాల చల్లారింది.
ఆకాశం ఎర్రబడిన మొహంతో మౌనాన్ని పాటించింది.
ఒక నగరపు మరణాన్ని నేనిప్పుడు వ్రాస్తున్నాను.
కన్నీళ్లను కాల్చేసిన కొవ్వొత్తి వెలుగుల్లో
నేను తెగిపోయిన జీవితాల తీగెల గురించి చెబుతాను.

పగలంతా నేను పాడుబడిన శిథిలాల మధ్య నడిచాను.
కాలిన ప్రతి మొండిగోడ అబద్ధాల కోరులా నిలబడి ఉన్నది.
పక్షుల కేకలతో ఆకాశం ప్రతిధ్వనిస్తుంటే
పొగమంటల మధ్య మబ్బులు పగిలిన పత్తి సంచులైనాయి.
క్రీస్తు నడచిన ఆకాశం పొగచూరి ఉండగా నేనడిగాను.
"మనిషికెందుకిన్ని కన్నీళ్లు? ఎందుకీ కొయ్య ప్రపంచం
ఇలా పగిలిపోతుంది?"
పట్టణంలో కాగితాలే ఆకులు
కొండలు విశ్వాస ప్రతీకలు
పగలంతా నడిచిన పసిబాలుడికి ప్రతి ఆకూ
ఆకుపచ్చని ఊపిరే! ప్రేమకు పునరుజ్జీవనమే!
మరణించిన ప్రతిదీ మృత్యువుచే ఆశీర్వదింపబడ్తుంది.
అగ్నిచే సంస్కరింపబడి కాంతి మొలకలనిస్తుంది.

**– డెరెక్ వాల్కాట్**
**(Derek Walcott)**

# 30. ప్రతిపత్తి

## (And Death shall have no dominion)

మృత్యువుకు ఒక ప్రత్యేక ప్రతిపత్తి అంటూ లేదు.
చనిపోవడమంటేనే నగ్నత్వంలోకి నడక
గాలిలో తేలుతూ పడమటి చంద్రుడివేపు పయనం
అస్థికలు శుభ్రపడి, శుభ్రమైనవి గతించాక
మోచేతులు, పాదాల వద్ద నక్షత్రాలు మెరుస్తాయి.
ఉన్మాద స్థితిలోనూ వాళ్లు ప్రశాంతంగానే ఉంటారు.
సముద్రంలో మునిగినా చటుక్కున పైకి లేస్తారు.
ప్రేమికులు పోయినా ప్రేమ నశించదు.
మృత్యువుకు ప్రత్యేకమైన రాజ్యమంటూ లేదు.

మృత్యువుకు ప్రత్యేక ప్రతిపత్తి ఏమీ లేదు.
సముద్రపు గాలుల క్రింద శయనించినవారు
ఆ గాలులంత త్వరగా నిష్క్రమించలేరు.
కాళ్లు మెలిదిప్పబడి, కీళ్లు వదులైనా
చక్రానికి కట్టబడి తిప్పబడినా ముక్కలుగా విరగరు
విశ్వాసం వాళ్ల చేతుల్లో రెండుముక్కలై
ఒంటి కొమ్ము గుర్రం వాళ్ల మీద దూసుకుపోయి
చివర్లు చీలికలైనా వాళ్లు చలించరు
మృత్యువుకు ప్రత్యేకమైన రాజ్యమంటూ లేదు.

మృత్యువుకు ప్రత్యేకమైన ప్రతిపత్తి అంటూ లేదు.
వాళ్ల చెవులకు సముద్రపు పక్షుల పిలుపు వినబడదు.
సముద్ర తీరాన అలలు విరుచుకు పడవు.
పుష్పాలు పుష్పించవు; పుష్పించినా తలపైకెత్తి
తమపై పడ్తున్న వాననీటి చుక్కలను ప్రశ్నించవు.
గోళ్లాలా గట్టిబడి చచ్చినా, కోపం వచ్చినా
తమల్ని మోదుతున్న వర్షపు బిందువుల్ని ఇదేమని అడగవు.
ఎండ మండుతున్నపుడు మాత్రం ఎండి రాలిపోతాయి.
అందుకే మృత్యువుకు ప్రత్యేక రాజ్యమంటూ లేదు.

**– డిలాన్ థామస్ (Dylan Thomas)**

# 31. నేను విలపించను!

## (A refusal to mourn the Death)

ఫలపుష్ప పక్షి జంతు జాలాన్ని తయారుచేస్తూ
చీకటిని తరిమివేసిన మానవజాతి
ఆఖరి కాంతి కిరణం వచ్చేదారిని,
సముద్రం మీద నుంచి కళ్లేలను గుంజుకుంటూ వచ్చే
నిశ్శబ్దపు ఘడియ గురించి ఊహించలేదు.

నేను వెళ్లక తప్పదు!
నీటి బిందువుల హారంలోకి,
మొక్కజొన్న పొత్తుల మందిరంలోకి.
శబ్దపు నీడల ప్రార్థనతో నా చెమట బిందువును
సంతాపలోయలో విత్తనాలుగా విత్తడానికి!

పసివాడి మృత్యువులోని రాజసం, వేదన చూడు!
ఒక నిష్ఠుర సత్యం కోసం పయనించే మానవజాతిని
నిర్మూలించాలని నేననుకోవడం లేదు.
ప్రాణవాయువు మజిలీలలో దైవదూషణకు ఆస్కారం లేదు,
యువతలోని అమాయకత్వపు జ్ఞాపకాలు తప్ప.

లండన్ పుత్రిక తొలి మర్త్యులతో నేల లోపల పాతిపెట్టబడి ఉంది.
స్నేహితులకు దూరంగా!
వయస్సును మించిన రేణువులు,
తన తల్లికున్న నల్లని రక్తనాళాలు,
థేమ్స్ నదీ వరద నీటిలా రహస్యంగా విలపిస్తాయి.
తొలి మృత్యువు, తర్వాత, ఇంకేమీ ఉండబోదు.

**– డిలాన్ థామస్**
**(Dylan Thomas)**

# 32. మరణాలు - ప్రవేశాలు

## (Deaths and Entrances)

చాలామంది దగ్గరవాళ్ల మృతితో
జీవితం నిప్పుల కణిక మీద ఉన్నట్లుకాగా
నీవు అత్యధికంగా ప్రేమించిన వ్యక్తి
నిష్క్రమించడం తప్పనిసరి అని తెలిసినప్పుడు-

ఎగిరిపోతున్న ఊపిరికి సంబంధించిన
సింహాలూ, అగ్నిజ్వాలల్ని ఇక్కడే వదలి
వెళ్లిన అమర స్నేహితుల
ధూళిగా మారిన అవయవాల్నెవరు లెక్కిస్తారు?

మేము నిన్ను పొగడ్తలతో ముంచెత్తి,
పాతాళంలోకి నిన్ను ఆహ్వానించిన అతడితో శాంతి
నెలకొల్పినా, విషాదాన్ని వివాహం చేసుకున్న
వాళ్లెందరో వెళ్లే ఆ లోకంలో నీవెలా ఉంటావో!

జీవితం నిప్పుల కణిక మీద ఉన్నట్లుకాగా-
చాలామంది దగ్గరవాళ్ల మృతితో,
నీ పెదాలు, తాళం చెవులు, మూతబడుతూ
తెరచుకుంటూ, చంపబడిన అపరిచితుల నేతపని.

చాలామందికి తెలియనివాళ్లు
నీ పొరుగువాడు, పక్కవీధి ప్రముఖుడు,
కన్నీళ్లలో ఈతకొడ్తూ, రక్తస్నానం చేస్తూ,
మృతుల లోకంలోకి వెళ్తూ, సన్నటి దారంతో
గోళాన్ని నీకు వ్యతిరేక దిశకు తిప్పుకుంటారు.

అల్చిప్పల, నత్తగుల్లల గొంతులో కేకల్ని నింపి

కేకలతో వెలువడే కాంతుల్ని కళ్లలోకి వంపుతారు.
అనేక మరణాలు జననాలతో
జీవితం అంగారాలపై ఉన్నట్లై
పరిచిత, అపరిచిత వ్యక్తులు లండన్ అలల్లో గాయపడి
నీ ఒంటరి సమాధి గోతిని చూస్తారు.
ఒకే శత్రువు, ఎందరికో! అతడికి తెలుసు–

నీ హృదయం ప్రకాశవంతమై
గుహల, తాళాలలోంచీ మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నా
పిడుగుల్ని కురిపించి, సూర్యుణ్ణి మూసి, ముంచి
నల్లబడిన తాళం చెవులతో వేగంగా స్వారీ చేస్తుందని,
నీ శింశుమార చక్రంలోని ఆఖరి యోధుడు
నిష్క్రమించే వరకూ ఆ పయనం ఆగదనీ!

**– డిలాన్ థామస్**
**(Dylan Thomas)**

# 33. మృత్యువుతో గొడవ

## (I wage not any fend with Death)

మృత్యువుతో నేను తగాదా పడబోను
రూపంలో, వదనంలో వచ్చే మార్పులను గురించి;
నేల కౌగిలిలోని ఏదైనా సరే అతడిలో కరగనీ
నా విశ్వాసంలో మాత్రం మార్పు ఉండబోదు.

అనంతమైన క్రియ సంభవిస్తూనే ఉంటుంది.
ఒక స్థితి నుంచి మరో స్థితిలోకి ఆత్మ నడుస్తుంది.
ఇవన్నీ చెదరగొట్టబడిన తరూశాఖలు
విరిగిన చేమంతిపూల రెక్కలు.

అలా అని మృత్యువును నేను నిందించబోను
అతడు భువిపైని శీలాన్ని నగ్న పరుస్తాడు.
నాకు తెలుసు మరొకచోట అతికించబడ్డ మానవుడు
అధికంగా పెరిగి పుష్పించి ఫలవంతుడౌతాడు.

అందుకే మృత్యువంటే నాకెంతో కోపం
నా ఎదలో పొంగి పొరలే ఆగ్రహ రూపం
అతడు మన జీవితాల్ని ఎంత దూరం చేస్తాడంటే
మనిద్దరం మాట్లాడుకునే మాటలు మనకే వినబడవు.

**– లార్డ్ ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్**
**(Lord Alfred Tennyson)**

# 34. రాబర్ట్ బ్రౌనింగ్ మరణించినప్పుడు-

**(On the Death of Robert Browning)**

మెలకువకు దీటైన స్వప్నమేదీ అతనికి తెలియదు.
అతడిప్పుడు మృత్యు సామ్రాజ్యంలో నిలబడి ఉన్నాడు.
మనం నిద్రిస్తున్నప్పుడు అతడు మెలకువగా ఉన్నాడు
ఇప్పుడు తనకు తెలిసిన విషయాల్ని స్వప్నిస్తున్నాడు.

అతడికేనాడూ మృత్యువంటే భయం, వెరపూ లేదు.
'ముందుకు పద' – అని ఆత్మను నడిపించినాడు.
ఏడవండి! కాని మీకు అతడి సత్యమార్గంలో విశ్వాసం లేదు,
కేవలం, అదృశ్యమైన ఓ శిరస్సును మీ మనసులో చూస్తున్నారు.

అతడి వాక్కులోని కాంతిని సంరక్షించుకోవాలి.
కాని మనం, సూర్యాస్తమయ వర్ణపు నీటి అలల్ని చూస్తున్నాం!
మనకు తెలుసు సూర్యుడు సముద్రం చేత ఓడిపోలేదని
ఆత్మ పరమాత్మ ఒక్కటేనని,
జీవితం, మృత్యువూ ఆత్మ యొక్క నీడలేనని!

**– ఆల్గెర్నాన్ ఛార్లెస్ స్వైన్‌బర్న్**
**(Algernon Charles Swineburne)**

# 35. ఒక మరణం - ఒక జననం
## (Death and Birth)

మరణం, జననం కలిసి ఒకేచోట నివసించరాదు.
సంపదలెన్ని ఉన్నా ఈ ఇంటిని శాశ్వతంగా ఉంచలేవు.
విధి జనన మరణాల్ని ఒక సన్నటి దారంతో కలిపి చూస్తుంది.

వాటిని కలిపి ఉంచే కాడి
అవి నడయాడే పరిధిని దూరంగానే ఉంచినా
మృత్యువు గొప్పదా, లేక, భూమిపైని జీవం గొప్పదో ఎవరికి తెలుసు!

ఎర్రగులాబి, తెల్లటి ఈక
కిరీటపు శిఖగా కలిసిపోవచ్చు – సంతోషం, దుఃఖంలా,
వేసవి శీతాకాలాల్లా జననం, మృత్యువూ.

**– ఆల్గెర్నాన్ ఛార్లెస్ స్వైన్‌బర్న్**
**(Algernon Charles Swineburne)**

## 36. ఒక జననం - ఒక మరణం
### (Birth and Death)

జనన మరణాలు కవల పిల్లలు
జీవుల ప్రాణాల్ని నిలిపే రాత్రింబవళ్లలో రాజ్యమేలతాయి.
రెండిటి మధ్య స్నేహాన్ని ఎల్లప్పుడూ ఉంచేది కాలం.

వాటి కనుచూపులపై విరుద్ధ పుష్పాలుండగా
స్వర్గాన్ని తండ్రిగా, భూమిని తల్లిగా ప్రకటిస్తాయి.
విశ్వాసులు వాటిని వీక్షిస్తారు, నమ్ముతారు.

చిరునవ్వులు కన్నీళ్లను తేలికపరుస్తాయి,
లేక కన్నీళ్లు చిరునవ్వులను కమ్మివేస్తాయి.
సంతోషమైనా దుఃఖమైనా
ఒకదానికొకటి జననమా, మరణమా తెలీదు.

**- ఆల్గెర్నాన్ ఛార్లెస్ స్వైన్‌బర్న్**
**(Algernon Charles Swineburne)**

# 37. మృత్యువంటే అది

## (Such, such is Death)

అదీ, అటువంటిది మృత్యువు.
విజయమూ లేదు, అపజయమూ లేదు.
ఖాళీపాత్ర, అక్షరాలు చెరిపేసిన పలక,
గతాన్ని దయతో పక్కకు నెట్టివేయడం.

మనకు తెలుస్తుంది: మృత్యువంటే జీవితం కాదని.
నలిపివేయబడిన ప్రాణమని, పగిలిన కుండ అనీ,
అద్భుత విషయాలు తెలిసిన మనకూ అంతిమమెప్పుడో తెలియదు.

మృత్యువులో విజేత, పరాజితుల మధ్య అభేదమే.
పరాక్రమవంతుడు, పిరికివాడు; స్నేహితుడు, శత్రువు;
దెయ్యాలు అడగవు– 'ఊపిరి తీసుకునే దాంట్లో
నీ ఘనత ఏమిటని? – ఓ పెద్ద మచ్చ
ప్రతి నిన్నటి రోజునూ దాచేస్తుంది,–
అతిపేదగా అసంపూర్తిగా
నీ ప్రకాశవంతమైన వాగ్దానం వదలి వెడలిపోయింది.
అది స్పృశించబడి, పెరిగి, పుష్పించి, ఫలవంతమై
నిన్ను గుర్తుచేస్తుంది, నీవు చనిపోయాక!

**– ఛార్లెస్ సొర్లె**
**(Charles Sorley)**

# 38. మృత్యువు గురించి-
## (On Death)

శీతల, వెండి, చిరునవ్వుల వెన్నెల
నక్షత్ర రహిత నింగిలో ఉల్కా కిరణం
ఆ ఒంటరి ద్వీపంపై కాంతిని విరజిమ్మాయి.
ఉదయ సంధ్యాకాంతి ఇక్కడ అల్పజీవులపై
అగ్నిజ్వాలగా మారి, మా మెట్ల దగ్గరకు చేరి మాసిపోతున్నది.

మిత్రుడా! ఆత్మస్థైర్యం ఉంటే చాలు
ఈ ప్రపంచపు తుఫాను నీడల్లో నావను నడిపించవచ్చు.
మేఘాల ప్రకంపనలని పగటి కాంతిలో నిద్రపుచ్చవచ్చు.
స్వర్గ నరకాలు కలిసే చోట విధి సమక్షంలో స్వేచ్ఛగా తిరగవచ్చు.

మనకు తెలిసిన దాయమ్మ ఈ ప్రపంచం
మనం స్పృశించిన మన అమ్మ ఈ లోకం
అప్పుడు మృత్యువు రావడమంటే అశనిపాతమే కదా!
ఉక్కు నరాలున్న మెదడు సైతం వణికిపోతుంది.
మనకు తెలిసింది, విన్నదీ, కన్నదీ ఒక అద్భుతమై కరిగిపోతుంది.

సమాధిలోని రహస్యాలు అక్కడే ఉన్నాయి.
ఈ ప్రేమ మాత్రం ఒంటరిగా మిగిలింది.
నిశితమైన కళ్లూ, అద్భుతమైన చెవులూ
చూడటానికి, వినడానికి ఉన్నా, మనం జీవించిలేనప్పుడు
ఆ అంతులేని మార్పుల ప్రపంచంలో
అంతా గొప్పగా, వింతగా అనిపిస్తుంది.

మాట్లాడని మృత్యువు గురించి కథ చెప్పేదెవరు?
రాబోయే కాలపు ముసుగు తెర లేవనెత్తేదెవరు?
సమాధి గోడలకు నీడల చిత్రాలద్దేదెవరు?
భయంతో నిండిన భవిష్యత్ ఆశలను,
మనం ప్రతిరోజూ చూసే ప్రేమ దృశ్యాలతో కలిపేదెవరు?

**– పెర్సి బెషె షెల్లీ (Percy Bysshe Shelly)**

# 39. చస్తే మంచిది!

**(Better die)**

కోటాను కోట్ల వీర్యకణాలు,
అన్నీ సజీవమే!
అంత జల ప్రళయంలోనూ బతికి బట్టకట్టింది,
నోవా ఒక్కడే!

అర్బుదాల అద్భుత విన్యాసాలలో,
ఏదో ఒక్క అవకాశం!
షేక్స్పియర్, న్యూటన్ లేదా డోనె కావచ్చు,
కాని, అది నేను!

నీకంటే అధికుల్ని ఇలా తొలగించవచ్చు,
అందరూ బయట ఉంటే నౌకలో నీవుండు!
మాకందరకూ మంచిది, ఓ మానవ విధాతా!
నీవు చప్పుడు చేయకుండా చస్తే చాలును.

**– అల్డస్ హక్స్లీ**
**(Aldous Huxley)**

# 40. అంతా మృత్యువే
## (Nothing but Death)

అక్కడ ఒంటరిగా ఉన్న స్మశాన వాటికల్లో
శబ్దం చేయని అస్థికలు సమాధుల్నిండా ఉన్నాయి.
సొరంగం గుండా పోతున్న హృదయం
బయటా, లోనా చీకటి, చీకటి, కటిక చీకటి.

మనలోకి మనం వెళ్తూ చస్తాము నౌకా ప్రమాదంలోలా
మన హృదయాల్లోకి మనమే మునుగుతూ
చర్మంలోంచి ఆత్మలోకి పడుతూ జీవించినట్లు.

అక్కడ శవాలున్నాయి
వాటి పాదాలు శీతల జిగురుమట్టితో చేయబడినాయి.
అస్థికల లోపల మృత్యువు
కుక్కలు లేనిచోట వినపడే మొరుగులా ఉన్నది.
ఏ గంటల నుంచో, సమాధులనుంచో వెలువడి
తడిగాలిలో వర్షపు కన్నీళ్లలా పెరుగుతున్నది.

ఒక్కోసారి నేను ఒంటరిగా చూస్తాను
తెరచాపల క్రింద శవపేటికలను,
పాలిపోయిన శవాల్ని, ఎండిన వెంద్రుకలున్న స్త్రీలను,
దేవదూతల్లా ఉన్న తెల్లని రొట్టెతయారీదారుల్ని.
ప్రముఖుల్ని పెండ్లాడి, విషాదంలో ఉన్న యువతులను,
నిట్టనిలువు మృత్యునదిలో ప్రయాణిస్తున్న పెట్టెల్ని–
నది ధూమ్రవర్ణంలో ప్రవహిస్తున్నది.
ఏటికి ఎదురీదుతున్న నౌక తెరచాపల శబ్దం–
మృత్యుధ్వని నిశ్శబ్దమే కదా!

ఆ శబ్దం మధ్య నుంచే మృత్యువు వస్తుంది,
పాదం లేని పాదరక్షలా, మనిషి లేని అంగీలా!

వచ్చి తలుపు తడ్తుంది, రాయిలేని ఉంగరంతో,
ఆ ఉంగరంలో ఉండాల్సిన వేలుండదు.
వచ్చి లేని నోటితో అరుస్తుంది. ఆ నోటిలో
నాలుక ఉండదు. గొంతు ఉండదు.
అయినా దాని శబ్దాలు వినబడుతూనే ఉంటాయి.
దుస్తులు చెట్ల సవ్వడిలా అణచబడ్డ శబ్దాన్నిస్తాయి.

నాకు సరిగా తెలీదు, నాకర్థమయ్యింది కొంచెమే
నాకు దృష్టి దోషం ఉన్నది, కాని ఆ పాట
మసకబడ్డ వయొలెట్ల రంగులో ఉన్నట్లు నాకనిపించింది.
భూమిపై విరగబూసిన వయొలెట్ల వర్ణం వాటికున్నది.
ఎందుకంటే మృత్యువదనం ఆకుపచ్చనిది
మృత్యువీక్షణం ఆకుపచ్చనిది.
వయొలెట్ ఆకుల తడి, శీతాకాలపు రంగు.

అయితే, ఒక్కోసారి మృత్యువు చీపురుకట్ట
రూపంలో నేలను ఊడుస్తూపోతుంది.
శవాలను వెదుక్కుంటూ; మృత్యువు ఆ
చీపురుకట్టలో దాగి ఉంటుంది. అది మృత్యుజిహ్వ.
అది మృత్యువుయొక్క సూది, దారాన్ని వెదుక్కుంటున్నది.
మడతపెట్టిన మంచాల్లో మృత్యువు దాగుంటుంది.
తన జీవితాన్ని నెమ్మది పరుపులపై నిద్రిస్తూ గడుపుతుంది.
నల్లటి దుప్పట్లు కప్పుకుని చటుక్కున ప్రాణం విడుస్తుంది.
ఒక విషాద శబ్దాన్ని విడుదల చేయగా దుప్పట్లు ఉబ్బుతాయి.
పరుపులు రేవు వేపు ప్రయాణం చేస్తాయి.
అక్కడ మృత్యువు నౌకాధిపతి దుస్తులలో ఎదురు చూస్తుంటుంది.

**– పాబ్లొ నెరుడా**
**(Pablo Neruda)**

# 41. మృత్యుశయ్య
## (The Death-bed)

తన చుట్టూరా కమ్ముకున్న నిశ్శబ్దం గురించి
అతనికి తెలుసు; అయినా కోటగోడలా నిశ్చలంగా ఉన్నాడు.
పసుపు కాంతి నుంచి ప్రసరిస్తున్న కిరణాలు
నిద్ర రెక్కలపై ఎగుర్తూ దూసుకుపోతున్నాయి.
నిశ్శబ్దం రక్షణ అతని మర్త్యతీరం
అంతర్వలయపు చంద్రుడు లేని అలల అంచుల్ని కలిగి ఉంది.

ఎవరో అతడి నోటికి నీటిని అందిస్తున్నారు.
అడ్డు చెప్పకుండా గుటకవేసి, మూలిగి, కూలబడ్డాడు.
రక్తవర్ణపు విషాదం నుంచి చీకటిలోకి పయనిస్తూ
తన గాయపు గంజాయి ఊపును, నెప్పిని మరచిపోయాడు.

నీరు – ఉపరితలాన నిశ్శబ్దంగా, ఆకుపచ్చగా ఉన్నది
నీరు – తన నావ పయనించే ఆకాశపు వెలుగు దారి
పక్షి గొంతులు, పూల ప్రతిబింబాల అంచులు
వేసవి రంగులు, చెల్లాచెదురై పారుతున్నాయి.
సంతృప్తి చెందిన తెడ్లను తడుపుతూ, నిట్టూరుస్తూ
నిద్ర పోయాడతడు.

రాత్రి, ఓ గాలి విసురుతో, గదిలోకి ప్రవేశించింది.
గుమ్మం వద్ద కర్టెను తెర వంపులుగా రెపరెపలాడింది.
రాత్రి. అతడు అంధుడు. తారలు కనిపించవు.
మబ్బులు సంతాప సూచక పూలగుత్తుల్లా మెరుస్తున్నాయి.
రకరకాల రంగులు – పర్పుల్, ఆకుపచ్చ, రక్తవర్ణం
మునుగుతున్న అతని కన్నులలో వెలిగి ఆరిపోయాయి.

వర్షం – చీకటిలోంచి జలజలమనడం అతడు విన్నాడు
ఉద్వేగంలేని, సువాసనా భరితమైన సంగీతం ఒక్కటిగా నేయబడింది.

రెక్కలు వడిలిన గులాబిపూలపై వేడి వర్షం కురుస్తున్నది.
అడవుల్ని తడిపే వానజల్లు తెరలు తెరలుగా వస్తున్నది.
ఉరుములు, పిడుగుల వెనక విజృంభించే పెను వర్షం కాదది.
శాంతి తుంపర సున్నితంగా, నెమ్మదిగా జీవితాన్ని
కడిగి, శుభ్రించి తనతో తీసుకుపోతున్నది.

అతడు కదిలినాడు. ఒక పక్కకు ఒత్తిగిల్లినాడు.
నెప్పి, పొంచి చూస్తున్న మృగంలా, ముందుకు దూకింది.
అతడిని పట్టుకుని పీకి, అతడి కలల్ని
గోళ్లతో, కోరలతో చింపివేసింది.
అతడి పక్కన ఎవరో నిలబడి ఉన్నారనిపించి
అతడు గజగజా వణికాడు.
మృత్యువు అతడివేపు అడుగువేసి
ఒక్కక్షణం ఆగి తీక్షణంగా చూసింది.

అతడి మంచం చుట్టూరా దీపాలను వెలిగించు
నీ కళ్లు అతనికివ్వు; వేడి రక్తాన్ని, జీవించాలనే కోరికనూ ఇవ్వు,
అతడితో మాట్లాడు; మేలుకొలుపు; ఇప్పటికైనా రక్షించగలవు
అతడు యువకుడు; యుద్ధాన్ని వ్యతిరేకించినవాడు
వృద్ధ ఆక్రమణదారులందరూ బతికి ఉండగా అతడెలా మరణిస్తాడు?
మృత్యువు బదులు పలికింది– 'అతడిని నేను ఎన్నిక చేసాను'–
ఆ వేసవి రాత్రి నిశ్శబ్దంగా మారింది.
నిశ్శబ్దం, రక్షణ, నిద్ర తెరలు, ముసుగు
అప్పుడే, దూరంగా, భయంకర తుపాకి చప్పుళ్లు.

**– సీజ్ ఫ్రైడ్ ససూన్**
**(Siegfried Sassoon)**

# 42. కవలల్లో ఒకరి మరణం

**(On the Death of a twin)**

ఎక్కడున్నారయ్యా! ఈ జ్యోతిష్కులంతా మీరు?
చిన్ని ప్రమాదాలకు కారణాలు స్వర్గపుస్తకంలో వెదకుతారు!
కవల పిల్లలు, ఏక మాతృగర్భ సంజాతకులు
అదృష్టం, జీవితం, మృత్యువులో కూడ విభిన్నంగా ఉన్నారు.
ఇద్దరూ వెచ్చగా ఉన్న కొద్దిసేపట్లోనే
ఒకరు చనిపోతారన్న విషయం తెలిసింది.
ఒకే ఆత్మ రెండుగా చీలి, ఒక అర్ధభాగం
అంతర్ధానమైతే రెండోది ఎలా జీవిస్తుంది?
ఒకే మాయ - ప్లాసెంటా నుంచి జీవించిన ఇద్దరు
ఇప్పుడు వేర్వేరుగా విడదీయబడినారు.
మృత్యువు ఒకరిని చంపి, ఇద్దరూ చనిపోతారనుకున్నది.
దెబ్బ అయితే కొట్టగలిగింది కాని మోసపోయింది.
కవలలిద్దరిలో ఒకరు మరణించి
రెండవ బిడ్డకు గుండె బలాన్నిచ్చింది.
మృత్యుదేవత ఇక్కడ ఒకరితో నిర్దాక్షిణ్యంగా,
మరొకరితో సామాన్యంగా ప్రవర్తించింది.
ఆమె ఇద్దరికి గురిపెట్టింది. ఒకరిని చంపగలిగింది.
కాని, అది పసిబిడ్డలో సగాన్ని.

**- విలియం స్ట్రోడ్**

**(William Strode)**

# 43. మృత్యు వనం
## (The garden of Death)

నీరసంగా ఉన్నా బతికేవుంది
చనిపోతోంది కాని సజీవంగానే వుందింకా,
గోల్ఫ్ బంతులంత విశాలనేత్రాలు
ఎముకలంత తెల్లగా
గట్టి నిర్మాణం – ఎముకల గూడు
కండ లేదు.
నవరంధ్రాల్లో చీము
పురుగులు
దంతాలు, తెల్లటి దంతాలు
కపాలం, ఎముకలు.
ప్రాణం గురించి విచారం
ఈ బాధ నిశితమైనది, లోతైనది.
మృత్యువు ఒక్కటే పరిష్కారం
మిత్రుడా! నాకు విచారంగా ఉంది.
నిద్రలోనూ, మెలకువలోనూ
నీవు పడ్తున్న బాధ
అంధత్వం
ఆవేదన, ఆక్రోశం – ఆలోచనలు రాని స్థితి
అన్నిటినీ నెప్పి మింగేసింది.
అటువంటి హృదయం మరణించినట్లేకదా!
ఓహ్! ఈ జీవితం – ఒక శాపం
నాకు విచారంగా ఉంది. ఐయామ్ సారీ!
నీవు చనిపోతావు
మృత్యువనంలోకి రాళ్లు విసరబడ్డాయి.
ఆ వైద్యసేవిక కళాకారిణి కాదు
మంచి చిత్రకారుడు ఆమెకు నశించడం గురించి వివరించాడు.

వ్యాధిచేత మలచబడిన మానవ రూపం
వేయి రోగాలు గూడుకట్టుకున్న ప్రాంతం
అందుకే ఇన్ని బాధలు–
ఇక్కడ స్వర్గం ఉండబోదు...
ఏమీ తినలేవు,
నోటినిండా పుండ్లే!
మూత్రం విసర్జించలేవు,
వృషణాలలో మంట!
నీరసం, వణుకు, నిస్త్రాణ, శోష
ఎముకలు – ఎముకలంత సన్నం
చర్మం, దుర్గంధం
జాలి చూపకు–
ఇక్కడ స్వర్గం లేదు–
ఒక శరీరం శిధిలం కానున్నది...
నరకం కోసం వెదుకు!
అది ఇక్కడే నీకు కనిపిస్తుంది.

**– గాడ్‌ఫ్రై ముటిసొ గొర్రి**
**(Godfrey Mutiso Gorry)**

# 44. అయిదవ ఇంద్రియశక్తి లోపం
## (Deaf and Death)

దీపాలు రాత్రంతా వెలుగుతూనే ఉంటాయి.
ఇక్కడ, ప్రజల్ని జాగ్రత్తగా గమనించాల్సిన రోజులు వచ్చాయి.
నేనొక గొర్రెల కాపరిని – నికొలస్ లాయిజొ
నాకు చీకటంటే ఇష్టం.
ఎందుకంటే చిన్నప్పటి నుంచీ నేను చీకటిలోనే నడిచాను.
కానీ ఈ పగటి వేడిమిలో, ఈ మంచాల మధ్య,
ఎగుడు దిగుడు స్తంభాలు, రాళ్ల మధ్య
నా అడుగులు తడబడుతున్నాయి.
నేను ఎలాగోలా నా నిద్రిస్తున్న ఇంటివేపు వెళ్లేప్పటికి
రాత్రి నా భుజాలపై ఎక్కి కూర్చున్నది.

అయినా నా చూపు నిశితమైనదే
కళ్లున్న వారికన్నా మంచిదే,
నేను రొట్టె ద్రాక్షసారాయిని ఆస్వాదిస్తాను.
ఏ పొలంలో ఏ పంట ఉందో తడిమి చెప్పగలను.
గడ్డిలో దాక్కున్న ఎర్ర నక్క వాసనను పసిగట్టగలను.
మంచును, ఊపిరిని, నా గొర్రెలను నేను స్పర్శతో లెక్కించగలను.
ఎందుకంటే నా మిగతా నాలుగు ఇంద్రియాలు బాగా పనిచేస్తాయి.
అయిదవది నాకు మృత్యు కారకమయ్యింది.
పహరా కాస్తున్న సైనికులు అరచి ఉండవచ్చు
'హాల్ట్! ఆగు! ఎవరక్కడ!' అని
వాళ్లకు శబ్దం కావాలి! జవాబు కావాలి!
శబ్దం వినిపించని నేను ఎలా స్పందించగలను?
వాళ్ల లోకం వాళ్లది. నేను వాళ్లకు సవాల్‌గా మారాను.
నేను వాళ్లపరాజయానికి ఆ క్షణం చిహ్నమయ్యాను.

శీతాకాలపు ఆకాశంలో రెపరెపలాడుతున్న పతాకలా
వాళ్లకున్న పంచేంద్రియాలూ వారికి వివరించలేకపోయాయి.
నాకు ఒక ఇంద్రియ శక్తి లేదని; అందుకే వాళ్లు కాల్చారు.
తుపాకి పేలింది, నాకు వినబడలేదు.
వాళ్లు ఇంద్ర ధనుస్సును కూడ కాల్చగలరు,
దానికి వారనుకున్నదానికన్నా ఒక రంగు తక్కువుంటే!

క్రీస్తు అన్నాడు– 'ఒక గొర్రెపిల్ల తప్పిపోతే
తనకు మిగతా తొంభైతొమ్మిదికన్నా అదే ముఖ్యమని'–
ఈ వైద్యశాలలో ఇతరుల ప్రాణాలు,
కొడిగట్టిన దీపాలలా వెలుగుతున్నపుడు,
నిద్రపట్టని వాళ్ల ఊపిరి ఘనీభవిస్తున్నపుడు,
నేను చూస్తున్నాను జీవితాల విలువెంతో!
ఈ ప్రశస్తమైన వస్తువుల ఉనికి ఎంతో!
ఇక నేను వీటిని తాకలేను, చూడలేను,
రుచి, వాసనతో దేనినీ పసికట్టలేను,
ఎందుకంటే నేను వినలేకపోయాను కనుక!

**– పాట్రిసియా బీర్**
**(Patricia Beer)**

# 45. మృత్యు విజయం
## (The Victory of Death)

నేను మరణించాక నా గురించి చింతించవలదు
దూరపు గంటల సవ్వడి మీకు వినబడుతున్నంత వరకు;
ఈ లోకానికి హెచ్చరిక చేయండి, నేను పారిపోయానని
ఈ క్రూరలోకం నుంచి, మరింత క్రూరమైన పురుగుల మధ్యకని.

కాదుకాదు, ఈ వాక్యాన్ని నీవు చదివితే, గుర్తుంచుకోకు
రాసిన చేతిని; అందుకే నీవంటే నాకిష్టం.
నీ మధురోహలలో నన్ను నేను మరచిపోయేందుకు;
నా గురించిన నీ ఆలోచన నీకివ్వరాదు ఏ కష్టం.

నేనంటాను, ఈ పద్యపాదాన్ని నీవు చూడు
నేను మట్టిలో కలసిపోయాక.
నా పేరు పలుమార్లు ఉచ్ఛరింపబడని నాడు
నీ ప్రేమ నా జీవితంలా శిధిలమయ్యాక.

ఈ తెలివిగల ప్రపంచం నీ వేదనా మూలుగుల్ని విని,
నేను ఆ లోకంలోకి వెళ్లిపోయాక ఎగతాళి చేయనీ!

**– విలియం షేక్స్‌పియర్**
**(William Shakespeare)**

# 46. ఒజిమాండియస్

## (Ozymandius)

ఒక పురాతన దేశంలో నేనొక బాటసారిని కలిసాను
అతడన్నాడు– "రెండు పెద్ద దేహరహిత శిలాస్తంభాల కాళ్లు,
ఎడారిలో నిలబడి ఉన్నాయి. వాటి దగ్గర్లోనే
ఇసుకలో సగం మునిగి పెద్ద రాతి మొహం.

ఆగ్రహం, అధికార గర్వం, ఆ మెలితిరిగిన పెదాలలో
ఆజ్ఞాపూరిత భావాల్ని ఆ మహాశిల్పి ఎవరో అద్భుతంగా చెక్కాడు.
అవింకా జీవంతో తొణికిసలాడ్తున్నాయి, ఆ చెక్కినవాడూ
లేడు, చెక్కించుకున్నవాడూ అక్కడ లేడు.

కాళ్ల దగ్గర శిలాఫలకంపై ఈ అక్షరాలున్నాయి.
'నా పేరు ఒజిమాండియస్! రాజులకే రాజును;
నా ఘనకార్యాల్ని చూడండి! ఘనులమనుకునేవాళ్లు నిరాశ పడండి!'

ఆ చుట్టుపక్కల ఏమీ కనిపించదు ఎటుచూసినా!
అన్ని పక్కలా శిథిలాలు, రాతి ముక్కలే
ఒంటరి ఇసుక మైదానం మాత్రం మైళ్లకొద్దీ విస్తరించుకున్నది"

**– పి.బి. షెల్లీ**

**(P.B. Shelly)**

# 47. దీపాలు ఆరిపోయాయి

**(Lights off)**

నేను నిద్రాలోకపు సరిహద్దుల వద్దకు వచ్చాను.
అంచనా వేయలేని లోతు, దూరం.
అరణ్యంలో దారి తప్పి అన్నీ కోల్పోయాను.
ఋజు మార్గమైనా, వంపులున్నా
నేడో, రేపో
దారిని వాళ్లు ఎన్నుకోలేరు.

ఎన్నో రహదారులు, డొంకలు
ఉదయసంధ్యపు తొలి వెలుగు
అరణ్యపు అంచుకు తగిలి
బాటసారుల్ని మోసం చేస్తుంది
ఇప్పుడు అకస్మాత్తుగా మాయమైంది.
వాళ్లు మునిగిపోతారు.

ఇక్కడ ప్రేమ అంతమౌతుంది.
నిరాశ, కోరిక ముగుస్తాయి.
సౌఖ్యాలు, కష్టాలు
తీపీ, చేదూ అన్నీ-
నిద్రకన్నా మధురమైనది
అన్ని కార్యాలలో కన్నా గొప్పదైన దారిలో కలిసిపోతాయి.

ఇక నేను ఏ పుస్తకం వేపూ,
నాకిష్టమైన ఏ వదనం వేపూ,
చూడలేను, ఆనందించలేను.
నాకేమీ తెలియని ప్రపంచంలోకి,
నేనిప్పుడు ప్రవేశించాలి,
ఒంటరిగా వెళ్లిపోవాలి,
ఎలాగో నాకు తెలియదు.

ఎత్తైన అరణ్యపు వృక్ష శిఖరాలు
వాటి మబ్బుల ఆకుల తలవంచాయి
దూరంగా అరలపై అరల్లా, అలల్లా,
నిశ్శబ్దంలో నేను వింటూ అనుసరిస్తున్నాను
దారిని కోల్పోతూ
నన్ను నేను కోల్పోతున్నాను.

– ఎడ్వర్డ్ థామస్
**(Edward Thomas)**

# 48. నివాళి

## (The souls of the poets)

ఉద్వేగాల్ని, ఆనందాన్ని ప్రదర్శించే కవిగాయకుల్లారా!
మీ ఆత్మల్ని భూమిపై విడిచి వచ్చినారు.
స్వర్గంలో కూడా మీ ఆత్మలలానే ఉన్నాయా?
కొత్తలోకంలో రెండు జీవితాల్ని గడుపుతున్నాయా!

అవును, స్వర్గలోకపు సమాజంలో
సూర్యచంద్రులు విహరించే చోట
అద్భుత జలధారలు పైకుబుకుతున్న ధ్వనులు
ఉరుముల శబ్దాల సంగీతం
స్వర్గ వృక్షాల గుసగుసలు
అన్నిటినీ, తీరికగా, ఎలిషియన్ మైదానాలలో
కూర్చుని ఆనందిస్తూ, దయానా లేడికూనలతో
కలిసి విహరిస్తూ,
పెద్దపెద్ద నీలిగంటల పుష్పాల కింద,
గులాబీ పూల వాసన ఉన్న డైజీ పూలమధ్య,
అలౌకిక సుగంధ గులాబీ పువ్వుల తోటలో,
అమర సత్యగానాన్ని ఆలాపించే
నైటింగేల్ పక్షుల మధుర గీతాల్ని వింటూ,
వేదాంత భావనల్ని విరజిమ్ముకుంటే,
కథల్ని, స్వర్ణయుగపు చరిత్రల్ని వడపోస్తూ,
స్వర్గలోకపు రహస్యాల్ని శోధిస్తున్నారా?
అక్కడ మీరు ఆ ఉన్నత స్థానాల్లో ఆసీనులై ఉండగా
మేమిక్కడ ఇలా జీవిస్తున్నాము–
మీరక్కడ వదిలివెళ్లిన ఆత్మల ఛాయలు
మాకు మీరుండే ప్రదేశాల్ని, మీరు వెళ్లిన దారుల్ని బోధిస్తున్నాయి.
నిద్రే లేని, నిరంతర అనంత ఆనంద లాహిరిలో

మీరు తెలియాడే అమరలోకపు సౌఖ్యాల్ని వివరిస్తున్నాయి.
మీ భూలోకపు ఆత్మలింకా
మా మర్త్యులతో మాట్లాడుతూ, తిరుగుతూ,
మా కష్టసుఖాల్ని, ఉద్వేగ విషాదాల్ని పంచుకుంటున్నాయి.
మా జయాపజయాల్ని, ఆనందావమానాల్ని
శక్తియుక్తుల్ని, అన్నిటినీ వీక్షిస్తున్నాయి.
ప్రతిరోజూ మాకు జ్ఞానాన్ని, వివేచననూ
సన్మార్గాన్ని చూపుతూ
మమ్మల్ని రక్షిస్తున్నాయి.

ఉద్వేగాలను, ఆనందాల్ని ప్రదర్శించిన కవిగాయకుల్లారా!
మీరు మీ ఆత్మలను భూమిపై విడిచి వెళ్లినారు.
స్వర్గంలో కూడా మీ ఆత్మలలానే ఉన్నాయా?
కొత్త లోకంలో రెండు జీవితాల్ని గడుపుతున్నాయా?

**– జె. కీట్స్**
**(J. Keats)**

# 49. మృత్యుభయం
## (The fear of Death)

మృత్యుభయమా? – నా గొంతులో పొగల పొర
నా ముఖంపై మంచుబిందువుల తెర
నీహారికా వర్షాల అలజడి, విస్ఫోటనమై వెలువడి
నాకు తెలుస్తుంది ఆ ప్రదేశపు ఒరవడి
కటిక చీకటి రాత్రి శక్తి, తుఫాను ఒత్తిడి
నా శత్రువు వేచివున్న జాడ, వేడి.
అతడు నిలబడిన చోట, అనాది భయపు రూపు
అయినా ధైర్యస్తుడు ముందుకు నడుస్తాడు.
మహాప్రస్థానం ముగిసింది; శిఖరం అందింది.
అడ్డంకులు తొలిగిపోయాయి.
అంతిమ పోరాటం; ఆ విజయం తరువాతనే
అందుతుంది ప్రతిఫలం
నేనెప్పుడూ పోరాటయోధుడినే – ఇంకో యుద్ధం
ఇదే ఆఖరిది, ప్రశస్తమైనది.
మృత్యు భయంకర స్వరూపానికి భయపడి
కళ్లు మూసుకుని నేనుండలేను.
ముఖాముఖీ ఎదుర్కొంటాను మృత్యువును
పాతతరం యోధుల్లా ప్రతిఘటిస్తాను.
ఒక్కక్షణంలో ఈ బాధల్ని, కష్టాల్ని, శీతల
జీవితపు బాకీల్ని తీర్చివేస్తాను
సాహసవంతుడు అత్యంత దుస్తర పరిస్థితుల్లోనూ
అద్భుత విజయాన్ని సాధిస్తాడు.
చెలరేగు కణాలూ, పెట్రేగే ఆగ్రహస్వరాలూ
కృశించి నశించి కలిసిపోనీ
బాధలోంచి శాంతి కుసుమం ఉద్భవించి
వెలుగు దివ్వెగా నీవున్న దారి చూపనీ
నా ఆత్మలో ఆత్మా! నిన్ను స్పృశించనీ
అన్నీ నిర్దేశించే భగవానునికి అంతిమ తీర్పును వదిలేయనీ!

**– రాబర్ట్ బ్రౌనింగ్ (Robert Browning)**

# 50. మృత్యువు
## (Death)

మృత్యువా, గర్వించకు, కొందరు నిన్ను
మహాశక్తివంతుడిగా, భయంకరుడిగా కీర్తించి ఉండవచ్చును గాక
కానీ, నీవంతగా ఎగిరిపడనక్కరలేదు.
ఎవరినైతే నీవు నేలకూల్చానని అనుకుంటున్నావో
వాళ్లు చావలేదు!
మృత్యుదేవతా! నీవు నన్ను చంపలేవు.
విశ్రాంతి, నిద్రలలో కనిపించే నీ రూపం,
వాటి నుంచి పొందే ఆనందం ఇంకా కావాలి నాకు!
మాలోని ప్రముఖ వ్యక్తులు నీతో నిష్క్రమించాక
వాళ్ల ఎముకలు మిగుల్తాయి, ఆత్మలు పయనిస్తాయి.
విధికి, అవకాశానికి, రాజులకు, తెగించిన వాళ్లకు నీవు బానిసవు
విషం, యుద్ధం, రోగాల్లో నివాసముండే అల్పజీవివి!
మాకు ఇంత నల్లమందు, ఇన్ని మంత్రతంత్రాలు చాలు
నీకంటే మంచి నిద్రనిస్తాయవి. మరి నీ గొప్పేమిటి?

**- జాన్ డొనె (John Donne)**

# 51. తాతయ్య

## (Grand Father)

నన్ను ఓ క్షణం దీక్షగా పరికించాడు.
మృత్యు భారంతో ఆయన కళ్లు బరువెక్కి ఉన్నాయి.
మాటలు పైకుబకలేదు కాని నాకర్థమయ్యాయి–
"కిటికీ తెరువు"
నేను కిటికీ తలుపులు తెరిచాను
ఆయన వేపు తిరిగి చెబుదామనుకున్నాను–
'ఎందుకు తాతా శ్రమపడతావు.
ఇప్పుడు నీ దృష్టికి నీకిష్టమైన పొలాలూ, చెట్లూ
ముళ్లకంచెలూ, పందిళ్లూ, పొదులూ
అల్లంత దూరంలోని చిట్టడవులూ
నీ సాయంకాలపు వాహ్యాళిలోని మజిలీలూ
ఇవన్నీ కనిపించడం అసాధ్యం'–
అని చెబుదామనుకుని అతనివేపు తిరిగాను
– పాత గూళ్ల స్థానానే పక్షులు కొత్తవి కట్టుకుంటున్నాయనీ,
పొలాల పక్క సెలయేరు మరలా దారి మార్చిందనీ,–
చెప్పబోయాను–
కాని, తాతయ్య, ఆ తెరచిన కిటికీ గుండా
తనంతట తానే వెళ్లిపోయాడు
నేను చెబుదామనుకున్న సంగతుల్ని స్వయంగా చూడాలని!

**– రాబర్ట్ యం. హొవెల్**

**(Robert M. Howell)**

# 52. పూలను కోసిన మృత్యువు

## (The Reaper and the flowers)

పంటలను కోసే అతడి పేరు మృత్యువు
తన పదునైన కొడవలితో
ధాన్యపు కంకుల్ని కోస్తాడు ఒక్కవేటుతో
పండిన కంకుల మధ్య ఉన్న పూలతో సహా

'ఇది ధర్మం కాదేమో!' –అనుకున్నాడతడు.
ధాన్యాన్ని మాత్రమే కోయగలిగితే బాగుండును
ఈ పూల పరిమళం నాకెంతో ఇష్టం
వాటిని మరలా యథాస్థితికి చేరుస్తాను.

నీళ్లు నిండిన కళ్లతో అతడా పూలను చూసాడు
వాడిన ఆకుల్ని ప్రేమగా ముద్దాడినాడు
స్వర్గాధిపతి కోసమే కదా నేనీ కంకుల్ని కోసింది
వీటిని పనలుగా కట్టలు కట్టింది.

'నా ప్రభువు ఈ పూలను ఇష్టపడతాడు'–
అని పలికి అతగాడు చిరునవ్వు నవ్వాడు
ఈ భూమి దైవానికిచ్చిన గురుతులివి
అతడీ నేలపై శిశువుగా నడిచినాడు

ఈ పూలిప్పుడు కాంతిమైదానాల్లో పుష్పిస్తాయి
నేను వాటిని జాగ్రత్తగా అంటుకడ్తాను
ధవళవస్త్రధారులైన సాధుసంతులు
ఈ పవిత్ర పుష్పాలను అలంకరించుకుంటారు.

నేలతల్లి కన్నీళ్లతో బాధతో ఈ పూలనిచ్చింది,
తాను ఎంతగానో ప్రేమించే కుసుమాలను;
తనకు తెలుసు వాటిని తాను కనుగొనగలనని
పై నున్న ప్రకాశవంతమైన కాంతి పొలాల్లో.

క్రూరత్వంతోనో, ఆగ్రహంతోనో
ఆనాడు అతడు అక్కడికి రాలేదు
దేవదూతగా ఆకుపచ్చని నేలపైకి అరుదెంచినాడు
ఆ పుష్పాలను తనతో కొనిపోయినాడు.

**– హెన్రి వాడ్స్‌వర్త్ లాంగ్‌ఫెలో**
**(Henry Wadsworth Longfellow)**



# వేదాంతం



A Hindu widow burning herself with the corpse of her husband, 1820s.



Pandora's Box



Valkyries

# 1. ఆనాటి వాళ్లేమనుకునేవారు?

ఆస్ట్రేలియాకు సమీపంలో ఉన్న చిన్నచిన్న ద్వీపాలను, మెలనిసియా, మైక్రొనెసియా, పాలినెసియా ద్వీపాలంటారు. క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాలప్పుడు ఈ దీవుల్లోకి ఇండొనేసియా నుండి ప్రజలు వలస వచ్చారు. న్యూజిలాండ్, హవాయి ఇంకా చిన్నచిన్న ద్వీపాలు పాలినేసియాలోకి వస్తాయి. పాలినేసియా కథల్లో ముఖ్యంగా వినవచ్చేది తొలి మానవస్త్రీ సృష్టి, ఆమెతోపాటుగా వచ్చిన మృత్యువు. టానె దేవుడు అడవులకు, వృక్షాలకు అధిదేవత. హవాయికి ద్వీపంలోని ఇసుకతో తొలి స్త్రీని తయారుచేసి ఆమెద్వారా హిని–టిటామా అనే సంధ్యాదేవతకు తండ్రి అయినాడు. ఆమెకు ఆ సంగతి తెలీకుండానే పెళ్లిచేసుకున్నాక నిజం తెలిసి ఆమె అధోలోకానికి పారిపోతుంది. టానె ఆమె వెంటపడగా 'నేను నీ ప్రపంచంపు బొడ్డుతాడును తెంపి, ఈ లోకానికి వచ్చాను. నీకు నాకు సంబంధం లేదంటుంది' అలా ఆమె ఆ పాతాళ లోకంలో ఉండిపోయి టానె మానవ సంతానాన్ని తన చీకటి లోకానికి లాక్కుపోతుంటుంది. అలా తొలిస్త్రీ జననం, ఆమె కుమార్తె వల్ల మరణం ఈ లోకంలోకి వచ్చాయని అప్పటి నుండే దగ్గర బంధువుల లైంగిక సంబంధాలు (Incest) నిషేధించబడినాయని పాలినేసియన్ ప్రజలు విశ్వసిస్తారు.

ఇన్యూట్ ఎస్కిమోలలో చానాళ్లపాటు మరణం లేదు. జనాభా పెరిగి నేల తలకిందులయ్యే పరిస్థితి రాగా, వాళ్లల్లోని ముసలి అవ్వ మంత్రాలు చదివి యుద్ధం, మృత్యువులను ఆహ్వానించిందట. ఆ రకంగా భూభారం తగ్గింది.

ఉత్తర ఆమెరికాలోని షోషోని (Shoshoni) తెగవాళ్ల నమ్మకమేమిటంటే– సృష్టికర్త తోడేలు, జిత్తులమారి కొయొటె నక్క ఓరోజు మాట్లాడుకుంటున్నపుడు – సృష్టికర్త "ఎవరైనా చనిపోతే వాళ్ల పొట్టకింద బాణం వదిలి బతికించవచ్చు" అంటాడు. కొయొటె అంటాడు– "అందరూ బతికితే భూమిపై ఉంటానికి చోటుండదు గదా"; సృష్టికర్త తోడేలు నవ్వి "నేనూ అదే చెబుతున్నాను. నీ కుమారుడు చనిపోయాడు. నీమాట నిలబడాలి సుమా" అన్నాడట. అలా ఆనాటి నుంచి మృత్యువు అక్కడ మొదలైందట.

కాలిఫోర్నియా పసిఫిక్ తీరంలోని 'వింటు' తెగ (Wintu) ప్రజల సృష్టికర్త ఒలెల్‌బిస్ (Olelbis) మానవులను సృష్టించ సంకల్పించుకుని నేలకు స్వర్గానికి మధ్య ఓ నిచ్చెన, నిచ్చెన పై మెట్టు దగ్గర రెండు జలధారలు (Fountains)–

ఒకటి శుద్ధిపరచబడడానికి (Purification); రెండవది– పునర్యవ్వనం పొందడానికి (Rejuvenation). ఈ పనిని త్వరగా పూర్తిచేయమని రెండు కవల ఆత్మలు (బుజర్డ్ పక్షుల రూపంలో ఉన్నవాటిని ఆదేశించాడు. అవి స్వర్గానికి నిచ్చెన వేస్తుండగా మధ్యలో జిత్తులమారి కొయొటి (Coyote) వచ్చి– “ఈ పని వలన ఏమిటి ప్రయోజనం? శ్రమ దండగ! ఈ మనుషులంతా స్వర్గానికి వెళ్తే స్వర్గం నిండిపోదా? పుట్టినపుడు సంతోషం, చస్తే సంతాపం మంచిది కదా!” ఇలా సవాలక్ష సందేహాలు, ఆంక్షలూ, ప్రశ్నలూ లేవనెత్తి, చెవిలో ఇల్లు కట్టుకుని పోరేప్పటికి ఆ పక్షులు బెంబేలెత్తి అప్పటివరకు కట్టిన నిచ్చెనను పీకేసాయి. కొయొటి ‘అనుకున్నదొకటి అయ్యిందొకటి’– నిచ్చెన పీకేలోపల స్వర్గానికి ఉడాయిద్దామనుకుంటే కుదరక హతాశుడై పూలతో రెక్కలమర్చుకుని ఎగరబోతే పూలు వాడిపోయి ‘కొయొటి’ నేలమీద పడగా– సృష్టికర్త పైనుంచి చూసి– “నీ అల్లరిపని వలన నీకేకాదు, ఇక మానవలోకంలోని ప్రతి ఒక్కరికి మృత్యువు తప్పదు” అని శాసనం చేసినాడట.

అంగోలాలో ఒక వేటగాడి సోదరుడిని మృత్యువు తీసుకుపోయాడని కోపంతో, వేటగాడు మృత్యువును వలలో బంధించాడట. అప్పుడు మృత్యువు నవ్వుతూ వేటగాడిని మృత్యులోకంలోకి తీసుకువెళ్లి, ‘మనుషులు అక్కడకు రావడానికి కారణం, వాళ్లు చేసిన నేరాలు, తప్పులే అని ఋజువుచేసి దేవతలను నిందించకు. నీకూ నీ కాలం వచ్చినప్పుడు ఇక్కడకు రాక తప్పదు’ అని వివరించినాడట.

ఆఫ్రికాలోని మరో తెగలో ఇంకో విచిత్రమైన కథ చెబుతారు. సృష్టికర్త ఓ ఊసరవెల్లి (Chamaleon)ని పిలిచి “మానవలోకానికి పోయి మానవులకు మరణం లేదు” అని చెప్పిరా అని పంపితే ఊసరవెల్లి అక్కడక్కడ ఆగుతూ తాత్సారం చేసిందట. సృష్టికర్తకు కోపం వచ్చి ఈసారి గోడమీద పాకే బల్లిని పిలిచి (Gecko Lizard)– “మనుషులు చావక తప్పదు. ఇది నా ఆదేశం” అని చెప్పి రమ్మనగా బల్లి అతివేగంగా, ఊసరవెల్లి కన్నా ముందు వచ్చి దైవాజ్ఞను ప్రకటించిందట. అలా ఊసరవెల్లి మందగమనం, బల్లి వేగం మానవులకు మృత్యువును తెచ్చిపెట్టాయి.

ఇంకో ఆఫ్రికన్ కథలో మానవులకు అమరత్వాన్ని ఇవ్వడానికి దేవతలు తొడుగుల్నిచ్చి ఓ దూతను పంపగా ఓ పాము ఆ తొడుగుల్ని కాజేసిందట.

అప్పట్నుంచి పాములు కుబుసాల్ని విడవడం, మానవుడికి మృత్యువు నిర్దేశింప బడినాయి.

కాంగో ఆదిమ ప్రజల విశ్వాసం ఏమిటంటే దేవుడు ఒకప్పుడు మానవులతో కలిసి నివసించేవాడు. అయితే మానవుల గొడవలు, పోట్లాటలు, అల్లరి చిల్లర పనులకు విసిగి భూమిని వదిలి స్వర్గానికి వెళ్లిపోతూ మానవులకు మరణాన్ని శిక్షగా విధించాడట.

అనేక గాథల్లో స్త్రీ, మృత్యువును మానవలోకంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. గ్రీకుల కథల్లోని పండోరా (Pandora) తొలి మానవస్త్రీ. దేవలోకం నుంచి వస్తూ తెరవవద్దని దేవతలు తనకు ఇచ్చిన పెట్టెను (Pandora's Box)ను కుతూహలంతో, పెట్టె మూత తెరవడంతో మృత్యువు, వ్యాధులు బయటకు వచ్చి మానవులను పీడించసాగినాయి. ఆమె వెంటనే పెట్టె మూయగా లోన ఆశ (Hope) మిగిలిపోయింది. ఆశ కొరకే మానవులు జీవిస్తారు.

ఈడెన్ తోటలోని జ్ఞానవృక్షం లాంటిదే ఆస్ట్రేలియన్ ఆదిమతెగల స్వర్గంలో తేనెపట్టులున్న బోలువృక్షం. దాని దగ్గరకు వెళ్లవద్దని సృష్టికర్త నిషేధించినా ఓ స్త్రీ తేనెకోసం చెట్టు నరికిందట. తేనె బదులు మృత్యువు గబ్బిలం (Bat) రూపంలో బయటకు వచ్చి మానవుల్ని కబళించసాగింది.

✧✧✧✧✧



# 2. అనాది విశ్వాసం - పరలోక యాత్ర

ప్రపంచంలోని ప్రతి తెగలోనూ మరణానంతరం ఆత్మ పరలోక ప్రయాణం చేస్తుందని నమ్మకం ఉన్నది. ఆ యాత్రకు కావల్సిన సంబారాలు సమకూర్చి, దేహాన్ని సమాధి చేసేవారు. రాతియుగ కాలం నాటి సమాధుల్లోనూ మరణించిన వారికి ఇష్టమైన ఆహారం, పనిముట్లు ఉంచిన ఆధారాలు లభ్యమవుతున్నాయి. తర్వాతి కాలాల్లో ఆయుధాలు, వాహనాలు, సేవకులు, రాణులతో సహా యావన్మందీ మరణించిన రాజుతో పాటు సజీవ సమాధి అయ్యేవారు.

**"కనియెం గోమల నీల మేఘ విలసత్ కాలాంజనా కారు హో**
**ర నిశాత ఉత్కట దంష్ట్రను జ్వల చల ద్రక్తా క్షు బ్రత్యగ్ర కాం**
**చన వర్ణాంబరు నంత్య కాల దహన జ్వాలా ప్రచండున్ జగ**
**జ్జన సంత్రాసకు నొక్క దివ్య బటు పాశ ప్రౌఢ హస్తోద్ధతున్"**

ఎవరికీ చూడ శక్యం కాని మృత్యువు సావిత్రికి కనిపించాడు. సత్యవంతుని జీవాత్మను తన పాశంతో బంధించి దక్షిణ మార్గంలో యమపురికి పోతున్నాడు. యముని మెప్పించి, తన భర్త ప్రాణాలు దక్కించుకొన్నది మహా ఇల్లాలు సావిత్రి. (శ్రీమదాంధ్ర మహాభారతం - అరణ్య సప్తమాశ్వాసం)

**సత్యాల గది**

సూర్యాస్తమయం తరువాత అమున్-రె (రవి-సూర్యుడు) ప్రయాణించే దారి వెంటే, ఆత్మ కూడా 12 చీకటి గుహల ద్వారా ప్రయాణిస్తుందని ఈజిప్టు ప్రజల విశ్వాసం. ప్రతి గుహను భయంకరమైన భూతాలు కాపలా కాస్తుంటాయి. శవంతో పాటు భద్రపరచిన మృత్యు పుస్తకంలోని మంత్రాలను ఆత్మ పఠిస్తే భూతాలు తప్పుకొని దారి ఇస్తాయి. 12 గుహలు, 6 ద్వారాలను దాటుకొని ఆత్మ 'రెండు సత్యాల గది'లోకి వెళుతుంది. అక్కడ ఒసిరస్ మృత్యుదేవత ఐసిస్, నెఫ్థిస్‌లతో కొలువుదీరి ఉంటాడు. 42 మంది న్యాయాధికారులు 42 పాపాలను వరుసగా అడుగుతుంటే ఆత్మ వాటిని చేశాడో లేదో సమాధానం చెప్పాలి. నిర్దోషి అని నిరూపించుకొన్న జీవుని హృదయాన్ని న్యాయదేవత 'మాత్' పక్షి ఈకతో అనూబిస్ (మమ్మిఫికేషన్-దేవుడు), తోత్ (చిత్రగుప్తుడు) దేవుళ్ల సమక్షంలో ధర్మకాంటాలో తూస్తారు. ఆత్మ నిజం చెబితే మృతుని ఆత్మ దేవలోకంలోని 'యారు క్షేత్రాలలో' హాయిగా విహరిస్తుంది. అబద్ధం చెప్పినట్టు రుజువయితే 'అమ్ముత్' అనే రాక్షసికి ఆహారం అవుతుంది.

## మంత్ర దర్పణం

చైనీయులకు ఆత్మ పరలోకం వెళ్లేప్పుడు భూతాలతో తరమబడి, వాటి నుంచి తప్పించుకోవాలి. పాపులు భూతాలకు చిక్కి ఆహారమవుతారు. పుణ్యాత్ములు వారి వారి పుణ్యాల్ని బట్టి నిజాన్ని పసిగట్టే కుక్కలను దాటుకొని న్యాయ స్థానపు గది దగ్గర మంత్ర దర్పణంలో తమ పునర్జన్మ గురించి తెలుసుకోవచ్చును. ఆ తరువాత ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే పాత జన్మ అంతా కళ్లముందు కనిపిస్తుంది. ముందుకు సాగితే భయంకరమైన లోయపై ఉన్న ఇరుకైన వంతెన మీదుగా ప్రయాణించి ధర్మచక్రాన్ని చేరితే, ఆత్మ అక్కడ న్యాయ చరఖాపై కొత్త జీవ దారంగా పేనబడి పునర్జన్మ ఎత్తుతుంది. పునర్జన్మ ఎత్తేముందు ఆత్మ మరపు జలాల్ని తాగి పాత జన్మ వాసనలను మరిచిపోతుందిట.

## కదిలే పర్వతాలు

బొలీవియాలోని 'గ్వారాయు' తెగ వాళ్ల ఆత్మకు రెండు అవకాశాలుంటాయి. అద్భుతంగా, విశాలంగా కనిపించే దారి. ఇరుకైన ముళ్ల దారి. సరైన దారి ముళ్ల దారిగా కనిపించేదే. ఆశ గలవారు, పాపులు మొదటి దారిలో పోయి అక్కడ నానా రకాల శిక్షలు అనుభవిస్తారు. దారిలో రాకాసి చేపలున్న కాలువను ఈదుకుంటూ దాటాలి. చీకటి అరణ్యాల్ని, కదిలే పర్వతాల్నుంచి, మాట్లాడే వృక్షం మాయల నుంచి, భూతాల నుంచి బయట పడితే అప్పుడు పితృలోకాన్ని ఆత్మ చేరుకుంటుంది. అక్కడ యవ్వన సరస్సులో ఈదులాడితే మళ్లీ కొత్త జీవితం అనుభవించే అవకాశం దొరుకుతుంది.

నార్స్ ప్రజలు వైకింగులు–యుద్ధంలో మరణించిన వీరులు 'వాలహల్లా' స్వర్గానికి చేరుకొని 'ఒడిన్' దేవుడి సమక్షంలో 'వాల్కిరీ' అనే అప్సరసలు స్వాగతించగా విందు వినోదాల్లో తేలియాడతారని, పిరికివాళ్లు, సోమరులు మరణించేప్పుడు సుఖంగా మరణించినా, తరువాత వాళ్ల ఆత్మ మంచుకొండల్లో నానా పాట్లు పడుతుంది. కాబట్టి సమాధుల్లో చలికి తట్టుకొనేందుకు గట్టి పాదరక్షలను ఉంచేవారు. మంచుకొండల్ని చచ్చీ చెడి దాటిన తరువాత మృత్యులోకం సరిహద్దులోని 'గియాల్లార్' వంతెన దగ్గర (గ్జాల్ ఏటి పై కట్టబడింది) మాడ్గాడ్ అస్థిపంజరం కాపలా వాడికి జీవ రక్తాన్ని భత్యం కింద సమర్పించుకొని వంతెన దాటి లోహపు అరణ్యాల ద్వారా నరకలోక ద్వారం చేరుకొంటుంది. అక్కడ భయంకరమైన 'గార్మ్' కుక్క అరుస్తూ ఉంటే దాన్ని శాంతింపచేయడానికి కేకు ముక్క పడేసి నరక లోకంలోకి ప్రవేశిస్తుందట.

## ధర్మ దేవతలు

గ్రీకుల నరక లోకాధిపతి హేడ్స్. పాప పుణ్యాలను బేరీజు వేసే ధర్మదేవత. ఐదు నదులు ఎఖెరాన్ – బాధల నది, స్టిక్స్ – అయిష్టం, లెథె – మతిమరపు,

కాసిటస్ – రోదనల నది, ఫ్యూరి ఫ్లెగెతాన్–మంటల నది – ఆత్మ వీటిని దాటి 'కారాన్' (Charon) అనే పడవ సరంగుకు దారి భత్యం చెల్లించి మూడు తలల సెరెబెరస్ కుక్క భయంకరమైన అరుపులను శాంతపరచి నరకలోకంలో న్యాయాధిపతి ముందు మోకరిల్లుతుంది.

జోరాస్ట్రియన్లకు మిత్రా, స్యారోష, రష్ణులు న్యాయ దేవతలు. గ్రీకులకు మినాస్, రాడమాంథస్, ఏకస్‌లు తీర్పు ఇచ్చే దేవతలు. జపనీయులకు 'ఎమ్మావో' యమధర్మరాజు. గ్రీకులకు 'ఎలెషియన్ క్షేత్రాలు', ఈజిప్షియన్ యారు క్షేత్రాలు, హిందువులకు అమరలోకపు వనాలు పుణ్యాత్ములు విహరించేవి. పాపాత్ములకు టార్టారస్ లాంటి నరక లోకంలో శిక్షలు తప్పవు... లంచంబు గొని, సాక్షి వంచించి, యనృతంబు పలికెడి పాపాత్ములకు, కామ మోహితులకు, దొంగలకు, ద్రోహులకు... సమస్త పాపాలకు శిక్షలుగా రకరకాల నరకాలు ఉన్నాయని భాగవతం పంచమ స్కంధం వివరంగా చెబుతున్నది.

✧✧✧✧✧



# 3. సత్యాన్వేషణ

ఏమిటీ మృత్యువు? ఎందుకు మనల్నింత కలవరపెడ్తుంది? ఈ మృత్యు రూప, స్వభావాలేమిటి? ఎక్కడ్నుంచి వస్తుంది? ఎక్కడికి తీసుకుపోతుంది? ఇటువంటి సందేహాలు మానవుడిని ఎల్లప్పుడూ వెంటాడుతూనే ఉన్నాయి. 'నా జీవితమంతా మృత్యువు గురించిన ఆలోచనల నుంచి దూరంగా ఉండటానికే సరిపోయిందని' జాన్‌సన్ అనే అతడు వాపోయాడు. ఫ్రెంచ్ వేదాంతి పాస్కల్ చెప్పిందదే!– 'We spend our lives trying to take our minds off death'-

హరి మాయా విరచితమై
తరుణీరూపంబు దాల్చి, ధరబర్విన బం
ధుర తృణ పరివృత కూపము
కరణి నదియు మృత్యు రూపకంబగు మరియున్–

నిత్య సంగమం వలన పురుషుడే తదుపరి జన్మలో స్త్రీగా మారతాడు. అతడే ఆమెకు మృత్యు స్వరూపం కూడా అన్న విషయం భాగవతం మూడవ స్కంధంలో చెప్పబడింది. ప్రతి కాన్పులోనూ స్త్రీ, దాదాపు మృత్యువుకు చేరువగా వెళ్లి మరల జీవిస్తుంది కదా!

తాత్త్వికములైన పురుష
స్త్రీత్వంబులు లేవు పార్వతీ, జీవునకా
తత్త్వమున కహం కృతిగ
ర్మిత్వ మొలసి భావ్య విధమమెయికొనుచుండున్–

స్త్రీ పురుష తత్వాలనేవేమీ ప్రత్యేకంగా లేవు అని భారతంలో అనుశాసనిక పర్వం, పంచమాశ్వాసంలో చెప్పబడింది.

బాలకుండై క్షణంబు, యువభావయుతుండయి కొంతకాలము
ద్వేల దరిద్రుడై క్షణము, విత్తసమన్వితుడై క్షణంబు, జీ
ర్ణాలస గాత్రుడై నటుని యట్ల నటించి తుదిన్ నరుండు యా
మ్యాలయ నామమైన తెరయందు జొరంబడు సత్వరంబుగన్

ఈ భావాన్నే షేక్‌స్పియర్ జీవితమనే రంగస్థలమందు ఏడు దశలుంటాయి– Seven stages of life' అని అద్భుతంగా వర్ణించాడు.

జీవితకాలం తక్కువ, జీవితం క్షణభంగురమని తెలిసీ మానవుడు అహంకారంతో ప్రవర్తించడం వింత కాదా!

'ఆయువు నూరువత్సరములందు సగంబు నశించె నిద్రచే
నాయరలో సగంబు గతమయ్యెను బాల్య జరాప్రసక్తిచే
బాయక తక్కినట్టి సగబాలు గతించు బ్రయాసవృత్తిచే
నాయువు చంచలంబగుట బ్రాణులకెట్లు సుఖంబు చేకూరున్'-
అన్నాడు భర్తృహరి.

జీవితం నీటిబుడగ వంటిదని, ఆయువు అల్పమని ధనసంపదలు చంచలమని తెలిసి కూడా ఈ నరజాతి పొగరుతో కుల, మత, వర్ణ, జాత్యహం కారాలతో ఒకరినొకరు చంపుకుంటూ మృత్యువు కోసం ఆరాటపడ్తున్నారెందుకు?

'అంతములేని యీ భువనమంత పురాతన పాంథశాల వి
శ్రాంతి గృహంబు నందు నిరుపంజలు రంగుల వాకిళుల్ ధరా
క్రాంతులు, పాదుషాలు, బహరామ, జమిషీదులు వేనవేలుగా
గొంత సుఖించి పోయిరెటో పెరవారికి జోటొసంగుచున్'
–అని చెప్పలేదా కవికోకిల దువ్వూరి రామిరెడ్డి

తను చూసిన ఒజిమాండియస్ బృహత్‌శిలను చూసి 'షెల్లీ' కూడా అదే అంటాడు– 'ఆ అంతూపొంతూ లేని నిర్జనమైన ఎడారి మధ్యలో ఓ పెద్ద రాయిమీద ఓ పురాతన విగ్రహం– తాటిచెట్టంత ఎత్తూ, ఏనుగంత లావూ ఉన్న కాళ్లు మాత్రం నిలబడి ఉన్నాయి. అక్కడున్న శిలాఫలకం మీద యిలా వ్రాసి ఉంది–

'నాపేరు ఒజిమాండియస్... రాజులకే రారాజును!
నా శౌర్య ప్రతాపాలకు, నా గొప్పతనానికి సాగిలపడండి! మొక్కండి!

ఎంతదూరం చూసినా, అంతా ఇసుకమయం, దుమ్మూధూళి. ఆ కాళ్లూ రాళ్లూ తప్ప మొక్కడానికి, భయపడడానికి అక్కడింకేమీ లేదు.

అంతే! బతికున్నపుడే ఈ భోగభాగ్యాలూ, ప్రగల్భాలూ, ఆడంబర విన్యాసాలు! చచ్చాక విలువేముంటుంది?

'మృతియును జీవనంబు నిది మేదినిలోపల జీవకోటికిన్
సతతము సంభవించు సహజంబిదె చోరహుతాశ సర్ప సం
హతులను దప్పి యాకటను బంచతనొందెడు నట్టి జీవుడున్
వెతలను బూర్వ కర్మభవ వేదనలొందుచు కుండు నెప్పుడున్–

అని మహాకవి పోతన భాగవతం ద్వాదశ స్కంధంలో జీవన మరణాల గురించి వివరించినాడు.

ఈ బంధాలూ, అనుబంధాలూ వట్టి మాయ! బతికున్నప్పుడే ఈ పట్టింపులూ, ఆచార వ్యవహారాలూ, చచ్చిన మరుక్షణం మనిషి శవమై అంటరాని వాడవుతాడు. అక్కడ్నుంచీ అందరి ఆలోచనా శవాన్ని ఎలా వదిలించుకోవాలా అనే ఉంటుంది. అయినా స్నేహం, ప్రేమ లాంటి బంధాలు మరణానంతరం పార్థివ దేహానికి గౌరవమైన వీడ్కోలు ఇవ్వడానికి తహతహ పడడం వలన ఖననం, దహనం, పక్షులకు వదిలేయడం, మమ్మిఫికేషన్, ఎంబాల్మింగ్ లాంటి తతంగాలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఇవన్నీ తెలిసినా మనిషి అనేక బంధాల, మోహాల, మాయల ఉచ్చులో చిక్కుకుని గిలగిలలాడ్తూనే ఉంటాడు.

మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్
నా యిల్లాలని నా కుమారుడని ప్రాణంబుండునందాక నెం
తోయల్లల్లాడిన ఈ శరీరము పుడమిందింగట్టెలుం గాలుచో
నా యిల్లాలును రాదు, పుత్రుడును తోడైరాడు తప్పింపగన్

– అంటాడు బలిజేపల్లి తన 'సత్యహరిశ్చంద్రీయం' అనే ప్రసిద్ధ నాటకంలో. కట్టెకాలి కాలంలో కలిసిపోయాక మిగిలేవి జ్ఞాపకాలే. మృతి తరువాత స్మృతులేకదా స్మరణీయాలు.

కాలగమనం అనంతమైనది. అది ఒక అద్భుత ప్రవాహం. కాలరహస్యం తెలుసుకోడానికి మానవుడు చేసే సత్యాన్వేషణలో ఎన్నో విశేషాలు గమనిస్తాడు.

'కాలరథమ్ముమీదనె జగత్పతి నిత్యము స్వారి చేయునో
కాల రథమ్ము చక్రముల ఘట్టన పుట్టుచు రాలుచుండు కెం
ధూళి కణమ్ములే అగునో తోచెడి ఈ సకల ప్రజాళియున్
కాల రహస్యమున్ తెలియగల్గుటె పుట్టుకకున్ ఫలమ్మొకో'

–అని బొమ్మికంటి శ్రీనివాసాచార్యులు కాల రహస్యాన్ని తెలుసుకోవడమే జీవన సాఫల్యంగా వివరించారు.

Great is life... and the real and mystical... wherever and whenver,

Great is death... sure as life holds all parts together, death holds all parts together;

Sure as the stars return again after thy merge in the light, death is as great as life.

– అంటాడు వాల్ట్ విట్‌మాన్ (Walt Whitman - leaves of grass 'Great are the myths.)

తమ్ముళ్లందరూ సరోవరంలో నీళ్లుతాగి మరణించి ఉన్నారు. ధర్మరాజుకు దుఃఖం పొంగుకు వచ్చింది. తానూ నీళ్లవేపు రాబోయాడు. అక్కడే ఉన్న ఓ కొంగ మానవ స్వరంతో పలికింది– 'ధర్మజా! నా ప్రశ్నకు సమాధానం చెప్పు! ఆ తరువాతే నీళ్లుతాగు! ఈ ప్రపంచంలో అద్భుతమైన, వింతైన నిజం ఏమిటి?'

ధర్మరాజుకు అర్థమయ్యింది ఎవరో తనను పరీక్షిస్తున్నారని– 'యక్షుడా! మానవుడు ప్రతిరోజూ తోటి మానవులు మరణించడం గమనిస్తున్నా తాను మాత్రం మరణించడని అనుకుంటాడు. అదే మానవ జీవితంలోని వింతైన నిజం' అన్నాడు. ధర్మరాజుకు మృత్యురహస్యం తెలుసు. అందుకే సరైన సమాధానం ఇవ్వగలిగాడు. మృత్యుభయం వల్లనే కదా మానవుడు మనుష్యుడయ్యింది. కాని పాపం పసిబాలుడు నచికేతుడికేం తెలుసు?

✧✧✧✧✧



# 4. మృత్యోర్మా అమృతం...

**సహోవాచ పితరం తతః**
**కస్మై మాం దాస్యసీతి**
**ద్వితీయం, తృతీయం తగ్ హోవాచ**
**మృత్యవే త్వా దదామీతి**

అన్నదానం చేసి కీర్తి గడించిన వాజశ్రవుడి కుమారుడు వాజశ్రవసుడు. మహాయజ్ఞం చేస్తూ తనకున్నదంతా పంచిపెడుతున్నాడు వాజశ్రవసుడు. మంచివాటితో పాటు బక్కచిక్కి వట్టిపోయిన గోవుల్నీ దానమిస్తున్నాడు. అది చూసి వాజశ్రవసుడి కుమారుడైన నచికేతుడు తన తండ్రి ఇటువంటి దానం చేయడం వల్ల ఆనంద నామ నరకానికి పోతాడని తర్కించి తండ్రిని సమీపించి, 'నాయనా! నన్నెవరికి దానమిస్తావు?' అని ఒకటి, రెండు, మూడు సార్లు రెట్టించి అడిగాడు. చిరాకుతో, కోపంతో, 'నిన్ను మృత్యువుకి ఇచ్చాను పో' అని తండ్రి అన్నాడు. ఎవరు ఈ మృత్యువు? తెలుసుకోవాలన్న కోరిక నచికేతుడికి కలిగింది. అన్నపానీయాలు మానేసి తండ్రి అన్నమాటను స్మరిస్తూ మృత్యురహస్యం తెలుసుకోవాలని మూడురోజులు మృత్యువు ఇంటి ముంగిటనే ఉన్నాడు. మూడు రోజుల పిమ్మట వచ్చిన యముడు నచికేతునికి మూడువరాలు – తండ్రి అతనిని ప్రేమతో దగ్గరికి తీసేటట్లు, బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించే నచికేతాగ్నిని, మృత్యురహస్యాన్ని ఇచ్చి వివరించగా నచికేతుడు ఆత్మజ్ఞానియై ఆదర్శవంతుడయ్యాడు.

## మృత్యుంజయులు

ఏమిటీ మృత్యు రహస్యం? ఎవరు ఈ మృత్యువు? ఈ శాశ్వత సత్యాన్వేషణలో సావిత్రి మృత్యువును దర్శించి తన భర్తను బతికించుకుంటుంది. శివానుగ్రహంతో మార్కండేయుడు మృత్యుపాశం నుంచి బయటపడ్డాడు. ఇస్తారిదేవత తన భర్త తమ్ముజ్ కోసం, తన భార్య యురిడెస్ కోసం ఆర్ఫియస్, తన కుమార్తె పెర్సిఫోన్ కోసం డిమాటర్ (భూమాత) యమలోకానికి వెడతారు. తన మిత్రుడు ఎంకిడు చనిపోవడాన్ని నమ్మలేని గిల్గామేష్ మృత్యుజలాల్ని దాటి చిరంజీవి అయిన ఉత్నాపిష్టమ్‌ను కలిసి మృత సంజీవనీ మొక్కను సంపాదించుకుని వస్తున్నప్పుడు ఒక పాము దానిని దొంగిలించుకుపోతుంది. బతికున్నప్పుడు సాధించలేని విద్యను రాక్షసుల పన్నాగంతో కాలిబూడిదై మధువులో కలిసి శుక్రాచార్యుని కడుపు చీల్చుకుని బయటపడే వేళ సాధించాడు కచుడు. సంజీవనీ పర్వతాన్ని పెకిలించుకుని వచ్చి చనిపోయిన వానరుల్ని, స్పృహతప్పిన రామలక్ష్మణుల్ని జీవింపచేస్తాడు హనుమ.

'మృతియును జీవనంబు నిది మేదిని లోపల జీవకోటికిన్ సతతము సంభవించు'నని పోతన భాగవతం ద్వాదశ స్కంధంలో అద్భుతంగా వర్ణిస్తాడు. మృత్యుం దధితా పర్వతేనః – మృత్యువు వెళ్లేదారిలో పర్వతాలను అడ్డం పెట్టైనాసరే నిన్ను రక్షించుకుంటాను అని రుగ్వేదం దశమ మండలంలో ఉంది.

మృత్యువులాంటి మృత్యువులు పది ఉన్నాయంటాడు ఫ్లోరియో తన సెకండ్ ఫ్రూట్స్ అనే గ్రంథంలో. అవేమిటంటే– ఎంతసేపు నిరీక్షించినా అవతలి వ్యక్తి రాకపోవడం, మంచం మీద పడుకున్నా నిద్ర పట్టకపోవడం, ఎన్నాళ్లు ఎంత సేవచేసినా ఉన్నత పదవి పొందక పోవడం, అవసరమైన సమయంలో మొరాయించే వాహనం, జైలులో ఉండి తప్పించు కోలేకపోవడం, వ్యాధి వచ్చి నయం కాకపోవడం, అత్యవసరమైన పనిమీద వెళ్తూ దారితప్పడం, గేటు దగ్గరికి చేరుకున్నా ఇంటివాళ్లు తలుపు తీయకపోవడం, నిన్ను మోసం చేస్తున్నవాడు నీ స్నేహితుడవడం, అన్నీ అందుబాటులో ఉన్నా ఆనందించే శక్తి లేకపోవడం. ఈ బాధలు మృత్యువుకన్నా భయంకరమైనవి అంటాడతడు.

మృత్యువు తన కొడవలితో పంటను కోస్తున్నప్పుడు పండిన కంకులతో పాటు కొన్ని లేత పుష్పాలు కూడా రాలిపడ్తాయంటాడు లాంగ్‌ఫెలో. జీవితం ఒక నరకమైనప్పుడు, జీవించడమే ఒక వ్యధ అయినప్పుడు, ఆశ మూగబోయినప్పుడు ఉన్న ఊరు పొమ్మంటుంది. వల్లకాడు రమ్మంటుంది' అంటాడు ఆర్థర్ గట్టర్‌మాన్. మృత్యువా నువ్వేం చేయలేవు నన్ను. నీవే మరణించు అంటాడు జాన్‌డొనే.

## అమరత్వ సాధన

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

అసత్తు నుంచి సత్తుకు, చీకటి నుంచి వెలుగుకు, మృత్యువునుంచి శాశ్వతమైన అమరత్వానికి నన్ను చేర్చమని ప్రార్థించే బృహదారణ్యకోపనిషత్‌లోని ఈ మంత్రాలు పవమాన మంత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. సాక్షాత్ మృత్యువు నుంచే మృత్యురహస్యాన్ని తెలుసుకున్న నచికేతుడు అతిపిన్న వయసులోనే ఆత్మజ్ఞానిగా ప్రసిద్ధికెక్కాడని కఠోపనిషత్ వల్ల మనకు తెలుస్తోంది.

'న మృతా భవంత్యనే నేత్యమృతం...' దీనిని సేవించడం వల్ల మృత్యువు దరిచేరదు. అది జలమో, పానీయమో, ఔషధమో, అపురూపమైన మూలికాసారమో, అద్భుతమైన పక్షి రూపమో కావచ్చు. అయినా మృత్యువును జయించి శాశ్వతంగా జీవించాలన్న కోరికతో చిరకాలం నుంచి ఇప్పటి వరకూ ప్రయత్నాలు సాగుతూనే

వున్నాయి. కొందరు సాహసికులు ఆ జీవజలం, అమృతపాత్ర, మృతసంజీవని కోసం చేసిన సాహసయాత్రలు నాగరిక చరిత్రలో అద్భుత ఘట్టాలయ్యాయి. 'మృత్యోర్మా అమృతంగమయ' – మృత్యువు నుంచి నన్ను అమరత్వంలోకి నడిపించు అనేది ఉపనిషద్వాక్యం. మృత్యువును తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని మన పురాణాల్లో అనేక వరాలు పొంది కూడా చివరకి మరణించిన హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, భస్మాసురుడు, రావణుడు వంటి రాక్షస వీరుల చరిత్రలు తెలుపుతున్నాయి. క్షీరసాగర మథనంలో అమృతాన్ని అందిపుచుకున్న దేవతలు అమరులయ్యారు. శుక్రాచార్యుని వద్ద మృతసంజీవిని విద్యను నేర్చుకున్న కచుడు తాను బతికి గురువును బతికించుకున్నాడు. సంజీవినీ పర్వతాన్ని పెకలించుకొని వచ్చిన హనుమంతుడు రామలక్ష్మణులనే కాక వానర వీరుల్ని జీవింపచేస్తాడు. మార్కండేయుడు శివుని అనుగ్రహంతో, సావిత్రి పతి సత్యవంతుడు యమధర్మరాజు వరంతో, హరిశ్చంద్రుని కుమారుడు లోహితాస్యుడు భగవదనుగ్రహంతో పునర్జీవు లయ్యారు.

## మృత్యువుని చూసినవాళ్లు

'మృత్యువు వెళ్లే దారిలో బ్రహ్మాండమైన గండశిలలతో అడ్డుకుని నిన్ను రక్షించుకుంటాను' అని ఋగ్వేదంలో మంత్రమున్నది. నచికేతుడు మృత్యుముఖంలోకి వెళ్లి యముని ప్రార్థించి మూడవ వరంగా మృత్యు రహస్యం తెలుసుకున్నాడని కఠోపనిషత్ చెబుతోంది. ప్రజాపతి తాను సృష్టించిన పుత్రుడ్ని తానే భక్షించబోగా భయం చెందిన వాళ్లు 'భాణ, భాణ' అని అరిచారని కాబట్టి భయం నుంచే వాక్కు పుట్టిందని బృహదారణ్యోపనిషత్తులో ఉంది. మృత్యువే భయకారకం కదా! తన భర్తను బతికించుకోవడానికి సావిత్రి, తన భార్య యురిడెస్ కోసం ఆర్ఫియస్, తన కుమార్తె 'పెర్సిఫోన్' కోసం డిమాటర్ (భూమాత), తండ్రి చేసిన దానం నిమిత్తం నచికేతుడు యమలోకానికి వెళ్తారు. తన భర్త 'తమ్మస్' కోసం ఇస్తార్ దేవత (శృంగారానికి, యుద్ధానికి అధిదేవత) నరకలోకానికి వెళ్లినప్పుడు తనపైని వస్త్రాల్ని, ఆభరణాల్ని కోల్పోతుంది. నరకాధిపతి 'ఎరిగెల్' శాపానికి ప్రాణాలు కోల్పోయిన ఇస్తార్ భూలోకానికి రాలేక పోవడంతో ఇక్కడ వసంత ఋతువు రాక అల్లకల్లోలం కావడంతో దేవతలు ఆమెను మరల భూలోకానికి జీవజలంతో బ్రతికించి తీసుకువస్తారు.

## ఆత్మకు మరణం లేదు

1461 సంవత్సరాలు జీవించే 'ఫీనిక్స్' పక్షిని తింటే అమరత్వం వచ్చి శాశ్వతంగా బతకవచ్చునుకున్న 'హీలియో గబారిస్' అనే రోమన్ చక్రవర్తి ప్రపంచంలోనే అరుదైన పక్షుల్ని తెప్పించుకుని తిన్నా కాలం కలిసిరాక హత్యకు గురవుతాడు. రసవాదులు (ఆల్కెమిస్టులు) జీవజలం, పరసవేది (ఫిలాసఫర్స్ స్టోన్) కోసం పొన్సెజిలియాస్ లాంటి వాళ్లు 'బిమిని' యవ్వన జలధారల కొరకు ఎందరో మాండ్రేక్, జింకోబల్బా, జిన్‌సెంగ్, సోమలతల్లాంటి మూలికల కోసం వెతుకుతూ కొంతకాలమైనా

మృత్యువును అధిగమించే ప్రయత్నం చేస్తూనే వున్నారు కాని జాతస్యి హి ధ్రు వో మృత్యుర్ధ్రువం – పుట్టినవాడు గిట్టక తప్పదు కదా!

**నా జాయతే మ్రియతే వా కదా చిన్నాయం భూత్వా భవితా వాన భూయః**
**అజో నిత్య శాశ్వతోదయం పురాణోన హన్యతే హన్యమానే శరీరే**

అని ద్వితీయాధ్యాయం, భగవద్గీతలో ఉంది. శరీరం నశించినా ఆత్మ నశింపదనే జ్ఞానం కలిగినవాడు మృత్యుభయం పొందదు. అదే అసలైన అమృతాన్వేషణ.

## జీవం ఏది...?

అంతవరకూ చేతనంగా ఉన్న అమూల్యమైన దేహం క్షణంలో నిర్జీవమై శవంగా, పనికిరానిదిగా మారిపోతుంది. మరణించిన తరువాత కూడా నిలిచి వుండేదే ఆత్మ. ఈ విషయాన్ని అవగాహన చేసుకుంటే మరణమంటే భయం వుండదు. కొంతమంది శాస్త్రజ్ఞులు ఆఖరి ఘడియల్లో ఉన్న రోగుల బరువును ప్రాణం పోయిన వెంటనే ఉన్న బరువుతో పోల్చి చూసి, జీవం బరువు 100 గ్రాముల లోపుగా తేల్చారు.

**"అంగుష్టమాత్రః పురుషోంతరాత్మా,**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః,**
**త్వం సచ్ఛరీరాత్ ప్రవృహేన్ముంజాది వేషికాం ధైర్యేణ**
**తం విద్యాచ్ఛు క్రమమృతం,**
**తం విద్యాచ్ఛుక్రమ మృతమితి."**

బొటనవేలంత ఉండే చైతన్యమనే అంతరాత్మ ప్రాణుల హృదయాలలో నివసిస్తుందని క్రీస్తుపూర్వం 800 సంవత్సరాల కాలం నాడే కఠోపనిషత్తులో (6–17) పేర్కొన్నారు. నిరంతర విచారణ, ధాన్యం ద్వారా దేహం, ఆత్మ వేరని తెలుసుకుని శాశ్వతమైన ఆత్మస్వరూప జ్ఞానాన్ని అలవరుచుకోవడమే మృత్యు రహస్యంగా యముడు నచికేతునికి వివరిస్తాడు.

**"మృతియును జీవనంబు నివి మేదిని లోపల జీవకోటికిన్**
**సతతము సంభవించు సహజంబిదె చోరహుతాశ సర్పసం**
**హతులను దప్పి యాకటను బంచతనొందెదు నట్టి జీవుడున్**
**వెతలను బూర్మ కర్మభవ వేదన లొందుచు కుందునెప్పుడున్"**

(శ్రీ మహాభాగవతము ద్వాదశ–27)

జననం, మరణం జీవకోటికి సర్వసాధారణం అనే తాత్విక చింతనే భారతీయులను మిగతా జనకోటికి ఆదర్శప్రాయంగా అనేక శతాబ్దాల పాటు నిలిపి ఉంచింది.

✧✧✧✧✧

# 5. మృత్యుంజయ మంత్రం

మహా మృత్యుంజయ మంత్రాన్నే త్రయంబక మంత్రమంటారు. ఋగ్వేదంలో (7-59-12) ముక్కంటిని (త్రయంబక-రుద్రరూపుడైన శివుడిని) స్తుతించే స్తోత్రమిది.

**ఓం త్రయంబకమ్ యజమాహె సుగంధిం పుష్టివర్ధనమ్**
**ఉర్వరుకమ్ ఇవ బంధనాన్ మృత్యుర్ ముక్షీయ మామృతాత్**

తాంత్రిక శైలిలో-

ఓం స్వయం భువః భు
ఓం స్వాహా ఝూం హోమ్
ఓం ఓం ఝూం హోమ్ స్వాహా
ఓం భూ భువర్ స్వాహా
ఓం త్రయంబకమ్ యజమాహె సుగంధిమ్ పుష్టివర్ధనమ్
ఉర్వ రుకమివ బంధనాన్ మృత్యుర్ ముక్షీయ మామృతాత్
ఓం స్వాహా భువః భు
ఓం స్వాహా ఝూం హోం
ఓం ఓం ఝూం హోం స్వాహా
ఓం భూ భువర్ స్వాహా

మహా మృత్యుంజయ మంత్రం మార్కండేయ విరచితంగా చెప్పబడ్డున్నది.

✧✧✧✧✧

## 6. మృత్యుముఖం నుంచి రక్షణా గీతం

**(సెమినోలి రెడ్ ఇండియన్ల పాట)**

తిరిగిరా!

మహావృక్షాన్ని చేరుకునే ముందే

తిరిగిరా!

పీచ్ చెట్టు దగ్గరకు వెళ్లేముందే

తిరిగిరా!

సరిహద్దు గోడ దగ్గరకు వెళ్లక ముందే

తిరిగిరా!

అడవి పొదల దగ్గరకు వెళ్లేముందే

తిరిగిరా!

దారి మలుపుకు చేరే ముందే

తిరిగిరా!

ఆ స్థలానికి చేరేముందే

తిరిగిరా!

ఆ తలుపు దగ్గరికి వెళ్లేముందే

తిరిగిరా!

అగ్నిజ్వాలను చేరుకునే ముందే

తిరిగిరా!

నిచ్చెన మధ్యకు చేరుకునే ముందే

తిరిగిరా!

**(Native American songs and poems - anthology Edited by Brian Swann)**

# 6. మృత్యువు - Quotations

★ Faith, Sir, we are here today, and gone to-marrow.
**- Aphra Behn**

★ Death seems to provide the minds of the Anglo-Saxon race with a greater fund of innocent amusement than any other single subject... the tale must be about dead bodies or very wicked people, preferably both, before the Tired Business Man can feel really happy.
**- Dorothy L. Sayers**

★ Whenever I prepare for a journey I prepare as for death. Should I never return, all is in order. This is what life has taught me. **- Katherine Mansfield**

★ If I had anydecency, I'd be dead. Most of my friends are.
**- Dorothy Parker** (at age seventy)

★ I have always admired the Esquimaux. One fine day a delicious meal is cooked for dear old mother, and then she goes walking away over the ice, *and doesn't come back.*
**- Agatha Christie**

★ Death is my neighbor now.
**- Dame Edith Evans**
*(in a radio interviews,*
*a week before her death at eighty-eight)*

★ Goddammit! He beat me to it.
**- Janis Joplin**
(on hearing of Jimi Hendrix's death)

★ Get my Swan costume ready.
**- Anna Pavlova**
*(last words)*

★ Worldly faces never look so wordly as at a funeral.

**- George Eliot**

★ O death where is thy sting ? O grave where is thy victory ? Where, indeed? Many a badly stung survivor, faced with the aftermath of some relative's funeral, has ruefully conceded that the victory has been won hands down by the funeral establishment - in disastrously unequal battle.

**- Jessica mitford**

★ The tombstone is about the only thing that can stand upright and lie on its face at the same time

**- Mary Wilson Little**

★ Death is simply a shedding of the physical body, like the butterfly coming out of a cocoon... It's like putting away your winter coat when spring comes.

**- Elisabeth Kubler-Ross**

★ There will be sex after death, we just won't be able to feel it.

**- Lily Tomlin**

★ In heaven they will bore you, in hell you will bore them.

**- Katharine Whitehorn**

*****



A tanto knife prepared for seppuku.

# Death
## (Wiki notes)

Death is the permanent cessation of all biological functions that sustain a living organism. Phenomena which commonly bring about death include biological aging (senescence), predation, malnutrition, disease, suicide, murder and accidents or trauma resulting in terminal injury. Bodies of living organisms begin to decompose shortly after deaath.

The word death comes from Old English deað, which in turn comes from Proto-Germanic dauþaz . This comes from the Proto-Indo-European stem -dheu- meaning the "Process, act, condition of dying".

The response after death includes various feelings of grief or emotional suffering one feels when someone the individual loves has died. Commemoration ceremonies after death may include various mourning or funereal practices. The physical remains of a person, commonly known as a *corpse* or *body*, are usually interred whole or cremated, though among the world's cultures there are a variety of other methods of mortuary disposal. In the English language, blessings directed towards a deceased person include *rest in peace*, or its initials RIP.

The most common cause of human deaths in the world is heart disease, followed by stroke and other cerebrovascular diseases, and on the third place lower respiratory infections.

When a person has died, it is also said they have *passed away, passed on,* or *expired,* among numerous other socially accepted, religiously specific, slang, and irreverent terms. Bereft of life, the dead person is then a *corpse, cadaver,* a *body*, a *set of remains,* and finally a skeleton. The terms *carrion* and *carcass* can also be used, though these more often connote the remains of non-human animals. As a polite reference to a dead person, it has become common practice to use the participle form of "decease", as in *the deceased*; the noun form is *decedent*. The ashes left after a cremation are sometimes referred to by the neologism *cremains*, a portmanteau of "cremation" and "remains".

Almost all animals who survive external hazards to their biological functioning eventually die from biological aging, known in life sciences as “senescence”. One of the very few known possible exceptions is the jellyfish *Turritopsis nutricula*, thought to be, in effect, immortal. Unnatural causes of death include suicide and homicide. From all causes, roughly 150,000 people die around the world each day. Of these, two thirds die directly or indirectly due to senescence, but in industrialized countries—such as the United States, the United Kingdom, and Germany—the rate approaches 90%, i.e., nearly nine out of ten of all deaths are related to senescence.

Physiological death is now seen as a process, more than an event: conditions once considered indicative of death are now reversible. Where in the process a dividing line is drawn between life and death depends on factors beyond the presence or absence of vital signs. In general, clinical death is neither necessary nor sufficient for a determination of legal death. A patient with working heart and lungs determined to be brain dead can be pronounced legally dead without clinical death occurring. Paradoxically, as scientific knowledge and medicine advance, a precise medical definition of death becomes more problematic.

## Signs of death

Signs of death or strong indications that an animal is no longer alive are:

- Cessation of breathing
- Cardiac arrest (no pulse)
- *Pallor mortis,* paleness which happens in the 15–120 minutes after death
- *Livor mortis,* a settling of the blood in the lower (dependent) portion of the body
- *Algor mortis,* the reduction in body temperature following death. This is generally a steady decline until matching ambient temperature
- *Rigor mortis,* the limbs of the corpse become stiff (Latin *rigor*) and difficult to move or manipulate
- Decomposition, the reduction into simpler forms of matter, accompanied by a strong, unpleasant odor.



(A flower, a skull and an hourglass stand for Life, Death and Time in this 17th-century painting by Philippe de Champaigne)

There are many scientific approaches to the concept. For example, brain death, as practiced in medical science, defines death as a point in time at which brain activity ceases.

One of the challenges in defining death is in distinguishing it from life. It is possible to define life in terms of consciousness. When consciousness ceases, a living organism can be said to have died. One of the notable flaws in this approach, however, is that there are many organisms which are alive but probably not conscious (for example, single-celled organisms). Another problem is in defining consciousness, which has many different definitions given by modern scientists, psychologists and philosophers. Additionally, many religious traditions, including Abrahamic and Dharmic traditions, hold that death does not (or may not) entail the end of consciousness. In certain cultures, death is more of a process than a single event. It implies a slow shift from one spiritual state to another.

Other definitions for death focus on the character of cessation of something. In this context "death" describes merely the state where something has ceased, for example, life. Thus, the definition of "life" simultaneously defines death.

Historically, attempts to define the exact moment of a human's death have been problematic. Death was once defined as the cessation of heartbeat (cardiac arrest) and of breathing, but the development of CPR and prompt defibrillation have rendered that definition inadequate because breathing and heartbeat can sometimes be restarted. Events which were causally linked to death in the past no

longer kill in all circumstances; without a functioning heart or lungs, life can sometimes be sustained with a combination of life support devices, organ transplants and artificial pacemakers.

Today, where a definition of the moment of death is required, doctors and coroners usually turn to “brain death” or “biological death” to define a person as being dead; people are considered dead when the electrical activity in their brain ceases. It is presumed that an end of electrical activity indicates the end of consciousness. However, suspension of consciousness must be permanent, and not transient, as occurs during certain sleep stages, and especially a coma. In the case of sleep, EEGs can easily tell the difference.

However, the category of “brain death” is seen by some scholars to be problematic. For instance, Dr. Franklin Miller, senior faculty member at the Department of Bioethics, National Institutes of Health, notes: “By the late 1990s, however, the equation of brain death with death of the human being was increasingly challenged by scholars, based on evidence regarding the array of biological functioning displayed by patients correctly diagnosed as having this condition who were maintained on mechanical ventilation for substantial periods of time. These patients maintained the ability to sustain circulation and respiration, control temperature, excrete wastes, heal wounds, fight infections and, most dramatically, to gestate fetuses (in the case of pregnant “brain-dead” women).”

Those people maintaining that only the neo-cortex of the brain is necessary for consciousness sometimes argue that only electrical activity should be considered when defining death. Eventually it is possible that the criterion for death will be the permanent and irreversible loss of cognitive function, as evidenced by the death of the cerebral cortex. All hope of recovering human thought and personality is then gone given current and foreseeable medical technology. However, at present, in most places the more conservative definition of death – irreversible cessation of electrical activity in the whole brain, as opposed to just in the neo-cortex – has been adopted (for example the Uniform Determination Of Death Act in the United States). In 2005, the Terri Schiavo case brought the question of brain death and artificial sustenance to the front of American politics.

Even by whole-brain criteria, the determination of brain death can be complicated. EEGs can detect spurious electrical impulses, while certain drugs, hypoglycemia, hypoxia, or hypothermia can suppress or even stop brain activity on a temporary basis. Because of this, hospitals have protocols for determining brain death involving EEGs at widely separated intervals under defined conditions.

### Legal

In the United States, a person is dead by law if a Statement of Death or Death certificate is approved by a licensed medical practitioner. Various legal consequences follow death, including the removal from the person of what in legal terminology is called personhood.

The possession of brain activities, or capability to resume brain activity, is a necessary condition to legal personhood in the United States. "It appears that once brain death has been determined ... no criminal or civil liability will result from disconnecting the life-support devices." (Dority v. Superior Court of San Bernardino County, 193 Cal.Rptr. 288, 291 (1983))

## Misdiagnosed

Premature burial

There are many anecdotal references to people being declared dead by physicians and then "coming back to life", sometimes days later in their own coffin, or when embalming procedures are about to begin. From the mid-18th century onwards, there was an upsurge in the public's fear of being mistakenly buried alive, and much debate about the uncertainty of the signs of death. Various suggestions were made to test for signs of life before burial, ranging from pouring vinegar and pepper into the corpse's mouth to applying red hot pokers to the feet or into the rectum. Writing in 1895, the physician J.C. Ouseley claimed that as many as 2,700 people were buried prematurely each year in England and Wales, although others estimated the figure to be closer to 800.

In cases of electric shock, cardiopulmonary resuscitation (CPR) for an hour or longer can allow stunned nerves to recover, allowing an apparently dead person to survive. People found

unconscious under icy water may survive if their faces are kept continuously cold until they arrive at an emergency room. This “diving response”, in which metabolic activity and oxygen requirements are minimal, is something humans share with cetaceans called the mammalian diving reflex. the concept of information-theoretic death has been suggested as a better means of defining when true death occurs, though the concept has few practical applications outside of the field of cryonics.

There have been some scientific attempts to bring dead organisms back to life, but with limited success. In science fiction scenarios where such technology is readily available, real death is distinguished from reversible death.

## Causes

The leading cause of death in developing countries is infectious disease. The leading causes of death in developed countries are atherosclerosis (heart disease and stroke), cancer, and other diseases related to obesity and aging. By extremely wide margin, the largest unifying cause of death in the developed world is biological aging, leading to various complications known as aging-associated diseases. These conditions cause loss of homeostasis, leading to cardiac arrest, causing loss of oxygen and nutrient supply, causing irreversible deterioration of the brain and other tissues. Of the roughly 150,000 people who die each day across the globe, about two thirds die of age-related causes. In industrialized nations, the proportion is much higher, approaching 90%. With improved medical capability, dying has become a condition to be managed. Home deaths, once commonplace, are now rare in the developed world.

In developing nations, inferior sanitary conditions and lack of access to modern medical technology makes death from infectious diseases more common than in developed countries. One such disease is tuberculosis, a bacterial disease which killed 1.7 million people in 2004. Malaria causes about 400–900 million cases of fever and 1–3 million deaths annually. AIDS death toll in Africa may reach 90–100 million by 2025.

According to Jean Ziegler, who was the United Nations Special reporter on the Right to Food from 2000 to March 2008,

mortality due to malnutrition accounted for 58% of the total mortality rate in 2006. Ziegler says worldwide approximately 62 million people died from all causes and of those deaths more than 36 million died of hunger or diseases due to deficiencies in micronutrients.

Tobacco smoking killed 100 million people worldwide in the 20th century and could kill 1 billion people around the world in the 21st century, a WHO Report warned.

Many leading developed world causes of death can be postponed by diet and physical activity, but the accelerating incidence of disease with age still imposes limits on human longevity. The evolutionary cause of aging is, at best, only just beginning to be understood. It has been suggested that direct intervention in the aging process may now be the most effective intervention against major causes of death.

In 2012, suicide overtook car crashes for leading causes of human injury deaths in America, followed by poisoning, falls and murder. Causes of death are different in different parts of the world. In high-income and middle income countries nearly half up to more than two thirds of all people live beyond the age of 70 and predominantly die of chronic diseases. In low-income countries, where less than one in five of all people reach the age of 70, and more than a third of all deaths are among children under 15, people predominantly die of infectious diseases.

## Autopsy

An autopsy, also known as a *postmortem examination* or an obduction, is a medical procedure that consists of a thorough examination of a human corpse to determine the cause and manner of a person's death and to evaluate any disease or injury that may be present. It is usually performed by a specialized medical doctor called a pathologist.

A "necropsy" is an older term for a postmortem examination, unregulated, and not always a medical procedure. In modern times the term is more often used in the postmortem examination of the corpses of animals.

## Life extension

Life extension refers to an increase in maximum or average lifespan, especially in humans, by slowing down or reversing the processes of aging. Average lifespan is determined by vulnerability to accidents and age or lifestyle-related afflictions such as cancer, or cardiovascular disease. Extension of average lifespan can be achieved by good diet, exercise and avoidance of hazards such as smoking. Maximum lifespan is determined by the rate of aging for a species inherent in its genes. Currently, the only widely recognized method of extending maximum lifespan is calorie restriction. Theoretically, extension of maximum lifespan can be achieved by reducing the rate of aging damage, by periodic replacement of damaged tissues, or by molecular repair or rejuvenation of deteriorated cells and tissues.

Researchers of life extension are a subclass of biogerontologists known as "biomedical gerontologists". They try to understand the nature of aging and they develop treatments to reverse aging processes or to at least slow them down, for the improvement of health and the maintenance of youthful vigor at every stage of life. Those who take advantage of life extension findings and seek to apply them upon themselves are called "life extensionists" or "longevists". The primary life extension strategy currently is to apply available anti-aging methods in the hope of living long enough to benefit from a complete cure to aging once it is developed.

## Location

Before about 1930, most people in Western countries died in their own homes, surrounded by family, and comforted by clergy, neighbors, and doctors making house calls. By the mid-20th century, half of all Americans died in a hospital. By the start of the 21st century, only about 20 to 25% of people in developed countries died outside of a medical institution. The shift away from dying at home, towards dying in a professionalized medical environment, has been termed the "Invisible Death"

## Society and culture

Death is the center of many traditions and organizations; customs relating to death are a feature of every culture around the

world. Much of this revolves around the care of the dead, as well as the afterlife and the disposal of bodies upon the onset of death. The disposal of human corpses does, in general, begin with the last offices before significant time has passed, and ritualistic ceremonies often occur, most commonly interment or cremation. This is not a unified practice; in Tibet, for instance, the body is given a sky burial and left on a mountain top. Proper preparation for death and techniques and ceremonies for producing the ability to transfer one's spiritual attainments into another body (reincarnation) are subjects of detailed study in Tibet. Mummification or embalming is also prevalent in some cultures, to retard the rate of decay.

Legal aspects of death are also part of many cultures, particularly the settlement of the deceased estate and the issues of inheritance and in some countries, inheritance taxation.

Capital punishment is also a culturally divisive aspect of death. In most jurisdictions where capital punishment is carried out today, the death penalty is reserved for premeditated murder, espionage, treason, or as part of military justice. In some countries, sexual crimes, such as adultery and sodomy, carry the death penalty, as do religious crimes such as apostasy, the formal renunciation of one's religion. In many retentionist countries, drug trafficking is also a capital offense. In China, human trafficking and serious cases of corruption are also punished by the death penalty. In militaries around the world courts-martial have imposed death sentences for offenses such as cowardice, desertion, insubordination, and mutiny.

Death in warfare and in suicide attack also have cultural links, and the ideas of dulce et decorum est pro patria mori, mutiny punishable by death, grieving relatives of dead soldiers and death notification are embedded in many cultures. Recently in the western world, with the increase in terrorism following the September 11 attacks, but also further back in time with suicide bombings, kamikaze missions in World War II and suicide missions in a host of other conflicts in history, death for a cause by way of suicide attack, and martyrdom have had significant cultural impacts.

Suicide in general, and particularly euthanasia, are also points of cultural debate. Both acts are understood very differently in

different cultures. In Japan, for example, ending a life with honor by seppuku was considered a desirable death, whereas according to traditional Christian and Islamic cultures, suicide is viewed as a sin. Death is personified in many cultures, with such symbolic representations as the Grim Reaper, Azrael and Father Time.

Talking about death and witnessing it is a difficult issue with most cultures. Western societies may like to treat the dead with the utmost material respect, with an official embalmer and associated rites. Eastern societies (like Indian) may be more open to accepting it as a *fait accompli*, with a funeral procession of the dead body ending in an open air burning-to-ashes of the same.

## Death and consciousness

Due to the mind-body dichotomy, much interest and debate surround the question of what happens to one's consciousness as one's body dies. The permanent loss of consciousness after death is often called "eternal oblivion". Faith or belief that consciousness is preserved after physical death is described by the term "afterlife." For the scientific aspect of consciousness after death, see the article Consciousness after death.

## In biology

